సీత జోస్యం

C

V. R. NARLA MEMORIAL LIBRARY
894.8274
VEN

వి.ఆర్. నార్ల

894.8274

C4

వెంకట

శేషసాయి

B. R. AMBEDKAR
PEN UNIVERSITY

LIBRARY

HYDERABAD-500 033.

Dr. B R.A.O.U. LIBRARY

Acc. No... N-16102

Date.....

Call No 894.8274
2563

V.R.I. LIBRARY
A.C.C. NO.
D.P.R.I, HYDERABAD

ఉపక్రమణిక

"జాబాలి" నా రామాయణ నాటకాలలో మొదటిది కాగా, ఈ "సీతా సౌస్యం" రెండవది. ఆ మొదటి నాటకానికి విపులమైన పీఠిక వ్రాస్తూ, రామాయణానికి సంబంధించిన అనేక ముఖ్యాంశాలను దానిలో చర్చించాను. వాల్మీకి ఏ రూపంలో రామాయణాన్ని చెప్పివుండవచ్చు? తర్వాత ఏనాటి వరకు దాన్ని పెంచారు? ఏ మేరకు పెంచారు? ఆదికావ్యంలోని ప్రక్షిప్తాలను పట్టివేయగలమా? [illegible] తొలిగిస్తే, వాల్మీకి రచనగా చెల్లుతున్న సంస్కృత రామాయణంలో ఏ [illegible]టి మిగులుతుంది? వాల్మీకి తన కావ్యనాయకుని నిజంగానే ఒక మానవాతీత [illegible]క్తిగా చిత్రించాడా? సంస్కృత రామాయణానికి, దాని అనువాదాలకు, లేదా అనుసరణలకు ఏయే వ్యత్యాసాలున్నాయి, ఎక్కడెక్కడ వున్నాయి? సంస్కృత రామాయణం [illegible]ుడు ఏకపత్నీవ్రతుడేనా లక్ష్మణుడు [illegible]కి వెళ్ళిననాటికి సీతారా [illegible]ుల వయస్సు [illegible]జరిగింది? లంకా దహన వృత్తాంతం ఎ[illegible]ంనాటి సాంఘికాచారా [illegible]వి? ఆహార [illegible]వ్యమాంసాలను ముట్టని

DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N16102

వారా? ఇట్టి ప్రశ్నలు మరి పెక్కింటికి కూడా ఆ పీఠికలో సమాధానాలను చెప్పడానికి నేను ప్రయత్నించాను.

ఈ సమాధానాలను చెప్పడంలో నేను ఊహపై ఆధారపడలేదు. సంస్కృత రామాయణంనుంచే నా సమాధానా లన్నింటికి సాక్ష్యాధారాలను చూపించాను; నా వాదాన్ని మరింత బలపరచడం కోసం రామాయణాన్ని విమర్శాత్మకంగా పరిశీలించిన జాతీయ, విజాతీయ పండితులను సాక్షులుగా పిలిచాను.

ఆ పీఠికలో సవిస్తరంగా చెప్పిన విషయాలను తిరిగి దీనిలో నేను తడవ బోవడం లేదు. ఇక్కడ కొత్త విషయాలనే వ్రాస్తాను. అయితే, ఈ "సీత జోస్యం" నాటకాన్ని, దీని ప్రధానపాత్రలను మీరు సవ్యంగా అవగాహన చేసుకోవాలంటే, "జాబిలి" పీఠికను ఒకసారి చదవడం అవసరమని భావిస్తున్నాను.

నా రెండు పీఠికలలో ఏదీ మీకు నచ్చకపోవచ్చు, నా రెండు నాటకాలలో దేన్నీ మీరు మెచ్చకపోవచ్చు. అంతే జరిగితే, అందుకు నే నెంత మాత్రం బాధ పడను. నాకు కావలసింది మీ ఆమోదం కాదు, మీలో ఆలోచన; నేను కోరేది మీ ప్రశంస కాదు, మీలో జిజ్ఞాస. ఎప్పటికప్పుడు పాత విషయాలను కొత్త దృష్టితో చూడ్డానికి మనం ప్రయత్నించాలి, పాత విశ్వాసాలను కొత్త పరీక్షలకు పెట్టుకోవాలి. పాత గాథలకు కొత్త వ్యాఖ్యానాలను చెప్పుకోవాలి. అప్పుడుగాని మనలో కొత్త ఆలోచనలు రేకెత్తవు; అప్పుడుగాని మనలో కొత్త చైతన్యం పెల్లుబకదు; అప్పుడుగాని కొత్త తేజస్సులో, ఓజస్సుతో ఒక జాతిగా మనం ముందుకు సాగలేము. మనలో స్తబ్ధత పోవాలి, సంచలనం రావాలి; మనలో ఔదాసీన్యం గతించాలి. ఏదో ఒక షక్షం వహించాలన్న పట్టుదల పెరగాలి. మనలో "విస్సన్నల" పట్ల వారి "వేదాల" పట్ల గౌరవం తగ్గాలి, తిరిగి "ప్రశ్నోపనిషత్తు"లు విరివిగా వెలువడాలి. నాటకాలను కూర్చి, వాటికి పీఠికలను చేర్చి, నేను [redacted] చగోరుతున్నది ఈ మానసిక పరివర్తననే, ఈ నవచైతన్యాన్నే ఈ పురోగతినే. మీలో కొందరికి కష్టం కలిగించడం ద్వారానే నా లక్ష్యాన్ని సాధించవలసివస్తే, అందుకు నేను వెనుదీయ ననడానికి నా నాటకాలే, వాటికి నా పీఠికలే తార్కాణాలు."

నాది ఆర్య, ఆర్యేతర దృష్టి కాదు; బ్రాహ్మణ, బ్రాహ్మణేతర దృష్టి అసలే కాదు. అవి సంకుచిత దృష్టులు. అవి నాకుంటే, నన్ను చూచి నేనే సిగ్గు పడాలి. జాతి మత కుల వర్గ విభేదా లన్నీ సమసిపోవాలి; సమతాస్వాతంత్ర్యాల

AOUH102B1125
A80

సర్వత్రా నెలకొనాలి; దారిద్ర్యం, దైన్యం ఈ భూతలంనుంచి మటుమాయమైపో వాలి; అణ్వస్త్రయుద్ధం ద్వారా నరజాతి, దాని నాగరికత సర్వనాశనం కాగల ప్రమాదం పూర్తిగా తొలగాలి; వివేక విజ్ఞానాలు వర్ధిల్లాలి; మానవునికి, అతడి మానవతకు పట్టాభిషేకం జరగాలి - ఇదే నా ఆరాటం, ఇందుకే నా పోరాటం. ఈ పోరాటంలో మీరు నా సరసన నిలిస్తే సంతోషిస్తాను; నా సమ్ముఖంలో నిలిచినా సంతోషిస్తాను; ఇదే మీకు నా ఆహ్వానం; నాపక్కనో, నా యెదుటనో భారు తీరండి, పోరులో దూకండి!

—ఇంతవరకు నేను వ్రాసింది 1965లో. అంతకు రెండు, మూడేళ్ళకు ముందు గానే "జాబాలి", "సీతజ్యోస్యం" నాటకాలతోపాటు వాటి కోవకే చెందినవా టిని మరి మూడింటిని సయితం పూర్తిచేశాను. వాటిని అప్పటిలో విజయవాడ, గుంటూరు, హైదరాబాదు, మద్రాసు, న్యూఢిల్లీ నగరాలలో నా మిత్రబృందా లకు చదివి వినిపించాను. కాని, వాటిని ప్రచురించడం జరగలేదు. ఇందుకు కారణం - నా నాటకాల సదవగాహనకు సుదీర్ఘపీఠికలు ముఖ్యావసరమని భావించిన నేను వాటిని వ్రాయలేక పోవడమే. 1964 డిసెంబరులో నాకు రెండవతూరి గుండెపోటు హెచ్చుగా వచ్చినప్పుడు, చచ్చిపోతున్నట్టుగా నేను నమ్మినప్పుడు, నాకు కలిగిన రెండు చింతలలో ఒకటి - "అయ్యో! నా నాటకాలను అముద్రితంగా విడిచి వెళ్లిపోతున్నానే!" అని. అయినా, వాటి ప్రచురణకార్యక్రమం ఇప్పటికైనా పూర్తి కానేలేదు.

1964నాటి రుగ్మతనుంచి పూర్తిగా కోలుకొనకముందే, ఎలాగో ఓపిక తెచ్చు కొని, 1965 మే, జూన్ నెలలలో "జాబాలి" పీఠికను వ్రాసి, వెనువెంటనే "సీతజ్యోస్యం" పీఠికను మొదలుపెట్టాను. ఇంతలో తిరిగి ఆరోగ్యం చెడిపోయిందో, మరేమి జరిగిందో ఇప్పుడు జ్ఞాపకం లేదుగాని, ప్రారంభఘట్టంలోనే అది నిలిచిపో యింది. అంతే - నా అముద్రిత నాటకాలనుగురించి తిరిగి నేను శ్రద్ధ వహించింది నవోదయ ప్రచురణ సంస్థవారి పట్టుదలపై 1974లోనే. ఆ సంవత్సరంలో నా "జాబాలి"ని ప్రచురించినమీదట "సీతజ్యోస్యం" నాటకాన్ని ముద్రణకు సిద్ధపరచవ లసిందిగా వారు ఎంతగా పోరినా, ఇప్పటివరకు (1976 మే నెల వరకు) అందుకు నేను ఉద్యమించనైనా లేదు. నాలుగైదు నెలల క్రితం తిరిగి గుండెపోటు వచ్చిన మీదట (అది నాల్గవతూరి) దాన్ని చిట్టచివరి "వార్నింగ్"గా పరిగణించకపోతే, నానాటకాలు మరి వెలుగుముఖం చూడబోవని రూఢిపరుచుకొన్నందునే 1965లో నిలిచిపోయిన ఘట్టంనుంచి "సీతజ్యోస్యం" పీఠికను తిరిగి ఇప్పుడు వ్రాయబోతున్నాను.

అయితే, పదేళ్ళనాటికంటె ఇప్పుడు ఆరోగ్యం తక్కువ, దార్ఢ్యం తక్కువ. అప్పటి "ఫైటింగ్ మూడ్" ఇప్పుడు లేదేమో కూడా! ఇంతే కాక, రామాయణాన్ని గురించి పదేళ్ళనాడు చదివిన విషయాలను ఇప్పుడు నెమరుకు తెచ్చుకోవలసి వస్తున్నది. ఈ పదేళ్ళలో రామాయణాన్ని గురించి వెలువడిన కొత్తపరిశోధక వ్యాసాలను, గ్రంథాలను చదవవలసి వస్తున్నది. అందువల్ల ఏ మేరకు నా కృషి జయప్రదం కాగలదో చెప్పలేను. అయినా శక్తివంచనలేని ప్రయత్నం చేస్తాను.

ఈ "సీతజ్యోస్యం" పీఠికలో నేను ప్రత్యేకించి చర్చించగోరుతున్న ముఖ్యాంశాలివి:

(1) రామాయణగాథకు చారిత్రకాధారం ఏ కొంచెంగానైనా వున్నదా?

(2) రాముని వనవాసం ఏప్రాంతంలో?

(3) రాక్షసు లెవరు? వారి స్థితిగతు లెట్టివి?

(4) ఋషు లెవరు? తమ యజ్ఞయాగాదులకు వారు జనస్థానాన్ని ఎన్నుకొనడం దేనికి?

(5) రామాయణకాలంనాడు ఎవరి ఆయుధాలెట్టివి?

ఈ అయిదు ప్రశ్నల చర్చను అయిదు ప్రకరణాలలో జరుపుతాను. మరొక ప్రకరణాన్ని నా నాటకంలోని పాత్రలనుగురించిన చర్చకు వినియోగిస్తాను. ఇతర విషయాలను తడవవలసివస్తే, అందుకు మరొక, లేదా మరికొన్ని ప్రకరణాలను ప్రత్యేకిస్తాను. అయితే, ఇట్టి అగత్యం బహుశా కలగదు.

*

రామాయణంలో నిజ మెంత?

రామాయణగాథకు చరిత్రకాధారం ఏ కొంచెంగానైనా వున్నాదా? - ఈ ప్రశ్నవేయడమే కోటానుకోట్ల రామభక్తుల దృష్టిలో ఒక పెద్ద నేరం, ఒక ఘోర పాపం. ఈ ప్రశ్న వేసే వాని నాల్క చీల్చాలి, గొంతు నులమాలి, అతడిని నిలువునా పాతిపెట్టాలి. రామాయణం నిజం కాకపోతే, ఏది నిజం? ఎంత దూరమో పోవడం దేనికీ? ఒక కుటీరాన్ని వేసుకొని, కొంత కాలంపాటు మన భద్రాచలం సమీపాన సీతారామలక్ష్మణులు వనవాసం చేసినందునే ఆ ప్రాంతాన్ని ఈనాటికీ "పర్ణశాల" అంటున్నారు. దానివద్ద సీత ఋతుస్నానాలు చేసిన ఉష్ణగుండాలు ఈనాటికీ వున్నాయి. బట్టలు ఉతుకుకొనడానికై ఆమె వాడిన రాతిబండలను ఇప్పటికీ అక్కడ చూడవచ్చు. ఆమె అపహరణ వార్తను గుంటూరుజిల్లాలోని ఒక కొండవద్ద మొట్టమొదటగా రాముడు విన్నందునే దానికి "వినుకొండ" అనే పేరు వచ్చింది. పాషండులు ఏమన్నా, రావణాసురుని కాష్ఠ మిప్పటికి భగభగ మండుతూనే వున్నది. ఇప్పుడు లంకను శ్రీమతి సిరిమావో బండారనాయకే పరిపాలిస్తున్నా, విభీషణుడు ఆ దీవిలోనే ఎక్కడో ఒకచోట ప్రచ్ఛన్నంగా కూర్చుని

ఈనాటికీ రామభజన చేస్తూనే వున్నాడు. ఆయనవలె హనుమంతుడుసయితం చిరం జీవి. నాస్తికుల పాపిష్ఠి కళ్ళకు ఆయన కనబడకపోవచ్చుగాని, "శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం, ప్రభాదివ్యకాయం, ప్రకీర్తిప్రదాయం, భజే వాయుపుత్రం, భజే వాలగాత్రం, భజేహం!" అంటూ ప్రార్థించినంతనే భక్తులరక్షణకై ఈనాటికీ ఆయన ఒక గంతులో వచ్చి, భూత ప్రేత పిశాచాలను చీల్చి చెండాడుతున్నాడు.

పాషండులు, ఇతర నాస్తికులు నమ్మకపోయినా, రామజననం దాదాపు పది లక్షల సంవత్సరాలక్రితం జరిగింది.[1] మరింత కచ్చితంగా చెప్పాలంటే, క్రీస్తుకు పూర్వం 8, 67, 102 సంవత్సరాలనాడు త్రేతాయుగంలో జరిగింది. రామాయణం లోనే ఒకచోట (ఉత్తరకాండలో 74వ సర్గ) రామజననం త్రేతలోకాదని, ద్వాపరంలో అనిగ్గోలు దనుకోండి. రావణవధానంతరం పరమేశ్వరునివెంట రాముని వద్దకు వచ్చిన దశరథుడు "కాహళుడను బ్రాహ్మణుని అష్టావక్రుడు తరింపజేసినట్టు నీవు నా వాక్యపరిపాలనద్వారా నన్ను తరింపజేశావు" అని అష్టావక్రుని ప్రసక్తి తెచ్చినట్టు యుద్ధకాండలో (122వ సర్గ) వున్నందున రాముడు కలియుగ ప్రారంభానికి చెందిన వాడని తీర్మానించుకోవా లనుకోండి.[1] అయితే, ఇవి పొరపాటు మాటలు. రామునికి, రామాయణానికి సంబంధించినంతవరకు ఎంత వెనకకు వెడితే, నిజానికి అంతే చేరువగా మనం జరుగుతాము! తిరుగులేని ఈ సూత్రాన్ని పాటించే ఒక జ్యోతిషశాస్త్ర పండితుడు రామరావణయుద్ధం క్రీస్తుకుపూర్వం 1, 25, 67, 101వ సంవత్సరంలో జరిగిందని చెప్పాడు. ఒక విధంగా ఇది కూడా తగినంతగా వెనకకు వెళ్ళడం కాదు. ఈ భూమి పుట్టినప్పుడే, ఆ మాటకు వస్తే, ఈ భూమి పుట్టకముందే, వేదాలున్నాయి. వాటిలో ఇక్ష్వాకుని పేరు వున్నది, సీతారామలక్ష్మణుల పేర్లు వున్నాయి. వేదాంగాలైన బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో విదేహరాజు జనకుని పేరు వున్నది, కేకయరాజు అశ్వపతి పేరు వున్నది.

ఈ ధోరణిలో రామభక్తులు ఏమేమో చెబుతూపోతారు, అంతూపొంతూ లేకుండా చెబుతూపోతారు. వారి మాటలకు విలువ నిస్తే రావణునికి పది తలలని, ఇరవై చేతులని నమ్మవలసివస్తుంది; హనుమంతునికి తోకవున్నట్టు, అతడు నూరు యోజనాల సముద్రాన్ని (బహుశా తన తోక తోడ్పాటుతోనే) అవలీలగా లంఘించి లంకను తగలబెట్టి వచ్చినట్టు నమ్మవలసివస్తుంది; కుంభకర్ణుని నిద్రనుంచి మేల్కొలపడానికి అతడిని వెయ్యి యేనుగులతో రావణుడు తొక్కించినట్టు నమ్మవలసివస్తుంది. రామాయణంలో కోకొల్లలుగా వున్న ఇట్టి కాకమ్మకథ లన్నింటిని

కడిగిపోసిన సత్యాలుగా గుర్తించవలసివస్తుంది. అందువల్ల రామాయణాని కున్న చారిత్రక ప్రాతిపదిక విషయమై జరిపే చర్చ సందర్భంలో రామభక్తులను మన దరిదాపులకైనా చేరనీయరాదు. వారిని, వారి సోదిని ఎంతమాత్రం పట్టించుకో రాదు.

కట్టుకథకు, గట్టి చరిత్రకు భేదం తెలియని రామభక్తులను ఒక పక్కకు నెట్టి, వేదాలను చారిత్రకదృష్టితో పరిశీలిస్తే, వాటిలోని ఇక్ష్వాకునికి, రామాయణం లోని ఇక్ష్వాకునికి ఏమీ సంబంధం లేదని తెలుస్తుంది. ఋగ్వేదంలో ఒకసారి, అథర్వణ వేదంలో ఒకసారి, మొత్తం రెండుసార్లు వేదాలలో ఇక్ష్వాకుని ప్రసక్తి వున్నది. అయితే ఇతడు వైవస్వత మనువు కుమారుడు కాడు, రాముని వంశానికి మూల పురుషుడు కాడు. పోతే, ఋగ్వేదంలోని సీత నాగేటి చాలుగాని, రామాయణ నాయిక కాదు. ఋగ్వేదంలోనే ఒక ఋక్కులో "రామమ్" అనే మాట తగిలేస రికి, "మరి సందేహం దేనికి? ఇదిగో! ఇక్కడ రామకథ బీజరూపంలో వున్నది" అంటూ శ్రీ బి.వి. కామేశ్వర అయ్యర్ ఎగిరి గంతువేశాడు.[2] అయితే, సాయ నాచార్యుడు ఈ "రామమ్" పదానికి ఈ సందర్భంలో చెప్పిన అర్థం "రాత్రి" అని. సరిగా ఇదే అర్థాన్ని తన ఋగ్వేదం అనువాదంలో ఆర్.టి.హెచ్. గ్రిఫిత్ స్వీకరించాడు. హెచ్.గ్రాస్మన్ సయితం ఋగ్వేదానికి తన జర్మన్ అనువా దంలో ఇంతే చేశాడు. ఇక, లక్ష్మణుని ప్రసక్తి మిగిలింది. ఋగ్వేదంలోని "లక్ష్మణ" శబ్దం "వేదిక్ ఇండెక్స్" వివరణప్రకారం ఒక దానశీలి తండ్రిపేరును సూచిస్తున్నది.[3]

ఇక్కడ మరొక విషయాన్ని కూడా గమనించాలి. వేదవాఙ్మయంలో రాముని ప్రసక్తిని, ఇతర రామాయణపాత్రల ప్రసక్తిని తీసుకురాగోరితే ఆ పనిని సందేహానికి ఆస్కారం లేకుండా చేసేవారు కాదా? ఒక రాముని చూచి, మరొక రాము డని పొరపడ్డానికి ఎంతమాత్రం వీలులేకుండా "రామ ఔపతస్విని" "రామక్రాతు జాతేయుడు", "రామమార్గవేయుడు" అంటూ బ్రాహ్మణాలలో, ఉపనిషత్తులలో చెప్పినట్టు, "రామదాశరథి" అని స్పష్టంగా, నిర్ద్వంద్వంగా చెప్పేవారు కాదా?

వేదాలను, వేదకాలాన్ని విడిచిపెట్టండి; కనీసం పాణిని వ్యాకరణంలోనైనా రాముని ప్రసక్తిలేదు. ఆయన వాసుదేవకృష్ణుని పేరెత్తాడు, యుధిష్ఠిరుని పేరె త్తాడు, అర్జునుని పేరెత్తాడు, రాముని తలవనైనా లేదు. ఇంతే కాదు. పతంజలి రచనలలో సయితం రాముని ఊసు పొరపాటుగానైనా రాదు. అసలు క్రీస్తుశకానికి పూర్వపు ఏ శాసనంలోను రాముని ప్రసక్తి కనబడదని మోరిట్స్ వింటర్‌నిట్స్.[4] వ్రాశాడు.

అయినా, ఋగ్వేదంలోని దివోదాసు, రామాయణంలోని దశరథుడు సమకాలికులని, శంబరునిపై యుద్ధంలో దివోదాసుకు దశరథుడు బాసటగా నిలిచాడని, ఈ ధోరణిలో ఏమేమో పండిట్ ద్వారకాప్రసాద్ మిశ్రా చాలా చాలా చెప్పాడు.[5] రాజకీయరంగంలోని తన బుద్ధిచాతుర్యాన్ని, తన వాద నైపుణ్యాన్ని సాహిత్యరంగానికి వర్తింపజేయడానికి ఈయన గట్టి ప్రయత్నం చేయకపోలేదు గాని, అది కేవలం ఒక "సర్సన్ ఫీట్"గా పరిణమించింది.

ఏ "సర్కస్ ఫీట్" చేయకుండా రామాయణాన్ని విచక్షణాపూర్వకంగా పరిశీలించిన జాతీయ, విజాతీయ పండితులు దానికి ఏ పాటిగా చారిత్రకాధారం కలదన్న విషయమై విభిన్నాభిప్రాయాలను వెల్లడించారు. వాటిని స్థూలంగా రెండు వర్గాలకింద విభజించవచ్చు:

(1) రామాయణం పూర్తిగా కల్పితగాథ.

(2) రామాయణంలో అసంభవవిషయాలు, అభూతకల్పనలు పెక్కులున్నా, దానికి చారిత్రకాధారం ఏ స్వల్పంగానో లేకపోలేదు.

ఈ రెండువర్గాల అభిప్రాయాలలో తిరిగి అనేక విభేదా లున్నాయి. వాటిలో ప్రధానమైన వివి:

(అ) రామాయణగాథకు మూలబీజం వేదవాఙ్మయంలో వున్నది.

(ఆ) ఉత్తరభారతానికి చెందిన కొన్ని బౌద్ధ జాతకకథల, దక్షిణభారతానికి చెందిన కొన్ని జానపదగాథల కలగాపులగమే రామాయణం.

(ఇ) ఎప్పుడు ఏ రూపంలో ఆవిర్భవించినా రామాయణంపై గ్రీక్ పౌరాణిక గాథల ప్రభావం బలీయంగానే వున్నది.

(ఈ) ఖగోళశాస్త్రాన్ని కథారూపంలో చెప్పడానికి జరిగిన ప్రయత్న ఫలితమే రామాయణం.

పోతే, రామాయణానికి ఎంతో కొంత చారిత్రకాధారం లేకపోలేదని చెప్పేవారిలో–

(ఎ) కొందరు దాన్ని సింహళంవరకు ఆర్యసామ్రాజ్య విస్తరణగా వేర్కొంటారు.

(బి) మరికొందరు ఆర్యజాతికి చెందిన రాముని జైత్రయాత్ర వింధ్యపర్వతాలను దాటి వెళ్ళలేదని వాదిస్తారు.

(సి) వేరొకకొందరు ఆర్య సామ్రాజ్య విస్తరణయత్నం ఎంతమాత్రం లేదని, ఆర్యసంస్కృతిని, నాగరికతను దక్షిణాపథానికి వ్యాపింపజేయడానికి మాత్రమే కృషి జరిగిందని సిద్ధాంతీకరిస్తారు.

(డి) రామాయణానికి రంగస్థలం ఇండియా కాదు, ఈజిప్టు అని వాదించే వారు సయితం కొంద రున్నారు.

కేవలం ఇవి మాత్రమే కాక, మరికొన్ని సూచన లున్నాయి, సిద్ధాంతాలున్నాయి, వాదాలున్నాయి, ప్రతివాదాలున్నాయి. ఒకే రచయిత "ఇది కావచ్చు, అది కావచ్చు, మరొకటి కావచ్చు, అన్నీ కావచ్చు" అని చెప్పిన సందర్భాలు సయితం వున్నాయి. వాటి వివరాలలోకి నేను అంతగా వెళ్ళను; వివిధ పండితులు, విభిన్న పరిశోధకులు వెల్లడించిన విరుద్ధాభిప్రాయాలలో కొన్నింటిని మాత్రమే సంగ్రహంగా నివేదిస్తాను.

రామాయణగాథను అంకురప్రాయంగా వేదవాఙ్మయంలో పరికించవచ్చునని 1872లో జర్మనీకి చెందిన సంస్కృతపండితుడు ఆల్ బ్రెక్ట్ వేబర్ సూచించాడు; తర్వాత పదకొండు సంవత్సరాలకు మన రమేశ్‌చంద్ర దత్ ఇది పూర్తిగా నిజమని ఉద్ఘాటించాడు. ఈ తరంవారికి దత్ అపరిచితుడు కావచ్చుగాని, ఒకనాడు ఆయన మన జాతీయనాయకుడు. ఐ.సి.ఎస్. ఆఫీసర్‌గా ఉద్యోగజీవి తాన్ని ప్రారంభించి, బరోడా దివాన్‌గిరి సమేతంగా, ఉన్నతపదవులను పెక్కింటిని ఆయన నిర్వహించాడు. ఆర్థికశాస్త్రవేత్త కొన్ని గ్రంథాలు రచించాడు. బహుభాషాపండితుడుగా ఋగ్వేదాన్ని బెంగాలీలోకి, రామాయణ, భారతాలను ఇంగ్లీషులోకి అనువదించాడు. కవిత్వం చెప్పాడు, నవలలు వ్రాశాడు. కాంగ్రెసుకు ఒకసారి అధ్యక్షుడైనాడు. వేబర్ వివిధసమయాలలో రామాయణాన్ని గురించి విభిన్నాభిప్రాయాలను వెల్లడించగా, దత్ ఒకే సూచనను స్పష్టంగా చేశాడు, నిష్కర్షగా చేశాడు. అందువల్ల ముందుగా ఆయన సూచనను వివరించడమే సమంజసం.

విపుల పరిశోధనతర్వాత, దీర్ఘాలోచనపిదప దత్ చేసిన సూచన –ఋగ్వేదంలోని సీత మారి, మారి, రామాయణంసీతగా పరిణమించిందని. ఋగ్వేదంలోని సీత ఒక వ్యక్తి కాదు, నాగేటిచాలుకు వేదఋషులు చేసిన రూపకల్పన మాత్రమే.[6] ఒక దేవతామూర్తిగా నాగేటిచాలును సంభావించుకొని, తక్కిన అనేక దేవతలనువలె ఆమెను సయితం వేదకాలంలో ఆరాధించారు. కాలక్రమాన ఆమెనుగురించి ఎన్నెన్నో కథ లల్లి, నారీలోకానికే శిరోమణిగా ఆమెను చేశారు.

అంతటి నారీశిరోమణిని ఒక మహాపురుషుని పుత్రికను చేయాలి కనుక, ఆమె పితృత్వాన్ని ఉపనిషత్తుల కాలంలో రాజర్షిగా ప్రఖ్యాతినందిన జనకునికి అంట గట్టారు. అయితే ఋగ్వేదాన్ని, దానిలోని నాగేటిచాలు ప్రసక్తిని పూర్తిగా త్రోసివేయడానికి వీలులేక, నాగేటిచాలులో జనకునికి దొరికిన శిశువుగా సీతను అభివర్ణించారు. నాగేటిచాలు (వ్యవసాయం) ఉత్తరభారతంనుంచి దక్షిణాపథానికి నెమ్మదిగా విస్తరించినప్పుడు సీతను గురించిన కథలు చిలవలు, పలవలు వేయడం సహజంగానే జరిగింది.

సీత వ్యావసాయిక దేవత అయితే, మరి రాముడెవరు? ఇందుకు రమేశ్ చంద్రదత్ జవాబు "ఆయన ఇంద్రుడే" అని. పురాణాల ప్రకారం రాముడు శ్రీమహా విష్ణువుకాని, ఇంద్రుడు కాడు. అయితే, వేదయుగంలో ఇంద్రుడే దేవాధిదేవుడు; అప్పటిలో విష్ణువుస్థానం ఇంద్రుని తర్వాత ఏడువెనకలుగానే. ఈనాడు బహుళప్రజలకు తెలియకపోవచ్చుగాని, ధర్మ సూత్ర వాఙ్మయం ప్రకారం, సీత ఇంద్రని భార్య. ఒకనాటి తన ప్రధమస్థానం నుంచి ఇంద్రుడు కేవల మొకదిక్పాలుడుగా డిమోట్ కావడం, విష్ణువు ఇంద్రునిస్థానానికి ప్రమోట్ కావడం, రాముడు విష్ణ్వవతారం కావడం, సీత రాముని భార్య కావడం – ఈ మార్పులన్నీ జరిగింది పౌరాణికయుగం ప్రవేశించిన పిదపనే. అయితే, ఇట్టి మార్పు లెన్ని జరిగినా, దత్ పలుకులలో, రాముడు ఇంద్రునికి "ఒక కొత్త కూర్పు" ("న్యూ ఎడిషన్") మాత్రమే; రామరావణ యుద్ధం ఇంద్రవృత్రాసురుల యుద్ధానికి ఒక కొత్త రూపు మాత్రమే.

ఈ విషయాలను వేబర్ కాదనడు గాని, ఆయన మతంప్రకారం ఋగ్వేదంలోకంటె స్పష్టంగా తైత్తిరీయ బ్రాహ్మణంలో రామాయణగాథ బీజాలను చూడవచ్చు. ఆ బ్రాహ్మణంలోని ఒక గాథలో చంద్రునిపట్ల సీత ప్రేమప్రసక్తి వున్నది. రాముని "రామచంద్రుడు" గా కూడా పేర్కొనడం ఈ గాథ కారణంగానే కావచ్చునని వేబర్ ఊహ చేశాడు. ఇది పరిశీలనైనా లేకుండా త్రోసివేయదగు ఊహ కాదు. "హరి" కున్న నానార్థాలలో "చంద్రు" డొకటి. ఇంతేకాక, చంద్రునికున్న నామావళిలో "ఓషధీశుడు" అనేది కూడా వున్నది. అతడు ఓషధులకు ఈశుడైనందున, అతడిని సీత (వ్యావసాయిక దేవత) ప్రేమించడం సహజమే.

సీతకు వ్యవసాయంతోగల సన్నిహితసంబంధానికి మరొక సాక్ష్యంగా పారస్కరగృహ్యసూత్రాన్ని చూపించవచ్చు. పొలం పైరుపై వుండగా "సీతాయజ్ఞం"

జరపాలని అది నిర్దేశిస్తున్నది. గృహ్యసూత్రాలనుగురించి ప్రత్యేకపరిశోధనలు జరిపిన డాక్టర్ వి.ఎమ్.ఆప్టే వివరించినట్టు, ఈ యజ్ఞానికి సంబంధించిన ఒక మంత్రం సీతను ఇంద్రునిభార్యగా సంబోధిస్తున్నది.[7] కేవలం గృహ్యసూత్రాలలోనే కాక, జైనమతగ్రంథాలలో సయితం "సీతజన్నం" ప్రసక్తి వున్నట్టు జగదీశ్ చంద్రజైన్ వ్రాశాడు.[8]

ఋగ్వేదంసీత కాలక్రమాన రామాయణంసీతగా మారినట్టు చెప్పినవారిలో మరొక ప్రముఖుడు రామాయణాన్ని కూలంకషంగా పరిశీలించిన జర్మన్ పండితుడు హెర్మన్ యాకోబీ. ఆయన వ్రాసినట్టు, విష్ణువుకు మరొక పేరు "ఉపేంద్రుడు" (ఇంద్రుని సోదరుడు). "హరి" విష్ణువుమాత్రమే కాదు, ఇంద్రుడు కూడా. ఇందువల్ల ఋగ్వేదంలోని ఇంద్రునికి సంబంధించిన వెక్కు గాథలను పౌరాణిక యుగంలో విష్ణువుకు అంటగడుతూపోయారు.[9] ఈ విషయంలోకి మరింతలోతుగా వెళ్ళి, ఎ.ఎ.మెక్డొనల్ ఈ కింది ముఖ్యాంశాలను పేర్కొన్నాడు: వృత్రాసురునికి ఋగ్వేదంలో ఒక పేరు "ఇంద్రశత్రువు". రామాయణంలో ఈ పేరు రావణునికి లేదుగాని, అతని కుమారులలో ఒకనికి (ఇంద్రజిత్తుకు) వున్నది. వృత్రాసురుడు చేసిన మహాపరాధం గోగ్రహణం కాగా, రావణుడు చేసింది సీతాపహరణం. వృత్రాసురునితో జరిగిన యుద్ధంలో ఇంద్రునికి తోడ్పడినవారు మరుత్తులు కాగా, రావణునిపై యుద్ధంలో రామునికి తోడ్పడినవాడు మారుతి.[10] వృత్రాసురుడు హరించిన గోవుల జాడను తెలుసుకొనడానికి ఇంద్రునిబంటుగా సరమ (దేవతల శునకం) తోడ్పడినట్టుగా, సీత జాడను తెలుసుకొనడంలో మారుతి తోడ్పడ్డాడు. పైగా, యాకోబీ సంభావించినట్టు, హనుమంతుడు ఆదిలో దక్షిణాదివారికి వ్యవసాయాధిదేవత కావచ్చు.

ఇంత గట్టిగా కాకపోయినా, ఋగ్వేదంలోని సీత కాలక్రమాన రామాయణం సీతగా రూపొందివుండవచ్చునని చెబుతూ, ఆదిలో దశరథరాముడు, హలధరుడైన బలరాముడీ ఒక్కరే అయివుండవచ్చునని పారిస్‌కు చెందిన సంస్కృత పండితుడు ఎ. బార్త్ సూచించాడు.[11] ఆయనకంటె ముందుగా వేబర్ సరిగా ఇదే సూచన చేశాడు.[12] పోతే, ఎ.బి.కీత్‌కు సంబంధించినంతవరకు వ్యవసాయ గాథలే మారి మారి పెరిగి పెరిగి చివరికి రామాయణంగా పరిణమించాయి. రామాయణం ఆవిర్భావంవిషయమై జరిగిన విభిన్నసూచనలలో "ఇదే అత్యంత విశ్వసనీయమైనది"గా ఆయన భావించాడు.[13]

వ్యవసాయాధిదేవతలు, వారికి సంబంధించిన కథలు, గాథలు. వారికి పూజా

పురస్కారాలు-ఇవి కానరాని ప్రాచీనసంఘం లేనే లేదు. విల్ డూరెంట్ వివరించి నట్టు, తక్కిన జంతుజాలంనుంచి వేరుపడి, నాగరికతాపథంవెంట నరుడు వేసిన తొలి మూడడుగులలో మొదటిది వాక్కు, రెండవది వ్యవసాయం, మూడవది లిపి.[14] వ్యవసాయాన్ని కనుగొనడానికి ముందు నరుడు ఆటవికుడు, దేశదిమ్మరి. ఎక్కడ వేటకు జంతువులు దొరకగలవో అక్కడికి అతడు కదిలిపోతూ వుండే వాడు; ఎక్కడ పశువులకు మేత దొరకగలదో అక్కడికి తన నివాసం అతడు మార్చుతూవుండేవాడు. ఒకేచోట అతడు స్థిరపడిందీ, నాగరికతాభివృద్ధి కేమి, సంస్కృతీవికాసాని కేమి ముఖ్యావసరమైన విభూతిని, విరామాన్ని అతడు సమ కూర్చుకొన్నదీ వ్యవసాయం ప్రారంభమైన పిమ్మటనే. ఆలోచనాఫలితంగా కాక, ప్రయోగాల ఫలితంగా కాక, మట్టిలో మానెడు గింజలు పోస్తే, అవి పుట్టెడు కాగ లవన్న సంగతిని ఆరేడు వేలసంవత్సరాలక్రితం యాదృచ్ఛికంగా ఈజిప్టులో నరుడు కనుగొన్నాడు.[15] ఇది అతడి కంటికి ఒక వింతగా కనబడింది, అతడి బుద్ధికి ఒక అత్యద్భుత విషయంగా తోచింది. దీన్ని కేవలం ఏదో ఒక దేవత, లేదా కొందరు దేవతల మహిమగా అతడు విశ్వసించాడు; ఈ ప్రాచీన విశ్వాసంనుంచి ఉత్తరభా రతంలో వ్యవసాయాధిదేవతలుగా ఇంద్రుడు, పర్జన్యుడు, అశ్వినులు, మరుత్తులు, ఉద్దాలకాశ్యపుడు, స్వాతికారి, సీత, అనుమతి-ఇందరు దేవతలు పుట్టుకొచ్చారు.[16] ఇండియాలోనే కాదు, దేశదేశాలలో ఇంతే జరిగింది. ఉదాహరణకు, ఈజిప్టులో ఓసైరిస్, ఐసిస్ మున్నగువారు వ్యవసాయాధిదేవతలు. గ్రీసులో డైయెనైసెస్, డిమీటర్, పర్సెఫని మున్నగువారు వ్యవసాయాధిదేవతలు ;[17] శాటర్నస్, సెయ్, సెగెటియా, యాట్టిస్ తదితరులు రోమన్ వ్యవసాయాధిదేవతలు.[18] వీరిలో కొందరి సంప్రీత్యర్థం ఒకప్పుడు దేశాదేశాలలో నరబలులు సాగుతూవుండేవి, బ్రిటిష్‌వారు జోక్యం కలిగించుకొని, దాన్ని నిషేధించడానికి పూర్వం మన దేశంలో ఖోండ్ తెగవారు, గోండ్ తెగవారు నరబలితర్వాతనే కొత్తపైరును వెడుతూవుండేవారు. వారిలో గోండ్ జాతివారికి బ్రాహ్మణబాలుని బలిపెడితే, పంట మరింతగా రాలు తుందని ఒక వెర్రి నమ్మకం వుండేదట.[19] తెలుగు, తమిళ, కన్నడ గ్రామాలలో ఒకప్పుడు-చెదురుగా బహుశా ఇప్పుడు కూడా-పోతురాజుకు బలిగా ఎనుబోతులను, మేకపోతులను నరకడం అతడు పైర్లను కాపాడతాడన్న విశ్వాసంతోనే.[20]

ఇప్పుడు తిరిగి అసలు విషయానికి వస్తే, చెప్పవలసిన మాటలివి: ఋగ్వేదంలో నాగేటిచాలుకు ప్రతిరూపమైన సీత మహాభారతంలో ధాన్యలక్ష్మిగా మారింది.[21] అందువల్ల రామాయణం పుట్టుపూర్వోత్తరాలనుగురించి రమేశ్‌చంద్ర దత్ వ్రాసిన

దాన్ని ఒక ఆంగ్ల మానసపుత్రుని వెర్రిమొర్రి ప్రేలాపనగా త్రోసిపుచ్చడం సాధ్యం కాదు. వేబర్, యాకోబీ, బార్త్, కీత్ మున్నగు పాశ్చాత్యపండితులు చేసిన సూచనలను "ఈ కిరస్తానీలు ఇంతకంటె ఏమి అనగలరులే!" అని నిరసించడానికి సయితం వీలులేదు. వేబర్‌ను బలపరుస్తూ వింటర్‌నిట్స్ అన్నట్టు ఋగ్వేదంసీతకు, రామాయణంసీతకు కొన్ని యోజనాల దూరం వుండవచ్చు.[22] అయినా, ఆ సీతలిద్దరికి ఎంతో కొంత రక్తబాంధవ్యం నిశ్చయంగా వున్నది.

తక్కిన పాశ్చాత్యపండితులను చులకనచేసే మన రామభక్తులు సయితం మాక్స్‌ముల్లర్‌ను మెచ్చుకొంటారు; మామూలుగా మెచ్చుకొనడమైనా కాదు, "మోక్షముల్లర్" అంటూ నెత్తిన పెట్టుకొంటారు. ఔను! వారి దృష్టిలో ఆయన అంతగా గౌరవించదగువాడే! సమస్తవిద్యలకు, సర్వశాస్త్రాలకు, సకలకళలకు ప్రాచీనభారతం నిలయమని ఆయన చెప్పలేదా? నాగరికతను ప్రపంచానికి భిక్షగా పెట్టింది భారతదేశమే అని ఆయన చాటలేదా? భారతావనిపట్ల తన కున్న భక్తిలో శతాంశమైనా తన మాతృదేశమైన జర్మనీపట్ల తనకు లేదని ఆయన ఉద్ఘాటించలేదా? అట్టి "మోక్షముల్లర్" రామాయణానికే కాక, భారతానికి కూడా చారిత్రకాధారం లేదని ప్రాశాడంటే, అది మన రామభక్తులకు విద్యుదాఘాతం కావచ్చు. కాని ఆయన అంతే ప్రాశాడు. ఈనాడు నోముల, వ్రతాల సందర్భంలో వాటిని జరిపించే పురోహితులు ఏవేవో కట్టుకథలు చెప్పడం కద్దు. వేదయుగంలో యజ్ఞయాగాదుల సందర్భంలో ఋత్విజులు ఇదే విధంగా కథలు, గాథలు, ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు మొదలైనవాటిని చెప్పేవారని, అవే అటుతర్వాత రామాయణ, భారతాల రూపాన్ని ధరించాయని మాక్స్‌ముల్లర్ సూచించాడు. సరిగా ఇవే మాటలను వాడకపోయినా ఆయన తాత్పర్యం వేద యుగంనాటి జానపదవాఙ్మయం రామాయణ, భారతాలరూపంలో కావ్యగౌరవాన్ని సంపాదించుకొన్నదని.[23]

అయితే, ఎందరు పండితులు-ఎంతటెంతటి విద్వాంసులు-రామాయణం అంకురప్రాయంగా వేదవాఙ్మయంలోనే వున్నట్టు చెప్పినా, ఈ విషయాన్ని గుర్తించడానికి పూర్తిగా నిరాకరించిన భారతీయ పరిశోధకులలో ప్రథమగణ్యుడు దినేశ్ చంద్రసేన్. ఆయన వంగప్రజలనుగురించి, వారి జానపద సాహిత్యాన్ని గురించి వంగభాషనుగురించి, దానిలోని వాఙ్మయాన్నిగురించి, చైతన్యుని గురించి, ఆయన మతాన్ని గురించి అనేక గ్రంథాలను రచించి కీర్తి కెక్కినవాడు. వంగభాషలోని రామాయణాలను గురించి, ముఖ్యంగా కృత్తివాస రామాయణాన్ని గురించి, ఉప

న్యాసాలరూపంలో తాను వ్రాసిన గ్రంథంలో వాల్మీకి రామాయణానికి ఏపాటి చారిత్రకాధారం కలదన్న విషయాన్ని విపులంగా చర్చించి, ఎంతమాత్రం లేదన్న తీర్మానానికి ఆయన వచ్చాడు.[24] ఈ సందర్భంలో ఆయన చేసిన వాదంలో ప్రధానాంశాలివి:

(1) ముఖ్యంగా దశరథ జాతకకథ, కొంత తక్కువ స్థాయిలో సామ, వెస్సంతర జాతకకథలు-వీటి కలగాపులగమే రామాయణంలోని బాల, అయోధ్యాకాండలు.

(2) ఆరణ్య, సుందర కాండలకు మూలాధారం ఒకనాడు మధ్య అమెరికా, జపాన్ మొదలైనకొన్ని ప్రాంతాలలోను, ఈనాటికి సయితం ఇండియాలో బహుళ వ్యాప్తిలోగల ఆంజనేయారాధన.

(3) పోతే, యుద్ధకాండకు, ఉత్తరకాండకు ప్రాతిపదికలు రామునితో ఏమీ సంబంధం లేకుండా ఒకప్పుడు రావణునిగురించి దక్షిణ భారతంలో ప్రచారంలో గాథలు.

దినేశ్ చంద్ర సేన్ పేర్కొన్నట్టు, రాముని వనవాసగాథకు, దశరథ జాతకకథకు కొంత పొచ్చుగానే పోలికలున్నాయి. అయితే, వాటిమధ్య కొన్ని వ్యత్యాసాలు కూడా వున్నాయి. రామాయణానికి మూలాధారాల చర్చసందర్భంలో ఈ జాతక కథకున్న అధిక ప్రాధాన్యం దృష్ట్యా పాళీభాషనుంచి దానికి స్వామి శివశంకరశాస్త్రి సరళమైన భాషలో సుందరంగా చేసిన ఆంధ్రానువాదాన్ని ఈ పీఠిక చివర మొదటి అనుబంధంగా ప్రచురిస్తున్నాను. దాన్ని చదివితే వాల్మీకంలోని రాముని వనవాసగాథతో ఈ క్రింది ముఖ్యాంశాలతో అది విభేదిస్తున్నట్టు స్పష్టపడుతుంది:

(1) దశరథుడు కోసలదేశం రాజు కాడు, కాశీప్రాంతం రాజు.

(2) రామలక్ష్మణుల పేర్లు రామపండిట్, లక్ష్మణకుమారుడు. సీత వారిద్దరి సోదరి. వారు ముగ్గురు దశరథుని పట్టపుదేవేరి సంతానం.

(3) పట్టపుదేవేరి మరణించిన వెనుకనే దశరథుడు రెండవపెళ్ళి చేసుకొంటాడు. ఆమెకు కలిగిన కొడుకు భరతుడు. (కౌసల్య, కైకేయి పేర్లు జాతకకథలో కానరావు. దానిలో సుమిత్ర, శత్రుఘ్నుల ప్రసక్తి రానే రాదు.)

(4) ఆడినమాట తప్పరాదన్న బాధతో కాక, సీతారామలక్ష్మణులకు కైకేయి వల్ల ముప్పు కలగవచ్చునన్న భయంతోనే దశరథుడు పన్నెండు సంవత్సరాలపాటు వనవాసం చేయవలసిందిగా వారికి సూచిస్తాడు. (జ్యోతిషులు

Dr. BRAOU LIBRARY Acc. No: N-16102 Class No. 894.8274 B03ti

మరి పన్నెండేళ్లు మాత్రమే ఆయనకు ఆయుర్దాయమని చెప్పినారటు.)

(5) సీతారామలక్ష్మణులు వనవాసానికి వెళ్ళింది దండకారణ్యానికి కాదు, హిమాలయాల ప్రాంతానికి.

(6) పుత్రవియోగదుఃఖంతో దశరథుడు వెంటనే చనిపోడు; రాముడు వనవాసానికి వెళ్ళిన తర్వాత తొమ్మిదేళ్ళ తర్వాతనే. అప్పుడుగాని అన్నవద్దకు వెళ్లి, వెనుకకు వచ్చి పట్టాభిషేకం చేసుకొనవలసిందిగా భరతుడు అభ్యర్థించడు.

(7) తండ్రి మరణవార్త విన్నపిమ్మట సీత,లక్ష్మణుడు వారణాసికి తిరిగి వచ్చినా, రామపండితుడు మాత్రం మొత్తం పన్నెండేళ్ళు వనవాసం చేస్తాడు. ఆ గడువుపిమ్మట తమ రాజధానీనగరానికి తిరిగి వచ్చి, సీతను పరిణమమంది, పట్టాభిషేకం చేసుకొంటాడు.

రామాయణగాథతో ఇన్ని వ్యత్యాసాలే కాక, ఒక వైపరీత్యం కూడా ఈ దశరథజాతకంలో వుండగా, ఇది రామాయణం ప్రథమ భాగానికి ఆధారభూతమని చెప్పడం "హరిహరీ! ఎంతటి పాపపు మాట!" అని రామభక్తులు ఒక్కుమ్మడిగా వైకి దూకుతారనుకోండి. కాని, దినేశచంద్ర సేన్‌కంటె వెక్కు దశాబ్దాలకు ముందు వేబర్ ఇంతే అన్నాడు; ఇటీవల సునీతికుమార ఛటర్జీ ఇంతే అంటున్నాడు. వీరు కేవలం దశరథ జాతకకథమీదనే ఆధారపడితే, వీరి వాదంలో పస లేదని కొట్టిపారవేయవచ్చు. కాని, దానికి సామ, వెస్సంతర జాతకకథలను కలిపితే, రామాయణగాథ ప్రథమఘట్టాలు స్థూలంగా రూపొందుతాయి.

అయితే, అన్నచెల్లెళ్ళ పెళ్ళి వైపరీత్య మేమిటన్న ప్రశ్న వెంటనే వస్తుంది. ఒకనాడు ఈజిప్టు రాజవంశంలో ఇది విపరీతం కాదు, బాబిలోనియన్ రాజవంశంలో విపరీతం కాదు, ఇరానియన్ సంఘంలో విపరీతం కాదు, ఇండియాలో శాక్యవంశీకులలోనైనా విపరీతంకాదు. గౌతమబుద్ధుని పూర్వీకులలో అన్న చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు పరిపాటిగా జరుగుతూ వుండేవట. వివాహాది సాంఘికాచారాల విషయంలో కాలంనుంచి కాలానికి, దేశం నుంచి దేశానికి, జాతినుంచి జాతికి తెగనుంచి తెగకు విధినిషేధాలు మారడం కద్దు. ఒకరికి మహావిపరీతమైనదిగా తోచే సాంఘికాచారం మరొకరికి అతిసహజమైనదిగా తోచడం కద్దు. ఎంత దూరమో పోవడం దేనికి? మన దేశంలో ఇటీవలివరకు సహగమనం విధ్యుక్తధర్మం కాదా? రజస్వలానంతరవివాహం పాపహేతువు కాదా? కొంత వెనుకకు వెడితే, భర్త ద్వారా

సంతానాన్ని పొందలేకపోయినప్పుడు అన్యపురుషుని ద్వారా పొందడం సదాచారమే కాదా? (దీన్ని "నియోగం" అనేవారు. "శబ్దార్థచంద్రిక" వివరణ ప్రకారం "నియోగము" అంటే "పుత్రులు లేని విధవను దేవరునివలననో, సపిండుని వలననో పుత్రుని పడయుటకై నియమించుట" "శబ్దరత్నాకరము" ఈ వివరణను దాటవేయడానికి నియోగంపట్ల ఇప్పటి వైముఖ్యం కారణం కాబోలు!)

దశరథ జాతకకథనుంచి రామాయణగాథ పుట్టలేదని, రామాయణగాథను స్వప్రయోజనాలకోసం బౌద్ధమతస్థులు వికృతం చేసిపెట్టినారని సి.వి.వైద్య సిద్ధాం తీకరించడానికి ప్రయత్నించాడు.[25] అయితే, ఇది నిష్పాక్షిక పరిశీలనకు తాళగల సిద్ధాంతం కాదని దినేశ్‌చంద్రసేన్ రచనను చదివితే స్పష్టపడుతుంది. పోతే, నా దృష్టిలో జాతక కథలను బుద్ధునికి అంటగట్టడం ఆయనపట్ల ఘోరాపచారం చేయడమే! మొదటినుంచి చివరివరకు అవి స్వోత్కర్షతో కూడిన కథలే. తన పరినిర్వాణసమయంలో తన ప్రియశిష్యుడు ఆనందుడు తనను స్తోత్రం చేయడా నికి ప్రయత్నించగా బుద్ధుడు అతనిని మృదువుగా మందలించాడు. అట్టి బుద్ధుడు తన ఘనతను తానే చాటుకొనడానికి కట్టుకథలను, పిట్టకథలను కొన్ని వందలు కల్పించి చెబుతాడా? ఆయన తదనంతరం మతిలేని ఆయన శిష్యులెవరో ఆనాడు ప్రజాసామాన్యంలో ప్రచారంలోగల జానపదగాథలను జాతకకథల పేరుతో ఆయ నకు అంటగట్టారు. బౌద్ధరచయితల పద్ధతిలో ఆనాటి జానపద గాథలలోనే కొన్నింటిని వాల్మీకి తన రామాయణంకోసం ఎన్నుకొన్నాడని ఎందుకు అనుకో రాదు? కవి కాబట్టి, ఆ కథలకు వీలైనంతగా ఆయన మెరుగులు దిద్దినాడని ఎందుకు అనుకోరాదు? ఏమైనా, ఒక జాతిగా మన దౌర్భాగ్యం జానపదగాథకు, చారిత్రకసంఘటనకు వ్యత్యాసాన్ని, ఆనాడే కాదు, ఈనాటికీ గుర్తించలేకపోవడమే!

పోతే, దినేశ్‌చంద్రసేన్ వివరించినట్టు, ఒకప్పుడు వానరపూజ దేశదేశాలలో వుండేది.[26] ఈజిప్షియనుల, బాబిలోనియనుల దృష్టిలో వానరం ఒక పవిత్రమైన జంతువు. తమది వానరవంశమని టిబెటనులు గొప్పలకు పోతారు. జపానులో ఒక వానరదేవాలయం వున్నది. మధ్య అమెరికాలో వానరవిగ్రహాల శిరస్సులు కనిపించాయి. పోతే, మన దేశంలో, ముఖ్యంగా దక్షిణభారతంలో రామాలయాల కంటె ఆంజనేయుని గుడులే ఎక్కువ వున్నట్టు చెప్పవచ్చు. అన్నట్టు, ఆంజనేయు నికి ఆలయాలున్నవి కాని, భరతునికి లేవు, లక్ష్మణునికి లేవు! కొందరు శైవుల విశ్వాసం ప్రకారం శివుడే హనుమంతుడుగా అవతరించాడు. బౌద్ధజాతకకథల ప్రకారం ఒక పూర్వజన్మలో బుద్ధుడు వానరుడు. నిజానికి వైష్ణవంలోనే ఆంజ

నేయుని స్థానం తక్కువ. దానిలో అతడు రామునికి నమ్మిన బంటు మాత్రమే. దినేశ్‌చంద్రసేన్ కంటె చాలా ముందుగానే హనుమంతుని గురించి సర్ ఆల్‌ఫ్రెడ్ సి.లియెల్, హెర్మన్ యాకోబీలు కొన్ని ఆసక్తిదాయకమైన విషయాలు వ్రాశారు. లియల్ వివరించినట్టు కోతులతోపాటు ఒకప్పుడు పెద్దపులులను, తోడేళ్ళను కూడా ఇండియాలో పూజిస్తూ వుండేవారు. వీటికంటె మిన్నగా త్రాచుపాములను పూజిస్తూ వుండేవారు. ఇప్పుడు పెద్దపులుల, తోడేళ్ళ పూజ ఆటవికజాతులలో తప్ప మిగలలేదేమో! పాముల పూజ నాగులచవితికి ప్రస్తుతం విశేషంగా పరిమితమౌతున్నది. పోతే, హనుమంతుని రూపంలో వానరపూజ మాత్రం నానాటికీ పెరుగుతున్నది. ఇండియాలో పూజలందుకున్న జంతువులలో అగ్రస్థానం వానరానిదే అని లియెల్ నూరేళ్ళక్రితం చెప్పిన మాట నేడు మరింత నిజం.[27]

ఆదిలో హనుమంతుడు నిశ్చయంగా అనార్యుల వేల్పు. అతడి పూజ రామ పూజకంటె కనీసం ఒకటి, రెండువేల సంవత్సరాలకు ముందుగానే ప్రారంభమై వుండవచ్చు. ఋగ్వేదంలో ఒకే ఒకచోట వానర ప్రసక్తి వున్నది. అక్కడ (పదవ మండలంలో) ఇంద్రుని మిత్రుడుగా వృక్షకపిని పేర్కొనడం జరిగింది. ఈ వృక్ష కపి కాలక్రమాన హనుమంతుడుగా మారివుండవచ్చునని బార్త్ వ్రాశాడు.[28] ఇది అర్థంలేని వ్రాత. ఋగ్వేదకాలంలో చివరికి గోవునైనా ఇప్పటివలె పూజించే వారు కాదు. దాన్ని చక్కగా పోషించేవారు, సుష్ఠుగా ఆరగించేవారు. బార్త్ ఉదాహరించిన ఋక్కులలోనే సేవించడానికి సిద్ధంగావున్న సోమరసాన్ని పాడు జేసిన వృక్షకపి తలను ఉత్తరించాలని ఇంద్రాణి అన్నట్టుగా వున్నది. అప్పటిలో వానరపూజ ఏ రూపంలో, ఎంత స్వల్పంగా వున్నా ఇంద్రాణి నోట ఈ మాట వచ్చేది కాదు గదా! పైగా, యాకోబీ దృష్టిలో ఈ వృక్షకపి ఋక్కులు అస్పష్టంగా వున్నాయి, అస్పష్టంగానూ వున్నాయి. బార్త్‌వలె కాక, లియెల్ సరిగా ఊహించినట్టు, ఏదో ఒక ఆటవిక జాతిలో హనుమంతుడు ఒక వీరపురుషుడు అయివుండవచ్చు. అతడికి సంబంధించిన వీరగాథలకు, వానర పూజకు సంబంధించిన విశ్వాసాలకు లంకె ఏర్పడి వుండవచ్చు. అందుమీదట అవతారపురుషుని ప్రతిపత్తికి అతడు పెరిగివుండవచ్చు.[29]

ఇంతకంటె ముందుకు వెళ్ళి, గ్రామగ్రామంలో హనుమంతునికి పూజ జరగడానికి అతడిని సేద్యానికి, ప్రత్యేకించి ఋతుపవనాలకు, సంబంధించిన దేవతగా గ్రామీణులు భావించడమే కారణం కావచ్చునని యాకోబీ ప్రతిపాదించాడు. హను

మంతుని కున్న వివిధ నామధేయాలలో "పావని" అనేది ఋతుపవనాలతో అతడి సంబంధాన్ని సూచిస్తున్నది. ఋతుపవనాలవెంట ఎన్ని వందల, ఎన్ని వేల యోజనాల దూరమైనా మేఘాలు అవలీలగా పయనిస్తాయి. ఈ శక్తి హనుమంతునికి కూడా వున్నది. మేఘాలు ఈ క్షణంలో బృహత్తర రూపంలో వుండవచ్చు, మరుక్షణంలో అతిసూక్ష్మ రూపాన్ని ధరించవచ్చు. ఇదే విధంగా హనుమంతుడు కోరిన రూపాన్ని ధరించగలడు. ఈ పద్ధతిలో మరికొన్ని శక్తులను, మహిమలను ఎవరికి తోచినట్టు వారు హనుమంతునికి ఆపాదిస్తూ పోయారు.[30] వర్షాధిదేవతగా అదివరకే గ్రామీణులలో, ముఖ్యంగా వ్యవసాయదారులలో, అతడిపట్ల వున్న భక్తి ప్రపత్తులు రామాయణంలో అతడి ప్రధాన పాత్ర తర్వాత ఇబ్బడిగా, ముబ్బడిగా పెరిగిపోయాయి. అందువల్లనే రామునికంటె మిన్నగా అతడికి ప్రజాసామాన్యంలో భక్తులున్నారు. అతడి భక్తులలో ప్రత్యేకించి పేర్కొనదగువారు హిందూ వస్తాదులు.[31]

నాది చిలిపిమాటగా కొందరికి తోచవచ్చుగాని, దాన్ని అనకుండా వుండలేకపోతున్నాను. ఎప్పుడు, ఎవరు, ఎందుకు, ఏరూపంలో వానరపూజను ప్రారంభించినా, ఇప్పటికీ దాన్ని జరిపే నరుని మానసికవికాసం వానరస్థాయిని దాటిపోదు, పోలేదు.

ఉత్తరాది కట్టుకథలు కొన్ని, దక్షిణాది పిట్టకథలు మరికొన్ని, వాల్మీకి ఇంద్రజాలంతో రామాయణమహాకావ్యం రూపాన్ని ధరించినట్టు దినేశ్ చంద్ర సేన్ చెప్పగా, ఈ కథలన్నీ ప్రాచ్యభారతానికి, ప్రత్యేకించి నిషాదజాతివారికి చెందినవని సునీతి కుమార్ ఛటర్జీ సంభావిస్తున్నాడు.[32] ఆయన మతం ప్రకారం వాల్మీకిపై హోమర్ కావ్యాల ప్రభావం నిశ్చయంగా వున్నది.

రామాయణంవిషయంలో మొట్టమొదటగా హోమర్ ప్రసక్తి తెచ్చినవాడు వేబర్. దాని పుట్టుపూర్వోత్తరాలనుగురించి ఆయన చేసినన్ని సిద్ధాంతాలు మరెవ్వరు చేయలేదు. వాటిలో పరస్పరవైరుధ్యాలుంటే వాటిని అనివార్యం చేసినట్టిది రామాయణమే. దానిలోని ప్రత్యక్షరాన్ని పరమపవిత్రమైనదిగా కళ్ళకద్దుకొనే రామభక్తులను విడిచిపుచ్చితే, సుందరకాండను ఎంతగా పారాయణం చేస్తే స్వర్గ ద్వారాలు అంత నిశ్చయంగా తమకోసం తెరుచుకొని వుంటాయని నమ్మేవారిని విడిచిపుచ్చితే, రామాయణంలో పరస్పర వైరుధ్యాలు ఎక్కడలేవు, ఎంతగా లేవు? వాటిని కప్పిపుచ్చడంకోసమే తిలక, కతక, శిరోమణి, భూషణాది వ్యాఖ్యానాలను వ్రాసినవారు కప్పదాట్లు వేశారు, పీతనడక నడిచారు, పిల్లిమొగ్గలు వేశారు, కోతిచేష్టలు చేశారు, కాకిగోల పెట్టారు, కొక్కిరాయి వేషాలు వేశారు, పడరాని

పాట్లు మరెన్నో పడ్డారు. అయినా, రామభక్తులు మాత్రం "ఆహా!", "ఓహో!" అంటూ వారిని మెచ్చుకొంటారు. లేకపోతే, తమను పాపం చుట్టుకోదా, తాము నరకాన పడిపోరా?

రామాయణగాథలోని ప్రథమ ఘట్టాలకు మూలం బౌద్ధ జాతకకథలు కాగా, ధనుర్భంగం, సీతాపహరణం, లంకపై దండయాత్ర గ్రీక్ పురాణాలనుంచి వాల్మీకి పరిగ్రహించిన ఘట్టాలు కావచ్చునని వేబర్ ప్రతిపాదించాడు.[33] రామాయణంలో రెండుచోట్ల యవనులప్రసక్తి వస్తుంది. వారు గ్రీసుకు చెందినవారు కావచ్చు, కాకపోవచ్చు. మన ప్రాచీనగ్రంథాలలో బాహ్లికప్రాంతంలో (మధ్య ఆసియా) స్థిర పడిన గ్రీకులను యవను లనేవారు; కేవలం గ్రీకులనే కాక, శ్వేత జాతివారందరిని యవను లన్న సందర్భాలు సయితం కొన్ని లేకపోలేదు. ఏమైనా, రామాయణం లోగల యవనుల ప్రసక్తినిమాత్రమే పురస్కరించుకొని, హోమర్ నుంచి వాల్మీకి కొన్ని ఘట్టాలను పరిగ్రహించినట్టు వేబర్ చెప్పలేదు. అనువాదాల రూపంలో హోమర్ కావ్యాలు ఇండియాలో ప్రచారంలో వున్నట్టు దియోన్ క్రిసాస్తమస్, క్లాడియస్ ఈలియన్‌లు క్రీస్తుశకం ప్రథమ శతాబ్దిలో వ్రాశారు. వీరిమాట ఎంత వరకు నిజమో చెప్పలేమని వేబర్ స్వయంగా గుర్తించాడు. కాని, ఆయన ఊహ హోమర్‌నుగురించి, హోమర్ కావ్యాలనుగురించి వాల్మీకి కర్ణాకర్ణిగా వినివుండవ చ్చునని. తన ఊహను బలపరచడంకోసం సీతాపహరణకు, లంకపై దండయాత్రకు "ఇలియెడ్" మూలం కావచ్చునని, శివధనుర్భంగగాథ "ఆడేసీ" నుంచి స్వీకరించి నట్టిది కావచ్చునని ఆయన సూచించాడు.

అయితే 1873లోనే కె.టి.తెలాంగ్ తన సవిస్తర సమాధానంలో పేర్కొ న్నట్టు, వేబర్ సూచనలో బలం లేదు.[34] ధనుర్భంగం, పరదారాపహరణ - ఇట్టి సంఘటనలు గ్రీసు, ఇండియాలకే పరిమితం కావు; అన్యదేశాల చరిత్రలలో సయితం ఇట్టివి కానవస్తాయి. ఇంతేకాక, యులిసిస్‌తో రామునికి పోలికలు తక్కువ; హెలెన్‌తో సీతకు పోలికలు మరింత తక్కువ. నిజానికి సీత కాలిగో టికైనా హెలెన్ దీటు రాదు. తెలాంగ్‌తోపాటు యాకోబి,[35] వింటర్‌నిట్స్,[36] వైద్య,[37] బుల్కే,[38] ఈ విషయంలో వేబర్ వాదాన్ని తిరస్కరించారు.

ఇద్దరి రచనలమధ్య పోలికలు కనబడినప్పుడు, వా రిద్దరిలో ఎవరు ఏ కాలానికి చెందినవారో స్పష్టంగా తెలియనప్పుడు, ఎవరికి ఎవరు ఋణపడివున్నారో చెప్పలేము. హోమర్ ప్రభావం వాల్మీకిపై అధికంగా కనబడుతున్నట్టు వేబర్ వ్రాయగా, వాల్మీకి రామాయణాన్ని గ్రహించి భాషలోకి

అనువదించిన ఇపోలిట్ పోష్ వాల్మీకినుంచి హోమర్ కాపీ కొట్టినట్టు బల్లగుద్ది వాదించాడు. ఆయన వాదం ప్రకారం ఎగమెమ్ననన్‌కు సుగ్రీవునితో, పెట్రాక్లెన్‌కు లక్ష్మణునితో, నెస్టర్‌కు జాంబవంతునితో, ఒడిసియూస్‌కు హనుమంతునితో ఎంతటి దగ్గరి పోలికలున్నాయంటే; ఆ హోమర్ పాత్రలను ఈ రామాయణ పాత్రలకు ప్రతిరూపాలుగా అభివర్ణించవచ్చు.[39] అయితే, కలకత్తాలోని ఏషియాటిక్ సొసైటీలో ఇటీవలనే ప్రసంగిస్తూ, సునీతి కుమార్ ఛటర్జీ తెలాంగ్‌ను కాదని, యాకోబీ, వింటన్‌నిట్స్‌లను కాదని, వైద్య, బుల్కేలను కాదని, వేబర్‌తో పూర్తిగా ఏకీభవించాడు.[40] వాల్మీకిపై హోమర్ ప్రభావం అత్యధికంగా కలదని ఆయన ఉద్ఘాటించాడు. గ్రీక్ పురాణగాథలలోని బ్రైయేరియన్‌కు యాభై తలలు, నూరుచేతులుండగా, రావణుని విషయంలో వాల్మీకి వాటిని పదితలలకు, ఇరవై చేతులకు తగ్గించినట్టు చెప్పాడు. ఛటర్జీ బహుభాషాకోవిదుడు, మహాపండితుడు, అఖండవిజ్ఞాని. ఆయన స్వతంత్రంగా ఆలోచించగలడు, సాహసోపేతంగా వ్రాయగలడు. అయినా, ఈ విషయంలో ఆయన పొరపడుతున్నట్టుగా చెప్పకతప్పదు.

ఇక, ఆర్.శ్యామశాస్త్రి వాదం రామాయణం అంటే కథారూపంలో ఖగోళశాస్త్రమే అని. రాముడు సూర్యుడు కాగా, భరతుడు శుక్రుడట, లక్ష్మణ శత్రుఘ్నులు బృహస్పతి, బుధులట. అయితే, సీతనుమాత్రం మరొక గ్రహంగా మార్చక, నాగేటిచాలుగానే ఈయన మిగిల్చాడు. సూర్యాయణంతో, గ్రహచలనంతో రామాయణంలోని ప్రధాన ఘట్టా లన్నింటికి ఏదో ఒక ముడిపెట్టడానికి ఈయన ప్రయత్నించాడు. ఇందుకై తాను చేసిన మొదటిప్రయత్నం తనకే నచ్చనందున ఈయన రెండవ ప్రయత్నం చేయగా, అది సయితం మొదటిదానివలె వృథా శ్రమగానే పరిణమించింది.[41] శ్రీ శ్యామశాస్త్రి ఎంత పండితుడైనా మోకాటికి, బట్టతలకు ముడివేయలేడుగదా!

కాగా, రామాయణానికి చారిత్రకాధారం నిస్సందేహంగా కలదని వాదించేవారిలో వాదబలంకంటె విశ్వాసబలం పెచ్చుగా కానవస్తుంది. రాముడు చారిత్రక పురుషుడైతే ఆయన ఏ కాలంవాడు? ఈ విషయమై వారిమధ్య ఏకాభిప్రాయం లేదు. ఆయన ఇక్ష్వాకువంశవృక్షం విషయమై కూడా ఏకాభిప్రాయంలేదు. ప్రాచీన భారత రాజవంశాలనుగురించి ప్రత్యేక పరిశోధనలు చేసిన ఎఫ్.ఇ.పార్జిటర్ రామాయణంలోని ఇక్ష్వాకు వంశవృక్షం తప్పులతడకగా వున్నదని, అందువల్ల దాన్ని త్రోసిపుచ్చి, పురాణాలలోగలదాన్ని స్వీకరించాలని ప్రతిపాదించాడు. తన కథానాయకుని వంశవృక్షం విషయంలోనే విశ్వసించరాని రామాయణాన్ని అన్యవిషయాలలో

విశ్వసించవచ్చునా? ఈ ప్రశ్న పాజిటర్‌కు తోచనైనా లేదు. కనుకనే రాముడు సింహళంవరకు వెళ్ళి, దాన్ని జయించినట్టు ఆయన వ్రాశాడు.[42] హెచ్.హెచ్. విల్సన్ కూడా ఇంతే వ్రాశాడు.[43] భారతీయ చరిత్రకారులలో సి.వి.వైద్య,[44] వి.రంగాచార్య,[45] ఆర్.సి.మజుందార్,[46] ఎన్.కె.సిద్ధాంత,[47] మొదలైనవారు కొన్ని వందలమంది ఇంతే వ్రాశారు. లంక అంటే విధిగా సింహళమే కాకపోవచ్చునని వారిలో ఒక్కరికైనా తోచలేదు. రాముడు వింధ్యపర్వతాలను దాటి దక్షిణాపథంలో అడుగు పెట్టలేదని చెప్పడానికి రామాయణంలోనే వున్న ప్రబలాధారాలలో ఒక్కటైనా వారి కంటబడలేదు. ఈ విషయాన్ని మరొకచోట చర్చించనున్నాను కనుక, ఇక్కడ మరి దీన్నిగురించి ప్రస్తావించను.

పోతే, రాముడు నిజంగా వింధ్యపర్వతాలను దాటివచ్చినా, సింహళంవరకు పురోగమించినా, కిష్కింధను కాని, లంకను కాని తన కోసలరాజ్యంలో ఆయన అంతర్భాగాలను చేసుకోలేదు; వాలిని కూలవేసిన తర్వాత కిష్కింధను సుగ్రీవుని రావణవధానంతరం లంకను విభీషణునికి ఆయన అప్పగించాడు. అందువల్ల రాముడు సాధించింది లంకవరకు ఆర్యనాగరికత విస్తృతిని కాని, ఆర్యసామ్రాజ్య విస్తరణ కాదని కొందరి మతం. వీరిలో ఒక ప్రముఖుడు రాధాకుముద్ ముఖర్జీ.[48]

ఈ విభిన్న సిద్ధాంతరాద్ధాంతాలతో పాటు తప్పక పేర్కొనవలసినవి మరికొన్ని కూడా వున్నాయి. వీటిలో మొదటిది పి.టి.శ్రీనివాస అయ్యంగార్ చేసిన విచిత్రసిద్ధాంతం. వేదకాలంలో ఒక వాల్మీకి వుండేవాడట; తర్వాత పాణినికి సమకాలికుడుగా మరొక వాల్మీకి వుండేవాడట. ఆ మొదటి వాల్మీకి కావ్యంలో ఈ రెండవ వాల్మీకి చేర్పులు, మార్పులు చేశాడట. అందువల్ల రాముని కొన్నిచోట్ల అవతారమూర్తిగా, కొన్నిచోట్ల మానవమాత్రుడుగా రామాయణంలో మనం చూస్తున్నామట![49] ఈ ఒక్క దెబ్బతో రామాయణంలోని పరస్పరవైరుధ్యాలన్నింటిని తాను తొలగించివేసినట్టు శ్రీనివాస అయ్యంగార్ ఎంత సంతోషించాడో మనకు తెలియదుగాని, ఆయన వాదంలో పస లేదు. రామాయణాన్ని వ్రాసింది ఇద్దరు వాల్మీకులు కాదు; ఒక అసలు వాల్మీకితోపాటు, ఒక నూరు, లేదా రెండు వందలమంది (ప్రక్షిప్తాల పాపానికి వొడిగట్టుకొన్న) నకిలీ వాల్మీకులు!

పి.టి.శ్రీనివాస అయ్యంగార్ తెలివికి పోతే, జె.టాల్‌బాయ్స్ వీలర్ అతితెలివికి పోయాడు. దక్షిణభారతంలో బ్రాహ్మణ, బౌద్ధ మతాల సంఘర్షణనే రామాయణ యుద్ధంగా వాల్మీకి చిత్రించాడని ఆయన సూచించాడు.[50] దీనిలో కొంత సత్యం వుండవచ్చునని ఆదిలో నమ్మిన వేబర్ తర్వాత తన మనస్సు మార్చుకొన్నాడు.

బుద్ధునిపట్ల దూషణతిరస్కారాలు రామాయణంలో ఒకచోట లేకపోలేదు గాని, అవి వాల్మీకి రచనలో ఎవడో తుంటరి దూర్చిన తూలుమూటలు! బౌద్ధమత విస్తరణను ప్రతిఘటించడానికే హిందూమతంలో అవతారసిద్ధాంతాన్ని లేవనెత్తినా రనడంలో సందేహం లేదు; ఆ సిద్ధాంతాన్ని బలపరచడానికే పురాణాలను సృష్టిం చారనడం కూడా సందేహానికి ఆస్కారంలేని విషయమే. కాని, రామాయణంలో రాముని అవతారమూర్తిగా చిత్రించే భాగాలన్నీ ప్రక్షిప్తాలే. వాల్మీకి పేరుతో ఎవరో ఫోర్జరీ చేసిన బాల, ఉత్తర కాండలలోనే అవి కోకొల్లలుగా వున్నాయి.

వేబర్‌కు సమకాలికుడైన క్రిస్టియన్ లాసెన్ రామాయణకావ్య పరిణామంలో నాలుగు దశలను గుర్తించాడు. మొదటి దశలో అది హిమాలయప్రాంతంలో సీతా రామ లక్ష్మణుల వనవాసానికి, అందుకు దారితీసిన పరిస్థితులకు మాత్రమే పరిమితం. రెండవ దశలో వారి వనవాసం గోదావరి తీరానికి మారింది. మూడవ దశలో దక్షిణాదివారిని లొంగదీసుకొనడానికి జరిగిన ప్రయత్నాలు వచ్చి కలిశాయి. పోతే, నాల్గవ దశనాటికి దక్షిణభారత భౌగోళికపరిజ్ఞానం మరింత పెరిగినందున సింహ ళద్వీపంపై దండయాత్రను కలపడం జరిగింది. దీన్ని చూడగా మొదటి దశకు సంబంధించినంతవరకు వేబర్‌తో లాసెన్ పూర్తిగా ఏకీభవించినట్టు అనిపించవచ్చు. కాని, లాసెన్‌దృష్టిలో సీత రాముని సోదరి కాదు; వారిద్దరికి ఆ సంబంధాన్ని కల్పించడం అసలు కథను బౌద్ధులు అపార్థం చేసుకొనడంవల్లనే సంభవించినట్టు ఆయన భావించాడు.[51]

కాగా, రాముడు మరెవ్వరో కాదు, ప్రాచీనకాలంలో ఈజిప్టును పరిపాలించిన ఫేరో రాజులలో అతిప్రసిద్ధుడైన రెండవ రామ్‌సెజ్ అని వ్రాసిన ఘనత మన ఆంధ్రునిదే. ఆయన మల్లాది వెంకటరత్నం. తన సిద్ధాంత నిరూపణకు ఆయన రెండు సంపుటాలలో "రాము, దిగ్రేటెస్ట్ ఫేరో ఆఫ్ ఈజిప్ట్" అని ఒక గ్రంథాన్ని 1934లో ప్రచురించాడు.[52] రామాయణంలోని లంక సింహళం కాదని కొక్కొండ వెంకటరత్నం పంతులు ఒకసారి తనతో అన్నాడట. అందుపై ఈ విషయంలోకి మరింత లోతుగా వెళ్ళాలన్న కోర్కె తనకు కలిగిందట. ఇది నిస్సందేహంగా మెచ్చదగు కోర్కె. అయితే, ఇది వెంకటరత్నం విషయంలో వెర్రితలలు వేసింది. సాక్ష్యాధారాలతో ఒక తీర్మానానికి రావడానికి మారుగా, ఒక తీర్మానానికి వచ్చిన మీదట దాన్ని సమర్థించగల సాక్ష్యాధారాలను ఆయన వెతకడం ప్రారంభించాడు. ఫేరోరాజులలో పెక్కుమంది పట్టపుదేవేరులు వారి అక్కలు, లేదా చెల్లెళ్ళు. ఫేరో రాజుల శవాలను "మమ్మీ"ల రూపంలో

శాశ్వతంగా పదిలపరచేవారు. దశరథ జాతకకథ ప్రకారం సీత రాముని సోదరి.* పోతే, దశరథుని శవాన్ని - భరతుడు కేకయపురంనుంచి తిరిగి వచ్చేవరకు-తైల ద్రోణంలో పదిలంచేశారు. ఈ రెండువిషయాలకు తోడుగా రాముని పేరుకు రామ్‌సెజ్ పేరుకు ధ్వనిసామ్యం అధికంగా వున్నది. అయినప్పుడు-మరి సందేహం దేనికి? -రాముడు రూఢిగా రామ్‌సెజ్ అయివుండాలి. రామ్‌సెజ్‌లు ఒకరు కాదు, ఇద్దరు కాదు, పన్నెండుగురు. అయితే వీరందరిలో ఎక్కువ ప్రసిద్ధి కెక్కినవాడు రెండవ రామ్‌సెజ్ కాబట్టి, ఆయన రాము డనడం సముచితమని వేఁఱొరత్నానికి తోచింది!

కేవలం రాముడు, రామ్‌సెజ్ పేర్ల మధ్యనే కాక, మరి పెక్కింటిలో ధ్వని సామ్యాన్ని గుర్తించి, రామాయణగాథతో ఈజిప్టుకే కాక, లెబనాన్, సిరియా, ఇజ్రాయెల్, పర్ష్యా, గ్రీసు మొదలైన దేశా లన్నింటికి వెంకటరత్నం ముడిపె ట్టాడు. ఆయన వాదంప్రకారం రాముడు రామ్‌సెజ్ కాగా, అగస్త్యుడు అగస్టస్ సీజర్ అగస్టస్ సతీమణి లోపాముద్ర అగస్టస్ సీజర్ భార్య లివియా; పౌలస్త్యుడు ఫిలెస్టీన్. అయోధ్య "ఆగ్డన్" అనే ఈజిప్షియన్ నగరం (ఒకప్పుడు ఈజిప్టుకు రాజధానిగా వున్న మెంఫిస్‌కు గ్రీకుల వ్యవహారనామం ఆగ్డన్). గంగ అంటే విధిగా

ఇండియాలోని గంగానది మాత్రమే కానక్కరలేదు; ఏ జలప్రవాహమైనా గంగ కావచ్చు, కేవలం జలమైనా గంగ కావచ్చు, అయితే. మరి సీత యెవరు? ఆమెకు ప్రతిగా విదేశాలచరిత్రనుంచి ఒక్కరైనా కానరానందున కాబోలు, సీతకు సముద్రతీరంలోని ప్రాంతంగా వెంకటరత్నం అర్థం చెప్పాడు. లెబనాన్‌కు చెందిన

---

* దశరథుడు కోసలదేశపురాజు కాగా, దశరథుని పట్టపుదేవేరి కౌసల్య. కేకయ రాజపుత్రిక కైకేయి అయినట్టు, విదేహ రాజపుత్రిక వైదేహి అయినట్టు పాంచాల రాజపుత్రిక పాంచాలి అయినట్టు, కోసల రాజపుత్రిక కౌసల్య కావాలి. అయిన ప్పుడు దశరథుడు తన మేనత్తను, లేదా సోదరిని వివాహమాడినట్టు తీర్మానిం చుకొనవలదా? నాకు తెలిసినంతవరకు ఈ విషయాన్ని గురించి ప్రస్తావించిన మొట్టమొదటి రచయిత ఎ.కె. సుర్. ఈయన వ్రాసిన "సెక్స్ అండ్ మ్యారేజ్ ఇన్ ఇండియా" అనే గ్రంథం 52వ పుటను చూడండి.

ఒక రాజు రెండవ రామ్‌సెజ్‌పై తిరుగుబాటు చేసి, సముద్రతీరంలోని ఈజిప్షియన్ ప్రాంతాన్ని చేజిక్కించుకొనగా, అతడిపై యుద్ధమే రామాయణయుద్ధమన్నాడు! మొదటినుంచి చివరివరకు ఇంత అసంబద్ధంగా వున్నందునే వెంకటరత్నాన్ని గురించి కాని, ఆయన విశేషంగా శ్రమపడి వ్రాసిన గ్రంథాన్ని గురించి కాని అంతగా పట్టించుకొన్నవారు లేరు.

మల్లాది వెంకటరత్నంవలె డాక్టర్ బుల్కే క్రైస్తవుడు. ఆయన పూర్తి పేరు ఫాదర్ కామిల్ బుల్కే. ఆయనకు డాక్టరేట్ వచ్చింది రామాయణాన్ని గురించి "రామ్‌కథ" అనే పేరుతో హిందీలో పరిశోధకవ్యాసం వ్రాసినందువల్లనే కావచ్చు. ఒక క్రైస్తవుడు. పైగా ఒక "ఫాదర్", రామాయణానికి చారిత్రక ప్రాతిపదిక కలదని నొక్కిచెప్పిన తర్వాత వేబర్, యాకోబీ వగైరాలను తుంగలో తొక్కవలసిందే అన్న ధోరణిని ఎ.డి. పుసాళ్‌కర్ అవలంబించాడు.[53]

రామాయణానికి చారిత్రకాధారం ఎంతవరకు కలదన్న చర్చలో ఇటీవల కొందరు పురాతత్త్వశాస్త్రవేత్తలు ప్రవేశించారు. ఇది ఆహ్వానించదగు పరిణామమే. ఇంతకుముందు ఈ చర్చ సంస్కృతభాషా పండితులకు, చరిత్రకారులకు పరిమితమై వుండేది. మన సంస్కృత భాషాపండితులకు సంప్రదాయంపట్ల భక్తిశ్రద్ధలు మెండు. పైగా, రామాయణంలో రాముడు, భారతంలో కృష్ణుడు ప్రముఖపాత్ర వహిస్తారు కాబట్టి, వారిద్దరు అవతార పురుషుల జాబితాలోకి ఎక్కినవారు కాబట్టి, రామాయణ, భారతగాథలను తార్కికదృష్టితో పరిశీలించడానికి వారికి గుండెలు చాలవు. వారిలో రామకృష్ణ భండార్కర్, సునీతి కుమార ఛటర్జీలను పోలిన సాహసోపేత జిజ్ఞాసువులను బహు కొద్దిమందిని విడిచిపుచ్చితే, తక్కినవారు రామాయణ, భారతగాథలను దాదాపు పూర్తిగా చారిత్రకసంఘటనలుగానే పరిగణిస్తారు. పోతే, మన చరిత్రకారులలో అత్యధిక సంఖ్యాకులకు సయితం రామాయణ, భారతాల వద్దకు వచ్చేసరికి మతి పోతుందేమో అనిపిస్తుంది. వారిలో నూటికి 99 మందికి నేను ఇంతకు ముందుకూడా ఒకసారి చెప్పినట్టు-రావణుని లంక, ఇప్పటి శ్రీలంక ఒక్కటే అని చెప్పగలమా అనే సందేహమైనా రాదు. పైగా, ఒక్కటే అని చెప్పడానికి వారు పడరానిపాట్లు పడతారు. ఇట్టివారిలో ప్రత్యేకించి పేర్కొనదగు చరిత్రకారులు హేమచంద్రరాయ్ చౌధురి,[54] వి.ఆర్. రామచంద్ర దీక్షితార్,[55] విశుద్ధానంద్‌పాథక్,[56] మన వైజ్ఞానికశాస్త్రవేత్తలలో వెక్కుమందికి శాస్త్రీయదృష్టి నామమాత్రమైనందున, మన బాబాలు, భగవాన్‌లు తమ పారలౌకిక శక్తులతో శూన్యంనుంచి "భగవద్గీత" ప్రతులతోపాటు స్విస్ చేతిగడియారాలను నిజంగానే

తెప్పిస్తున్నట్టు నమ్ముతున్నాడు. మన చరిత్రకారులలో చారిత్రకదృష్టి బహుస్వల్పం కాబట్టే, రామచంద్ర దీక్షితార్ ఇప్పటి శ్రీలంక రావణుని లంక కాదన్న పక్షంలో లంకాపురిపై దండయాత్రకు తనకు దారి నివ్వనందుకు సముద్రునిపై అలిగి, ప్రాయోపవేశం వేరుతో దర్భశయ్యపై రాముడు మూడురోజులపాటు పరుండడం, నీలుని తోడ్పాటుతో లంకకు వారధిని ఆయన కట్టడం మొదలైన పరమ సత్యాలన్నీ అర్థరహితమై పోగలవని వ్రాయగలిగాడు! సముద్రునిపై రాముడు అలగడం "కుత్సితనం"గా దీక్షితార్‌కు తోచనట్టే, హనుమంతుడు సముద్రంపైగా ఎగిరివెళ్ళడం విడ్డూరంగా పాఠక్‌కు తట్టలేదు. ఇట్టి శాస్త్రజ్ఞులు, ఇట్టి చరిత్రకారులు మన దేశంలో యూనివర్శిటీ ప్రొఫెసర్లుగా వున్నంతవరకు, ఇట్టివారు గౌరవప్రతిష్ఠలు పొందుతున్నంతవరకు మనకు ప్రగతి లేదు, భవిష్యత్తు లేదు.

మన పురాతత్త్వశాస్త్రజ్ఞులలో సయితం శాస్త్రీయదృష్టి ప్రదర్శించగల వారు చాలా చెదురుగానే కనబడతారు. వారిలో కొందరిది ఆర్యదృష్టి కాగా, మరి కొందరిది ద్రావిడదృష్టి. మొదటివర్గంవారు ఆర్యేతరమైన ప్రతిదాన్ని అనాగరికమై నదాన్నిగాకొట్టిపారవేస్తారు. ద్రావిడేతరమైనదానిపట్ల రెండవవర్గంవారు సరిగా ఇదే వైఖరిని[1] ప్రదర్శిస్తారు. అందువల్లనే సింధులోయ నాగరికతవిషయమై ఒకరు చెప్పినదాన్ని మరొకరు కాదంటున్నారు; దాన్ని తమ నాగరికతగానే జమకట్టుకొనడానికి ఒకరితో ఒకరు గట్టిగా పోటీ పడుతున్నారు. రామాయణంవిషయంలో కూడా వారిమధ్య గల ఈ ఆర్య, ద్రావిడ దృష్టిభేదాల దుష్పరిభావం విశేషంగానే వ్యక్తమౌతున్నది. ఏమైనా, ఇటీవల కొందరు పురాతత్త్వశాస్త్రజ్ఞులు పాక్షికదృష్టినుంచి కాక, సమగ్రదృష్టితో, శాస్త్రీయదృష్టితో రామాయణగాథను ఏమేరకు చారిత్రక సంఘటనగా పరిగణించవచ్చునన్న విషయమై శ్రద్ధాసక్తులను చూపుతున్నారు. వారిలో బి.బి.లాల్, హెచ్.డి.సంకాలియాలు ముఖ్యులు. తక్కిన వారివలె రామాయణ కావ్యంపై, ఇతర ప్రాచీన రచనలపై ఆధారపడి, వీరిద్దరు ఏవో కొన్ని తీర్మానాలకు రావడంలేదు; అన్య సాక్ష్యాధారాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇది సమంజసం. అది రామాయణం కానివ్వండి, భారతం కానివ్వండి, లేదా, అవి పురాణాలు కానివ్వండి, వేద వేదాంగాలే కానివ్వండి; వాటిలో ఒక్కటైనా ఏదో ఒక కాలంలో ఎవరో ఒకరు వ్రాసినట్టిది కాదు. ఒక రెవరో వ్రాయగా, మూలానికి తమ చిత్తంవచ్చినదాన్ని పెక్కుమంది చేర్చుతూపోయారు, మూలాన్ని మార్చుతూపోయారు, మొత్తాన్ని తిరిగి కూర్చుతూపోయారు. అందువల్ల ప్రాచీన గ్రంథాలుగా ఈనాడు మన దేశంలో చెల్లుతున్న వాటిలో ప్రక్షిప్తాలు లేకుండా

ఏదీ మనవరకు రాలేదు. పైగా, ఈ ప్రక్షిప్తాలు కొన్ని శతాబ్దాలమీద జరిగాయి. అందువల్ల మన ప్రాచీన గ్రంథాలకున్న చారిత్రకప్రామాణికత అతిస్వల్పం; కొన్ని కొన్ని సందర్భాలలో అసలే పూజ్యం. అయినప్పుడు కేవలం సాహిత్య సంబంధమైన సాక్ష్యాధారాలతో ఎవరేమి చెప్పినా, అది సందేహాలను మిగుల్చుతుంది; అది తొలగించగల సందేహాలకంటె, కలిగించగల సందేహాలే నిజానికి పెచ్చుగా వుంటాయి.

సరిగా ఇదే విధమైన సంకటపరిస్థితి ఒకప్పుడు విదేశాలలో సయితం వుండేది. గ్రీన్ పౌరాణిక గాథలలో ఎంత నిజం, ఎంత కల్పన? గత కాలాన్ని గురించి హేరాడొటన్, థుసిడైడెజ్ మున్నగు చరిత్రకారులు క్రీస్తుకు పూర్వం వ్రాసిన చరిత్రలలో ఎంత చరిత్ర వున్నది? బైబిల్ చారిత్రకాంశాలుగా వివరిస్తున్నట్టివి ఎంత వరకు వాస్తవంగా జరిగినట్టివి? ఈ ప్రశ్నలకు పూర్తిగా కాకపోయినా, ఎన్నదగు మేరకు గట్టి సమాధానాలను చెప్పడం టర్కీలో, గ్రీస్‌లో, క్రీట్‌లో, ఇరాక్‌లో, ఇరాన్‌లో, ఇజ్రాయెల్‌లో, ఈజిప్టులో పాతకాలపు మట్టి దిబ్బలను త్రవ్విన మీదటనే సాధ్యపడింది. ఉదాహరణకు హిన్‌రిచ్ షెలీమాన్, విల్‌హెల్మ్ డర్ప్‌ఫెల్ట్, సర్ ఆర్థర్ జాన్ ఎవెంజ్ టర్కీలో, క్రీట్‌లో, గ్రీస్‌లో జరిపిన త్రవ్వకాల తర్వాతనే గ్రీక్ పౌరాణిక గాథలలో కొంత సత్యం లేకపోలేదని రూఢిపడింది. సర్ అస్టిన్ హెన్రీ లెయెర్డ్, డబ్లియు. ఎం.ఫ్లిండర్స్ పెట్రి, సర్ గార్డినెర్ విల్కిన్‌సన్, కార్ల్ రిచర్డ్ లెప్‌సీయూస్ ప్రభృతులు మధ్యప్రాచ్యంలో త్రవ్వకాలు కొనసాగించిన పిమ్మటనే క్రీస్తుకు పూర్వంనాటి చారిత్రక గ్రంథాలలో కొంతవరకు చరిత్ర కలదని, బైబిల్‌లోని కథలలో చాలా భాగం అల్లిబిల్లి కథలైనా, కొన్నింటిలో స్వల్పంగా చరిత్ర లేకపోలేదని ధృవపడింది.

మన ప్రాచీనగాథలలో చరిత్ర ఏపాటిగా కలదో కచ్చితంగా తేల్చుకొనడానికి మన ప్రాచీన నగరాలు కొన్నింటిలోనైనా త్రవ్వకాలు శాస్త్రీయపద్ధతులలో విస్తృతంగా జరగాలి, క్షుణ్ణంగా జరగాలి. రామాయణానికి సంబంధించినంతవరకు ముఖ్యంగా అయోధ్యలోని "జన్మభూమి" దిబ్బను త్రవ్వి చూడాలి; "కనకభవనం" ప్రాంతంగా ప్రస్తుతం చెల్లుతున్న ప్రాంతాన్ని త్రవ్వి చూడాలి; సీతారాముల వనవాసకాలంలో కోసలరాజ్యానికి తాత్కాలిక రాజధానిగా పేర్కొనబడుతున్న నందిగ్రామాన్ని కూడా త్రవ్వి చూడాలి. ఇంతే కాక, లక్ష్మణునితో సన్నిహిత సంబంధం వున్న నగరమన్న ప్రతీతి లక్నోకు (దాని ప్రాచీననామం లక్ష్మణపుర మటు) కలదు కాబట్టి, అక్కడ సయితం త్రవ్వకాలు జరగాలి. గుహుని రాజధాని శృంగిబేరపురంలోను, వాల్మీకి,

భరద్వాజుల ఆశ్రమాల ప్రాంతాలలోను త్రవ్వకాలు జరగాలి. ఒక్క అయోధ్యలో వినా తక్కిన ఈప్రాంతాలలో ఇంతవరకు త్రవ్వకాలు జరగనేలేదు. అయోధ్యలో జరిగిన త్రవ్వకాలైనా పేరుకు మాత్రమే. భారతానికి సంబంధించిన ముఖ్యప్రాంతాలను సయితం ఇదే విధంగా నిర్లక్ష్యం చేయడం సంభవించింది. రామాయణ, భారతాలకు మన రెండు కళ్ళతో పోలికపెట్టడం కద్దు. అవి లేకపోతే మనకు గుడ్డితనం తప్ప దనడం కద్దు. అయినా, వాటికి సంబంధించిన ప్రాంతాలను త్రవ్వి చూడలేదేమి? ఏది అబద్ధ మాడినా, పురాతత్త్వశాస్త్రవేత్త చేతిలోని పార అబద్ధమాడదు, పలుగు అబద్ధమాడదు. తీరా అయోధ్య, నందిగ్రామం, లక్ష్మణ పురం, హస్తినాపురం, కురుక్షేత్రం, మధుర మొదలైన చోట్ల త్రవ్వకాలు జరిపితే, రామాయణ, భారతగాథలు కట్టుకథలుగా తేలిపోవచ్చునేమో అని భయపడినందు వల్లనే ఇక్కడ జరగవలసిన పరిశోధనలు ఇంతకుముందు జరగలేదని అనుకోవలెనా?

ఇదివరలో ఏమి జరిగినా, కొన్ని నెలల క్రితం బి.బి.లాల్ పుణ్యమా అని రామాయణ, భారతగాథలలో ప్రాధాన్యం వహిస్తున్న అన్ని ప్రాంతాలలో త్రవ్వకాలు ప్రారంభమైనాయి. ఇవి పూర్తి కావడానికి అయిదేళ్ళు పట్టవచ్చు. అందువల్ల మరి అయిదేళ్ళ పాటు ఓపిక పడితే, మన రామాయణ, భారతగాథలకు చారిత్రకాధారాలు ఏపాటివో కలవో చాలావరకు తేలిపోగలదు.

ఈలోపున లాల్, సంకాలియాలు రామాయణాన్ని గురించి చెబుతున్న మాట అది చాలావరకు పుక్కిటి పురాణమని; దానిలో లవలేశంగా చరిత్ర వుంటే, అది ఒక స్వల్పరాజ్యానికి (కోసల రాజ్యానికి), ఒక సామాన్య రాజకుటుంబానికి (దశరథుని కుటుంబానికి) పరిమితమైనట్టిదని, కాగా, లాల్ దృష్టిలో రామరావణ యుద్ధంకంటె కురుక్షేత్ర సంగ్రామమే ప్రాచీనమైనది. అన్యులు పెక్కుమందివలె సంకాలియా సయితం ఈ విషయాన్ని అంగీకరించడం లేదు. కాగా, సంకాలియా పరిశోధనల ప్రకారం, రావణుడు ద్రావిడజాతికి చెందినవాడు కాడు; రావణుని రాజధాని ఈనాటి శ్రీలంక కాదు. వీరిద్దరి అభిప్రాయాలను సందర్భానుసారంగా మున్ముందు వివరిస్తాను. ఈలోపుగా నేను చెప్పగోరుతున్నది నాకు సయితం ఈ విషయమై కొన్ని అభిప్రాయాలున్నాయని. అవి--

(1) రామాయణంలో నూటికి 75 వంతులకు పైగా పుక్కిటిపురాణమే.

(2) తక్కిన 25 వంతుల కథకు కీలకం-సింహాసనానికై దాదాపు అన్ని రాజకుటుంబాలలో కొనసాగుతూవుండే కుట్రలు, కుహకాలు మాత్రమే.

(3) రాముడు వింధ్యపరిసరాలను దాటి రాలేదు.

(4) రావణుడు గోండ్ రాజు కావచ్చు; లేదా, మరొక ఆదివాసితెగ రాజు కావచ్చు.

(5) రావణుని లంక, ఈనాటి శ్రీలంక ఒక్కటి కావు.

(6) రామరావణ యుద్ధాన్ని రెండు విభిన్న జాతులమధ్య సంఘర్షణ అనడం కంటె ఆహారోత్పత్తి వ్యవస్థకు (ఫుడ్ ప్రొడక్షన్ ఎకానమీకి), ఆహార సేకరణ వ్యవస్థకు (ఫుడ్-గేదరింగ్ ఎకానమీకి) సంఘర్షణ అనడమే ఎక్కువ సమంజసం.

(7) దండకారణ్య ప్రాంతానికి వ్యవసాయవిస్తరణతో రామునికి కొంత సంబంధం కలదుకనుక, రామునిభార్యపేరు సీత కనుక, వేదకాలపు సీత మారి మారి, రామాయణం సీతగా పరిణమించినట్టు చెప్పడానికి వీలు కలిగింది.

ఈ అభిప్రాయాలు మౌలికమైనవి కావు; రామాయణాన్ని తార్కికదృష్టితో పరిశీలించినవారు వెల్లడించిన విభిన్నాభిప్రాయాలలో నా బుద్ధికి సమంజసమైనవిగా తోచినవాటిని నేను స్వీకరించాను. ఈ పీఠికను చివరివరకు చదవండి; మీకు నచ్చితే, నావలె మీరు సయితం వీటిని స్వీకరించండి, లేదా త్రోసిపుచ్చుండి. ఏమి చేసినా, ఆలోచనతో చేయండి; భక్తిపారవశ్యంతో అంధప్రాయంగా సంచరించకండి. నరుడు ఆలోచన చేయగలడు, తక్కిన జంతువులు చేయలేవు. ఆలోచన చేయగల శక్తి వాటికి లేనందునే అవి జంతువులుగా మిగిలిపోయాయి.

ఏది జనస్థానం? ఎక్కడిది లంక?

ఆలోచన చేయగలవారిని రామాయణం జాగ్రఫీ ఎంతగానైనా తికమక పెడుతుంది. దానిలోని ఇతర వికారాలు పెక్కింటికివలె ఇందుకు కూడా మూలకారణం దానిలోని ప్రక్షిప్తాలే అని చెప్పవచ్చు. వనవాసానికి అయోధ్యలో బయల్దేరిన రాముడు సుతీక్ష్ణమహర్షి ఆశ్రమానికి చేరుకొనడానికి ఏయే దారులవెంట, ఏ దిక్కులలో పయనించాడో, ఏయే నదీనదాలను, ఏయే పర్వతాలను,లోయలను దాటినాడో, మార్గమధ్యం లో ఎక్కడెక్కడ, ఎంత కాలంపాటు విశ్రమించాడో ఈ వివరాలలో దొసగులు లేవు. ఉత్తర, వాయవ్య, ఈశాన్య భారతాలకు సంబంధించిన భౌగోళికవివరాలు సయితం మొత్తంపై సవ్యంగానే వున్నాయి. అయినప్పుడు దక్షిణభారతంవద్దకు వచ్చేసరికి తప్పులు విశేషంగా దొర్లడం ఎందువల్ల జరిగింది? వాల్మీకి రచనకు "మెరుగులు" దిద్దిన ప్రబుద్ధులే ఇందుకు బాధ్యులనుకొనడానికి బలీయమైన కారణాలు కొన్ని వున్నాయి. దక్షిణభారతం ముక్కుముఖాలైనా వారికి

సరిగా తెలియవు. అయినా, సర్వం తెలిసినట్టు వారు వాల్మీకి రచనలో వేలు పెట్టారు. వారి కారణంగా మరీ పెచ్చుగా తప్పులు దొర్లింది కిష్కింధాకాండలోని 40,41,42,43 సర్గలలో. రామాయణాన్ని విమర్శకదృష్టితో పరిశీలించిన పండితు లందరు ఇవి ప్రక్షిప్తాలని నిర్ణయించారు. భూలోకాన్నిగురించి మాత్రమే కాక, నాగలోకాన్నిగురించి, నరకలోకాన్నిగురించి, ఆదిశేషునిగురించి, ఉదయాద్రి, అస్తా ద్రులనుగురించి సుగ్రీవునిచేత వీటిలో ఉపన్యాసం చెప్పించడం జరిగింది కనుక, వీటిని "సుగ్రీవుని జాగ్రఫీ సర్గ" లనవచ్చు.

ఒక ముఖ్యవిషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. సీతను చెరబట్టిన రావ ణుడు దక్షిణంగా వెళ్ళినట్టు రామలక్ష్మణులకు జటాయువు స్పష్టంగా చెప్పాడు. (ఆరణ్య కాండ, 68 వ సర్గ). అందువల్లనే వారిద్దరు సీతాన్వేషణకై దక్షిణాభి ముఖంగా వెళ్ళారు. అదే దిశలోగల ఋశ్యమూకను దాటి రావణుడు వెళ్ళడాన్ని తాను చూచినట్టు సుగ్రీవుడు స్వయంగా రామునితో చెప్పాడు. అయినా, సీతాన్వేషణకై తక్కిన మూడు దిక్కులకు కూడా సుగ్రీవుడు తన వానరబలగా లను ఎందుకు పంపించాలి? అది కేవలం మతిలేని పని కాబట్టి, దాన్ని అతడు చేయలేదనే మనం అనుకోవాలి. కాని, వాల్మీకికి "మెరుగులు" దిద్దినవారికి తమ భూలోక పరిజ్ఞానాన్ని ప్రదర్శించుకొనడానికి ఒక సాకు కావాలి. అది ఈ పట్టులో దొరకనే దొరికింది కాబట్టి, దాన్ని వారు పూర్తిగా వినియోగించుకొన్నారు.

ఏమైనా, సుగ్రీవుని జాగ్రఫీప్రకారం భూమి గుండ్రంగా లేదు, చదునుగా వున్నది; బొంగరంవలె శూన్యంలో అది గిరగిర తిరగడం లేదు, ఆదిశేషుని శిరస్సుపై స్థిరంగా నిలిచివున్నది. తూర్పుదిక్కుగా మనం పయనిస్తూ పోగాపోగా, బయల్దేరిన చోటుకే మనం తిరిగి రాము, ఇలాతలం తూర్పుపొలిమేరను చేరుకొంటాము. ఆ పొలిమేరలోగల పసిడికొండపై తాపీగా కూర్చుని, ఆదిశేషుడు భూభారాన్ని మోస్తూవుంటాడు. (మరి ఆ పసిడికొండ దేనిపై బైఠాయించిందో!) పసిడికొండ నడినెత్తిన ఒక పసిడి తాడిచెట్టు వున్నది. దానివి మూడు తలలు. (దాన్ని అక్కడ పాతింది ఇది తూర్పు పొలిమేర అని చెప్పడం కోసమట; దాన్ని పాతిన వారు బ్రహ్మ విష్ణు మహేశ్వరులట.) ఆ తాటిచెట్టువరకు వెళ్ళేలోగా మనం సగం పురిరూపంలో వున్న నరులను చూస్తాము; ఒంటికాలితో నడిచేవారిని, పెదవులలో చెవులున్నవారిని, ఉక్కుకంటె గట్టి ముఖాలున్నవారిని చూస్తాము. పర్వతశిఖరాలనుంచి తలక్రిందులుగా వ్రేలాడుతున్న రాక్షసులను చూస్తాము. (ఆ రాక్షసుల పేరు "మందేహులు". ప్రతిదినం అరుణోదయవేళ భూసురోత్తములు

జపిస్తున్న గాయత్రీమంత్ర ప్రభావంవల్ల మందేహులు సముద్రంలో పడిపోతూవుండ బట్టి మనం బ్రతికిపోతున్నామట; లేకపోతే వారినుంచి మనకు ఘోరప్రమాదాలు తప్పేవి కావట.) పోతే, ఈ తూర్పుదిశలోనే మనం ఇక్షు, లవణ, లోహిత, శుద్ధజల, క్షీరసాగరాలను చూస్తాము. క్షీరసాగరంలో జలక్రీడ లాడుతున్న యక్ష గంధర్వచారణాప్సరాది లావణ్యవతులను చూస్తాము.

తూర్పుదిక్కులోవలె తక్కిన మూడు దిక్కులలో సయితం ఇంతటి వింతలను, ఇంతకు మించిన విడ్డూరాలను మనం చూడవచ్చు. ఉదాహరణకు, దక్షిణాన ఒక వెండి కొనతో, ఒక బంగారం కొనతో పెద్ద కొండ వున్నది. పశ్చిమాన రెక్కలున్న సింహాలున్నాయి. ఉత్తరాన రంగురంగుల బట్టలను కాసే చెట్లు,ముత్యాల, వజ్రాలనగలను కాసే చెట్లు, బంగారుపాన్పులను కాసే చెట్లు వున్నాయి. సుగ్రీవుని పేర ఈ జాగ్రఫీని సృష్టించిన ప్రబుద్ధులను "ఈ వింతలు, ఈ విడ్డూరాలు మా కంటికి కనబడవే మేమి?" అని ప్రశ్నించేవారి నోరు మూయించడానికి తిరుగులేని సమాధానాన్ని వారు ముందుగానే చెప్పివేశారు. ఇట్టివి భక్తులకే తప్పనెనరులేనివారికి, క్రూరులకు, నాస్తికులకు కనబడవట!

భక్తికి ప్రాతిపదిక మౌఢ్యం కాబట్టి, మౌఢ్యం పెంచకపోతే కొందరికి భుక్తి జరగదు కాబట్టి, పురాణాలలోని కల్లబొల్లులను ఇక్కడ పోగు పోసినా, కనీసం సుప్రసిద్ధమైన జనపదాలనుగురించి, నదీనదాలనుగురించి, పర్వతాలను గురించి సరిగా చెప్పివుంటే, అదొక దారి. కాని, అది కూడా లేదు. సీతాన్వేషణకు తన వానరబలగాలను సుగ్రీవుడు పంపింది కిష్కింధనుంచి. అది వింధ్యపర్వతాలకు దక్షిణంగా ఉన్నట్టు బహుజనాభిప్రాయం. కాని, రామాయణాన్ని నిశితంగా పరిశీలించినవారి వాదం ప్రకారం వింధ్య పర్వతాలకు ఉత్తరంలోనే కిష్కింధ వున్నది. ఈ విషయమై మత భేదాలున్నా, విదేహ, మాళవ, కాశి, కోసలప్రాంతాలకు అది దక్షిణంగా వున్నదనడంలో ఉభయవర్గాలు ఏకీభవిస్తున్నాయి. అయినప్పుడు, ఆ ప్రాంతాలను చేరాలంటే కిష్కింధనుంచి ఉత్తరంగా వెళ్లాలి కాని, సుగ్రీవుని జాగ్రఫీ ప్రకారం వాటిని చేరాలంటే కిష్కింధనుంచి ఉత్తరముఖంగా కాక, లేదా పశ్చిమోత్తరంగా కాక, తూర్పుగా వెళ్లాలి!

తిరిగి అతడి జాగ్రఫీ ప్రకారం కిష్కింధనుంచి దక్షిణంగా వెడితే తగిలే

ప్రాంతాలలో వంగ, కళింగా లున్నాయి. అతడి జాగ్రఫీలో నర్మదతర్వాత తపతి ప్రసక్తి రాదు; కృష్ణతర్వాత తుంగభద్ర ఊసు లేదు. దాని ప్రకారం కిష్కింధకు దక్షిణంగా ఒక అవంతి, పశ్చిమంగా ఇంకొక అవంతి వున్నది. ఈ తప్పులన్నింటిని చూచినమీదట, సుగ్రీవుని వేరిట జాగ్రఫీని ఫోర్జరీ చేసిన ప్రబుద్ధులు మధ్య దేశానికి, ముఖ్యంగా కురు-పాంచాల ప్రాంతానికి, చెందినవారు కావచ్చునని కొందరు భావిస్తున్నారు. ఇదే నా భావం కూడా!

సుగ్రీవుని జాగ్రఫీప్రకారం రావణుని లంకను* చేరాలంటే కిష్కింధనుంచి దక్షిణంగా బయల్దేరి, వింధ్య పర్వతాలను దాటాలి; నర్మద, గోదావరి, మహానది, కృష్ణ, వరద, మేఖల, ఉత్కళ నదులను దాటాలి; ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్యదేశాలను దాటాలి; కావేరిని దాటాలి; తామ్రపర్ణిని దాటాలి; అటుపైన నూరుయోజనాలు సముద్రయానం చేయాలి. అయినా, దక్షణదిశకు అంగదుని నాయకత్వాన బయల్దేరిన వానరులు చివరికి వింధ్యపర్వతాలనైనా దాటరు; సుగ్రీవుడు పెట్టిన ఒక నెల గడువు దాటిపోయినా, ఆ పర్వతాలలోనే వారు తిరుగుతారు. దిక్కుతోచక వాటిమధ్య తిరుగుతూవుండగా వారికి సంపాతి తటస్థపడతాడు. లంక ఎక్కడ వున్నదో ఆతడు వారికి వివరిస్తాడు. రెక్కలు కాలినపిదప వింధ్యప్రాంతాన్ని తన నివాసస్థానంగా చేసుకొన్నానని అనేక పర్యాయాలు వేర్కొన్న సంపాతి ఒకే ఒకసారి "దక్షిణసముద్ర తీరంలోని వింధ్యపర్వత భాగం" ప్రసక్తిని తెస్తాడు. (కిష్కింధాకాండ, 60వ సర్గ) మనకు తెలిసిన వింధ్యపర్వతశ్రేణి దక్షిణ సముద్రంవరకు విస్తరించదు కాబట్టి, ఆ తీరంలో మరొక వింధ్యపర్వతశ్రేణివున్నదని అనుకోవాలి కాబోలు!

సీతాన్వేషణకై అంగదుడు, హనుమంతుడు, జాంబవంతుడు మొదలైనవారు వెళ్ళిన దారివెంటనే లంకపై దండయాత్రకు రాముడు వెళ్ళివుండాలికదా! అయినా, ఆయన వింధ్య పర్వతాలను దాటినట్టు యుద్ధకాండ మనకు చెప్పడం లేదు. నర్మద, గోదావరి, కృష్ణ, కావేరి మున్నగు నదులను దాటినట్టు చెప్ప

---

* లంక ఉనికి తనకు తెలియదని రామునితో తన తొలి సమావేశంలో పలికిన సుగ్రీవుడే (కిష్కింధాకాండ, 7వ సర్గ) లంక ఎక్కడ కలదో అటు పిమ్మట వివరిస్తాడు. (కిష్కింధాకాండ, 41వ సర్గ) ఎవరికి తోచినదాన్ని వారు వ్రాసి, రామాయణంలో దూర్చినందునే, దానితో ఇట్టి పరస్పరవైరుధ్యాలు కొల్లలుగా కనబడతాయి.

ంలేదు. సహ్య, మలయ పర్వతాలను దాటి, మహేంద్రపర్వతాన్ని చేరినట్టుగా మాత్రమే చెబుతున్నది. (యుద్ధకాండ, 4వ సర్గ). ఈ మహేంద్రపర్వతం సమీపంలోనే సముద్రతీరం వున్నదట. హనుమంతుడు మహేంద్ర పర్వతశిఖరంనుంచే లంకకు ఎగిరి వెళ్లాడట (కిష్కింధాకాండ, 67వ సర్గ). అయినప్పటికి, దక్షిణ సముద్రతీరంలోని వింధ్య పర్వతశ్రేణి ఒక మలయపర్వతం, సహ్యపర్వత పంక్తిలో మరొక మలయపర్వతం వున్నదని మనం అనుకోవలెనా? ఇదే విధంగా రెండు ప్రస్రవణ పర్వతాల ప్రసక్తి కూడా వున్నది. వీటిలో ఒక ప్రస్రవణ కిష్కింధ సమీపంలో వుండగా (కిష్కింధాకాండ, 27వ సర్గ), రెండవది సముద్రతీరం లో ఉన్నదట (కిష్కింధాకాండ, 53వ సర్గ). అరణ్యకాండ 6వ సర్గలో పంప ఒక నది కాగా, 73వ సర్గలో అది ఒక సరస్సు, దండకారణ్యం అంచులో చిత్రకూట పర్వత పరిసరాలలోని మందాకినీ నది కాక (అయోధ్యాకాండ, 93 వ సర్గ), దండకారణ్యంలో పంచవటి దరిదాపులలో మరొక మందాకిని వున్నదట. (ఆరణ్యకాండ, 64వ సర్గ.)

ఈ విధంగా రామాయణంలోని జాగ్రఫీ, ముఖ్యంగా దక్షిణభారతం జాగ్రఫీ ఎన్నెన్నో సందేహాలు కలిగిస్తున్నది, ప్రశ్నలను రేకెత్తిస్తున్నది. అయితే, సందేహాలైనా, ప్రశ్నలైనా ఆలోచనాపరులకే, జిజ్ఞాసువులకే; రామభక్తులకు ఈ బాధ ఎంతమాత్రంలేదు. భక్తి పారవశ్యం వారిని ఆలోచనారహితులను చేస్తుంది, అంధ ప్రాయలను చేస్తుంది. నిజానికి, ఆ మేరకు వెళ్ళనిది సిసలైనభక్తి కానే కాదు! ఎఫ్.ఇ.పార్జిటర్ రామభక్తుడు కాడుగాని, పౌరాణికగాథలలో చారిత్రక సత్యాలు చాలా పెచ్చుగా దాగివున్నాయని ఆయన గట్టి నమ్మకం. అందువల్ల రామాయణం జాగ్రఫీలోని అవకతవకలను ఆయన ఎంతమాత్రం కానలేక పోయాడు. 1894 లో తాను ప్రచురించిన ఒక పరిశోధకవ్యాసంలో మధ్య, దక్షిణభారతాలకు సంబంధించిన, సింహళ ద్వీపానికి సంబంధించిన భౌగోళిక వివరాలను రామాయణ కావ్యకర్త మొత్తంపై నిర్దుష్టంగా పేర్కొన్నట్టు ఆయన వ్రాశాడు![1] ఈ ప్రాంతాలలో పర్యటన చేసి వుండకపోతే, ఇంతటి సమగ్ర భౌగోళికపరిజ్ఞానం ఆకావ్యకర్తకు లభించివుండేది కాదని వ్రాశాడు. పార్జిటర్ పాశ్చాత్యుడు; ఐ.సి.యస్. ఆఫీసర్ కూడా. సంస్కృతం కృష్ణంగా నేర్చుకొన్నట్టివాడు. అట్టి ప్రముఖుడు చెప్పిన మాటను, అంతటి పండితుడు చేసిన తీర్మానాలను త్రోసివేయడం తప్పు కాదా? పాశ్చాత్యపండితు లందరినీ నమ్మడానికి వీలులేదనుకోండి. వారిలో పెక్కుమంది జాత్యహంకారం కొద్దీ మన ప్రాచీనచరిత్రను, దాని వైభవాన్ని

చులకనచేయడానికి ప్రయత్నిస్తారు. పోతే, పార్జిటర్‌ను పోలిన న్యాయాభిలాషులు, ధర్మపరులు నూటికి నూరుపాళ్ళు నిజం వ్రాస్తారు. వారి వ్రాతలను మనం కళ్ళ కద్దుకోవాలి.

పార్జిటర్ వ్రాతలను కళ్ళ కద్దుకొనడం జరిగినందువల్లనే రామభక్తులవలె మన సంస్కృత పండితులలో, మన చరిత్రకారులలో దాదాపు నూటికి 99 మంది రావణునిలంక, ఈ నాటి శ్రీలంక అభిన్నమైనవని ఉద్ఘాటిస్తున్నారు. పార్జిటర్ వాదంలోని ఈ కింది ముఖ్యాంశాలను సయితం పరమసత్యాలుగా వారు స్వీకరిస్తున్నారు!

(1) బళ్లారిలో, లేదా దాని సమీపంలో కిష్కింధ వుండేది.

(2) సంపాతి "దక్షిణవింధ్యలుగా" వేర్కొన్న పర్వతాలు దక్షిణ మైసూరు లోని కొండలు అయివుండాలి.

(3) ఈ దక్షిణ మైసూరు కొండల సమీపాన సముద్రం లేదనుకోండి. కాని, ఈ కొండల వరసలు కెరటాలను జ్ఞప్తికి తెస్తూవుంటాయి. అందు వల్లనే రామాయణ కవి ఈ కొండ లున్న ప్రాంతాన్ని సముద్రంతో పోల్చివుండాలి.

పార్జిటర్ వాదంలోని తక్కిన విషయాల చర్చ మరికొంత దూరం వెళ్లిన తర్వాత చేస్తాను. ఈలోగా మతిగలవారికి ఎవరికైనా తోచవలసిన సందేహం ఒకటి వున్నది. తమ్ముడు జటాయువు మరణవార్త విన్న సంపాతి అతడి ఆత్మశాంతికై పార్జిటర్ పేర్కొంటున్న దక్షిణ మైసూరు కొండలవద్ద సముద్రజలాలను విడుస్తాడు. మరి అతడు అలంకారప్రాయమైన సముద్రంలోని అలంకారప్రాయజలాలను అలంకారప్రాయంగా విడిచాడు కాబోలు!

తమ విశ్వాసాలను బలపరుస్తున్నవన్నకారణాన పార్జిటర్ వ్రాతలను కళ్ళ కద్దుకొన్నవారు పార్జిటర్‌కంటె పెద్ద పండితుడైన యాకోబీ పార్జిటర్ కంటె ఒక సంవత్సరం ముందుగా 1893లోనే -"లంక ఎక్కడిది?" అనే ప్రశ్ననుగురించి జరిపిన చర్చను[2] గమనించనైనా లేదు. ఆ చర్చ సందర్భంలో ఆయన మన దృష్టకి తెచ్చిన కొన్ని ముఖ్యంశా లివి:

(1) సింహళద్వీపానికి ప్రాచీననామం సింహళం కాదు, తామ్రపర్ణి. అలెగ్జాండర్ సమకాలికులు దాన్ని "తామ్రపర్ణి" అన్నారు; అశోకునికి సయితం

అది "తామ్రపర్ణి" గానే తెలుసు.

(2) అటుపిమ్మట టోలెమిక్ (ఈజిప్టు) రాజుల కాలంలో "సింహళం" అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. ఏదో ఒక ఓడరేవు పేరు "సింహళం" కాగా, దాన్ని మొత్తం దీవికి పేరుగా ఉపయోగించడం ఈ కాలంలో జరిగివుండవచ్చు.

(3) అటుపిమ్మట వరాహమిహిరుడు లంకను, సింహళాన్ని రెండు విడివిడి ద్వీపాలుగా పేర్కొన్నాడు. భవభూతి, మురారి, రాజశేఖరుడు ఇంతే చేశారు.

(4) సింహళానికి చెందిన ఒక ప్రాచీన బౌద్ధగ్రంథం "దీపవంశం" (దీని రచన క్రీస్తుశకం 302-477 సంవత్సరాల మధ్య). సింహళానికి పర్యాయ పదంగా "లంక" అనే మాటను ఈ గ్రంథంలో ప్రయోగించారు. అయితే, రామాయణం ప్రభావమే ఈ ప్రయోగానికి ప్రేరణ కూర్చి వుండవచ్చు.

(5) ఏదో పరభాషనుంచి "లంక" సంస్కృతంలో ప్రవేశించిన శబ్దం. అది తెలుగు మాట కావచ్చు. "లంకకు" సి.పి.బ్రౌన్ నిఘంటువులో "దీవి, ఏటి నడుమ దిబ్బ" అనే అర్థాలు కనబడతాయి.

ఈనాటి శ్రీలంక రావణుని లంక కాకపోవచ్చునని సూచించడంతోనే సరి పుచ్చినాడే తప్ప. ఏది లంకాద్వీపమో నిర్ధారించడానికి యాకోబీ ప్రయత్నించ లేదు. ఇందుకు ప్రయత్నించినవారిలో విపరీత సిద్ధాంతాలను చేసినవారు కొంద రున్నారు. వారిలో అగ్రతాంబూలాన్ని దివాన్‌బహదూర్ సి.ఎన్.మెహతాకు అందించాలి. ఈయన అద్భుత పరిశోధనల ప్రకారం ఆస్ట్రేలియాలో మెల్ బోర్న్ దరిదాపులలో లంక వున్నది. ఒక మోనోప్లేన్‌లో మంటల బాంబులను దండిగా వేసుకొని, పూరీ జగన్నాథానికి, విజయనగరానికి మధ్యలోగల మహేంద్ర గిరినుంచి బయల్దేరి, అండమాన్‌నికోబార్ దీవులపైగా, సుమిత్రా, జావాల పైగా, న్యూగినీ పైగా లంకానగరానికి హనుమంతుడు వెళ్లాడు. అది మహాశక్తి వంతమైన మోనోప్లేన్ కాబట్టి, సూర్యోదయం వేళకు బయల్దేరిన హనుమంతుడు సూర్యా స్తమయానికి ముందుగానే లంకను చేరగలిగాడు. తన విమానంనుంచి మంటల బాంబులను జోరుగా విసిరి, లంకాపురిని ధ్వంసం చేశాడు. అయితే, రాముడు తన వానరసైన్యాన్ని ఇంత దూరానవున్న లంకకు ఎలా తరలించగలిగినాడన్న

సందేహం రానక్కరలేదు. ఇండియానుంచి ఆస్ట్రేలియాఖండంవరకు ఒకప్పుడు ప్రకృతిసిద్ధమైన వారధి ("యాడమ్స్ బ్రిడ్జి") వుండేది. అక్కడక్కడ దానిలో గల గండ్లను పూడ్చివేస్తూ, వానరసైన్యం నిరాటంకంగా ముందుకు సాగింది. రామాయణం, మహాభారతం, పురాణాలు మొదలైన మన ప్రాచీన గ్రంథాలవ ద్దకు వచ్చేసరికి మనలో కొందరికి ఎంతగా మతిపోతుందో ఈ రచనను[3] కొన్ని నిమిషాలపాటు తిరగవేసినా తెలుస్తుంది.

రావణుని లంకను మెహతా ఆస్ట్రేలియా తీరానికి జరపగా, ఎన్.ఎస్. అధి కారి సుమిత్రావరకు మాత్రమే దాన్ని జరిపాడు.[4] వి.హెచ్.వడెర్ దాన్ని మరింత దగ్గరకు తెచ్చి, భూమధ్యరేఖ సమీపాన, మాల్దీవులలో అది వున్నదన్నాడు[5] పోతే, డేనియల్ జాన్ రావణుని లంక ఇప్పటి శ్రీలంక కాదని, శ్రీలం కకు దక్షిణంగా, లేదా, ఆగ్నేయంగా హిందూమహాసముద్రంలో గల ద్వీపాలలో ఒకటి కావచ్చునని సూచించాడు. హనుమంతుడు విమానంలో కాక, తెరచాప పడవలో లంకకు ప్రయాణం చేసినట్టు ఆయన వ్రాశాడు.[6] డచ్ పండితుడు రూఫర్ దృష్టిలో రావణుని లంకకోసం చూడవలసింది మలేసియాలో. దాని ఉనికి జొహోర్‌కు, సింగపూర్ మధ్యగల సముద్రంలో. ఈ అభిప్రాయన్ని వాయుపురాణం బలపరుస్తున్నట్టు కె.వి.సీలకంఠ శాస్త్రి వివరించాడు.[7] అయితే, దీన్ని ఆయన ఆమోదించలేదు.

పోతే, ఎన్.బి.రాయ్ సరికొత్త సిద్ధాంతం ప్రకారం లంక అంటే మరేదో కాదు. మొహంజోదారో మాత్రమే.[8] నాలుగు వేల సంవత్సరాలక్రితం రామరా వణ యుద్ధం జరిగింది అప్పటిలో ఒక లంకగా వున్న మొహెంజొదారో లోనే. రావణుడు రాక్షసరాజు. అతడి రాజ్యం సింధు, కచ్, గుజరాత్ ప్రాంతాలలో వుండేది. మొహంజోదారో దాని రాజధాని. రావణుని ఈ రాక్షస రాజ్యానికి ఉత్తరదిశలో దానవరాజ్యం వుండేది. హరప్ప దాని ముఖ్య పట్టణం. ఈ రాక్షస, దానవ రాజ్యాలకు ఉమ్మడి పేరు హరప్పా సామ్రాజ్యం. ఆ సామ్రాజ్యానికి పశ్చి మంగా బలూచిస్తాన్‌లో కిష్కింధ వుండేది. ఇప్పటి కలాత్ ఒకనాటి కిష్కింధ కావచ్చు. ఇందుకు ఆధారం పశ్చిమోత్తర భారతంలోగల జనపదాలలో ఒక దాన్నిగా కిష్కింధను పాణిని వేర్కొనడమే.

రాయ్ ప్రతిపాదిస్తున్న ఈ నూతన సిద్ధాంతాన్ని హర్షిస్తూనే కొందరు పాక్ ప్రొఫెసర్లు ("సమాచార్" కథనం ప్రకారం) దీనిలో కొన్ని సవరణలు జరగా లంటున్నారు. హైదరాబాద్ (సింధు) యూనివర్శిటీకి చెందిన హిస్టరీ ప్రొఫె

సర్లు ముజఫర్ ఆలీ, ఆలీ మహమ్మద్ సోమ్రూల వాదం ప్రకారం సీతారాములు వనవాసం చేసింది దండకారణ్యంలో కాదు; పశ్చిమోత్తర భారతంలో. కావాలని కొందరు బ్రాహ్మణపండితులు ఈ సత్యాన్ని మరుగుపరిచారు. రామాయణం వర్ణిస్తున్న అత్యున్నత ప్రమాణాల నాగరికత ప్రాచీనకాలంలో ఒక్క సింధులోయలోనే వుండేది. ఆర్యజాతికి చెందిన రాముడు సంఘర్షించింది మొహెంజొదారో కాదు, పాక్ ప్రధాని భుట్టో స్వస్థలమైన లార్కానా. చిత్రకూటం రావీనది పరిసరాలలో, పంచవటి, కిష్కింధలు జీలం-చినాబ్ నదుల మధ్యప్రాంతంలో, అయోధ్యరావి-సట్లెజ్ నదుల మధ్యప్రాంతంలో వుండేవి. ఇందువల్ల రామాయణానికి రంగస్థలం దాదాపు పూర్తిగా ఇప్పటి పాకిస్తాన్ అని చెప్పవచ్చు. కుశలవులు సంస్థాపించిన రెండు నగరాలు (లాహోర్, కసూర్‌లు) పాకిస్తాన్‌లోనే వున్నాయి. ఈ వాదాన్ని మొత్తంపై బలపరుస్తూ, పెషావర్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ జెయూర్ ఒకటి, రెండు విషయాలలో మాత్రం కొంత విభేదించాడు. ఈయన అభిప్రాయం ప్రాకారం అయోధ్య కాబూల్, పెషావర్‌ల మధ్య ఎక్కడో వుండేది. ఈ ప్రాంతాన "అజ్వాన్" అనే పేరుతో ఇప్పుడున్న కుగ్రామమే ప్రాచీనకాలంలో అయోధ్య అయివుండవచ్చు. రాముడు వానరబలాలతో సింధు తీరంలోని లంకపై దండయాత్ర చేసింది కాబూల్ నది పరిసరప్రాంతాలనుంచి కావచ్చు. రావీనది ప్రాచీననామం "రామి". రాముని జీవితంతో ప్రత్యక్షసంబంధం ఎంతో కొంత వున్నందునే దానికి ఈ పేరు వచ్చివుండాలి.

రామాయణానికి రంగస్థలం పాకిస్తాన్ అనే ఈ వాదం మనకు ఎంతమాత్రం ఆశ్చర్యాన్ని కలిగించ నక్కరలేదు. థాయ్‌లెండ్ లో ఒక అయోధ్య వున్నది. దాని రాజులలో రాములు అనేకు లున్నారు. తమది ఇనవంశమని వారు చెప్పకొంటారేమో కూడా! పోతే, ఇండోనీసియనులు రామరావణ యుద్ధం తమ దేశంలోనే జరిగినట్టు ఉద్ఘాటిస్తారు. ఇది అయోధ్య, అది మిథిల, ఇది కిష్కింధ, అది లంక అని రామాయణ నగరా లన్నింటిని తమ దేశంలోనే వారు చూపిస్తారు.

రామాయణం విషయమై, అంతకంటె ముఖ్యంగా లంక విషయమై జరిగిన జరుగుతున్న- ఈ విభిన్న వాదాలలో ఏదీ నాకు నచ్చలేదు. నాకు నచ్చిన వాదం- ఇదే ఎవరైనా శ్రద్ధాసక్తులతో పరిశీలించదగు వాదం-రావణుని లంక వింధ్య పర్వత పరిసరాలలోనే ఎక్కడనో వున్నట్టు చెప్పేది మాత్రమే. ఈ వాదాన్ని చేసిన వారిలో అగ్రగణ్యులు సర్దార్ ఎమ్.వి.కిబే, టి. పరమశివ అయ్యర్, హెచ్.డి.సంకాలియా, డి.ఆర్.మన్‌కడ్. ఈనలుగురి వాదంతో కొంతవరకు భిన్నించినా,

రాముడు వింధ్య పర్వతాలను దాటలేదనే పండిట్ ద్వారకాప్రసాద్ మిశ్రా అభిప్రాయం. వీరి వాదాలను వివరించడానికి ముందు డి.ఆర్. భండార్కర్ దండకారణ్యం ఉనికిని గురించి చెప్పిన విషయాలను కొంత తడవాలి.

"ఏది దండకారణ్యం?" అనే ప్రశ్నకు "నిస్సందేహంగా అది మహారాష్ట్ర" అని భండార్కర్ ప్రత్యుత్తరమిచ్చాడు.[9] మహారాష్ట్రులు సంధ్యావందనం సందర్భంలో "అస్మిన్ దండకారణ్యే దేశే" అని చాటుకొంటారట, దీన్ని తన వాదానికి తిరుగులేని సాక్ష్యంగా ఆయన వేర్కొన్నాడు. ఆయన చెప్పినట్టు, మరాఠీ భాష ప్రచారంలోగల ప్రాంతం దండకారణ్యంలో భాగమై వుండవచ్చు. కా, ఆ భాషా ప్రాంతానికే దండకారణ్యం పరిమితమై వుండేదనడం ఎంతవరకు సబబు? దక్షిణ భారతం జాగ్రఫీ విషయంలో పార్జిటర్ వాదాన్ని భండార్కర్ బలపరుస్తున్నాడు. ఆపార్జిటర్ వ్రాతల ప్రకారం ఉత్తరాన బుందేల్ ఖండ్‌నుంచి దక్షిణాన కృష్ణానదీ తీరం వరకు మొత్తం భూభాగం దండకారణ్యమే. బుందేల్ ఖండ్ దాదాపు అలహాబాద్ వద్ద ప్రారంభమౌతున్నది [10] పోతే, "దక్షిణాన కృష్ణానదీ తీరంవరకు" అంటే, కర్నూలు, బళ్లారి, రాయచూర్ జిల్లాలవరకు. అయినప్పుడు దండకార ణ్యాన్ని కేవలం మరాఠీ ప్రాంతానికి పరిమితం చేయడం సబబు కాదు.

రామాయణంప్రకారం ఉత్తరాన దండకారణ్య ప్రారంభం అత్రి మహర్షి ఆశ్ర మాన్ని దాటినంతనే. ఆయన ఆశ్రమం చిత్రకూట పర్వతానికి ఒకనాటి పయనంలో వున్నది. అది కాలినడక పయనం; కాలిబాటవెంట పయనం. అందువల్ల చిత్ర కూటానికి అత్రి ఆశ్రమం,[11] పన్నెండు మైళ్ళలో వుండేదని అనుకోవచ్చు పరమశివ అయ్యర్ అంచనా ప్రకారం సీతారామలక్ష్మణుల ప్రయాణమార్గంలో వారు గంగానదిని దాటిన తర్వాత 27 మైళ్ళలో యమున వుండగా, దాని తర్వాత 29మైళ్ళలో చిత్రకూట పర్వతం, దానికి పన్నెండు మైళ్ళలో అత్రి ఆశ్రమం వున్నాయి. ఇందువల్ల గంగకు 70 మైళ్ళలోపలనే, యమునకు 45 మైళ్ళలోపలనే దండకారణ్యం ప్రారంభ మౌతుంది.

నిజానికి అయోధ్యకు, దండకారణ్యానికి మధ్యప్రాంతంలో అరణ్యం లేదనుకొ నడానికి ఎంతమాత్రం వీలు లేదు. యమునానదిని దాటిన వెంటవే సీతారాముల క్ష్మణులు నెమళ్ళగుంపులతో, కోతులతో, ఏనుగులతో, వేటాడి తినడానికి తగిన మృగాలతో నిండివున్న కాననంలో ప్రవేశించారు (అయోధ్యకాండ, 55 వ సర్గ). వేటకు వెళ్ళాలంటే, కోసలరాజులకు సరయూనదీతీరంలోనే అరణ్యం వుండేది. పొరపాటున అంధమని పుత్రుని దశరథుడు చంపింది సరయూనదీ తీరంలోని

అరణ్యంలో వేటాడుతూనే(అయోధ్యకాండ, 63వసర్గ). రాముడు సయితం ఇదే అరణ్యానికి వేటకు వెడుతూవుండేవాడు (అయోధ్యకాండ, 49 వ సర్గ). ఇక్కడ మరొక విషయాన్ని కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. కైకేయి పెట్టిన షరతుప్రకారం రాముడు వెళ్ళవలసింది అరణ్యవాసానికి. అందుకై బయల్దేరిన రాముడు ఆదిలో కొంతకాలం పాటు చిత్రకూట పర్వతంవద్ద నివసించినాడంటే, అది అరణ్యప్రాంతమై వుండాలి కదా?

ఇంతగా అరణ్యాలనుగురించి, వాటి విస్తృతినిగురించి నేను ముచ్చటించడం రామునికాలంలో-దాన్ని క్రీస్తుకుపూర్వం పదవశతాబ్దిగా పరిగణించినా మన దేశం అడవుల మయమని చెప్పడంకోసమే. ఆ కాలంలో దాదాపు ప్రతి జనపదం అరణ్యం మధ్యలోనే వుండేదని ఐతరేయ బ్రాహ్మణం సూచిస్తున్నట్టు వేదవేదాంగాలలో మహాపండితుడైన ఎన్.ఎమ్. కుంతే వ్రాశాడు.[12] అరణ్యాల మధ్యలోగల ఋష్యాశ్రమాలలో రూపొందినవి కనుకనే కొన్ని వైదికగ్రంథాలకు "ఆరణ్యకాలు" అనే పేరు వచ్చింది.

బౌద్ధయుగంలో సయితం అరణ్యాలు విస్తారంగానే వుండేవి. బుద్ధుని జననం లుంబినీవనంలో, ఆయన ధర్మచక్రప్రవర్తనను ప్రారంభించింది మృగదావంలో, ఆయన చాతుర్మాస్యం తరచుగా జేతావనంలో, ఆయన మహాపరినిర్వాణం సాలవనంలో-- ఈవిధంగా ఆయన జీవితంలోని ప్రతి ముఖ్యఘట్టానికి ఏదో ఒక వనంలో ప్రత్యక్ష సంబంధం వున్నది. "వనం" అంటే కేవలం ఉద్యానం కాదు. ఆపదానికి "శబార్థచంద్రిక" చెబుతున్న నానార్థాలలో మొట్టమొదటిది "అడవి" అని. బౌద్ధ యుగంలో కపిలవస్తు పరిసరాలలో ఒక మహావనం, వైశాలి దరిదాపులతో మరొకటి వుండేదని, ప్రతి గ్రామం చేరువలో పశువులమేతకై చిన్నదో, పెద్దదో ఒక అడవి వుండేదని రీస్ డేవిడ్జ్ వ్రాశాడు.[13] జాతకకథలలో అరణ్యాల ప్రసక్తి పదేపదే కాన వస్తున్నది. బౌద్ధకాలం నాటి ఆర్థికవ్యవస్థలో అటవీసంపదకున్న ప్రాధాన్యాన్ని సంతోష్‌కుమార్ దాస్ విశదీకరించాడు.[14]

మొత్తం దేశం ఇంతగా అరణ్యాలతో విండివున్న కాలంలో, ఉత్తరదక్షిణ భారతాలమధ్య "కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి" ధోరణిలో దండకారణ్యం వున్నకాలంలో, రాముడు (పార్జిటర్ చెప్పగా, భండార్కర్ బలపరస్తున్నట్టు) బళ్ళారిజిల్లావరకు వచ్చి సుగ్రీవుని స్నేహం చేశాడని, లంకపై దండయాత్రకు మరింత ముందుకు సాగిపోయినాడని ఎలా అనుకోగలము? గంగకు ఉత్తరదిశలోనే, కోసలరాజ్యంలోనే అప్పటిలో రాజమార్గాలు బహుస్వల్పం. అవి సయితం

పేరుకే రాజమార్గాలు. బహుశా వాటిపై ఒకే ఒక రథం ధారాళంగా నడవ గలిగేది. వనవాసానికి బయల్దేరిన రాముడు అయోధ్యనుంచి శృంగిబేరపురం వరకు (ఇంచుమించుగా నూరుమైళ్ళు) ఒకే ఒక రథంలో ప్రయాణం చేశాడు. సకల బంధుమిత్ర పరివారంతో భరతుని ప్రయాణానికి ఆ మార్గాన్ని వెడల్పు చేయవలసి వచ్చింది. ఇందుకోసం కొన్ని వేలమందిని భరతుని ఉత్తరువుపై నియోగించారట. (అయోధ్యకాండ 80వ సర్గ). అయినప్పుడు చిత్రకూట పర్వతంనుంచి సింహళం వరకు (అదే రావణుని లంకాద్వీపమైతే) 1500 మైళ్ళకు పైగా రాముడు ఏ విధంగా పురోగమించ గలిగాడు? ఇంతకంటె కూడా ముఖ్యమైన ప్రశ్న - సింహళ ద్వీపంలోని రావణుడు 1500 మైళ్ళలోగల జనస్థానంపై తన ఆధిపత్యాన్ని ఏవి ధంగా సంస్థాపించుకొన గలిగాడు? సింహళానికి, జనస్థానానికి మధ్య ఇతరరాజ్యాలు లేవా? వాటిని విడదొక్కుకొని రావణుడు ముందుకు ఎలా వెళ్ళగలిగాడు? అశోకుని సామ్రాజ్యం నెల్లూరుదాటి విస్తరించలేదు; గుప్త, హర్ష సామ్రాజ్యాలు నర్మదానదినైనా దాటలేదు. మరి మూడువేల యేళ్ళనాడు రావణుడు యము నానదివరకు ఎలా విస్తరించగలిగాడు? రాముడు సింహళంపై జైత్రయాత్ర ఎలా జరపగలిగాడు? ఈ ప్రశ్నలు రామభక్తులకు, ఆయన భజనపరులకు తోచకపోవచ్చు. కాని, ఇవి కనీసం పార్జిటర్‌కు తోచవలదా? భండార్కర్‌కు తోచవలదా? ఈ విషయంలో కుమారునికి లేని హేతుదృష్టిని తండ్రి చూపించడం ఒక విశేషం. డి.ఆర్. భండార్కర్ పంచవటి నాసిక సమీపంలో వుండేదని చెప్పగా,[15] ఆయన తండ్రి ఆర్.జి. భండార్కర్ వాల్మీకి తన కావ్యనాయకుని వింధ్యపర్వత ప్రాంతా నికి పశ్చిమంగా ఎంతో దూరానవున్న నాసిక్ వరకు తెచ్చివుండడని వ్రాశాడు.[16] "వాల్మీకి తన కావ్యనాయకుని" అనే మాటలను ఆర్.జి. భండార్కర్ నిర్మొమొ త్తంగా వాడలేదు. ఆయన దృష్టిలో ("జాబాలి" పీఠికలో నేను వివరించినట్టు) రామాయణం కావ్యమే కాని చరిత్ర కాదు. ఏమైనా, ఇరవయ్యో శతాబ్దంలో పైకివచ్చిన భారతీయమేధావులు పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో పేరొందిన మేధావులు చూపుతూవచ్చిన పాటిగానైనా, హేతుదృష్టిని చూపలేకపోవడం మన దేశ దౌర్భాగ్యమే! ఒక జాతిగా మన మనస్సు వికసించడానికి మూరుగా ముడు చుకుపోతున్నట్టుగా అనుమానించవలసి వస్తున్నది.

దండకారణ్యంలో రాముడు విడిదిచేసిన ఆశ్రమాలమధ్య, ఆయన నివసించిన ప్రాంతాలమధ్య దూరాలను మదింపుచేయడానికి టి.పరమశివ అయ్యర్ టోపో గ్రాఫికల్ మ్యాపుల సహాయంతో ప్రశంసాపాత్రమైన ప్రయత్నం చేశాడు. ఆయన

మదింపు ప్రకారం అయోధ్యకు 100 మైళ్ళలో శృంగిబేరపురం, 169 మైళ్ళలో చిత్రకూటపర్వతం, 178 మైళ్ళలో అత్రి ఆశ్రమం, 185 మైళ్ళలో అగస్త్యభ్రాత ఆశ్రమం, 306 మైళ్ళలో అగస్త్యుని ఆశ్రమం, 315 మైళ్ళలో పంచవటి, 349 మైళ్ళలో మతంగవనం, 373 మైళ్ళలో లంక వున్నాయి. (కౌటిల్యుని అర్థశాస్త్రం ప్రకారం యోజనం అంటే దాదాపు నాలుగున్నర మైళ్ళు, క్రోసు అంటే 2000 గజాలు. ఇందుకు అనుగుణంగానే రామాయణంలోని యోజనాలును, క్రోసులను పరమశివ అయ్యర్ మైళ్ళలోకి మార్చాడు).

ఇక్కడ మనం రెండు విషయాలను ప్రత్యేకించి గమనించాలి. పరమశివ అయ్యర్ అంచనాల ప్రకారం అయోధ్యకు 190 మైళ్ళ లోపలనే దండకారణ్యం ప్రారంభమౌతుంది; అయోధ్యకు 315 మైళ్ళలో పంచవటి వున్నది. ఈ అంచనాలు నిజమైతే (భండార్కర్ చెప్పినట్టు) దండకారణ్యం కేవలం మరాఠీ భాషాప్రాంతానికి పరిమితం కావడానికి వీలు లేదు; పంచవటి నాసిక్ ప్రాంతంలో వుండడానికి సయితం వీలు లేదు.

పోతే, ఇక్కడ గమనించదగు మరొక విషయ మిది; పరమశివ అయ్యర్ అంచనా ప్రకారం అయోధ్యకు 373 మైళ్ళలో లంక వున్నది. ఘోరారణ్య ప్రాంతా లగుండా 373 మైళ్ళలో ప్రయాణం చేయడం నిజంగా ఒక గొప్ప విశేషం. అయితే రామభక్తులకు, ఆయన భజనపరులకు ఇది చాలదు. అందువల్ల ఆయన 1500 మైళ్ళకు పైగా పురోగమించినట్టు వారు ఉద్ఘాటిస్తారు; వారిలో సి.ఎన్.మెహతాను పోలినవారు ఆయన ఆస్ట్రేలియావరకు పురోగమించినట్టు బల్లగుద్ది వాదిస్తారు.

రావణుని లంకకోసం చూడవలసింది వింధ్య పరిసరాలలోనే అని పరమశివ అయ్యర్‌కంటె ముందుగా సర్దార్ ఎమ్.వి.కిబే చెప్పాడు. అసలు ఈ సిద్ధాంతాన్ని లేవనెత్తిందే ఆయన. దాన్ని మన సంస్కృతపండితులు, మన చరిత్రకారులు పరిశీలనైనా లేకుండా త్రోసివేశారు. కాని, రామాయణ పరిశోధనలో అగ్రగణ్యుడైన యాకోబీ దానివైపు మొగ్గు చూపించాడు. "రావణుని లంక అస్సాంలో వుండేదని ఒకప్పుడు నే ననుకొన్నాను. ఇప్పుడు మీ సిద్ధాంతమే మరింత సమంజసమైనదని నాకు తోస్తున్నది" అనే ధోరణిలో అయన కిబేపేర లేఖ వ్రాశాడుకూడా.[17] తర్వాత కొంతకాలానికి జె.సి.ఘోష్,[18] డాక్టర్ హీరాలాల్,[19] జి. రామదాసు[20] మున్నగు మరికొందరు కూడా కిబేను సమర్థించారు.

రావణుని లంక వింధ్య పరిసరాలలో వుండేదన్న విషయంలో ఏకీభవించినా,

తక్కినవాటిలో పరమశివ అయ్యర్, కిబేలకు అన్నీ విభిన్నాభిప్రాయాలే. మ్యాపులజోలికి పోకుండా, కేవలం రామాయణంపై ఆధారపడి కిబే వేసిన అంచనాల ప్రకారం చిత్రకూట పర్వతానికి, కిష్కింధకు మధ్యదూరం 96 మైళ్ళు కాగా, కిష్కింధకు, లంకకు మధ్యదూరం ఏడుమైళ్ళు మాత్రమే. చిత్రకూటంనుంచి వింధ్యపర్వతాలు ఇంచుమించు 96 మైళ్ళలోనే వున్నాయి. అందువల్ల కిష్కింధ వింధ్యపర్వతాలకు ఉత్తరపుచరియలలో ("స్లోప్స్"లో) వుండేది; లంక వాటి దక్షిణపు చరియలలో వుండేది- ఇదే కిబే సిద్ధాంతం. దీని సమర్థనకై ఆయన చెప్పిన కారణాలలో ముఖ్యమైన వివి:

(1) చిత్రకూటప్రాంతాన్ని విడిచినపిమ్మట పదేళ్ళపాటు రాముడు వనవాసం చేసింది సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంలో, లేదా దాని పరిసరాలలో, ఈనాటి సత్నాలో అది వుండేది. మధ్యప్రదేశ్‌లోని కట్నీనుంచి అలహాబాద్‌కు రైలు ప్రయాణం చేస్తుండగా దారిలో తగిలే పట్టణం సత్నా. ఇక్కడ అతి సుందరమైన ఒక నది వున్నది. ఈ నదీతీరంలోనే సుతీక్ష్ణుని ఆశ్రమం వుండేది.*

(2) దక్షిణభారతంలోని గోదావరికాక, వింధ్య పర్వతాలకు ఉత్తరదిశలో పంచవటి సమీపాన దాదాపు ఇదే పేరుతో మరొక నది వుండేది. పురాతత్త్వశాస్త్రవేత్త హీరాలాల్ వివరణ ప్రకారం, ఈ రెండవ నది "గోధా".

(3) వింధ్యపర్వతశాఖలలో ఒకదాని పేరు "కిన్‌జువా". దాని పరిసరాల లోని అరణ్యాన్నే వాల్మీకి "క్రౌంచారణ్యం" అనివుండవచ్చు.

(4) వరాహమిహిరుడు భారతదేశాన్ని తొమ్మిది భాగాలు చేశాడు.(ఎనిమిది దిక్కులలో ఎనిమిది భాగాలు, వాటి మధ్యప్రాంతంలో తొమ్మిదవ భాగం). ఈ తొమ్మిదవదానికి ఆగ్నేయభాగంలో కిష్కింధ కలదని ఆయన చెప్పాడు. అది త్రిపుర సమీపంలో (జబల్పూర్ దరిదాపులలో) కలదని సూచించాడు. దీని తాత్పర్యం కిష్కింధ వింధ్యకు ఉత్తరదిశలో కలదని.

(5) శబరభాషలో విశేష పాండిత్యాన్ని గడించిన జి. రామదాసు వివరణ

---

* ఈ మాట కిబే చెప్పలేదుగాని, సత్నాకు మరొక పేరు "రఘురాజనగర్" అని ఇంపీరియల్ గెజెటీర్ 12వ సంపుటం 130వ పుటలో వున్నది. రాముడు సత్నాలో పదేళ్లు నివసించినందునే దానికి ఈ పేరు వచ్చిందా?

ప్రకారం, ఆ భాషలో "లంక" అంటే ఎత్తు,ఎగువ, కొండ (స్వర్గం); "జైతాన్" అంటే దిగువ; "దండకం" అంటే జలమయ ప్రాంతం. ఎత్తైన కొండపై వున్నం దునే రావణుని రాజధాని "లంక" అయివుండాలి. ఆ లంకకు దిగువగల ప్రాంతం పేరును "జైతాన్" నుంచి జనస్థానానికి రామాయణ రచయిత మార్చి వుండాలి. (ఎగువ తిరుపతి, దిగువ తిరుపతి ఈనాడు మనకున్న పద్ధతిలో) పోతే, లంక సమీపంలోగల ప్రాంతంలో సాంద్రారణ్యంతోపాటు జలాశయాలు పెక్కు లున్నందు వల్లనే దాన్ని "దండకారణ్యం" అనే పేరు వచ్చివుండాలి.

(6) రావణుని లంక త్రికూట పర్వతంపై వుండేది. అది ఇప్పటి "అమర కంటక" పర్వతం. దీనికి ఏడుమైళ్ళదూరంలో ఇప్పుడు శబరినారాయణఅనే గ్రామం వున్నది. రాముడు శబరినుంచి అర్ఘ్యపాద్యాలను స్వీకరించింది ఈగ్రామంలోనే కావచ్చు.

(7) "అమరకంటక" అనే పదానికి రావణుని వంశనామమైన "సాలకటంకట" తో కొంత ధ్వని సామ్యం కానవస్తున్నది, వైగా, అమరకంటక ప్రాంతంలో గల ఆదివాసులు తాము రావణ వంశీయులమని చెప్పుకొంటారు.

(8) వింధ్యపర్వతశ్రేణిలో కైమూర్ అనే భాగానికి చెందింది అమర కంటక. ఇక్కడ ప్రాచీనకాలపు గుహ లున్నాయి; ఆ గుహలలో ప్రాచీనకాలపు కుడ్యచిత్రాలున్నాయి, ప్రాచీన జనపదాల చిహ్నా లున్నాయి.

(9) అమరకంటక పరిసరాలలో అనేక సరస్సు లున్నాయి. "సాగరం" అనే పేరు వాటిలో కొన్నింటికి వున్నది. నందలాల్ డే వివరించినట్టు "సాగరం" అనే పదానికి సరస్సు, సముద్రం, మహాసముద్రం అనే నానార్థా లున్నాయి.*

(10) విభీషణుడు సముద్రం ఆవతలిగట్టునుంచి గట్టిగా మాట్లాడగా, ఇవతలి గట్టుపై విడిసివున్న వానరసేనానాయకులకు అతడి మాటలు వినబడినట్టు యుద్ధ కాండ17 వ సర్గ స్పష్టం చేస్తున్నది. అది నిజంగా నూరు యోజనాల వెడల్పుగల సాగరమైతే, ఇది జరిగేది కాదుగదా?

---

* హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్ ఆంధ్రప్రదేశ్‌లో ఇన్ని సాగరాలున్నాయి. వీటిలో ఒక్కటైనా సముద్రం కాదు.

(11) క్రీస్తుశకం 1080 నాటి ఒక సంస్కృత తామ్రశాసనం రీవాసంస్థానంలో దొరికింది. వింధ్యప్రాంతంలోని "లవణాకరం" ప్రసక్తి దీనిలో వున్నది. దీన్ని బట్టి ఆప్రాంతంలోని ఒక పెద్ద నీటిమడుగు నడుమ ఉప్పుగని వుండేదని మనం ఊహించవచ్చు. రావణుని లంక ఈ మడుగులో వుండేదేమో!

(12) రీవా సంస్థానంలో బిలాస్‌పూర్, కట్నీల, మధ్య ఫెండ్రారోడ్ అనే రైలు స్టేషన్‌కు పదిమైళ్ళ దూరంలో ఒక కొండమీద "రాణి బకావళికోట" వున్నది. "భృగుమహర్షి ఆశ్రమం" గా పేరందిన స్థలంనుంచి ఈ కోట స్పష్టంగా కనబడుతుంది. ఈఆశ్రమం నర్మదానది జన్మస్థానానికి రెండు మైళ్ళలోపల వున్నది. ఇక్కడి నేల బాడవ. ఇది రొచ్చు రొచ్చుగా వుంటుంది. దాదాపు మూట పదేళ్లనాడు ఈ బాడవ దాటి "రాణి బకావళికోట" కు వెళ్లాలని సర్ రిచర్డ్ టెంపుల్ ప్రయత్నించాడు. కాని, ఊబిలో దిగబడి, తన ఏనుగు మరి ముందుకు నడవలేక పోయినందున, ఆప్రయత్నాన్ని ఆయన విరమించవలసి వచ్చింది. బాడవ ఈవలి అంచునుంచి కోటను చూస్తే, మంచు తెరలమధ్య మసకమసకగా ఎంతో దూరాన వున్నట్టు అది కనబడుతుంది. ఇదే రావణుని లంకాపురి అయివుండవచ్చు.

సర్దార్ కిబే చేసిన ఈ సిద్ధాంతానికి భిన్నంగా వెళ్లి, ఇప్పటి జబల్పూర్-దామో రోడ్డుపైగల ఇంద్రానాపర్వతంపై* రావణుని లంక వుండేదని పరమశివ అయ్యర్ తీర్మానించాడు. నర్మద, హిరన్ (హిరణ్య?) నదుల లోయలోగల "హవేలీ" (మైదానం) నుంచి ఈ పర్వతం 650 అడుగుల యెత్తుకు లేస్తున్నది. దీని మూడు పార్శ్వాలలో హిరన్ ప్రవహిస్తున్నది. వర్షాకాలంలో హిరన్ పొంగి పారలినప్పుడు హవేలీ ఒక పెద్ద సముద్రంవలె కనబడుతుంది. రామాయణం పేర్కొంటున్న దక్షిణసముద్రం ఇదే కావచ్చు. ఇంద్రానా దరిదాపులలో సువేల వున్నది. రామాయణం పేర్కొంటున్న సువేల అదే కావచ్చు. (రావణుని లంకాపురి త్రికూటపర్వతం పై వుండగా, దాని సమ్ముఖంలో సువేల అనే మరొక పర్వతం కలదని, సువేలశిఖరం పై నుంచి లంకాపురిని రాముడు మొట్టమొదటగా చూచినాడని యుద్ధకాండ 38 వ సర్గ వివరిస్తున్నది.) ఇంద్రానా పర్వతప్రాంతాన్ని పశ్చిమోత్తర దిశనుంచి చేరాలంటే, వింధ్యపర్వతంపంక్తి మధ్యగల ఒక సందుగుండా వెళ్ళాలి. (దీన్ని హిందీలో "కటావ్"అంటారు.) వింధ్యపర్వత

---

* ఇది ప్రస్తుతం దాని వ్యవహార నామం. అసలు పేరు "ఇంద్రాణి పర్వతం" కావచ్చు.

పంక్తికి చెందిన కైమూర్‌శాఖ కటంగీ అనే ప్రదేశానికి తూర్పుగా ఒక మైలులో హఠాత్తుగా నిలిచి పోయినట్టు కనబడుతుంది. ఈ కటంగీ జబల్పూర్- దామోరో డ్డులో ఇరవైఎాల్గవ మైలురాయివద్ద వున్నది. వింధ్యపర్వతపంక్తిలో కటంగీవద్దగల ఈ "కటావ్"నే రామాయణం మహేంద్రపర్వత ద్వారంగా పేర్కొనివుండాలి. ఈ పర్వత ద్వారంగుండా కైర్‌నది ప్రవహిస్తున్నది. సీతాపహరణ తర్వాత రావణుడు లంకకు తిరిగి వెడుతూవుండగా మహేంద్రపర్వత ద్వారం వద్ద చేపలు పడుతున్న సుపార్శ్వుడు (సంపాతి కుమారుడు) లంకాధిపతిని చూచినట్టు రామాయణంలో వున్నది (కిష్కింధాకాండ, 59 వ సర్గ). సుపార్శ్వుడు చేపలు పట్టింది ఈకై ర్‌నదిలోనే కావచ్చు. రామాయణం పేర్కొంటున్న ఋష్యమూక, పంప, కిష్కింధ, మహేంద్రగిరి, మలయపర్వతం మొదలైనవాటిని కూడా మ్యాపుల తోడ్పాటుతో, గెజిటీర్ల తోడ్పాటుతో గుర్తించడానికి ఇదే ధోరణిలో పరమశివ అయ్యర్ "రామాయణ అండ్ లంక" అనే తన గ్రంథంలో గట్టి ప్రయత్నం చేశాడు. అయన చేసిన ఈ ప్రయత్నం సర్దార కిబే చేసినదానికంటె శ్రద్ధగా, క్షుణ్ణంగా జరిగినట్టు కనబడుతుంది. ఇందువల్లనే కావచ్చు, కిబే సిద్ధాంతం వైపు కుకాక, పరమశివ అయ్యర్ వాదంవైపుకు డి.ఆర్.మన్‌కడ్ మొగ్గు చూపించాడు. ఈయన పేరందిన సంస్కృత విద్వాంసుడు. వల్లభ్-విద్యానగర్‌లోని వి.పి.మహావి ద్యాలయానికి ప్రిన్స్‌పాల్ గా పనిచేసిన విద్యావేత్త. బరోడా విశ్వవిద్యాలయానికి చెందిన ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యాన వాల్మీకి రామాయణానికి ప్రామాణిక పాఠాన్ని నిర్ణయించిన పండితవర్గంలో ఈయన సభ్యుడు. కిష్కింధా కాండ ఎడిటింగ్ బాధ్యతను, జి. హెచ్.భట్, నాయకత్వాన ఈయన ఎంతో సమర్థంగా నిర్వహించాడు. నాకు ప్రత్యేకించి నచ్చినట్టిది కిష్కింధాకాండ ప్రామా ణిక పాఠం సంపుటానికి ఈయన ఇంగ్లీషులో వ్రాసిన పీఠిక. దానిలో ఈయన స్వతంత్ర ప్రవృత్తి, ఈయన శాస్త్రీయదృష్టి, ఈయన సత్యప్రియత్వం విశేషంగా గోచరిస్తున్నాయి.

మన్‌కడ్ తీర్పుప్రకారం, "సుగ్రీవుని జాగ్రఫీ సర్గలు" గా నేను పేర్కొన్న నాల్గింటిలో 39, 41, 42 సర్గలు దాదాపు పూర్తిగా వాల్మీకి పేరుతో జరిగిన ఫోర్జరీలు. పోతే, 40వ సర్గలో సయితం (వావిళ్ళవారి వచన రామాయణంలో ఇది 41వ సర్గ) ఒకటవ శ్లోకం నుంచి ఎనిమిదవదానివరకు, తొమ్మిదినుంచి పదకొండువరకు, 21 నుంచి 26 వరకు వాల్మీకి వ్రాసినవి కావచ్చు; తక్కినవి నిశ్చయంగా ప్రక్షిప్తాలే. సీతాపహరణ తర్వాతదక్షిణదిసగా రావణుడు వెళ్ళడాన్ని

సుగ్రీవుడు స్వయంగా చూచినమీదట సీతాన్వేషణకై తక్కినవి మూడు దిక్కులకు అతడు తన వానరబృందాలను పంపించడం మతిలేని పని కాబట్టి, అతడు దాన్ని చేసివుండడని నావలనే మన్‌కడ్ అభిప్రాయపడుతున్నాడు. అంగదుని నాయకత్వాన దక్షిణానికి వెళ్ళిన బృందానికి సుగ్రీవుడు చెప్పిన మొదటిమాట "దక్కినంపువైపు నకు దిరిగిన వెంటనే" వేయి శిఖరాలున్న వింధ్యపర్వతాలు వారికి కనబడుతాయని, వాటిని దాటిన వెంటనే నర్మదానది తగులుతుందని. దీన్నిబట్టి కిష్కింధ వింధ్యకు ఉత్తరంలోనే వుండేదని స్పష్టంగానే తెలియడంలేదా అని మన్‌కడ్ ప్రశ్నిస్తున్నాడు. మతిగలవారికి ఎవరి కైనా ఈ ప్రశ్న విధిగా తోచాలి.

సంస్కృత సాహిత్యంలో తనకున్న ప్రత్యేక పాండిత్యాన్ని పురస్కరించు కొని "సుగ్రీవుని జాగ్రఫీ సర్గల" లోని శ్లోకాలలో పెక్కింటిని మత్స్యపురాణం నుంచి యెత్తి, రామాయణంలో దూర్చినారని మన్‌కడ్ నిరూపించగలిగాడు. కేవలం ఇక్కడనే కాక, ఇతర ఘట్టాలలో సయితం మత్స్యపురాణంనుంచి చౌర్యం జరిగిందని ఆయన రుజువుచేశాడు. వాయుపురాణంనుంచి, బ్రహ్మాండపురాణం నుంచి ఇదే విధంగా మరికొంత చౌర్యం జరిగినట్టు ఆయన నిరూపణ చేశాడు. వాల్మీకి పేర ఎందరెందరో ఇన్ని తప్పుడు పనులు చేయబట్టే ఆయన పేర చెల్లుతున్న సంస్కృత రామాయణం 24,000 శ్లోకాలకు పెరిగింది!

అయోధ్యనుంచి చిత్రకూటపర్వతం, అక్కడినుంచి పంచవటి, అటుపైన కిష్కింధ, లంకాపురి ఎంతెంత దూరాలలో కలవో రామాయణ పాఠమే ఆధారంగా చర్చించిన మీదట, పరమశివ అయ్యర్ తీర్మానాలతో మన్‌కడ్ మొత్తంపై ఏకీభవిస్తున్నాడు. ఒకే ఒక విషయంలో మాత్రం అయ్యర్‌తో ఈయన విభేదిస్తున్నాడు. శరభంగుని ఆశ్రమంనుంచి సుతీక్ష్ణుని ఆశ్రమానికి 94 మైళ్ళు అని అయ్యర్ చెప్పగా, ఇంత స్పష్టంగా చెప్పడానికి తగు ఆధారంలేదని, "బహుదూరం" అని మాత్రమే చెప్పగలమని మన్‌కడ్ వ్రాస్తున్నాడు. ఏమైనా, ఇంద్రానాపర్వతం పైనే లంకాపురి వుండేదన్న అయ్యర్ వాదాన్ని మన్‌కడ్ పూర్తిగా బలపరుస్తున్నాడు. ఇంద్రానాపర్వతం వద్ద సింగల్ దీప్ అనే గ్రామం కలదని చెప్పినా, అది ఇటీవలి కాలంలో ఆ గ్రామానికి వచ్చిన పేరు కావచ్చునని అయ్యర్ సూచించాడు. కాని, మన్‌కడ్ దృష్టిలో సింహళం ద్వీపంగా సంపాతి పేర్కొన్నది ఈ గ్రామమే కావచ్చు. ఇంతే కాక, ఇంద్రానాపర్వత ప్రాంతంలో "తికుడు" అనే మరొక గ్రామం వున్నది. దీనికి "త్రికూట" తోగల ధ్వని సామ్యం గమనార్హమైనదని కూడా మన్‌కడ్ భావిస్తున్నాడు.[21]

మన్‌కడ్‌వలె సంకాలియా సయితం పరమశివ అయ్యర్ వైపుకు ఆదిలో మొగ్గు చూపించాడు. అయితే, ఇటీవల ఇంద్రానాపర్వతప్రాంతాన్ని పరిశీలించివచ్చిన మీదట ప్రాచీనకాలంలో ఇక్కడ జనపదాలున్న సూచనలు ఎంతమాత్రం తనకు కానరాలేదని, అందువల్ల లంకకై చూడవలసింది జబల్పూరు ప్రాంతంలో కాక, నర్మదకు ఉత్తరంగా మధ్యప్రదేశ్ ఆగ్నేయభాగంలో, లేదా దాని పొరుగునవున్న ఒరిస్సా, ఆంధ్ర ప్రాంతాలలో అని ఆయన ప్రకటించాడు.[22]

వింధ్యపరిసరాలలోనే లంకకై చూడాలని అనేవా రందరు నొక్కి చెప్పే మొట్టమొదటి సంగతి - సీతాన్వేషణకై బయల్దేరిన అంగదబృందం కాని, సీతను చూచిన తర్వాత లంకనుంచి తిరిగివచ్చిన హనుమంతుడు కాని, వానరసేనతో లంకపై దండెత్తి వెళ్ళిన రాముడు కాని, నర్మదానదిని దాటినట్టు రామాయణంలో లేకపోవడమే. వింధ్యపర్వతపంక్తికి దక్షిణంగా, దానికి అనతి దూరంలో నర్మద ప్రవహిస్తున్నది. అయినప్పుడు నర్మదనుదాటకుండా ఎవరైనా దక్షిణసముద్రతీరాన్ని ఎలా చేరగలరు? ఈ ప్రశ్నకు ద్వారకాప్రసాద్ మిశ్రా ప్రత్యుత్తరం "నిజమే, ఎవరైనా నర్మదను దాటకుండా ఉత్తరభారతంనుంచి దక్షిణ సముద్రతీరాన్ని చేరలేరు. కాని, తూర్పు సముద్రతీరాన్ని చేరవచ్చు" నని. చిత్రకూటంనుంచి సత్నా, రీవా, శహడోల్, బిలాస్‌పూర్, రాయపూర్, బస్తర్ జిల్లాలగుండా ప్రయాణం చేసి, గోదావరి గట్టుపై వున్న పంచవటిని చేరవచ్చు. నర్మదను దాటకుండా గోదావరిని చేరవచ్చునన్న విషయాన్ని గుర్తిస్తే, కిబే వాదంలో పస తగ్గుతుంది, పరమశివ అయ్యర్ సిద్ధాంతం దెబ్బ తింటుంది. "అయితే, మరి ఆశ్రమంనుంచి, ఆశ్రమానికి దూరాల లెక్కలను క్రోసివేయవలసిందేనా?" అని నిలదీస్తే, "ఊ" నని సమాధానం చెప్పడానికి మిశ్రా సందేహించడం లేదు. ఆయన వాదం ప్రకారం ఈ దూరాల విషయమై రామాయణంలో పరస్పరవైరుధ్యాలు కనబడుతున్నాయి. పదునాలుగేళ్ల వనవాసంలో రాముడు ప్రదేశం నుంచి ప్రదేశానికి తన నివాసాన్ని మార్చాడు. ఆ ప్రదేశాలమధ్య దూరాలనుగురించి ఎవరైనా నిర్ధారణగా ఏమి చెప్పగలరు, ఎలా చెప్పగలరు? పైగా, రాముడు ఏ కాలి బాటలవెంట పయనించాడో తెలియదు. ఆయన తిరిగిన ప్రదేశాలు చాలా వరకు ఈనాటి మధ్యప్రదేశ్‌కు చెందిన వనడం నిజమే. అందువల్లనే రామాయణానికి సంబంధించిన స్థలపురాణాలు మధ్యప్రదేశ్‌లో బహుళ ప్రచారంలో వున్నాయి. అయితే, ఇట్టి పురాణాలు ఇంద్రానా ప్రాంతంలో ప్రచారంలో లేవు, అమరకంటక ప్రాంతంలో సయితం లేవు. పైగా, రామాయణంలోగల లవణసముద్రం

ప్రసక్తిని త్రోసివేయడానికి ఎంతమాత్రం వీలులేదు. సముద్రం మధ్య లోనే లంక బహుశా వుండేది. ఆ సముద్రం బంగాళాఖాతం కావచ్చు. ఒరిస్సా లోని మహానది ముఖద్వారానికి, ఆంధ్రప్రదేశ్ లోని గోదావరి ముఖద్వారానికి మధ్యలో ఎక్కడనో ఒకచోట అది వుండేదని అనుకోవచ్చు. హనుమంతుడు లంకకు వెళ్ళింది మహేంద్రగిరి నుంచి. గంజాం సమీపంలోగల తూర్పు కనుమలలో ఒక భాగాన్ని ఇప్పటికి సయితం మహేంద్రగిరి అనే పిలుస్తారు. ఇంతేకాక, సీతాన్వేషణకై రాముడు తిరిగిన ప్రాంతాలలో శబరుల నివాసస్థానం వున్నది. ఇప్పటికి కూడా శబరజాతివారు ఒరిస్సాలో హెచ్చుగా వున్నారు. బస్తర్‌లో శబరి పేరుతో ఒక నది వున్నది. ఈ కారణా లన్నింటివల్ల రావణుని లంకకై చూడవలసింది మధ్య ప్రదేశ్‌లో కాదని, ఆంధ్ర, ఒరిస్సారాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలలోనే అని మిశ్రా గట్టిగా నమ్ముతున్నాడు.

"సీతాన్వేషణకై వెళ్ళిన వానరబృందం కాని, లంకపై దండెత్తిన రాముడు కాని వింధ్యపర్వత ప్రాంతాలను దాటినట్టు రామాయణాన్ని నిశితంగా పరిశీలించిన వారెవ్వరు అనలేరు. మరి మీ వాదం నిజమైతే, ఆంధ్ర ఒరిస్సాల సరిహద్దుకు వింధ్యపర్వతాలను జరపవలసి వస్తుంది" అనే ఆక్షేపణకు మిశ్రా సమాధానమిది: ఓడ్రులు వింధ్యప్రాంతం ప్రజలని మత్స్యపురాణం చెబుతున్నది. ఛోటానాగపూర్‌లోని కొండలను ప్రాచీనకాలంలో వింధ్యపర్వతాలని అనే వారట. అందువల్ల వింధ్య పర్వతాలు మహేంద్రగిరి వరకు విస్తరిస్తున్నట్టుగా ఒకప్పుడుభావించేవారని ఎందుకు అనుకోరాదు?[23]

మిశ్రాతో, పూర్తిగా కాకపోయినా, చాలావరకు ఏకీభవిస్తున్న పరిశోధకుడు ఆర్.ఎన్.చక్రవర్తి. అంగదుని నాయకత్వాన సీతాన్వేషణకై వెళ్ళిన వానరులు ఋక్షబిలంలో ప్రవేశించి, కొంతదూరం వెళ్ళగా, వారికి అతిసుందరమైన ఒక లోయ తగులుతుంది. ఇది మన విశాఖజిల్లాలోని అరకులోయ అని చక్రవర్తి నమ్మకం. ఇదే స్వయంప్రభ అనే తాపసి నివాసస్థానం (కిష్కింధాకాండ, 50-51 సర్గలు). అరకులోయకు వాయువ్యంగా దాదాపు నూరుమైళ్ళలోగల గోండ్ ప్రాంతమే వానర రాజ్యం. అరకులోయకు ఈశాన్యంగా నూరుమైళ్ళలోపల మహేంద్రగిరి వున్నది. ఈ పర్వతానికి తూర్పుగా అనతిదూరంలో తూర్పుసముద్రం (బంగాళాఖాతం) వున్నది. దానికి ఉత్తరదిశలో రెండువందల మైళ్ళ దూరాన మలయగిరి వున్నది. ఈ మహేంద్ర, మలయగిరులమధ్య మహానది లోయ వున్నది. ఈనాటి ఒరిస్సా మ్యాపులో ఈ కొండలను, ఈ లోయను చూడవచ్చు. "మరి ఆ మ్యాప్‌లో

లంక లేదేమి?" అనే ప్రశ్న (చక్రవర్తి దృష్టిలో) అర్థరహితం. రామ, రావణులు ఈనాటివారో, నిన్నటివారో కారు; కొన్ని వేల సంవత్సరాల క్రితంవారు. ఈ దీర్ఘ కాలంలో సముద్రం ఎంతగానో ముందుకు కోసుకొని వచ్చివుండవచ్చు. అందువల్ల రావణుని లంక కనబడకుండా పోయివుండవచ్చు.[24]

లంకకోసం చూడవలసింది జబల్పూర్ పరిసరాలలో కాదన్న తీర్మానానికి చేసుకొన్న మీదట, దానికై అమరకంటక, బస్తర్ ప్రాంతాలమధ్య అన్వేషించాలన్న నిర్ణయానికి సంకాలియా వచ్చాడు. జబల్పూర్ నాకు కొత్త కాదు. నిజానికి, అది నా జన్మస్థానం. మధ్యప్రదేశ్‌లోని కట్నీ, సత్నా వగైరాలు నాకు తెలిసిన పట్టణాలే. అయితే, రామాయణానికి ఈ పట్టణాలతో, లేదా ఈ ప్రాంతాలతో ఏపాటి సంబంధం కలదన్న దృష్టితో వాటిని నేను చూడలేదు. అందువల్ల నేను గట్టిగా ఏమీ చెప్పలేనుగాని, జన స్థానం, కిష్కింధ, లంక మొదలైనవి ఈనాటి మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్, ఆంధ్రప్రదేశ్‌ల ఉమ్మడి సరిహద్దుల ప్రాంతాలలో, ప్రత్యేకించి ఛోటా నాగపూర్ ప్రాంతంలో వుండేదన్న నమ్మకం అంతకంతకు నాలో బలపడుతున్నది. ఛోటానాగపూర్‌లో ఇప్పటికి కూడా నూటికి 38.04 వంతులు అడవులమయం. ఇది ముండా, ఓరోన్, సంతాల్, హో, అసుర మొదలైన ఆదివాసులకు ప్రధాన కేంద్రం. కొన్ని కొన్ని ప్రాంతాలలో ఈ ఆదివాసులు మొత్తం జనాభాలో నూటికి దాదాపు 66 వంతులవరకున్నారు.[25] ఏమైనా, ఒక్కటిమాత్రం ముమ్మాటికీ నిశ్చయం. రాముడు నర్మదానదిని దాటలేదు. రామభక్తులకు, భజనపరులకు, సీతారాముల బొమ్మలకు ఏడాది కొకసారి పెళ్ళిచేసి, స్వర్గద్వారాలు తమకోసం తెరుచుకొని వుండగలవనివిశ్వసించే ప్రబుద్ధులకు ఎవరేమి చెప్పినా, ఎంతగా చెప్పినా, అది కంఠశోషమాత్రమే కాగలదు. అందువల్ల వారిని ఉద్దేశించి కాక, ఆలోచనాశక్తిని కొంతగానైనా మిగుల్చుకొన్న వారిని ఉపలక్షించి, ఈ నాటి శ్రీలంక రావణునిలంక కావడానికి ఎంత మాత్రం వీలులేదని వ్రాసిన టి. అమృతలింగం వాదంలోని కొన్ని ముఖ్యాంశాలను నివేదించగోరుతున్నాను. ఈ అమృతలింగం పరమశివ అయ్యర్ తమ్ముడు. ఆదిలో ఈయన గొప్ప రామభక్తుడు. ఒక పుణ్యగ్రంథంగా రామాయణాన్ని పారాయణ చేస్తూ వుండేవాడు. అన్నగారి పుస్తకాన్ని చదివినమీదట ఆలోచనలో పడి, అన్నను మించి ఈయన చాలా దూరం వెళ్ళాడు. ఈయనకు రాముడు దేవుడు కాడు, మనిషి. మాత్రమే. మనిషిగానైనా, భరతుని తర్వాతనే, ఇంతేకాక, రామాయణవ్యాఖ్యాత లంటే ఈయనకు చెడ్డ కంటగింపు; గోవిందరాజు అంటే మరింత ఒళ్లుమంట.

విష్ణ్వవతారంగా రాముని చిత్రించడానికి, శైవంపై వైష్ణవం ఆధిక్యతను నెలకొల్పడానికి గోవిందరాజు సిగ్గుబిడియాలు ఎంత మాత్రం లేకుండా ఎంత నాన్ సెన్స్ వ్రాశాడో అమృతలింగం వివరించాడు. రామాయణాన్నిగురించి వ్రాసినవారిలో ఇంత నిష్కర్షగా, ఇంత నిర్భయంగా ఇంతగా నిజం ముఖాన్ని చూస్తూ వ్రాసినవారు నాకు కనబడలేదు. ఈయన "రామాయణ విమర్శ" ఈయన జీవితకాలంలో అచ్చు కాకపోవడం శోచనీయం. అటుతర్వాతనైనా నిర్దుష్టంగా కాక, కొన్ని వేల అచ్చు తప్పులతో దాని ప్రచురణ జరగడం మరింత శోచనీయం.[26]

రామాయణంలోని ప్రాంతాలతో, దానిలోని సంఘటనలతో సాలవృక్షాని * కున్న ప్రాధాన్యాన్ని సంకాలియా కంటె చాలా ముందుగా గుర్తించినవాడు అమృత లింగం. ఆయన వివరించినట్టు, బాలకాండ అయిదవసర్గ అయోధ్యను "సాలమేఖ లామ్" అని వర్ణిస్తున్నది; రాజగృహంనుంచి అయోధ్యకు తిరిగి వస్తున్నప్పుడు భరతుడు సాలవనాన్ని దాటుతాడు (అయోధ్యాకాండ, 71వ సర్గ); బంధువర్గాన్ని పురోహిత బృందాన్ని, సైనిక దళాలను వెంటబెట్టుకొని చిత్రకూట పర్వతాన్ని భరతుడు సమీపిస్తున్న ఘట్టంలో బయల్దేరిన పెద్ద రొదను విని, అందుకు కారణాన్ని కనుగొనవలసిందిగా రాముడు చెప్పినప్పుడు లక్ష్మణు డెక్కింది సాలవృక్షాన్నే (అయోధ్యాకాండ, 96వ సర్గ); రామునితో ఖరదూషణలు జరిపిన యుద్ధంలో వారు సాలవృక్షాలను ఆయుధాలుగా ఉపయోగించారు. (ఆరణ్యకాండ, 25వ సర్గ); ఋశ్యమూకలో రామునితో స్నేహంచేసినప్పుడు సుగ్రీవుడు ఒక సాలవృక్షం శాఖను విరిచి, దాని ఆకులపై కూర్చుండవలసిందిగా తన కొత్త మిత్రుని ఆహ్వానిస్తాడు. (కిష్కింధా కాండ, 5వ సర్గ); సుగ్రీవునికి తన ప్రతాపాన్ని ప్రదర్శించడానికి రాముడు ఏడు సాలవృక్షాలను ఒకే బాణంతో చీల్చుతాడు. (కిష్కింధాకాండ, 12వ సర్గ); వాలి సుగ్రీవులయుద్ధం సాలవృక్షాలతోనే (అదే కాండ, అదే సర్గ); అశోక వనంలో హనుమంతుడు చూచిన చెట్లలో సాలవృక్షాలున్నాయి. (సుందరకాండ, 14వ సర్గ); లంకాదహనానికి ముందు రావణుని సేనానులతో తాను చేసిన యుద్ధంలో ఆంజనేయుడు ఆయుధంగా వినియోగించింది సాలవృక్షాన్నే (సుందరకాండ, 46వ సర్గ); రామాయణంలో మరి వెక్కు తావులలో సయితం సాలవృక్షం ప్రసక్తి వున్నది.[27] వావిళ్ళవారి రామాయణంలో దీన్ని "మద్దిచెట్టు"గా తెనిగించారు. "సూర్యరాయాంధ్ర నిఘంటువు"ను చూడగా "మద్ది" అనే మాటకు అది చెప్పిన ఒక అర్థం "సాలము" అని. కాని, మద్దిచెట్టు సాలవృక్షం కాదు. మద్దిలో చాలా

---

* వృక్షశాస్త్రంలో దీని పేరు Shorea robusta

రకాలున్నట్టు చెప్పి, "ఇనుమద్ది", "పూడుమద్ది", "అర్జునము", నదీసర్జము" అనే వాటిని నాల్గింటిని సి.పి.బ్రౌన్ పేర్కొన్నాడు.[28] మద్ది, "తెల్లమద్ది, నల్లమద్ది, కర్పూరపుమద్ది యని త్రివిధభేదములు గలది" అని దేవిడి జమీందార్ వ్రాశాడు .[29]వృక్షశాస్త్రంలో తెల్లమద్దివేరు "టెర్మినాలియా అర్జున".[30] అయినా, సాలవృక్షాన్ని మద్దిచెట్టుగా పేర్కొన్నవారికి ఆ రెండు చెట్లలో దేన్ని గురించీ తెలియదని మనం అనుకోవాలి.

మద్ది దక్షిణ భారతంలో సమృద్ధిగా పెరుగుతుంది; మధ్య భారతంలో పెరుగుతుంది; ఉత్తర భారతంలో అయోధ్యవరకు పెరుగుతుంది. అయోధ్యకు ఆవలగా ఉత్తరదిశలో, పంజాబ్‌లో, పశ్చిమోత్తర భారతంలో ప్రత్యేకించి శ్రద్ధ చూపితేనే తప్ప, అది తేలికగా యెక్కరాదు.[31] కాగా, సాలవృక్షం హిమాలయాలలో పెరుగుతుంది; గంగ, దాని ఉపనదుల లోయలలో పెరుగుతుంది; మధ్య భారతంలో పెరుగుతుంది; సంతాల్, రీవా, ఛోటానాగపూర్, ఒరిస్సాలలో పెరుగుతుంది; ఉత్తర సర్కార్లలో కూడా పెరుగుతుంది. కాని, విశాఖజిల్లాలలో పాలకొండ అనే పర్వత పంక్తికి దక్షిణదిశలో అది పెరగదు .[32] విశాఖజిల్లాకు దిగువ సాలవృక్షమే లేనప్పుడు ఈనాటి హంపి-విజయనగర ప్రాంతంలో కిష్కింధ వుండేదని వి.ఆర్.రామచంద్ర దీక్షితార్ వ్రాయడం తప్ప కాదా? .[33] పార్జిటర్, దీక్షితార్‌లు చెప్పినట్టు కిష్కింధ బళ్ళారి జిల్లాలోనే వున్నా, హంపి- విజయనగరం వద్ద కాక, తుంగభద్ర ఎడమగట్టుకై ఆనెగొందెలో వుండేదని డి.ఆర్. భండార్కర్ తీర్మానించడం బేసబబు కాదా?[34] ఈనాటి శ్రీలంకే ఒకనాటి రావణునిలంక అని హేమచంద్రరాయ్ చౌధురి నొక్కిచెప్పడం "పదుగు రాడుమాట"నే వల్లించడం కాదా?[35] వీరు ముగ్గురూ హిస్టరీ ప్రొఫెసర్లుగా పనిచేసినవారే! అయితే మాత్రమేమి? రైతుగా కొంత కాలం, ప్లీడరుగా కొంతకాలం పనిచేసిన అమృతలింగం చూపినపాటి హేతుదృష్టిని వీరు చూపలేక పోయారు! సాలవృక్షం పెరగనిచోటు కిష్కింధ కాబోదని, లంక కాబోదని వీరికి అనుమానమైనా తోచలేదు. ఇంద్రానా పర్వత ప్రాంతం లంక కావడానికి వీలు లేదని ముందు ద్వారకాప్రసాద్ మిశ్రా, తర్వాత సంకాలియా చెప్పడానికి ఒక్క ప్రబలకారణం అక్కడ సాలవృక్షాలు లేక పోవడమే!

భక్తునివలె రామాయణాన్ని పారాయణం చేయడాన్ని విరమించి, సత్యాన్వేషిగా దాన్ని పఠించడాన్ని, పరిశీలించడాన్ని ప్రారంభించినందునే "ఇది హేమంతర్తువు వర్ణన దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఏమిలే" దని రామభక్తులు భావించే ఒక సర్గ

లోగల (ఆరణ్యకాండ, 16వ సర్గ) ఒకే ఒక మాటలో -- "పడమటిగాలి" అనే మాటలో - ఒక భౌగోళికసత్యాన్ని అమృతలింగం గుర్తించగలిగాడు.[35] మనది సువిశాలదేశం; దాన్ని ఒక ఉపఖండం అనవచ్చు. అందువల్ల మన దేశంలోని అన్ని ప్రాంతాలలో ఋతుపనాలు ఒకే రీతిగా వుండవు. మన తెలుగుగడ్డపై పడమటిగాలి మండు వేసవిలో, ముఖ్యంగా రోహిణీకార్తెలో వీస్తుంది. వడగాలి, వడగాడుపు అనేవి దానికి మరి రెండు పేర్లు. ఒక్కొక్క యేడు అది నిప్పులను చెరగడం కద్దు. ఈ "పడమటి గాడుపు", లేదా "గాడ్పు"కు "పడమటి దిక్కునుంచి వచ్చు గాలి", "వేడిగాలి" అని సూర్యరాయాంధ్రనిఘంటువు అర్థాలను చెప్పి; "జాహ్నవీ మాహాత్మ్యము" నుంచి "పడమటి గాడుపుల్ విసరె బాటలము ల్వికసించె" అనే ప్రయోగాన్ని చూపుతున్నది. మన తెలుగుసీమకే కాక, వింధ్య దక్షిణప్రాంతం మొత్తానికి పడమటిగాలి వేడిగాలి కాగా, వింధ్యకు ఉత్తరాన అది చల్లనిగాలి. అక్కడ అది వీచేది గ్రీష్మంలో కాదు, హేమంతంలో. అందువల్లనే హేమం తర్తువు ప్రశంసచేస్తూ, "స్వభావంవల్లనే చల్లనైన పశ్చిమవాయువు, మంచుచే మరింత చల్లనైనందున, రెండింతలు చల్లదనంతో వీస్తున్న" దని లక్ష్మణు డంటాడు. అతడు ఈ మాట లన్నది పంచవటివద్ద. అది వింధ్యపర్వతాలకు ఉత్తరంలో కాక, దక్షిణంలో వుంటే, హేమంతంలో పడమటిగాలి వీచేదిగాదు; అది చల్లగా వుండేదీ కాదు. మన చరిత్రకారులకు, ఇతర పరిశోధకులకు ఎందువల్లనో ఇట్టి విషయాలు సక్రుత్తుగా తప్ప స్ఫురించవు. వారి సాంప్రదాయిక విశ్వాసబలమే ఇందుకు ఒక కారణం కావచ్చు. ఏమైనా, అమృతలింగంవలె ఇతర రామాయణ విమర్శకులు ఒకసారి ఇంపీరియల్ గెజిటీర్‌ను తిరగవేసివుంటే ఉత్తర, దక్షిణ భారతాలలో పశ్చిమపవనం స్వభావంలోగల ఈ వ్యత్యాసాన్ని తెలుసుకొనగలిగి వుండేవారు.[36] రామాయణానికి వింధ్య దక్షిణ ప్రాంతంతో ఏమీ సంబంధంలే దనడానికి ఈ పశ్చిమ వాయువు ప్రసక్తి ఒక్కటే నిజానికి చాలదా?

ఇది చాల దనేవారికి అమృతలింగం మరికొన్ని సాక్ష్యాధారాలను చూపిస్తు న్నాడు. ఇప్పటి శ్రీలంకనే రావణుని లంకగా విశ్వసించేవారు రాముడు శివలింగాన్ని రామేశ్వరంలో స్వయంగా ప్రతిష్ఠించినట్టు చెబుతారు. కాని, రామేశ్వరం క్రీస్తు తర్వాత పది, పదమూడు శతాబ్దాలమధ్య ఆవిర్భవించిన క్షేత్రం. మహాభారతంలో కనీసం మూడు చోట్ల పుణ్యక్షేత్రాల పట్టిక లున్నాయి. ఈ మూడింటిలో రామేశ్వరం పేరు కనబడదు. కంచి, శ్రీరంగం, మదురై, చిదంబరం, తిరు పతి మొదలైన వాటి ప్రసక్తి సయితం వాటిలో కానరాదు. దక్షిణ భారతానికి

సంబంధించినంత వరకు పశ్చిమసముద్రతీరంలోని ఒక దీవిలోగల గోకర్ణక్షేత్రాన్ని, "సముద్రతీరంలోని కన్యాతీర్థాన్ని" మాత్రమే మహాభారతం పేర్కొంటున్నది. ఈ "కన్యాతీర్థం" ఇప్పటి "కన్యాకుమారి" అయివుండాలి. రామాయణాన్నివలె భారతాన్ని కూడా పెంచి పెంచి, మహాభారతంకింద మార్చారు. దాన్ని పెంచడం క్రీస్తుశకం అయిదవ శతాబ్దివరకు జరిగింది. అయినా, మహాభారతంలో రామేశ్వరం ప్రసక్తి లేదంటే అది క్రీస్తుశకం అయిదవ శతాబ్దినాటికి ఉద్భవించలేదని తీర్మానించుకోవలదా? అయిదవ శతాబ్దం మాట విడిచిపుచ్చండి; పది, పదకొండవ శతాబ్దాలలో పుట్టిన పురాణాలు సయితం రామేశ్వరం పేరెత్తడం లేదు. అందువల్ల పదకొండు, పద మూడు శతాబ్దాల మధ్యకాలంలో చోళరాజులు రామేశ్వర దేవాలయాన్ని నిర్మించారని విధిగా తీర్మానించుకోవాలి. చోళరాజులు శైవులు. రామేశ్వరంలో శివలింగాన్ని వారు ప్రతిష్ఠ చేయించినందున, విష్ణుభక్తులు మరింత దక్షిణానికి వెళ్ళి, ధనుష్కోటిని వైష్ణవక్షేత్రంగా పెంపొందించారు.

అమృతలింగం వాదం ప్రకారం క్రీస్తుశకం పది, పదమూడు శతాబ్దాలమధ్య తమిళులు సముద్రాంతర దేశాలను జయించారు. సింహళం ఉత్తరభాగంలో, దాని ఈశాన్యభాగంలో వారు తమ వలసకేంద్రాలను నెలకొల్పారు. అప్పటిలో వారి ప్రాబల్యం త్రింకోమలీవరకు విస్తరించింది. త్రికూటకు, త్రింకోమలీకి వున్న ధ్వని సామ్యంవల్లనే రావణుని త్రికూటపర్వతం సింహళంలో వుండేదన్న భ్రమ ప్రబలి వుండవచ్చు. అయితే, రామాయణం ప్రకారం త్రికూటపర్వతం లంక అంచులోనే (కోస్తాపైనే) వుండాలి. కాని, ఈనాటి శ్రీలంకలో ఉత్తరతీరం నుంచి దాదాపు నూరుమైళ్ళు వెళ్ళినమీదటనే, అనురాధపురాన్ని చేరిన మీదటనే, మనకు మొట్ట మొదటి పర్వతం తగులుతుంది. అయినప్పుడు ఈనాటి శ్రీలంకను రావణుని లంకగా పరిగణించడం రామాయణానికి విరుద్ధంగా వెళ్ళడమే కాదా?

మానవల్లి రామకృష్ణకవి పరిష్కరించి ప్రచురించిన "కౌముదీ మహోత్సవం"[37] అమృతలింగంద్వృష్టికి రాలేదని అనుకోవాలి. లేకపోతే పంపాసరోవరం వింధ్యపర్వత ప్రాంతంలోనే వుండేదని చెప్పడానికి ఆ నాటకాన్ని ఒక సాక్ష్యాధారంగా ఆయన చూపించి వుండేవాడు. దాన్ని వ్రాసింది స్త్రీయో, పురుషుడో స్పష్టంగా చెప్పలేకున్నారు. రామకృష్ణకవి సమేతంగా పండితులలో పెక్కుమంది దాన్ని విజ్జిక రచనగా భావిస్తున్నారు. తక్కిన వారిలో కొందరు దాన్ని అనంత నారాయణ రచనగా పరిగణించగా, మరికొందరేమో "కాదు, నీలకంఠకవి దాన్ని వ్రాశా"డని వాదిస్తున్నారు. ఏమైనా, నిశ్చయంగా అది ప్రాచీనరచన. శైలినిబట్టి అది

క్రీస్తుశకం అయిదవ, లేదా ఆరవ శతాబ్దం నాటి రచనకావచ్చునని మొత్తంపై అందరు పండితులు అంగీకరిస్తున్నారు. పంపాసరోవరం వింధ్యపర్వత ప్రాంతంలో వుండేదని "కౌముదీమహోత్సవం" నిర్ద్వంద్వంగా పేర్కొంటున్నది. ఆ సరోవరానికి సమీపంలోనే వ్యాధకిష్కింధ వుండేదని అది స్పష్టంచేస్తున్నది. అక్కడికి చేరువలోనే "వింధ్య వాసిని" దేవాలయం సయితం వుండేదని అది వివరిస్తున్నది. పంపాసరోవరం, వ్యాధకిష్కింధ, వింధ్యవాసిని దేవాలయం - ఇవి బందాజిల్లాలోని చిత్రకూటు పర్వతానికి ఏమంత అధిక దూరంలోనివి కావటు.

"కౌముదీ మహోత్సవం" కిష్కింధవిషయమై చెబుతున్నదాన్ని వాయు, మార్కండేయ పురాణాలు బలపరుస్తున్నాయి. వాటి ప్రకారం "కిష్కింధకులు" అనే ఒక తెగవారు వింధ్యపర్వత ప్రాంతంలో నివసిస్తూవుండేవారు. కిష్కింధ ఉజ్జయినికి ఆగ్నేయంలో వున్నట్టు వరాహమిహిరుడు వ్రాయగా, అది పాంచలదేశానికి ఆగ్నేయంగా వున్నట్టు రాజశేఖరుడు చెప్పాడు. కాగా, సర్ అలెగ్జాండర్ కన్నింగ్‌హాం అభిప్రాయం ప్రకారం మనకు తెలిపిన గోదావరి కాక, చిత్రకూటు పర్వతానికి నైరుతిదిశలో తొమ్మిది మైళ్ళ దూరాన ఒక గుహలో పుట్టి "గుప్త గోదావరి" అనే ఒక సెలయేరు ప్రవహిస్తూవుండేది.[38] దీన్నిబట్టి, పంచవటి గోదావరీతీరాన నాసిక వద్ద కాక వింధ్యపర్వతపంక్తికి ఉత్తరదిశలో గల "గుప్తగోదావరి" గట్టున వుండేదని అనుకోవచ్చు.

లంకకోసమైనా మనం చూడవలసింది వింధ్యపర్వతాలకు దక్షిణప్రాంతంలో కాదని ఇటీవలి కాలంలో దొరికిన రెండు శాసనాలు సూచిస్తున్నాయి. వీటిలో ఒకటి క్రీస్తుశకం 1703 నాటి శాసనం. అందువల్ల దాన్ని పరిగణనలోకి తీసుకోనక్కరలేదు. పోతే, రెండవది క్రీస్తుశకం పదవ శతాబ్దం నాటి శాసనం. దాన్ని వేయించిన వాడు గుప్తరాజుల వంశానికి చెందిన సోమేశ్వరుడు. అతడు దాన్ని వేయించింది సువర్ణపురంలో. ఇప్పుడిది బస్తర్‌లోని సోన్‌పూర్. ఈ ప్రాంతం ప్రభువును "పశ్చిమలంకాధిపతి"గా ఈ శాసనం పేర్కొంటున్నది.[39]

తక్కిన విషయాలన్నింటిని విడిచి పుచ్చి, కేవలం సాంఘికాచారాలనే పరిగణనలోకి తీసుకొన్నా, కిష్కింధకాని, లంకకాని దక్షిణాద్రిలో వుండేవి కావని తీర్మానించుకోవాలి. హెచ్.డి. సంకాలియా[40] వివరించినట్టు, రామాయణం మూల రచయితకువలె, దానిలో ప్రక్షిప్తాలను ప్రవేశపెట్టినవారికి కూడా దక్షిణభారత ప్రజల ఆచార వ్యవహారాలు ఎంతమాత్రం తెలియవు. దీన్ని నిరూపించడానికి ఒకే ఒక తార్కాణం చాలునని చెప్పి, సంకాలియా ఉత్తర దక్షిణ భారతాలలో

ప్రాచీనకాలం, నాటి అంత్యక్రియలను వేర్కొన్నాడు. గోదావరికి దిగువ, మొత్తం దక్షిణభారతంలో, క్రీస్తుశకం మూడవ శతాబ్దికిపూర్వం ఖననం తప్ప, దహనం లేదు. అయినా, వాలి దహనక్రియ వర్ణనకు కిష్కింధకాండలో ఒక సర్గకు సర్గ (25వ సర్గ) పూర్తిగా ప్రత్యేకించబడింది!

ఇంతకు మరింత వ్రాసినా, రామభక్తుల విశ్వాసాలు మారబోవని నాకు తెలుసు. పోతే, విచక్షణాదృష్టిని, ఆలోచనాశక్తిని తమ మత మౌఢ్యాలకు బలి పెట్టి నివారు జనస్థానంవలె, పంచవటివలె, కిష్కింధవలె లంక సయితం వింధ్య పర్వతపంక్తికి, నర్మదానదికి ఉత్తరదిశలోనే ఎక్కడనో వుండేదన్న తీర్మానానికి వచ్చివుండాలి. ఏమైనా, కొత్త విషయాలను మరి చెప్పడానికి ప్రయత్నించక, ఇంతవరకు చెప్పినవాటిని సంక్షిప్తంగా పునశ్చరణ చేసి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను.

(1) రెండు, రెండున్నరవేల సంవత్సరాలనాటి గ్రీక్ రచయితలు సింహళాన్ని "తామ్రపర్ణి" గా వేర్కొన్నారు, లంకగా కాదు.

(2) అశోకుని కాలంనాటి భారతీయులకు తెలిసింది కూడా "తామ్రపర్ణి" మాత్రమే; లంక కాదు.

(3) క్రీస్తుశకం ఆరవశతాబ్దికి చెందిన భారతీయ ఖగోళశాస్త్రజ్ఞుడు వరాహమి హిరుడు లంకను, సింహళాన్ని రెండు విడి విడి ద్వీపాలుగా వేర్కొన్నాడు. ఇంతేకాక, కిష్కింధ ఉజ్జయినికి ఆగ్నేయదిశలో వుండేదని ఆయన వ్రాశాడు; పదవశతాబ్దికి చెందిన విఖ్యాతకవి, నాటకకర్త రాజశేఖరుడు అది పాంచాలదేశానికి ఆగ్నేయదిశలో కల దన్నాడు.

(4) "లంక" తెలుగులోనుంచి సంస్కృతంలోకి వెళ్ళిన మాట అని భాషా శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

(5) సీతాన్వేషణకై అంగదుని నాయకత్వాన బయల్దేరిన వానరబృందం కాని, రాముని నాయకత్వాన లంకపై దండెత్తిన వానరసేనలు కాని, వింధ్య పర్వత పంక్తిని దాటినట్టు, నర్మదానదిని దాటినట్టు రామాయణం చెప్పడం లేదు.

(6) సాలవృక్షాలులేని చోట కిష్కింధ వుండడానికి వీలులేదు, లంక వుండడానికి వీలులేదు. గోదావరినదికి దిగువలో సాలవృక్షాలు పెరగవు.

(7) "కిష్కింధకులు" వింధ్య ఉత్తరప్రాంతానికి చెందిన వారని వాయు,

మార్కండేయ పురాణాలు చెబుతున్నాయి.

(8) వింధ్యకు దక్షిణాన పడమటిగాలి వడగాడ్పుకాగా, ఉత్తరాన అది చల్లని గాలి. పంచవటివద్ద పడమటిగాలిని చల్లనిగాలిగా రామాయణం వేర్కొంటున్నది కాబట్టి, అది వింధ్యకు ఉత్తరదిశలో గల ప్రాంతమై వుండాలి.

(9) క్రీస్తుశకం అయిదవ, లేదా ఆరవ శతాబ్దానికి చెందిన "కౌముదీ మహోత్సవ నాటకం" కిష్కింధ, పంచవటి మొదలైన వన్నీ వింధ్య పర్వత ప్రాంతంలో వున్నట్టు వివరిస్తున్నది.

(10) క్రీస్తుశకం అయిదవ శతాబ్దివరకు మార్పులు చేర్పులు జరుగుతూ పోయిన మహాభారతంలో రామేశ్వరం ప్రసక్తి లేదు; దానిలో ధనుష్కోటి ప్రసక్తి సయితం లేదు.

(11) ఉత్తర తీరాన త్రికూటపర్వతంపై లంకాపురి వున్నట్టుగా రామాయణం వివరిస్తున్నది. సింహళం ఉత్తరతీరంలో ఒక్క పర్వతమైనా లేదు.

సింహళం రావణుని లంక కాదనడానికి ఇన్ని కారణాలు కనిపిస్తున్నా, వీటిని కాదనే వారివిషయంలో నేను చేయగలిగింది "అయ్యలారా! మీకు పదివేల నమస్కారాలు!" అంటూ నా దారిని నేను ముందుకు సాగడమే! !

*

రాక్షసు లెవరు?

ఋగ్వేదంలో, అధర్వవేదంలో, మరికొన్ని వైదిక గ్రంథాలలో రాక్షసుల ప్రసక్తి విశేషంగా వున్నది. దీన్ని అవినాశచంద్రదాస్ "ఋగ్వేదిక్ కల్చర్"[1] అనే గ్రంథంలో క్రోడీకరించారు. ఆయన క్రోడీకరణప్రకారం, రాక్షసులు కుక్కల, రాబందుల, గుడ్లగూబల అక్కృతులలో వుంటారు. ఒక చోటునుంచి మరొక చోటుకు పిట్టలవలె వారు ఎగిరి పోతూవుంటారు. సోదరుని రూపం, భర్తరూపం, ప్రియుని రూపం ధరించి, స్త్రీలను సమీపించి, వారి సంతానాన్ని రాక్షసులు నాశనం చేస్తూ వుంటారు. కపిరూపంలో, లేదా శునకరూపంలో స్త్రీలకై వారు పొంచి వుండడం కద్దు. గర్భవతులై వున్నప్పుడు, ప్రసవసమయంలో స్త్రీలకు మరింత ప్రమాదకరంగా వారు పరిణమిస్తారు. పశువక్ష్యాదుల రూపాలను అప్పుడప్పుడు ధరించినా, మానవాకృతిలోనే వారు అధికంగా వుంటారు. అయితే, ఏదో ఒక వైకల్యం తప్పదు, వికారం తప్పదు, వైపరీత్యం తప్పదు. వారిలో కొందరికి మూడుతలలు, కొందరికి రెండు నోళ్ళు, కొందరికి నాలుగు కళ్ళు, కొందరికి ఎలుగుగొడ్డు మెడ, కొందరికి అయిదు కాళ్ళు, కొందరికి చేతులపై కొమ్ములు! యజ్ఞయాగాదులను రాక్షసులు ధ్వంసం చేస్తారు; దుర్భాషలకు, దుశ్చర్యలకు వారికి పెట్టింది పేరు. ఆవు పొదుగు నుంచి పాలను దొంగచాటుగా వారు తాగివేస్తారు, పచ్చి మాంసం

తింటారు. నరమాంసాన్ని మరింత పసందు చేస్తారు. నరులను చంపి తినడానికై వారిలో ప్రవేశిస్తారు. ఒక్క అగ్ని దేవుడంటేనే రాక్షసులకు చెడ్డ భయం. రాక్షసుల పీడ తప్పించడానికై అగ్నిదేవునికి చాలినవాడు మరి లేడు.

రాక్షసులకు జ్ఞాతులుగా చెప్పదగువారు పిశాచులు, వారు శవాలను తింటారు. ఋగ్వేదంలో పిశాచులప్రసక్తి ఒకే చోట వున్నా, అధర్వవేదంలో, తైత్తిరీయ సంహితలో వారు పెచ్చుగా తారసిల్లుతారు. రాక్షసులకువలె పిశాచులకు "క్రవ్యాదులు" పర్యాయపదం కావడం ఉభయవర్గాలవారికి నరమాంసం పట్లగల ప్రీతివల్లనే.

"అసురు" లనేవారు రాక్షసులకు, పిశాచులకు అన్నలవంటివారు. అసురులకు వైరం దేవతలతో, రాక్షసులకు విరోధం నరులతో, పిశాచులకు వైమనస్యం పితరులతో, వీరినుంచి పీడతొలగించడానికే శవాలను దహనం చేయడం. పైగా, మృతదేహాన్ని దహించివేస్తే, చెఱనుంచి బయటపడిన తీరులో, ఆత్మ పుణ్యలోకాలకు సునాయాసంగా చేరుకోగలుగుతుంది! అన్నెం పున్నెం తెలియనివారు కాబట్టి, శిశువుల మృతదేహాలను చితిపై పెట్టనక్కరలేదు; అరిషడ్వర్గాలను జయించినవారు కాబట్టి, సర్వసంగపరిత్యాగులకు సయితం దహన సంస్కారంతో నిమిత్తం లేదు.

రాక్షసులకు, పిశాచులకు జ్ఞాతులస్థానానికి అసురులను దిగదీయడానికిముందు మిత్ర, వరుణులను అసురులుగా ఆర్యులు ప్రశంసించారు. ఈ దేవత లిద్దరిని ఏకం చేసి, "మిత్ర-వరుణ" అనే పేరుతో కొన్ని చోట్ల సంస్తవించారు. "అసుర" అనే పదాన్ని దుష్టార్థంలో ఋగ్వేదంలో ప్రయోగించింది (రమేశ్ చంద్రదత్ వివరించి నట్లు)[2] దాని చిట్టచివరి మండలంలోనే, ఆర్యులలో ఇండియాకు చేరిన శాఖవారికి "అసుర" శబ్దం దుష్టమైనదిగా మారిపోయిన తర్వాత కూడా ఇరాన్‌లో సిరపడిన శాఖవారికి "అహుర" అనే పేరుతో అసురుడు దేవాధిదేవుడుగానే నిలిచాడు[3] (ఇరానియన్ దేశస్థులు "స"ను "హ" గా పలుకుతారు. తమకు తెలిసిన భారత దేశాన్ని-సప్తసింధు ప్రాంతాన్ని వారు "హప్తహిందు"అనే వారు. "ఇండియా" అనే మాట ఆ "హప్తహిందునుంచి" వచ్చినట్టిదే.) అనంతప్రసాద్ బెనర్జీ - శాస్త్రి వాదాన్ని ఆమోదిస్తున్నవారు ప్రస్తుతం దాదాపుగా లేరుగాని, దాని ప్రకారం ఇండియాకు తొలిగా వలసవచ్చిన ఆర్యులు తమ వరుణదేవుని చలవతో సముద్రమార్గంవెంట వచ్చారు. వారు వచ్చింది అసీరియానుంచి కాబట్టి. వారికి"అసురు" అనే పేరు వచ్చింది; వారు నిర్మించిన అసురనాగరికతే హరప్ప, మొహెంజదారోలు ప్రధాన కేంద్రాలుగా సింధులోయలో పరిఢవిల్లింది. ఆయన

చేసిన ఈవాదం పట్ల ఆసక్తిగలవారు "అసుర ఇండియా"[4] అనేపేరుతో ఆయన వ్రాసిన గ్రంథాన్ని చదవవచ్చు.

అసురులు ఆర్యజాతికి చెందిన ఒక శాఖవారైనప్పటికీ, రాక్షసులు మాత్రం నిశ్చయంగా ఏదో ఒక జాతికి, లేదా దాని శాఖకు చెందిన ప్రజలు ఎంత మాత్రం కారు. ఇదే మాట పిశాచులకు వర్తిస్తుంది.[5] పరజాతులవారిపట్ల ఆర్యుల వైర విద్వేషాలనుంచి, వారి భయవిభ్రాంతులనుంచి పుట్టుకువచ్చినవారే రాక్షసులైనా, పిశాచులైనా. వేదకాలంనాటి ఆర్యులు అంతకు పూర్వమే ఇక్కడ స్థిరపడిన వివిధ జాతులవారితో హోరాహోరిగా సంఘర్షించ వలసివచ్చింది. ఆయుధబలంలో ఆధిక్యం తమదే, యుద్ధపద్ధతులలో పైచేయి తమదే. అయితే, సంఖ్యాబలం తక్కువ. అందువల్ల పైకి ఎంత ధైర్యంగా కనబడినా, లోలోపల భయం వారిని పీడిస్తూనే వుండేది. ఆ భయాన్ని తగ్గించుకొనడానికి ముప్పొద్దుల వారు సోమరసాన్ని సేవిస్తూ వుండేవారని అనుకోవచ్చు; ఆ భయాన్ని తొలగించుకొనడానికే "అసురుడు" గా తాము ఒకప్పుడు సంస్తవిస్తూవచ్చిన వరుణదేవుని వెనుకకు నెట్టి,* తమవలెనే కడవలకొలది సోమరసాన్ని గడగడ తాగి, కయ్యానికి కాలుదువ్వే ఇంద్రుని దేవాధి దేవునిగా ఎన్నుకొన్నారని కూడా అనుకోవచ్చు. చారిత్రక వ్యక్తులలో ఋగ్వేదం ఇంద్రుని పోల్చవలసినింది కాలిగ్యూలాతో. జెంఘిస్‌ఖాన్‌తో, ఆటిలాతో, నాదిర్ షాతో, హిట్లర్‌తో, ఏకోశానా అతడికి దయా దాక్షిణ్యాలు లేవు. గర్భవతుల సమేతంగా అనార్యజాతులకు చెదిన ఆబాలగోపాలాన్ని అతడు ఊచకోత కోసేవాడు. పురాలకు పురాలనే నేలమట్టం చేసి. "పురందరుడు" అనే బిరుదనామాన్ని అతడు గడించుకొన్నాడు. ఋగ్వేదకాలంలో "ఇంద్రుడు" అనే పేరుతో ఒక "వార్ లార్డ్" (యుద్ధనాయకుడు) వుండేవాడో, లేక తాము దేవాధి దేవునిగా ఎన్ను కొన్న ఇంద్రుని పేరుతో హత్యాకాండము ఋగ్వేదకాలంనాటి ఆర్యులు స్వయంగా కొనసాగించేవరో చెప్పలేము. ఏమైనా హేతుదృష్టితో, చారిత్రదృక్పథంతో ఋగ్వే దాన్ని పరిశీలించగలవారికి దానిలో కొట్టవచ్చినట్టు కానవచ్చేవి దార్శనికసత్యాలు కావు, హత్యల ప్రశంసలు, హంతకుల సంస్తవాలు మాత్రమే.

అవధు లెరుగని క్రౌర్యంద్వారా అన్యజాతులవారిని జయించ గొరినప్పుడు,

---

* "అసురు"నికి ఒక పర్యాయపదం "పూర్వదేవుడు". ఇంద్రుని పథమస్థానా నికి "ప్రమోట్" చేయడానికి ముందు ఆర్యులు వరుణుని దేవాధిదేవునిగా సంభావించేవారనడాన్ని ఇది సూచిస్తున్నది.

వారిని చిత్రవధ చేసి, వారి దేశాన్ని భుక్తంచేసుకొన గోరినప్పుడు, అజాతుల వారిని అసహ్యించుకోవాలి. కేవలం అసహ్యించుకొనడమైనా చాలదు, వారిపట్ల జుగుప్స పెంచుకోవాలి. ఇది మానవస్వభావం. ఇందుకు అనుగుణంగానే ఋగ్వేద కాలంనాటి ఆర్యులు ప్రవర్తించారు. తమతో పోల్చినప్పుడు ఇక్కడి అనార్య జాతులవారే అన్ని విధాల ఎక్కువ నాగరికులు. అయినా, లేనిపోని ఘనతను తమకు తామే ఆపాదించుకొని, ఇక్కడివారి రూపురేఖలను, వేషభాషలను, ఆచారవ్యవహారాలను, వారికి సంబంధించిన సమస్తాన్నీ నిరసించారు, నిందించారు. ఇక్కడి వారు నల్లనివారట; వారివి చొట్ట ముక్కులట. వారి భాష అయెమయమైనదట; వారు యజ్ఞయాగాదులను చేయరట; వారు శిశ్నదేవుని ఆరాధిస్తారట; ఏ విధంగా చూచినా, వారు నీచజనులట, నికృష్టమానవులట; మానవులుగా సంభావించడానికైనా తగనివారట!

ఆర్యులు వలసకు రావడానికి పూర్వం ఇక్కడ స్థిరపడినవారిలో నీగ్రోలున్నారు, నిషాదులున్నారు, కిరాతులున్నారు, ద్రావిడులున్నారు, వీరందరినీ కలగాపులగం చేసి, దాసులని, దస్యులని వీరికి ఆర్యులు నామకరణం చేశారు. "దాసుడు" అనే పదానికి క్రమంగా "బానిస" "శూద్రుడు" అనే అర్థాలేర్పడినాయి; "దస్యుడు" అనే దానికి "శత్రువు", "చోరుడు" అనే అర్థాలేర్పడినాయి. ఆర్యులు ఇక్కడికి చేరకముందే నీగ్రోలు (బహుశా నిషాదులచేతిలో) పరాస్తులై, న్యూగినీకి, ఫిలిప్పీన్స్‌కు, మలయా పీఠభూములకు, అండమాన్ దీవులకు తరలిపోయారు. ఇండియా నడిగడ్డపై ఈ నాటికే వారు సక్రుత్తుగా మిగిలింది కొచ్చిన్, తిరువాన్కూర్ కొండలలో, ఇంతే కాక, వైనాడ్ ప్రాంతంలోని ఇరులా తెగవారిలోను, నాగభూమిలోని అంగామా నాగజాతివారిలోని వారు చెదురుగా కనబడతారు.[6]

ఇక్కడ కాలూనడానికి కిరాతులపైకంటె, ద్రావిడులపై కంటె నిషాదులపై మరింత భీషణంగా మరింత దీర్ఘకాలంపాటు ఆర్యులు పోరాడవలసి వచ్చినట్టు అనుకోవాలి. ఈ కారణానే కావచ్చు- రాక్షసులుగా, పిశాచులుగా వారు వర్ణించిన వారిలో నిషాదుల కవళికలు పొచ్చుగా కనబడతాయి. ఇది నామాట కాదు; మౌలిక చింతన చేసిన మానవవికాసశాస్త్రవేత్త రామప్రసాద్ చాందా మాటలు[7] వైదిక వాజ్మయం నిషాదులుగా పేర్కొన్నవారు వింధ్యపరిసరాలలో, ఛోటానాగపూర్ ప్రాంతంలో, బస్తర్‌లో, ఒరిస్సాలో , ఆంధ్రప్రదేశ్ ఈశాన్యదిశలో నివసిస్తున్న మూండా, గోండ్, సవర, సంతాల్ , జువంగ్, కొర్వా, చెంచు, పర్జా, ఖోండ్ మున్నగు తెగలవారు; దక్షిణాదిలోని తోడాలు, బడగాలు మొదలైన

వారు.[8] ఇరుగు పొరుగువారితో సాహచర్యంవల్ల ఈ తెగలవారిలో క్కొందరు ఆర్య, ద్రావిడకుటుంబాల భాషలను (తమ తమ యాసలతో) మాట్లాడుతున్నా, తక్కినవారివి స్వభాషలే. వాటి పేర్లు- ముండారీ, హో, కొర్కు, సవర గడబ వగైరాలు

వేదకాలంనాటి ఆర్యులు ఉద్ధతి పౌరాణిక కాలంనాటికి సన్నగిలింది. అనాగరికులుగా వచ్చినవారికి, ఇక్కడికి చేరిన పిదప, నాగరికతావాసనలు కొంతవరకు అంటడమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఏమైనా పౌరాణిక కాలంనాటికి అన్యజాతులవారి విషయమై - ముఖ్యంగా నిషాదులవిషయమై - భయం వెరిగి నందువల్లమే కావచ్చు, రాక్షసులగురించి అతిగా కథ లల్లడం, అతి భీకరులుగా వారిని చిత్రించడం తటస్థించింది. రామాయణాన్నే చూడండి. దానిలోని రాక్షసులలో ఒకడు ఖరుడు (గాడెద), ఒకడు దూషణుడు (బండబూతులు తిట్టేవాడు), ఒకడు మకరాక్షుడు (మొసలి కన్నులవాడు), ఒకడు మహోదరుడు(బానపొట్ట వాడు), ఒకడు త్రిశిరుడు (మూడు తలలవాడు), ఒకర్తుక వికట, ఒకర్తుక దుర్ముఖి, ఒకర్తుక అజాముఖి(మేకముఖం వున్నటిది). ఇంతటితో సరిపుచ్చుక రామాయణంలో రావణునికి పదితలలు, ఇరవై చేతులు పెట్టారు; కుంభకుర్ణునికి పర్వతాన్ని పోలిన కాయాన్ని, బండి చక్రాలవంటి పెద్ద కళ్ళను పెట్టారు; కబంధునికి యోజనం నిడివి గల చేతులతోపాటు కడుపులోనే ఒంటికంటిని, పెద్దనోటిని పెట్టారు. ఇ.డబ్లియు. హాప్‌కిన్స్ 'ఎపిక్ మైథాలజీ"లో వివరించినట్లు, మహాభారతంలోని రాక్షసులతో పోల్చినప్పుడు, రామాయణంలోనివారే కొంత నయం.[9] ఉదాహరణకు భారతంలోని బకాసురుడు నరమాంస భక్షకుడు. అతడి తిండికి రోజుకు ఒక మనిషి కావాలి. హిడింబాసురుడు సయితం నరమాంస భక్షకుడే.

కాగా, పురాణాలలో రాక్షసులను మరింత ఘోరంగా చిత్రించారు. తారకాసురునిది ఏనుగుతల కాగా, అతడి తమ్ముడిది సింహంనోరు. కార్తవీర్యార్జునునివి వేయి చేతులు. బాలకృష్ణుని చంపడానికి ప్రయత్నించినవారిలో పూతనతోపాటు తృణావర్తుడు, శకటాసురుడు మొదలైన రాక్షసులు పెక్కునంది వున్నారు. వీరిని గురించి ప్రచారంలో వున్నట్టివి కట్టు కథలని, పిట్ట కథలని మన మెదడుకు ఏ కొద్ది పాటిగా పని పెట్టినా స్పష్టపడుతుంది. ఈ పని టి. కె వెంకటరామన్ కొంతవరకు చేశాడు.[10] సుశ్రుతుడు పేర్కొన్నట్టు, "పూతన" ఒక బాలారిష్టం. దానినుంచి కృష్ణునికి ప్రాణపాయం తప్పడమే "పూతన" అనే రాక్షసి వచ్చి, చను బాలివ్వడం కట్టుకథగా మార్పుచెందినట్టు అనుకోవచ్చు. పోతే, శిశుపాలుడు

ఒకానొక సందర్భంలో ఎత్తి పొడిచినట్టు, కృష్ణుడు ఒక బండిని తన్నడం, ఒక రాబందును చంపడం రాక్షసులను సంహరించడం కానక్కరలేదు. రాముడు ఒక కాకిని చంపడమైనా కాకాసురుని వధించడం కానక్కరలేదు. అన్ని పాపాలను రాక్షసుల నెత్తిని రుద్దడానికే వారిని మాయావులనడం, అందుకే వారు కామరూపధారులనడం!

రాక్షసుల పుట్టుపూర్వోత్తరాలను గురించి, యక్షులతో వారి బాంధవ్యాన్ని గురించి, దానవులతో, దైత్యులతో వారి సమైక్యతనుగురించి, అసురులతో వారి ఆత్మీయతనుగురించి రామాయణ భారతాలలో, భాగవతాది పురాణాలలో ఒక లక్షకట్టుకథ లున్నాయి. "అమరకోశం" మొదలుకొని, "ఆంధ్ర వాచస్పత్యం" వరకు నిఘుంటువులు వారందరినీ కలగాపులగం చేస్తున్నాయి. ఆ వివరాలలోకి నేను ప్రవేశించను. అట్టి పొరపాటు పని చేస్తే, ఆ కారడవిలోనుంచి నేను బయటపడ లేను. ఈ విషయాలుగురించి తెలుసుకొనగోరేవారు ఇంతకుముందు నేను పేర్కొన్న "ఎపిక్ మైథాలజీ"ని చూడవచ్చు. అంతటితో తృప్తిపడనివారు ఈ మధ్యనే ద్వారకాప్రసాద్ మిశ్రా ప్రచురించిన "స్టడీస్ ఇన్ ది ప్రోటో-హిస్టరీ ఆఫ్ ఇండియా"[11] చదవవచ్చు. ఈనాటి మధ్య ఆసియా ఒకనాటి దేవలోకమని మిశ్రా నమ్మకం. దేవలోకంపై ఆధిపత్యానికి కశ్యపప్రజాపతి సంతానం మధ్య జరిగినవే దేవాసుర యుద్ధాలని ఆయన నమ్మకం. ఆ యుద్ధాలలో దితికుమారులు (దైత్యులు), దనువు కుమారులు (దానవులు)ఏకమై, తమ సవతితల్లి అదితి పుత్రులతో (దేవతలుగా చెల్లిన ఆదిత్యులతో) అనేక యుద్ధాలు సాగించారట. అదితి పుత్రులతో పరాజయం చెందిన దైత్యులే, దానవులే (వారి ఉమ్మడిపేరు "అసురులు") దేవలోకం నుంచి తరలివచ్చి, హరప్పన్ నాగరికతను పెంపొందించారట. ఈ ధోరణిలో సాగింది మిశ్రా రచన.

భారతీయ నాగరికత "ఆర్యులభిక్ష" అనే దురభిప్రాయం ఒకప్పుడు బలంగా వుండేది. ఋగ్వేదకాలానికి పూర్వం ఇది అనాగరిక దేశమన్న దురభిప్రాయం మరింత బలంగా వుండేది. హరప్పన్ నాగరికత అవశేషాలు బయల్పడ్డంతో ఋగ్వేదకాలానికి అనేక శతాబ్దాలకు పూర్వమే ఇక్కడ ఒక గొప్ప నాగరికత పరిఢవిల్లినట్టు స్పష్టపడింది. కొన్నేళ్ళక్రితం ఈ నాగరికత కేవలం సింధులోయకు పరిమితమైవుండేదని అనుకొన్నారు. ఇటీవలి కాలంలో జరిగిన తవ్వకాలతర్వాత ఒక వైపున జమ్మూవరకు, మరొక వైపున గుజరాత్ వరకు, వేరొక వైపున హర్యానా, రాజస్థాన్ ల వరకు ఇది విస్తరించి వుండేదని తెలిసివచ్చింది. ఇంతేకాదు

అహమ్మద్ నగర్ జిల్లాలోని గోదావరి ఉపనదీతీరంవరకు ఇది పాకినట్టు కొత్తగా తెలిసింది.[12] మరింతగా పరిశోధనలు జరిగితే, మరింతమేరకు ఇది విస్తరించినట్టు రుజువు కావచ్చునని పురాతత్త్వశాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. హరప్పన్ నాగరికత వెలుగులోకి వచ్చి, ఆర్యనాగరికత బండారాన్ని బయట పెట్టడం ఆర్యాభిమాను లకు బాధ కలిగించింది. అందువల్ల హరప్పన్ నాగరికత నిర్మాతలు సయితం ఆర్యులన్న వాదాన్ని వారు లేవనెత్తారు. వారిలో కొందరేమో ఒక్కసారిగా కాక, దఫాలవారీగా ఆర్యులు ఇక్కడికి వలస వచ్చారని, తొలిదశలో ఇక్కడికి వచ్చిన వారే హరప్పన్ నాగరికత నిర్మాతలని చెబుతున్నారు. మిగిలినవారు "హరప్పన్ నాగరికత నిర్మాతలు ఆర్యులు కాకపోవచ్చునని, వారి జ్ఞాతులైన అసురు" లని వాదిస్తున్నారు. ఈ అసురులు అసీరియానుంచి వచ్చినట్టు బెనర్జీ-శాస్త్రి ఎలుగెత్తి చాటగా, కాదు, మధ్య ఆసియా నుంచి" అని ద్వారకా ప్రసాద్‌మిశ్రా బల్ల గుద్దుతున్నాడు. వీరు భయుల తాపత్రయం ఆర్యుల ఆధిక్యతను ఎలాగైనా నిలబె ట్టాలనే! వీరే కాదు, మరి పెక్కుమంది కూడా హరప్పన్ నాగరికత నిర్మాతలు ద్రావిడులన్న పాశ్చాత్య పురాతత్త్వవేత్తల సిద్ధాంతాన్ని ఖండిస్తున్నారు; కనీసం అది ఏదో ఒక అనార్యజాతి నిర్మాణమన్న ప్రతిపాదనను సయితం త్రోసిపుచ్చుతున్నారు.

ఆర్యు లెవరైనా, దాసులను ఆర్యులని ద్వారకాప్రసాద్ మిశ్రా అనబోడు, బెనర్జీ-శాస్త్రి అనబోడు, ఆర్యాభిమానాన్ని ప్రదర్శించే అన్యులైనా అనబోరు. ఇదే రీతిగా దస్యులు ఆర్యులని వారు అనబోరు. అయినప్పుడు ఋగ్వేదంలో పురాల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి దాసులవే ఎందుకు కావాలి, దస్యులవే ఎందుకు కావాలి? దుర్గాల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి తిరిగి వారివే ఎందుకు కావాలి? సిరిసంపదల ప్రసక్తి ఎక్కడ వచ్చినా, అవి సయితం దాసదస్యు జనులకు చెందినవే ఎందుకు కావాలి? పిప్రు అనే దస్యునాయకునికి తొంభై తొమ్మిది పురాలు, శంబర అనే దస్యునాయకునికి నూరు పురాలు వుండేవని ఋగ్వేదం చేబుతున్నది. వీ రిద్దరితో పాటుగా ధుని, శుష్ణ, చుమరి అనే దాసదస్యులకు ఎన్నెన్నో దుర్గాలు వుండేవని అది బెబుతున్నది. తన స్నానానికి నీరైనా కరువు కాగా, కువయ అనే దాసుని భార్యలు పాలలో ఓలలాడుతున్నారని కుత్సఅంగిరసుడు వాపోయినట్టు అది చెబుతున్నది. శంబరుని దుర్గాలు భాగ్యరాసులతో మూల్గుతున్నట్టు అది చెబుతున్నది.[13] దీన్నిబట్టి హరప్పన్ నాగరికత దాసులుగా ఋగ్వేదం నిరసించిన, దస్యులుగా అది నిందించిన అనార్యజాతులలో ఏదో ఒకటి-లేదా, ఏవో కొన్ని సృష్టించినట్టిదే అని విదితంకావడం లేదా?

హరప్పన్ నాగరికతకు సంబంధించిన "సీల్స్" (ముద్రలు) కొన్ని వందలు దొరికాయి. వాటిలో ఒక్కదానిపైనైనా ఇంద్రుడు లేడు అగ్ని, వరుణాది దేవతలు లేరు; ఆర్యులవెంట వచ్చిన గుఱ్ఱం సయితం లేదు. కాగా, వాటిపై ద్రావిడులకు దేవుడైన శివుడు పశుపతి రూపంలో వున్నాడు. అన్య ద్రావిడదేవత లున్నారు. ఈ కారణాలను బట్టి కూడా హరప్పన్ నాగరికత ఆర్యేతరమైనదని తీర్మానించు కొనవలదా?

అయితే, అది హరప్పన్ నాగరికత కానివ్వండి; అక్కడియన్, సుమేరీయన్, బాబిలోనియన్, ఈజిప్షియన్, క్రీటన్, ఫొనిసియన్, హిట్టైట్ ఆదిగాగల ప్రాచీన నాగరికతలలో మరేదైనా కానివ్వండి; ఆ కాలానికి అవి గొప్ప నాగరికత లైనా, వాటికి ఈనాటి నాగరికత మానదండాలను వర్తింపజేయరాదు. అవి శిలాయుగం చివరిదశలోని నాగరికతలు, లేదా లోహయుగం ప్రారంభదశలోని నాగరికతలు. అందువల్ల వాటి విస్తృతివలె వాటి వైభవం బహుపరిమిత మైనట్టిది. క్రీస్తుకు 3000 సంవత్సరాల క్రితం సుమేరియాలోని ఉర్ నగరం విస్తీర్ణం 200 ఎకరాలు, క్రీస్తుకు 1500 సంవత్సరాల క్రితం అసీరియా రాజధాని అసుర్ విస్తీర్ణం 120 ఎకరాలు.[15] హోమర్ కవి వర్ణించిన ట్రోజన్ యుద్ధానికి కేంద్రమైన ట్రాయ్ విస్తీర్ణం ఒక అంచనా ప్రకారం[16] ఒకటిన్నర ఎకరాలు కాగా, మరొక అంచనా ప్రకారం[17] దాదాపు ..నాలుగెకరాలు. విదేశాలనుంచిమన దేశానికి వస్తే, క్రీస్తుకు 2500 సంవత్సరాలకు పూర్వం మొహెంజొదారో విస్తీర్ణం ఒక చదరపుమైలు.[18] ఉర్, ట్రాయ్ వగైరాలతో పోల్చినప్పుడు ఇది కొంత పెచ్చుగా కనబడుతున్నా, ఇప్పటి అనేక గ్రామాలే ఇంతకంటె విస్తీర్ణమైనవికావా?

ఈ చారిత్రక సత్యాలను దృష్టిలో పెట్టుకొన్న పక్షంలో ఆర్యులను ఆశ్చర్యచకితులను చేసిన - అసూయాపరులను చేసిన - హరప్పన్ నాగరికత సమకాలిక ప్రపంచంలోని గొప్ప నాగరికతలలో ఒకటైనా, ఈ కాలపు ప్రమాణాల ప్రకారం అది ఆటవికస్థాయికి నాలుగైదు మెట్లు పైకి ఎక్కివచ్చినట్టిది మాత్రమే. అయితే, ఆర్యుల కళ్ళకు అదే మహావైభవోపేతమైనదిగా కనబడింది; కేవలం మాయాజాలంవలెనే అది వారికి తోచింది. అప్పటికి వారంతటి అనాగరికులు! తక్కిన విషయాలు విడిచిపుచ్చండి, పచ్చి ఇటుకలు చేయడమైనా అప్పటికి వారికి తెలియదు. కుదురుగా ఒకచోట నిలవక, ప్రాంతంనుంచి ప్రాంతానికి, దేశంనుంచి దేశానికి తమ ఆలమందలవెంట తరలివెడుతున్న కాలంలో బహుశా వారు చుట్టు గుడిసెలలో, పూరి పాకలలో కాలక్షేపం చేస్తూవుండేవారు. అటు తర్వాతనైనా

వారికి చేతనైన విద్య మట్టితో, కలపతో ఇళ్ళు కట్టుకొనడమే మహాభారత కాలం నాటికైనా వాస్తువిద్యలో వారు ప్రవీణులు కాలేదు. ఇందువల్లనే పాండవులు తమ ఇంద్ర ప్రస్థం నిర్మాణానికి మయుడనే దైత్యుని నియమించారు.

అయితే మయసభను గురించి మహాభారతంలో చెప్పినవి నూటికి నూరు పాళ్ళు అత్యుక్తులే; రామాయణంలో అయోధ్యనుగురించి చెప్పినవి తిరిగి నూటికి నూరు పాళ్ళు అతిశయోక్తులే. అయోధ్యనిడివి పన్నెండు యోజనాలట, వెడల్పు మూడు యోజనాలట! (బాలకాండ, అయిదవ సర్గ). క్రీస్తుశకం ఒకటవ శతాబ్దిలో అలెగ్జాండ్రియా విస్తీర్ణం 2250 ఎకరాలు మాత్రం; అప్పటిలో ఒక మహా సామ్రాజ్యానికి రాజధానీనగరమైన రోం విస్తీర్ణం 3600 ఎకరాలు మాత్రం.[19] మరి ఇందుకు కనీసం వెయ్యి సంవత్సరాలకు పూర్వం వెలసిన అయోధ్య విస్తీర్ణం 36 చదరపు యోజనాలంటే దీన్ని నిజమని తల లూపగలవారు రామభక్తులు మాత్రమే, పురాణాలలోని అబద్ధాలను అభూత కల్పనలను తిరుగులేని నిజాలుగా ఔదలదాల్చగల పరమచాందసులు మాత్రమే.

హరప్పన్ నాగరికత ఆవిర్భావంవలె దాని అభివృద్ధి సయితం నగరాలలోనే. అయితే వాటిని ఋగ్వేదకాలం నాటి ఆర్యులు ధ్వంసం చేసినందున తిరిగి మన దేశంలో నగరాలు నెలకొనడం కొన్ని శతాబ్దాల తర్వాతగాని జరగలేదు. అయోధ్య విస్తీర్ణాన్ని గురించి రామాయణంలోని మాటవలె మిధిల, వారణాసి, ఇంద్రప్రస్థం విస్తీర్ణాలనుగురించి జాతకకథలలోని మాటలు కూడా "లేత సొరకాయ కోతలు"గా కొట్టివేయదగినవని ప్రసిద్ధ పురాతత్త్వశాస్త్రవేత్త ఎ.ఘోష్ తెగవేసి చెప్పాడు.[20]

అయోధ్య విస్తీర్ణం 36 చదరపు యోజనాలని చెప్పిన రామాయణమే దానిలో రత్నాలతో పొదిగిన రాజప్రాసాదాలు వున్నట్టు చెప్పింది (బాలకాండ, అయిదవ సర్గ). కాని, అయోధ్యాకాండకు వెడితే, అవి రత్నాలు పొదిగిన దివ్యహర్మ్యాలు కావని, మట్టితో మెత్తిన మిద్దెలని అనుమానించ వలసివస్తుంది. తన కుమారుని కైకేయి వనవాసానికి పంపిస్తున్నట్టు విన్నంతనే కౌసల్య స్పృహ తప్పి పడిపోతుంది. తిరిగి తెలివి రాగానే విచారాన్ని పట్టలేక నేలపై దొర్లుతూ రోదిస్తుంది. "విశేషముగా నేలమీద దొరలిన" మీదట "లేచి, దుఃఖపడుచుండునదియు, విశేషముగ బరువువేసి మోయించిన యీడుగుఱ్ఱమువలె డస్సినదియు, నేలమీదబడి పొరలుటచే నొడ లంతయు దుమ్మంటుకొన్నదియునైన తన తల్లియగు కౌసల్యను (రాముడు) లేవనెత్తి కూర్చుండబెట్టి యొడలి దుమ్మంతయు దుడిచెను" (అయోధ్యాకాండ, 20వ సర్గ). అది గచ్చునేల సయితం లేనట్టి మట్టిమిద్దె కాకపోతే,

అది తివాచీలు నేలమీద పరవని చావడి కాకపోతే, కిందపడి దొర్లినంత మాత్రాన ఎంతో బరువుతో నేల మీద పొర్లిన గుఱ్ఱానికి అంటుకొన్నంత దుమ్ము కాస ల్యకు అంటుకొని వుండేదా? హెచ్.డి. సంకాలియా సరిగా ఇదే ప్రశ్న వేసి, ప్రాచీన కాలపు ఆర్యనగరాలను ఎక్కడ తవ్విచూచినా, మట్టి మిద్దెలే బయల్ప డినట్టి వివరించాడు. పునాదులకు కొండరాతిని రెండు చోట్ల వాడినా, అక్కడ సయితం గోడలు రాతితో కట్టినవి కావట; వెదురు అల్లికపై మట్టిగిలాబాతో ఏర్పరచినట్టివట. కప్ప ఆకులతోనో, గడ్డితోనో కూర్చినట్టిదట.[21]

ఒకప్పుడు వాస్తుశాస్త్రంలో, ఇతర విద్యలలో ఎన్నదగుప్రవీణులైనా, ఆర్యుల చేతిలో పరాజయపరంపర తర్వాత, ప్రాంతంనుంచి ప్రాంతానికి పలాయనంతర్వాత, పర్వతపంక్తులమధ్య, దుర్గమారణ్యాలమధ్య స్థిరపడ వలసి వచ్చిన హరప్పన్ నాగరికత నిర్మాతలు తమ పూర్వవిద్యలను మరచిపోయి వుండాలి, వాటిలో తమ ప్రావీణ్యాన్ని కోల్పోయివుండాలి. నాగరిక శిఖరంనుంచి అనాగరికస్థాయికి దిగజారి పోవడానికి నాలుగైదు తరాలు చాలు. లిపి లేని, గ్రంథాలు లేని కాలంలో ఇందుకు బహుశా రెండు, మూడు తరాలైన సరిపోయేవి. నిషాదులు హరప్పన్ నాగరికత నిర్మా తలు కాకపోవచ్చు. కాని, ఒకప్పుడు ఆటవికులస్థితికి కొన్ని మెట్లు పైగానే వారు బ్రతుకుతూవుండేవారు. వారిని సింధు, గంగ, యమున పీఠభూములనుంచి పర్వతప్రాంతాలకు, కాననాలమధ్యకు ఆర్యులు తరిమి కొట్టినపిదప వారు త్వరి తగతిని ఆటవికుల స్థితికి దిగజారిపోయినట్టు వారిని గురించి ప్రత్యేకపరిశోధనలు చేసిన శరత్ చంద్రరాయ్ వ్రాశాడు.[22]

రామాయణాన్ని చూస్తే, అయోధ్యకంటె లంకాపురి మరింత ధగధగాయమా నంగా వుండేదన్న అభిప్రాయం కలుగుతుంది. రావణుని నగరు (అంతఃపురం) పొడవు ఒక యోజనం, వెడల్పు అర్థయోజనం, దానిలోనివి "వార్షుకమేఘముపలె తేజరిల్లు భవనపంక్తులు" ఆ భవనాలోనివి వెండి, బంగారాల స్తంభాలు, పచ్చలు పొదిగిన కిటికీలు, పసిడి మెట్లు, నీలాలు పరచిన తిన్నెలు వగైరాలు, వగై రాలు (సుందరకాండ, ఏడవ సర్గ). పురాతత్త్వశాస్త్రం దృష్టిలో ఇది స్వచ్ఛమైన "నాన్ సెన్స్" ప్రాచీనకాలంలో ఇట్టి భవనాలు, ఇట్టి నగరులు ఈ ప్రపంచంలో లేనేలేవు. క్రీస్తుకు 2500 సంవత్సరాలకు పూర్వం మొహెంజొదారోలో శ్రీమం తుని భవనం నిడివి 97, వెడల్పు 83 అడుగులు (రెండు అంతస్తులు), క్రీస్తుకు 2000 సంవత్సరాలకు పూర్వం ఉర్‌నగరంలో అట్టి భవనం నిడివి 40, వెడల్పు 33 అడుగులు (మండువాకు నలుగడలలో ఏడు గదులు); క్రీస్తుకు 600 సంవ

త్సరాలకు పూర్వం బాబిలోనియాలో దాని నిడివి 98, వెడల్పు 82 అడుగులు (నడుమ మండువాతో 19 గదులు). ఇవి శ్రీమంతుని భవనాలే కాని, రాణ్మం దిరాలు కావంటే, ఎష్ నున్నా అనే చోట ఒక ప్రాచీన రాణ్మందిరం కనబడింది. ఇది క్రీస్తుకు పూర్వం 2300 సంవత్సరాలనాటిది. దీని నిడివి 230, వెడల్పు 85 అడుగులు. దీనిలో గదులు, మండువాలు కలిపి, మొత్తం 36 మాత్రమే వున్నాయి.[23] సుందరకాండను పారాయణం చేస్తే స్వర్గద్వారాలు తమకోసం తెరచుకొని వుండగలవని గట్టిగానమ్మేవారికోసం ఈ వివరాలను నేను పేర్కొనలేదు; ఆలోచనాశక్తిని, విజ్ఞతాదృష్టిని కోల్పోవనివారికోసమే.

ఇంత దూరం వచ్చినా, రాక్షసు లెవరో నేను తేల్చి చెప్పకపోవడానికి కారణం - కచ్చితంగా చెప్పగలిగింది ఏమీ లేకపోవడమే. అయితే, ఒకటి మాత్రం నిశ్చయం. వారు ఆర్యులు కారు. రావణుడు పౌలస్త్య డనడం కల్ల; అతడు వేద వేదాంగాలలో పండితుడనడం బొల్లు; అతడిని వధించినందున తనకు చుట్టుకొన్న బ్రహ్మహత్య పాపపరిహారం కోసమే రాముడు రామేశ్వరంలో శివలింగప్రతిష్ఠ చేశాడనడం కాక మ్మకథ. ఒకవైపున రాక్షసులను, రాక్షసేశ్వరులను మాయావులని, క్రూరుని నిందిస్తూనే, మరొక వైపున వారితో ఏదో పొత్తు కల్పించుకొనడానికి ఆర్యులు ఎందుకు ప్రయత్నించారు? ఈ ప్రయత్నం వెనుకగల చిత్తవృత్తి దురూహ్యమైనది కాదు, కానక్కరలేదు. ఎంతో దూరం పోవడం దేనికి? మన రక్త మాంసాలను పీల్చుకు తింటున్నారని ఒక వైపున ఆంగ్లేయులను నిందిస్తూనే, మరొక వైపున రైలు బండి, టెలిగ్రాఫ్, టెలిఫోన్, మోటారు కారు మొదలైన వాటిని "తెల్లోడి మాయ"లని మెచ్చుకొన్నవారు నలభై, యాభై యేళ్ళనాడు మనలో ఎందరు లేరు? "మావలె మీరు కూడా ఆర్యజాతికి చెందినవారే!" అని సర్ విలియం జోన్స్, మాక్స్ ముల్లర్ మున్నగువారు చెప్పినప్పుడు మురిసిపోయినవారు మనలో ఎందరు లేరు? అంతటితో ఆగక మన వేదాలను, అన్య ప్రాచీనగ్రంథాలను తస్కరించి, వాటి సహాయంతోనే రైలు, విమానం వగైరాలను తెల్లవారు కనిపెట్టగలిగినారని చాటినవారు ఎందరు లేరు? ప్రాచీనకాలపు ఆర్యులు సయితం అనార్యజాతులు బలదర్పాలకు, వారి ప్రజ్ఞాప్రాభవాలకు మూలం బ్రహ్మవిష్ణు మహేశ్వరులనుంచి వారు పొందిన వరాలే అని చెప్పారు, వేద వేదాంగాలలో వారి పాండిత్యమే అని చెప్పారు!

రాక్షసులు ఆర్యులు కారంటే, మరి వారెవరు? ఆర్యమతాన్ని, సంప్రదాయాలను వ్యతిరేకించినందున, ఆర్యసంఘంనుంచి వెలివేయబడినవారా? ఇట్టివారికి

వ్రాత్యులనేవారు. వ్రాత్యులను ఎంతగా విద్వేషించినా, వారిని రాక్షసులుగా వర్ణించినవారు లేరు.

పోతే, ఇక్కడి ఆదివాసులలో మొట్టమొదటివారుగా పేర్కొనబడుతున్న నీగ్రో జాతివారు రాక్షసులు కావడానికి వీలులేదు. ఆర్యులను అసుయాపరులను చేసినంతటి గొప్పది రాక్షసనాగరికత. సుందరకాండను చదువుతూ వుంటే, లంకాపురి ముందు అయోధ్య వెలవెల బోతూవున్నట్టు కనబడుతుంది. ఒక్క రామాయణమే కాదు, తక్కిన ప్రాచీనగ్రంథాలు సయితం ఆర్యనాగరికత కంటె రాక్షసనాగరికత కనీసం సిరిసంపదలకు సంబంధించినంతవరకు మహోజ్జ్వలమైన దని గుర్తిస్తున్నాయి. ఆ నాగరికత నీగ్రోజాతి సృష్టి కానేరదని నిష్కర్షగా చెప్పవచ్చు.

నీగ్రోల కంటె కిరాతులు నాగరికతలో కొంతవరకు ముందుకు వెళ్ళినట్టి వారు. వారిని గురించి, వారి నాగరికతనుగురించి తెలుసుగొనగోరేవారు "కిరాత జనకృతి" అనే పేరుతో సునీతి కుమార ఛటర్జీఇంగ్లీషులో వ్రాసిన పుస్తకాన్ని చదువవచ్చు .[24] ఆర్యుల తర్వాతనే కిరాతులు ఇక్కడికి వలస వచ్చినట్టు అనుకొనడానికి అవ కాశం కలదని ఛటర్జీ సూచిస్తున్నాడు. పైగా, కిరాతుల చరిత్రలో సుప్రసిద్ధ ఘట్టాలు క్రీస్తుశకం పధ్నాల్గవశతాబ్దం అనంతరకాలానికి చెందినవని ఆయన వివ రిస్తున్నాడు. ఇంతేకాక, కిరాతుల ముఖ్యస్థావరాలు ఇండియా తూర్పు, ఉత్తర సరిహద్దు ప్రాంతాలు. అవి జాతీయ జీవన స్రవంతికి సుదూరంలోగల ప్రాంతాలు. ఈ కారణాలన్నింటివల్ల రామాయణ భారతా లేమి, భాగవతాది పురాణా లేమి రాక్షసులుగా వర్ణించినట్టివారు కిరాతులు కావడానికి వీలు లేదు.

ఇప్పుడిక మిగిలినవారు నిషాదులు, ద్రావిడులు మాత్రమే. రామాయణాన్ని విమర్శకదృష్టితో పరిశీలించినవారిలో అది పేర్కొంటున్న రాక్షసులు ద్రావిడులు కావ చ్చునని అధిక సంఖ్యాకులు, "కాదు, నిషాదు"లని తక్కినవారు తీర్మానిస్తున్నారు. ఈ అధికసంఖ్యాకుల దృష్టిలో సింహళద్వీపమే రావణుని లంక. అయినప్పుడు ద్రావిడులే, లేదా ద్రావిడులలో ఒక తెగవారే, రాక్షసులని వీరు తీర్మానించడం సహజమే.

అయితే ద్రావిడులలో రాక్షసులెవరు? ఈ ప్రశ్నకు సి.వి. వైద్య సమాధానం "తెలుగువా"రని! పంచవటి నాసిక్‌వద్ద వుండేదా, లేక భద్రాచలం వద్ద వుండేదా? ఎక్కడైనా, అది గోదావరితీరంలోనే వుండేదట. రాక్షస రాజ్యం గోదావరితీరానికి సమీపంలోనే, దానికి దక్షిణ దిశలో ప్రారంభమయ్యే దట. నాసిక్ ప్రాంతంవారు

ఆర్యభాషాకుటుంబానికి చెందిన మరాఠీని మాతృభాషగా చేసుకొన్న వారు కాబట్టి, వారే రాక్షసులు కావడానికి వీలు లేదట. పోతే, తెలుగువారిది ద్రావిడభాష కాబట్టి, వారే రాక్షసులు కావాలట! అయితే, మనకు ఎక్కడ కోపం రాగలదో అని కాబోలు, ఆయన ఒక మాట కలుపుతున్నాడు. తెలుగువారు రాక్షస సంతతి వారైనా, ఇప్పుడు మాత్రం రాక్షసులు కారట.[25]

వైద్య అభిప్రాయాన్ని సురవరపు ప్రతాపరెడ్డి బలపరుస్తున్నాడు. అధర్వణ కారికల ప్రకారం రావణుడు ఆంధ్రుడట. ప్రాచీనాంధ్ర లక్షణ వేత్తలలో బృహస్పతి, కణ్వుడు, పౌమచంద్రుడు, పుష్పదంతుడు, గౌతముడు, ధర్మరాజులతో పాటు రావణుడు సయితం వున్నాడట. దీని ప్రకారం లంకాధిపతి ఆంధ్రుడైనా, "రావణుడు" అనే పదం "బహుశా వేరు కాదేమో!" అనే సందేహాన్ని "రామాయణ విశేషములు" అనే తమ గ్రంథంలో ఆయన వెల్లడించాడు. ఆయన మతంప్రకారం తమిళంలో "ఇరైవాన్" అంటే దేవుడు కావచ్చు, రాజు కావచ్చు. దాన్ని సంస్కృతీకరించగా వచ్చినదే "రావణ " శబ్దం కావచ్చు . పోతే, "రో" లేక "రై" అంటే తెలుగులో "ధనం." "రైవాన్" అంటే ధనవంతుడు కావచ్చు. రాజు కావచ్చు. ఈ "రైవాన్" పదంనుంచే "రావణ" పదం వచ్చి వుండవచ్చు. ఈ చర్చ మరికొంత సాగించిన తర్వాత ఆయన తేల్చిన సారాంశ మిది! " ప్రాచీనాంధ్ర వ్యాకర్తలలో నితడొకడని ప్రతీతి యుండుటచేత (రావణుడు) ఆంధ్రుడే యైయుండుననుటకు కొంత యూధార మెక్కువగా నున్నది." (రామాయణ విశేషములు, పుటలు 315-16). రాక్షసు లెవరన్న ప్రశ్నను మరొక చోట చర్చించి, ఆయన చెప్పిన మాట లివి: "వింధ్యనుండి దక్షిణాపథ మంతయు నుండిన అనార్యులలోని ఒక తెగయె రాక్షసుల తెగ."

ఇక, రామాశ్రయ శర్మ వాదం ప్రకారం రాక్షసులలో రెండు వర్గాలవారుండేవారు. ఒక వర్గం వారేమో జన్మవల్ల రాక్షసులైనవారు. రెండవ వర్గంవారు ఏదో శాపంవల్ల రాక్షసు లైనవారు! శాపాలలో నమ్మకం వున్న ఈ రచయిత అభిప్రాయాలను నేను చర్చించబోను. వాటిపట్ల ఆసక్తిగలవారు వాల్మీకి రామాయణం వివరిస్తున్న సాంఘిక, రాజకీయ వ్యవస్థలనుగురించి ఈయన వ్రాసిన విపుల గ్రంథాన్ని పఠించవచ్చు.[26] ఇట్టి గ్రంథాలను మరి రెండింటిని కూడా నేను తిరగవేశాను. వాటిలో మొదటిది కుమారి పి.సి.ధర్మరచన[27]; రెండవది డాక్టర్ ఎన్.ఎస్. వ్యాస్ రచన[28] వీరు ఆధునిక యుగంవారు; ఆధునిక విద్య నభ్యసించినవారు. అయినా వీరిచిత్తవృత్తి మాత్రం అధునికమైనది కాదు. ఇట్టివారి

సంఖ్య తరగడానికి మారుగా నానాటికి పెరగడం మన దేశ దౌర్భాగ్యం.

నేను ఆలోచించ గలిగినంతవరకు రాక్షసులు ఏదో ఒక తెగకు, లేదా ప్రాంతానికి చెందినవారు కారు. ఎక్కడ వైరవిద్వేషాలుంటే, ఎక్కడ భయవిభ్రాంతులుంటే, అక్కడ రాక్షసు లుంటారు. ఈ విషయాన్ని గుర్తించినప్పుడు రామాయణ, భారతాలలోని, భాగవతాది పురాణాలలోని రాక్షసులు ఒకే ప్రాంతంవారు కానక్కరలేదు. ఒకే తెగకు చెందినవారు సయితం కానక్కరలేదు.

పైగా, రాక్షసులు దేశదేశాలవారి కున్నారు. రావణునివి పది తలలుకాగా టూటోనిక్ పురాణాల లోని టిర్ నాయనమ్మవి 900 తలలు; గ్రీక్ పురాణాలలోని క్రోనస్ తన బిడ్డలను తానే తిని వేశాడు; బాబిలోనియన్ పురాణాలలోని ఇయా పాములు, మొసళ్ళు, కుక్కలు వగైరాలను కనింది; సుమెరియాన్ పురాణాలలో ఉడుగ్ అనే పేరుతో అతి భయంకరులైన సప్తరాక్షసులున్నారు.[30]

ఇప్పుడు మనం వేసుకొనవలసిన ప్రశ్న : రామాయణం రాక్షసులు ఎక్కడివారని? సింహళద్వీపం రావణుని లంక కాదన్న విషయాన్ని గుర్తిస్తే రాక్షసరాజ్యం కోసం చూడవలసింది వింధ్యపర్వతాలకు ఉత్తరదిశలో, లేదా ఆ పర్వతాల పరిసర ప్రాంతాలలో. ఈ పీఠిక మూడవ ప్రకరణంలో నేను వివరించినట్టు, ఎమ్.వి. కిబే, జి.ఎన్.హీరాలాల్, టి. పరమశివ అయ్యర్,టి.అమృతలింగం, డి.ఆర్.మన్‌కడ్ ప్రభృతులు ఇంతే చేశారు. అరుణకుమార్ ఘోష్ అభిప్రాయం కూడా రామాయణంలోని రాక్షసులు మధ్యభారత ప్రాంతానికి చెందినవారనే. ఈయన వివరణ ప్రకారం, క్రీస్తుకు పూర్వం అయిదవ శతాబ్ది ప్రాంతాలలోనే ఆర్యులు దక్షిణ భారతంలో కాలూన గలిగారు. అంతకు కొన్ని శతాబ్దాలకు పూర్వమే రామారావణయుద్ధం జరిగివుండాలి. పైగా, సింహళం ప్రాచీన చరిత్రను తెలిపే "మహావంశం"లో రావణుని ప్రసక్తిలేదు. రామాయణంలోని అతిశయోక్తులను, అభూత కల్పనలను తొలగిస్తే, ఒక కోసల రాకుమారునికి, ఒక అనార్యజాతి రాజుకు జరిగిని యుద్ధానికి సంబంధించనట్టిదే రామాయణం మూలగాథ.[31]

రామాయ యుద్ధానికి రంగం మధ్యభారత మని, ప్రత్యేకించి వింధ్య పరిసర ప్రాంతమని గుర్తించిననాడు ఆ యుద్ధం జరిగింది. నిషాదజాతికి చెందిన ఏదో ఒక తెగతో అని సంభావించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి. ఒకప్పుడు ఉత్తర భారతంలో అధికభాగం నిషాదుల ఆక్రమణలో వుండేది. అప్పటిలో వారిని మూడు పేర్లతో పిలిచేవారు. వాటిలో మొదటిది నిషాదులు కాగా, రెండవది

శబరులు, మూడవది పులిందులు. క్రీస్తుశకం ప్రారంభం తర్వాత వారి ప్రసిద్ధ నామాలు భిల్లులని, కోల్లలని. ఇక్కడ ఆర్యుల తాకిడికి తట్టుకోలేక వారు మెల నీసియాకు, పోలినీసియాకు, ఆస్ట్రిరలియాకు, న్యూజిలెండ్‌కు, ఇండోనీసియాకు, ఫిలిప్పీన్స్‌కు, మలయాకు, ఇండో-చైనాకు, బర్మాకు, నికోబార్ దీవులకు, మరికొన్ని దూరప్రాంతాలకు తరలిపోయారు. తరలిపోయినవారు పోగా, మిగిలివారు వింధ్య పరిసర ప్రాంతాలలో తలదాచుకొన్నారు[32] ఆర్యుల చేతిలో దెబ్బ తర్వాత దెబ్బతిని చెల్లా చెదరుకాకముందు భారతీయసంస్కృతిపై నిషాదులు తమ ముద్రను బలంగానే వేశారు. కోశల-తోశల, అంగ-వంగ, కలింగ-త్రిలింగ, ఉత్కల-మేకల, పులింద-కులింద అనే పేర్లను మన దేశంలో కొన్ని ప్రాంతాలకు పెట్టినవారు నిషాదులే. జంటమాటలుగా వుండే కొన్ని జాతుల పేర్లు కూడా (ఉదాహరణకు అచ్చ-వచ్చ, తక్కోల-కక్కోల మొదలైనవి) వారు పెట్టినవే.[33] అన్నట్టు, ఇక్కడ మరొక మాట చెప్పాలి. కోసల ఒకప్పుడు నిషాద ప్రాంతం. ఇక్కడ వర్ణ సాంకర్యం కొంతవరకు జరిగివుండాలి. అందువల్లనే ఆర్యజాతికి చెందిన రామునికి నల్లనిరంగు వచ్చివుండాలని అరుణకుమార్ ఘోష్ వ్రాశాడు[34] వర్ణసాంకర్యంతో పాటు కులసాంకర్యం సయితం కోసలలో వుండేదని అనుకోవాలి. సుప్రసిద్ధ సాంఘికశాస్త్రవేత్త జి.ఎస్. ఘుర్యే వివరణ ప్రకారం దశరథుని భార్య సుమిత్ర శూద్రాంగన[35]

మన దేశంలో కొన్ని ప్రాంతాలకు, జాతులకు మాత్రమే కాక, కొన్ని నదులకు సయితం వాటి పేర్లు నిషాదులు పెట్టినట్టివే. ఇక్కడ ఒక నదికి "గంగ" అని వారు పేరు పెట్టబట్టే, ఇక్కడనుంచి వారిలో ఇండో-చైనాకు వలసవెళ్ళిన వారు అక్కడ ఒక నదికి "మెకాంగ్" (మా-గంగ) అని పేరు పెట్టడం జరిగింది. కాగా, సునీతి కుమార ఛటర్జీ అభిప్రాయం ప్రకారం కర్మసిద్ధాంతం, జన్మ, పునర్జన్మల సిద్ధాంతం నిషాదులనుంచి హిందూమతం స్వీకరించినట్టివి.[36]

నిషాదులలో ఒక తెగవారైన ఖోండ్‌ల మధ్య (వీరికి "కుయా" లని మరొక పేరు కూడా వున్నది) అనేక సంవత్సరాలపాటు నివసించి, వారి వేషభాషలనుగురించి, ఆచారవ్యవహారాలనుగురించి పరిశోధనలు చేసిన జి. రామదాసు పంతులు రావణుడు ఈ తెగకు చెందినవాడన్న తీర్మానానికి వచ్చాడు. ఈ తెగవారి ఊరు వెలుపల "నిశాన్ పెన్ను" అనే దేవి వుంటుందట. ఆరు మొదలు తొమ్మిది అంగుళాల రాయిని - కోడి గుడ్డును పోలిన రాయిని - ఈ దేవీ మూర్తిగా ఒక చెట్టుకింద గ్రామద్వారంవద్ద ప్రతిష్ఠచేస్తారట. ఇది పగిలిపోయినా, దీన్ని ఎవరైనా

దాని స్థానంనుంచి తొలగించినా, తమకు కీడు కలగగలదని ఖోండులు నమ్ముతారట. ఈ నమ్మకం తెలిసినవాడు కాబట్టే హనుమంతుడు లంకలో ప్రవేశిస్తూ ఈ రాయిని కదిలించి వుండాలట. లంకాదేవితో హనుమంతుని సంఘర్షణగా రామాయణం భయంకరంగా కనబడ్డం కోసం మృగాల ముఖాలను (మూరు ముఖాలుగా) తగిలించు కొంటారట. రాక్షసులను వికృతరూపులుగా రామాయణం వర్ణించడం ఇందువల్లనే జరిగివుండవచ్చునట. ఖోండుభాషలో దియ -గీవ అంటే చికాకు పరచడం, "దశ-గీవ"ను రామాయణంలో "దశగ్రీవుడు"గా మార్చడం, రావణునికి పదితలలని చెప్పడం జరిగివుండవచ్చునట. రామాయణంలోని రాక్షసులు ఖోండులు కావచ్చునని చెప్పడానికి ఇట్టి వివరాలను పెక్కింటిని రామదాసు పంతులు ప్రచురించాడు[37]

రామాయణంలోని రాక్షసులు ఖోండ్ తెగవారు కాకపోతే వారికి సన్నిహితులైన గోండ్ తెగవారు కావచ్చునని రామదాసు సూచించాడు. ఆ తెగవారు రావణుని భక్తిగౌరవాలతో సంస్మరిస్తారట; పూర్వకాలంలో తమ ప్రభువుగా అతడిని కీర్తి స్తారట. గోండ్ జాతివారు ప్రతిముఖ్యప్రదేశాన్ని "లక్క"అంటారట. దిన్నే రామాయణం "లంక"గా మార్చి వుండవచ్చునని గోండ్ జాతివారి మధ్య దాదాపు ఒక జీవితకాలాన్ని గడిపిన వి.ఎన్.పట్వర్ధన్ సంకాలియాకు చెప్పినాడట.[38]

ఇందరు పండితులు, ఇందరు పరిశోధకులు, ఇందరు విభిన్న శాస్త్రవేత్తలు చెప్పిన ఈ విషయాలను "ఇవి నాస్తికుల ప్రేలాపనలు"గా కొట్టి పారవేయగలవారు ఎంద రెందరో వుండగలరని నాకు తెలుసు. ఇదివర కొకసారి వీరికి పదివేల నమస్కారాలు చెప్పినట్టున్నాను; ఈసారి లక్ష నమస్కారాలు చెప్పి, నా దారిని నేను ముందుకు సాగుతాను.

*

ఋషులెవరు?

నిజమే - ఒక లోకోక్తి పెచ్చరిస్తున్నట్టు, ఋషిమూలాన్ని విచారించరాదు. ఆ పని చేస్తే, కనబడేది ఏదో బూతు, లేదా ఏదో బొంకు ! ఈ రెండింటిలో ఒకటి కాకపోతే, కనీసం దంభం కనబడుతుంది, లేదా దర్పం కనబడుతుంది! ఒక్క మనదేశంలోనే కాదు, అన్ని దేశాలలో - ఒక్క మన నాగరికతలోనే కాదు, అన్ని నాగరికతలలో - మంత్రవేత్తలుగా చెల్లినవారి విషయంలో, చెల్లుతున్నవారి విషయంలో నా మాటలు నూటికి నూరుపాళ్ళు నిజం.

మంత్రాలకు చింతకాయలు రాలనిది ఇప్పుడే కాదు, ఎప్పుడైనా, ఎక్కడైనా, కాని, అవి రాలతాయన్న నమ్మకాన్ని ప్రజలలో పాదుకొలపకపోతే, మంత్రవేత్తలకు ఆధిక్యత దక్కదు సరిగదా. అన్నపానీయాలైన దక్కవు. అందువల్ల ఎన్నెన్నో వేషాలు వారు వేయాలి. మోసాలు చేయాలి, గొప్పలు చెప్పుకోవాలి, ఘనతలు ఆపాదించుకోవాలి.

అయితే, ఇదే సమయంలో ఒక సత్యాన్ని నేను గుర్తిస్తాను. దేశదేశాల నాగరికతల చరిత్రలను చదివిన నేను దాన్ని గుర్తించకపోతే, ఆది క్షమించరాని తప్పిదమే కాగలదు. ఈనాడు మనం డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఎస్టాబ్లిషమెంట్స్‌గా (ఖగోళ

శాస్త్రజ్ఞులుగా), ఇతర సైన్‌టిస్టుగా చెప్పుకొంటున్నవారు ఒకనాడు మంత్రవేత్తలే. మానవచరిత్రలో పశుపోషణవ్యవస్థ వ్యావసాయిక వ్యవస్థ ఒకదాని తర్వాత మరొకటి నెలకొన్నంతనే, విద్యావైజ్ఞానిక విషయాలను గురించి ఆలోచనలు చేయడానికి, పరిశోధనలు జరపడానికి కొందరికి విరామం లభించింది. వీరిలో అధిక మేధావులైనవారే దేవతలకు పూజారులైనారు, రాజులకు పూరోహితులైనారు, అగ్రవర్ణాల, లేదా వర్గాల పౌరులకు విద్యాగురువు లైనారు. వీరే మనకు తొలి సైన్‌టిస్టులు, నిప్పును రగల్చడం మొదలుకొని కుండను చెయ్యడం వరకు; కుక్కను, ఆవును, గుఱ్ఱాన్ని మచ్చికచేయడం మొదలుకొని నాగలిని కనిపెట్టడంవరకు; ఎప్పుడు వరద పొడవగలదో చెప్పడం మొదలుకొని, ఎప్పుడు గ్రహణం వదలగలదో సూచించడంవరకు - అన్నీ ఒకనాడు విప్లవాత్మకమైన వైజ్ఞానిక, సాంకేతిక విజయాలే. వీటిని దాదాపు పూర్తిగా సాధించినవారు దేవతల పూజారులే, రాజుల పురోహితులే, అగ్రవర్ణాల, లేదా వర్గాల విద్యాగురువులే. అయితే, ప్రజాబాహుళ్యానికి సంబంధించినంతవరకు తమకు తెలిసిన విద్యలను వీరు గుప్తంగా వుంచారు. తమ ప్రధాన పోషకులకు సయితం తమకు తెలిసిన సమస్తాన్నీ విడమర్చి చెప్పలేదు. దీనికితోడు వీరు తమకు సర్వజ్ఞతను ఆపాదించుకొన్నారు, తమకు అలౌకికశక్తులున్నట్టు, ఆమోఘ మహిమ లున్నట్టు కపటనటన చేశారు. అందువల్లనే వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్రాల పురోగతి దేశదేశాలలో కొన్ని వేల సంవత్సరాలపాటు స్తంభించిపోయింది. కొత్త సత్యాలను కొత్తవారు కనుగొనగలిగితే, తమ ఘనత ఎక్కడ దెబ్బతినగలదో అని, తాము పొందుతున్న గౌరవమర్యాదలు ఎక్కడ తగ్గపోగిలవో అని "ఎందువల్ల ?" అనే ప్రశ్నపైనే వీరు ఆంక్షవేశారు.

దేశదేశాలకు సంబంధించిన ఈ పూజారివర్గం వైఖరికి, ఈ పురోహితవర్గం వర్తనకు భిన్నమైనది కాదు మన ఋషుల నడవడి. "ఋషి" అనగానే అతడు "సర్వసంగపరిత్యాగి" అని మనం భావిస్తాము. ఇది మన పౌరాణిక ఋషుల విషయంలోవలె మన వైదికఋషుల నిషయంలో సయితం ఎంతమాత్రం నిజం కాదు. అంగిరసుడు, అగస్త్యుడు, భృగుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైనవారు వేద వేదాంగాలలోవలె పురాణేతిహాసాలలో మనకు తగులుతారు. ఇవి వంశ నామాలు కాబట్టి, వీరికి సంబంధించిన ఏ వృత్తాంతమైనా, ఏ విశేషమైనా ఒకే వ్యక్తికి సంబంధించింది కావడానికి వీలు లేదు. ఏమైనా, వీరి పుట్టుపూర్వోత్తరాలను గురించి మన పురాణాలలోగల కథలను పుణ్యగాథలుగా భావించే వారి మానసిక స్వాస్థ్యాన్ని శంకింవలసివుంటుంది. నా పలుకులు

ఋషులపట్ల ద్వేషంతో కూడినవి కావని రుజువు చేయడానికి వారికి సంబంధించి పురాణాలలోగల కొన్ని గాథలను (అయిష్టంగానే) ఇక్కడ పేర్కొనక తప్పదు.

అగస్త్యునికి, వసిష్ఠునికి తల్లి ఊర్వశి కాగా, తండ్రులు మిత్రవరుణులు. ఈ "జాయింట్" తండ్రులు ఊర్వశిద్వారా తమ సుపుత్రద్వయాన్ని లోకోద్ధరణకై ఏ తీరున ప్రసాదించారో ఆ కథ అసహజమైనదే కాదు, అశ్లీలమైనది కూడా. ఇందుకు ఏమంత భిన్నమైనది కాదు ఘృతాచి తల్లిగా భరద్వాజుడు తండ్రిగా ద్రోణాచార్యుని జననం. ఏవో మహిమ లని ఏవో వరాలని "మసిపూసి మారేడు కాయ" చేయడానికి ప్రయత్నం జరగకపోలేదు గాని, మత్స్యగంధితో పరాశరుడు జరిపినట్టిది పచ్చి వ్యభిచారం. ఈ వ్యభిచారం ద్వారా జన్మించిన వేద వ్యాసుడు వంశోద్ధరణ పేరుతో అంబిక, అంబాలికలతో పొత్తు కలిపి, ధృతరాష్ట్ర పాండు రాజులను కన్నాడు; వారి దాసితో కత్తు కలిపి, విదురుని కన్నాడు! దేవతలకే మమతను (ఆమె నిండు గర్భవతిగా వున్నదన్న సంకోచమైనా లేకుండా) బృహస్పతి "రేప్" చేశాడు. ఈ విధమైన కథలను పెక్కింటిని చదివినమీదటనే "ఏ పురాణమైన ఏమున్న దందులో నీతి ముసుగుతోడ బూతుకాక?" అని నేను దేవతలు గట్టిగా పోటీపడినట్టు చెప్పవచ్చు. ఇట్టి కథలతో కూడిన ఒక సంకలనం "శాన్ ఆఫ్ హిందూ గాడ్స్ అండ్ సేజెస్"[1] అనే పేరుతో ఇటీవల వెలువడింది. మరింత వివరంగా ఈ కథలు వేమూరి శ్రీనివాసరావు సంకలనం చేసిన "పూర్వగాథాలహరి"లో వున్నాయి.

కామ వికారాలను, ప్రకోపాలను విడిచి పుచ్చండి; అన్యవిధాల చూచినా, ఋషులన్నవారిలో అల్పత్వం విశేషంగానే గోచరిస్తుంది. దుర్వాసునికి ముక్కుపై కోపం; కదిలినా, మెదిలినా అతడు ఒక శాపం తగిలించేవాడు. వసిష్ఠునికి, విశ్వామిత్రునికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండేది. గౌతముని సంపద చూచి అసూయాపరులైన అన్యఋషులు అతనికి మాయోపాయంద్వారా గోవధపాపాన్ని అంటగట్టారు. భృగుడు బ్రహ్మను, శివుని శపించిన తర్వాత, విష్ణువును వక్షస్థలంపై తున్నాడు.

పోనీ, ఇవి పురాణాలకు సంబంధించిన కాకమ్మ కథలని త్రోసివేయడానికి వేద ఋషులన్నవారు ఇంతకంటె ఏమంత భిన్నమైనవారు కారు. ఋగ్వేదకాలం ప్రారంభదశలలో యజ్ఞాలు, యాగాలు పెద్ద యెత్తున జరిగేవి కావు; జరిగినా, ఎవరికి వారు వాటిని స్వయంగా జరుపుకొనేవారు. కాలక్రమాన మంత్రద్రష్టలమన్న ఘనతతో ఒక ఋషివర్గం ఏర్పడింది. వీరు యజ్ఞయాగాల సంఖ్యను పెంచారు. వాటి కాలపరిమితిని పెంచారు. "ఆంధ్రవాచస్పత్యము" వివరణప్రకారం పాకయ

N-1610
894.874
వెం టి

జ్ఞాలు ఏడు; హవిర్యజ్ఞాలు ఏడు, సోమయజ్ఞాలు ఏడు. ఇవి కాక, అశ్వమేధయాగం, రాజసూయం, పౌండరీకం, బృహస్పతిసవం, చైనం మొదలైన ప్రత్యేకయజ్ఞాలు అనేకం వుండేవి. మొదలైన అనే ముసుగుకింద "ఆంధ్రవిజ్ఞానము" మభ్యపరచిన యజ్ఞాలలో ఒకటి "పురుషమేధం". బలిపశువుగా నరుని నరకడానికి ఇది ఘనంగా ధ్వనించే పేరు. వేదకాలం ప్రారంభదశలలో (తక్కిన ప్రాచీన దేశాలలో వలె) ఇక్కడకూడా పురుషమేధాలు జరుగుతూ వుండేవని వ్రాసింది ఒక మ్లేచ్ఛుడు కాడు, ఒక హిందూపండితుడే. ఆయన రాజేంద్రలాల్ మిత్ర.[2]

అది ఏ యజ్ఞమైనా, యాగమైనా సోమరసం లేకుండా బహుశా జరిగేది కాదు. కాగా, ప్రత్యేకించి సోమయజ్ఞాలైన ఏడింటిలో సోమరసానికి అగ్రప్రాధాన్యత వుండేదని చెప్పనక్కరలేదు. ఈ పీఠిక నాల్గవ ప్రకరణంలో ఋగ్వేదంలో "కొట్ట వచ్చినట్టుగా కానవచ్చేవి దార్శనికసత్యాలు కావు. హత్యల ప్రశంసలు, హంతకుల సంస్తవాలు" అని నేను వ్రాశాను. వాటి తర్వాత ఋగ్వేదంలో ప్రాధాన్యం వహించేవి సోమరసం సంకీర్తనలే, సోమయజ్ఞాల మహిమలే! ఇది కేవలం నా మాట మాత్రమే కాదు, ఎ.బి. కీత్ మాట కూడా. ఋగ్వేదం తొమ్మిదవమండలం పూర్తిగా సోమయజ్ఞాన్ని గురించే తక్కిన మండలాలలో ఆరు చోట్ల దాని ప్రస్తావన వున్నది. పైగా , ఇంద్రునితో కలిపి, అగ్నిదేవునితో కలిపి, పూషునితో కలిపి, రుద్రునితో కలిపి సోమస్తోత్రాలు పెక్కుచోట్ల వున్నాయి. ఇది సోమదేవుని (చంద్రుని) గురించిన స్తోత్రాలు కావచ్చు, లేదా సోమరసాన్ని గురించినవి కావచ్చు. ఈ కారణాన ఋగ్వేదంలో మొత్తం ఎన్ని చోట్ల సోమరసం ప్రత్యక్షమౌతున్నదో తేల్చి చెప్పలేమన్న తీర్మానానికి కీత్ వచ్చాడు.[3]

సోమలత, లేదా సోమవల్లి ఏదో నిర్ధారణగా ఈనాడు మనకు తెలియదు. మాక్స్ ముల్లర్, రూడల్ఫ్, ఫాన్ రాల్, జె.జి.బేకర్ మున్నగువారు 1884లో ఈ విషయమై దీర్ఘచర్చ జరిపి, ఏకాభిప్రాయానికి రాలేక పోయారు.[4] క్రిస్టియన్ లాసెన్, ఆల్‌ఫ్రెడ్ హిల్‌బ్రాంట్, రాజేంద్రలాల్ మిశ్రా ప్రభృతులమధ్య కూడా ఈ విషయమై విభిన్నాభిప్రాయాలే. ఇందువల్ల ప్రస్తుతం సోమవల్లిని గుర్తించడం బహుశా సాధ్యంకాదన్న అభిప్రాయానికి మెక్డొనెల్, కీత్‌లు వచ్చారు.[5] అయితే, మన తెలుగు నిఘంటుకారులు మాత్రం (ఒక్క సి.పి.బ్రౌన్ మినహాగా) దీన్నిగురించి గట్టిగా ఆలోచనైనా చేయకుండా "తిప్పతీగ", "పాన్నగంటి" అనే అర్థాలు వ్రాసివేశారు.

సోమవల్లి ఋగ్వేదకాలంలోనే పుష్కలంగా గాని, సులభంగా గాని లభించేది

కాదేమో! అందువల్లనే దానికి ప్రత్యేకపు విలువ వుండేదేమో! అది పర్వత ప్రాంతాలలోనే (ముఖ్యంగా హిమాలయాలలోనే) ఏపుగా పెరిగేదట. దాన్ని కిరాతులనుంచి ఆర్యులు కొంటూ వుండేవారట. కిరాతులను హీనంగా చూచినా, వారిపట్ల హేయంగా ప్రవర్తించినా, వారినుంచి కొన్న ,సోమవల్లిని ఆర్యులు మహా పవిత్రమైనదాన్నిగా పరిగణించేవారు. అనంత, అమృత, ఇందులేఖ, కుండలి, కుల్వ, చంద్రిక, చక్రలక్షణ, ఛిన్న, ఛిన్నరుహా, జీవంతి, తంత్రిక, దేవనిర్మిత, నిర్జర, మధుక, మధుపర్ణి, వత్సాదని వయస్థ, విశ ల్యాది ఘనాతిఘనమైన పేర్లతో పిలుస్తూ, దాన్ని వారు కళ్ళకు అద్దుకొంటూ వుండేవారు.

ఎంతైనా వెచ్చించి, ఏదో ఒక విధంగా సోమవల్లిని కొనవలసిందే; దాన్ని వినియోగించి, ప్రతిగృహస్థు తన శక్త్యానుసారం ఏదో ఒక యజ్ఞాన్ని జరిపించవలసిందే. ప్రత్యేకించి సోమయజ్ఞాలు ఏడు వుండేవి. అవి : అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్యము, షోడసి, అతిరాత్రం, ఆప్తోర్యామం, వాజపేయం. వీటి కంటె రాజసూయం, అశ్వమేధం గొప్ప యజ్ఞాలు కాబట్టి, వీటి సందర్భంలో యాజకు లేమి, ఋత్విజు లేమి సోమంలో ఓలలాడే వారని అనుకోవచ్చు.

సోమం మద్యంకాదని కొందరి వాదం. వేదకాలంలో మద్యాన్ని "సుర" అనే వారట. ఒక సుర మాత్రమే కాదు, దానితో పాటు "మధువు"[6] వుండేది, "పానం" [7] వుండేది, "పరిస్రుత"[8]వుండేది. "సౌవీరం" వేదకాలంలో లేదను కొంటే, పురాణాలకాలానికి అది వాడుకలోకి వచ్చింది. ఏదో ఒక సందర్భం కల్పించుకొని, ఈ మద్యా లన్నింటిని సేవిస్తూనే వుండేవారు. తక్కినవాటికి లేని ఘనత ఏదో సోమానికి వుండేది. దాన్ని నీళ్ళతో, పాలతో, పెరుగుతో, నేతితో, తేనెతో కలిపి తూగుతూ వుండేవారు. అందువల్ల అది సురవలె ఎక్కువ మత్తుగలిగించేది కాదని అనుకోవాలి. దాన్ని పోల్చవలసింది బహుశా బీర్, వైన్, షాంపేన్ వగైరాలతో; విస్కీ, బ్రాందీ, రమ్, వోడ్కా వగైరాలతో కాదు. సురను ఋగ్వేదంలో కొన్ని చోట్ల ప్రశంసించారు, కొన్ని చోట్ల నిరసించారు. దాన్ని నిరసించడానికి ఒక ముఖ్యకారణం ద్యూతగృహాలలో (వీటిని "సభలు" అనేవారు) దాన్ని మితిమీరి సేవించడం కావచ్చు. అయితే, కొన్ని యజ్ఞాలలో సోమంతోపాటు సురకు స్థానం వుండేది; సౌత్రామణి యజ్ఞంలో కేవలం సురనే వినియోగించేవారు.[9]

మాంసం లేనిదే మద్యం రుచి సగం చస్తుంది. ఏదో ఒక రూపంలో మద్యపానం విశేషంగా జరిగిన వేదకాలంలో మాంసభక్షణ సయితం విశేషంగా కొనసాగిందని ప్రత్యేకించి చెప్పనక్కర లేదు. గోమాంసం సమేతంగా అని మాంసాలను అప్ప

V.R. NARAYANA RAO LIBRARY
A.C.C. No.
D.P.R.L. HYDERABAD

టిలో ఆరగించేవారు. ఇవి ఒక పాషండుని వాఎపు మాటలు కావు; ని. కున్హన్ రాజా వ్రాసిన మాటలు. ఆయన కేరళ రాజకుటుంబానికి చెందిన వాడు. సాంప్ర దాయిక పద్ధతులలో సంస్కృతంలో పాండిత్యం సంపాదించిన పిమ్మట మద్రాసు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో చదివి, డాక్టరేట్ పొందినట్టివాడు. వైదికవాఙ్మయంలో ప్రత్యేక పరిశోధనలు జరిపి, కీర్తిప్రతిష్ఠలు తెచ్చుకొన్నట్టి వాడు. మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలలోనే గాక, హెహరాన్ యూనివర్సిటీలో సయితం సంస్కృతం ప్రొఫెసర్‌గా పనిచేసినట్టివాడు. వేదాలనుగురించి, వేదకాలం ప్రజలనుగురించి మిడి మిడి జ్ఞానంతో మాట్లాడేవారి మాటలకు విరుద్ధంగా, ఆర్షవిజ్ఞానాన్ని గురించి, దానిలోగల ఆధ్యాత్మిక సంపదనుగురించి లేనిపోని గొప్పలకు పోయేవారి వ్రాతలకు వ్యతిరేకంగా, ఆయన అనేక విషయాలు వ్రాశాడు. ఆయన వ్రాసిన ప్రతిదానితో నేను ఏకీభవించలేను గాని, కొన్ని నిజాలను కుండ బద్దలగొట్టినట్టు చెప్పినందుకు ఆయనను నేను హర్షిస్తాను. వాటిలో (ఆయన పలుకులలోనే) ఒక నిజ మిది: "వారు (వేదకాలంనాటివారు) తినేవారు. తాగేవారు; వారు మాంసం తినేవారు, మద్యం తాగేవారు. గోమాంసాన్ని కూడా వారు తినేవారు.[10]

తక్కినవారు తృప్తిగా తినగా, ఋషు లేమో సుష్ఠుగా తినేవారు; తక్కిన వారు తృప్తిగా తాగగా, ఋషు లేమో మస్తుగా తాగేవారు. ముఖ్యంగా సోమ పానం వారికి "మౌనేయ ఉన్మాదం" కలిగించేది. తైత్తిరీయోపనిషత్తు దాన్ని "బ్రహ్మానందం" గా అభివర్ణించింది.[11] అందువల్లనే కావచ్చు, వేదాలను "అపౌరు షేయా" లన్నారు. అన్నట్టు, పరమేశ్వరుడు చెప్పినదాన్ని ఋషులు చెవిద్వారా విని, నోటివెంట పలికేవారుకారట; కంటిద్వారా చూచి, నోటివెంట పలికేవా రట. అందువల్లనే వారు "మంత్రద్రష్ట" లట; అందువల్లనే వారిద్వారా మనకు సంక్రమించినట్టివి "దార్శనిక శాస్త్రా" లట!

ఏమైనా, బ్రహ్మానందంలో పడి, ఋగ్వేదఋషులు కోరింది ముక్తిని కాదు, భుక్తినే; మోక్షాన్ని కాదు, మోదాన్నే; జన్మరాహిత్యాన్ని కాదు, జగతిలో సర్వ సౌఖ్యాను భూతినే. తిరిగి ఇవి నా మాటలు కావు; కున్హన్‌రాజా మాటలు. "ఇది ద్రవ్యం (మ్యాటర్), అది ఆత్మ (స్పిరిట్)" అనే విభేదాన్ని ఋగ్వేదం చేయలేదని ఆయన వివరించాడు. "జీవంతో కూడిన ద్రవ్యమే, లేదా ద్రవ్యంతో కూడిన జీవమే" ఋగ్వేదానికి తెలుసునని ఆయన విశదీకరించాడు. ఈ జగత్తులోనే మానవుడు జన్మసాఫల్యాన్ని పొందగలడని, ఇందుకోసం పరలోకాలకు పయనించన క్కరలేదని ఆయన ఉద్ఘాటించాడు. "వేదసంస్కృతి సారాంశాన్ని చెప్పవలసిందిగా

నన్ను ప్రశ్నిస్తే నా ప్రత్యుత్తరం; 'ఈ సుందర జగత్తులో సుఖమయజీవితం' అని ఆయన ఉద్ఘోషించాడు.[12]

కున్హన్ రాజా చెప్పడం దేనికి? ఋగ్వేదాన్ని ఒకసారి తిరగవేస్తే మనకే తెలుస్తుంది- ఋషుల యజ్ఞాలు, యాగాలు,క్రతువులు మొదలైన వన్నీ ఐశ్వర్యం కోసమని, ఆరోగ్యం కోసమని, ఆయుర్దాయం కోసమని. ఐశ్వర్యాన్ని కోరినప్పుడు వారు ఆవులు కావా లన్నారు, గుఱ్ఱాలు కావాలన్నారు, పాడి కావాలన్నారు, పంట కావాలన్నారు, సంతానం కావా లన్నారు. అస్త్రశస్త్రాలు కావా లన్నారు, రథాలు కావాలన్నారు, అన్నింటి కంటే ముఖ్యంగా దాసులను, దస్యులను, పణులను, అసురులను, అన్యులను వధించి, వారి సిరిసంపత్తులను దోచుకోగల బలదర్పాలు కావాలన్నారు. ఆరోగ్యం విషయంలో అన్ని రుగ్మతలనుంచి రక్షణ కావాలన్నారు, వజ్రదేహాలు కావా లన్నారు, అరిభీకరత్వం కావాలన్నారు, ఆయుర్దాయాన్ని కోరిన ప్పుడు "నూరు హిమాల" పాటు జీవితం కావా లన్నారు. అంతే తప్ప "ఈ జగం మిథ్య" అనలేదు. "ఈ బ్రతుకు బుద్బుదప్రాయం" అనలేదు. ఆ సిద్ధాంతా లను ప్రతిపాదించినవారు ఉపనిషత్తుల ఋషులు. వారిలో అతి ముఖ్యుడైన యాజ్ఞవల్క్యుడు పారమార్థిపార్మార్థిక సత్యంగా "ఆత్మే సర్వస్వం" అని జనక మహారాజుకు బోధించాడు. అయితే. పారమార్థికసత్యం కడుపు నింపదు కాబట్టి, వ్యావహారికసత్యాన్ని పాటించి, ఆ మహారాజునుంచి పదివేల గోవులను దానంగా పుచ్చుకొన్నాడు. వాటిని ఉత్తినే పుచ్చుకొనడమైనా కాదు, ఒక్కొక్క కొమ్ముకు పదేసి పసిడి మాడలు కట్టించుకొని మరీ పుచ్చుకొన్నాడు! "తన కాలంలో యాజ్ఞ వల్క్యుని మించిన వేదాంతి లేడు; అతడిని మించిన ధనాశాపరుడు సయితం లేడు" అని దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ వ్రాసింది అక్షరాలా సత్యం.[13]

పేరుకు ఉభయులూ ఋషులే అయినా, ఋగ్వేద కాలంనాటి ఋషి తాత్త్విక దృక్పథానికి, ఉపనిషత్తుల కాలంనాటి ఋషి దృక్పథానికి విశేషవ్యత్యాసం గోచ రిస్తుంది. పురాణాల కాలంనాటి ఈ వ్యత్యాసం మరింత పెరుగుతుంది. ఆర్థిక, సాంఘిక వ్యవస్థలలో వచ్చిన విస్తృత పరిణామాలు ఇందు కొక కారణం; ఆర్యేతరులతో ఆర్యుల నిత్యసంఘర్షణవలె నిత్యసాహచర్యం మరొక కారణం. ఇక్కడికి వచ్చినప్పుడు ఆర్యులు గోపాలకులు. ధన మంటే వారికి గోధనమే గోవులే వారికి "కరన్సీ" అంటే ఆశ్చర్యంగా తోచవచ్చు గాని. అది చారిత్రక సత్యం. "గోపతి" అంటే వారికి ఆబోతు మాత్రమే కాదు, భూపతి తోపాటు సూర్యచంద్రులు, మరికొందరు దేవతలు కూడా. "గోమేధం" అంటే

యజ్ఞం. "గోఘ్నుడు" అంటే అతిథి. "గోత్రం" అంటే ఆదిలో గోగణం, లేదా గోశాల, కాలక్రమాన కులం వంశం, ఋషిసంతతి దానికి రూఢార్థాలుగా పరిణ నించాయి. ఋగ్వేదకాలం ప్రారంభదశలలో గోపాలనకున్న ప్రాధాన్యానికి ఇట్టి నిదర్శనాలు కొన్ని వందలు చూపించవచ్చు. ఉపనిషత్తుల కాలానికి ధన మంటే కేవలం గోధనమే కాక, బంగారం కూడా. అందువల్లనే జనకమహారాజు నుంచి పదివేల గోవులతో పాటు, ఇరవై వేల పసిడి మాడలను కూడా (యాజ్ఞవ ల్క్యుడు దక్షిణగా పుచ్చుకొన్నాడు. నాటికి గోపాలన ప్రాధాన్యాన్ని వ్యవసాయం కొంతవరకు తగ్గించింది. ఎక్కడ పచ్చిక బీడు లుంటే అక్కడికి తమ నివాసా లను మార్చడాన్ని ఆర్యులు తగ్గి చారు; గ్రామాలలో స్థిరపడిపోవడం సాగించారు; గ్రామాలు పట్టణాలుగా పెంపొందడు ప్రారంభమైంది. చిన్న తెగలు పెద్ద తెగలుగా కలియడం, పెద్ద తెగలు విడివిడి రాజ్యాలుగా నెలకొనడం మొదలైన మార్పులు కూడా జరిగాయి.

ఆర్థిక, సాంఘిక వ్యవస్థలలో ఈ పరివర్తనల సరసనే భావసరళిలో సయితం కొత్త ధోరణులు ద్యోతకమైనాయి. ఋగ్వేదకాలంనాటి మతం (మానవ వికాస శాస్త్రజ్ఞుల పరిభాషలో) " మ్యాజిక్". వేటనుగురించిన చిత్రాలను తన గుహలో చిత్రిస్తే, వేటాడడానికి తనకు ఎక్కువగా జంతువులు దొరకగలవని ఆదిమానవుడు విశ్వసించేవాడు. ఋగ్వేదకాలంనాటి ఆర్యులు అంతకంటె నాగరికతలో కొన్ని మెట్లు పైకి వెళ్ళినట్టివారు. ఒక్కొక్క ప్రకృతిశక్తికి ఒక్కొక్క దేవతగా రూపక ల్పన చేసుకొనడం; మంత్రశక్తితో కోరిన దేవతలను ఆవాహన చేయగల లన్నింటిని చేయించుకొనగలమని నమ్మడం-ఇంతవరకు వారు ఎదిగివచ్చారు. మానవనాగరికత చరిత్రను పరిశోధించిన పెక్కుమంది పండితుల తీర్మానం ప్రకారం, ఆర్యుల మత విశ్వాసాలకు పూర్తిగా భిన్నమైనట్టివి వారు ఇక్కడికి చేరినప్పుడు ఆనార్యజాతులలో ప్రచారంలో వుండేవి. ఉదాహరణకు, కర్మసిద్ధాంతం ఆర్యేతరం; జన్మపునర్జన్మల సిద్ధాంతం ఆర్యేతరం; సర్వసంగపరిత్యాగం, కర్మసిద్ధాంతం ఆర్యేతరం; యతుల వ్యవస్థ ఆర్యేతరం; తపస్సు ఆర్యేతరం; యోగశాస్త్రం ఆర్యేతరం; తాంత్రిక దేవా లయాలు, విగ్రహారాధన ఆర్యేతరం; అవతారసిద్ధాంతం ఆర్యేతరం; ఒక్క మాటలో, ఈనాడు హిందూమతంలో ముఖ్యాంశాలుగా చెల్లుతున్న అనేక విశ్వాసాలేమి, దానికి ప్రధానంగాలుగా చెల్లుతున్న అనేక ఆచారవ్యవహారా లేమి ఆర్యేతరం. ఇక్క డికి వచ్చిన కొత్తలో ఆర్యేతరమైన ప్రతిదాన్నీ ఆర్యులు నిరసించినా, నిందించినా, నిర్మూలించడానికి ప్రయత్నించినా, నెమ్మదినెమ్మదిగా ఆర్యేతర విశ్వాసాలను, జీవి

తవిధానాన్ని పంచుకొనడం ప్రారంభించారు. యతులపై ఇంద్రుడు తన కుక్కలను ఉసిగొలిపి, వారిని చంపించినట్టు ఋగ్వేదం చెబుతున్నది.[14] రామాయణకాలంవరకు యతులపట్లఆర్యఋషులకు! వైరభావం సమసి పోలేదని, శంబుకుడు యతి కను కనే, అతడిని రామునిచే వారు చిత్రవధ చేయించారని నేను నమ్ముతున్నాను. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. వైదిక్కృషులతో ఔపనిషద ఋషులకు, వారితో పౌరాణికఋషులకు సామ్యం చాలావరకు ఒక్క పేరులోనే!

పౌరాణికఋషు లందరినిగురించి కాక, రామాయణ ఋషులనుగురించి మాత్రమే కొంత ప్రస్తావించి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. ఋగ్వేదంలో మనకు తగిలే అగస్త్యుడు, వసిష్ఠుడు రామాయణంలో ప్రముఖపాత్ర వహిస్తారు. అయితే, వారే వీరు కారు; ఆ మూలపురుషుల వంశానికి చెందినవారు. ఆ మూలపురుషు లిద్దరి జనన వృత్తాంతంవెనుక ఒక చారిత్రకసత్యం దాగివున్నట్టు డి.డి. కోశాంబి వ్రాశాడు. సుమేరియన్, బాబిలోనియన్, ఆసీరియన్ నాగరికత లలోవలె హరప్పన్ నాగరిక తలో సయితం దేవతలసేవకై దేవదాసీలను నియోగించేవారట. అప్పటిలో వారిని అప్సరస లనేవారట. తండ్రి ఎవరో నిర్ధారణగా తెలియనప్పుడు ఈ అప్సరసల సంతానాన్ని "కుంభసంభవు" లనేవారట. కోశాంబి వివరణ ప్రకారం, మొహెంజొదారో త్రవ్వకాలలో బయల్పడినట్టిది కేవలం స్నానపానాదులకై ఉద్దేశించబడిన తటాకం కాదు; అది మతసంబంధమైన పుష్కరిణి. దాని అంచులలోని గదులు అప్సరసల శయ్యామందిరాలు. అగస్త్య వసిష్ఠుల జన్మస్థానాలు ఆ మందిరాలే అని కోశాంబి చేసిన సూచన అసంబద్ధమైనదిగా నామట్టుకు నాకు ఎంతమాత్రం అనిపించడం లేదు.[15]హరప్పన్ నాగరికతకు సంబంధించిన శిల్పాలు బహు స్వల్పంగానే లభించాయి. వాటిలో ఒకటి పూజారి శిల్పం కావడం, మరొకటి అప్సరస శిల్పం కావడం ప్రత్యేకించి గమనార్హ మైన విషయంగా కోశాంబి సూచనను చదివిన మీదట నాకు స్ఫురిస్తున్నది.

విశ్వామిత్రవంశానికి మూలపురుషునిగురించి కూడా కోశాంబి మౌలికమైన కొన్ని భావాలను వెల్లడించాడు. వాటి వివరాలలోకి వెళ్ళక, ఒకే ఒక్క మాట చెప్పి సరిపుచ్చుతాను. కోశాంబి పరిశోధనలప్రకారం గోత్రఋషుల ఎనిమిదిమందిలో ఒక్క విశ్వామిత్రుడే స్వచ్ఛమైన ఆర్యుడు; తక్కినవారు అనార్యులు, లేదా ఆర్య, అనార్య జాతులవారి మిశ్రమసంతానం.[16]గోత్రాల బండారాన్ని బయట పెడుతూ మరింత విపులంగా ఆయన వ్రాసిన ఒక పరిశోధన వ్యాసం వున్నది. కోరినవారు దాన్ని కూడా చదువుకోవచ్చు.[17]

అగస్త్య, వసిష్ఠ, విశ్వామిత్రులు గాని, అత్రి, భరద్వాజులు గాని సన్యాసులు కారు, సంసారులే. శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, ధర్మభృత్తు మున్న గువారు సంసారులని రామాయణం స్పష్టంగా చెప్పక పోయినా, వారు సయితం సన్యాసులైనట్టు తోచదు. వేదాలలోగాని, బ్రాహ్మణాలలోగాని, దశోపనిషత్తులలో గాని "సన్యాసి", "పరివ్రాజకుడు" అనే మాటలు కనబడవు. అప్పటిలో వర్ణాలు నాలుగైనా, ఆశ్రమాలు మూడు మాత్రమే. తన జీవితం చివరిఘట్టంలో సంసారాన్ని మరి విడిచిపెట్ట గోరినప్పుడు యాజ్ఞవల్క్యుడు తన భార్య లిద్దరితో- మైత్రేయితో, కాత్యాయినితో-తాను సన్యాసాశ్రమంలో ప్రవేశించబోతున్నట్టు చెప్పడు. బౌద్ధమతాన్ని అరికట్టడానికి కల్పించబడినట్టిదే సన్యాసాశ్రమం.[18]

ఏమైనా అత్రి, అగస్త్యాదుల విషయంలో రామాయణం "ఋషి", "ముని", "తాపసి" అనే వాటిని పర్యాయపదాలుగా ప్రయోగించింది. ఈ పదాలమధ్య అర్థ భేదాలు లేవా? కేవలం ఋషినే తీసుకొన్నా, వేదాల కాలంలో అతడు యజ్ఞ యాగాలను చేసేవాడు; ఉపనిషత్తులకాలం వచ్చేసరికి యజ్ఞయాగాలను విరమించి, వాదోప వాదాలపట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాడు. (యూరోపియన్ తత్త్వశాస్త్ర పరిభాషలో ఉపనిషత్తుల ఋషులు "సోఫిస్టులు"). కాగా మునులనేవారు మౌనాన్ని పాటిస్తూ, ఏదో మంత్రాన్ని జపిస్తూ పోయేవారు; తాపసు లనేవారు శరీరక్లేశాలద్వారా నిర్లిప్తతను సాధించడానికి యత్నించేవారు; విభిన్నమైన ఈ ఆధ్యాత్మికసాధనలను పరిపాలించేవారిని "ఒకే కాడికింద కట్టడం" ఎంతవరకు భావ్యం ఇంతేకాక, దండకారణ్యంలోని ఆర్యులను వానప్రస్థులుగా పెక్కుచోట్ల రామాయణం పేర్కొంటున్నది. వానప్రస్థాశ్రమాన్ని వనాలలోనే గడపాలంటే, ఆర్యప్రాంతాలలో అవి లేనట్టు దండకారణ్యానికే ఎందుకు వెళ్ళాలి? తమ కథనంప్రకారమే అక్కడివారు ఘోర రాక్షసులు, నరమాంసభక్షకులు. వారిమధ్యకు కావాలని వెళ్ళడం దేనికి? ప్రాణాపాయాన్ని ఆహ్వానించడం దేనికి?

ఇన్ని ప్రశ్నలకు అవకాశ మివ్వడంతో పాటు, దండకారణ్యంలోని ఋషులను గురించి రామాయణం వింతలను, విడ్డూరాలను పెక్కింటిని పేర్కొంటున్నది. వైఖానసులనే ఋషులు బ్రహ్మదేవుని గోళ్ళనుంచి పుట్టినవారట! వాలఖిల్యులు ఆయన రోమాలనుంచి పుట్టినవారట. పోతే, కొందరు ఋషులు చంద్రసూర్యుల కిరణాలనే దాహంగా పుచ్చుకొంటారట. కొందరు ఆకులనే ఆహారంగా నియోగిస్తారట. కొందరు గొంతువరకు నీళ్ళలో నిలబడి తపస్సు చేయగా, మరికొందరు ఎల్లప్పుడుతడిబట్టలతోనే వుంటారట. కొందరు అసలు నిద్రపోరట;

మరికొందరు రొమ్ముపైకి, లేదా భుజాలపైకి తలవాల్చి నిద్రపోతారట. కొందరు పంచాగ్నుల మధ్యలో తిష్ఠవేసి తపస్సు చేస్తారట. (ఆరణ్యకాండ, ఆరవ సర్గ).

ఆధ్యాత్మికోన్నతిని కోరి, ఇన్ని కఠోరసాధనలను చేసినా, వీరు ఆయుధాలను విసర్జించినట్టు కనబడదు. విశ్వామిత్రునికి తెలియని అస్త్రశస్త్రాలు లేవట. కావాలంటే, కొత్తవాటిని ఆయన పుట్టించగలడట (బాలకాండ,21వ సర్గ). అగస్త్యుడు విష్ణుమూర్తి విల్లును, బ్రహ్మదేవుని బాణాలను, ఇంద్రుని కత్తిని, అమ్ముల పొదులను రామునికి బహూకరించాడట (ఆరణ్యకాండ, 12 వ సర్గ). పైగా, సకల దివ్యశక్తులు ఈ ఋషుల కున్నాయి. వారు త్రికాలజ్ఞులు. ఎంతటి శాపమైనా తగిలించగలరు. అయినప్పుడు రాక్షసులకు ఏదో శాపం తగిలిస్తే, తమకు వారి పీడ వదిలేది కాదా? ఆ పని చేయక రాముని రక్షణ కోరడం దేనికి? చేతుని జోడించి, " ఓ విస్తార కీర్తిగల రాముడా! మమ్ము నందఱను నీవు రక్షించువాడవు గావున, మాచే బూజింపను గారవింపను దగినవాడవు. రాజు దుష్టులను శిక్షించి, శిష్టులను బాలించువాడు గాన దండ్రితో సమానుడు. నృపాలుడు దేవేంద్రుడు నాల్గవ యంశమునను, తక్కిన లోకపాలుర యంశమునను బుట్టి జనులను బాలించుచున్నాడు గావున, నృపాలుడు జనుల పొగడ్తల గైకొనుచు మేలి భోగముల ననుభవించుచున్నాడు. అట్లే నీ దేశ వాసులమైన మేము నీచే గాపాడ దగినవారము. సకల జనముల బాలించు నీ వరణ్యవాసివైనను; పురవాసివైనను మా యేలికవు. మే మన్ననో యాయుధములను విడిచి, కోపము నడచుకొని, యింద్రియముల గెల్చినవారమై, తపస్సే ధనముగా నెంచి, యా తపోధనమును గడించుచున్నారము. మేము మీ బిడ్డలవంటివారము. కాబట్టి నీవు మమ్మెల్లప్పుడు రక్షింపవలయును" అని ఎందుకు మొరపెట్టుకోవాలి? (ఆరణ్యకాండ, ఒకటవ సర్గ). ఇంతటితో సరిపుచ్చక "మమ్ములను సంరక్షించడంలో నీ ధర్మాన్ని నీవు పరిపాలిస్తే, మా తపఃఫలంలో నాల్గవ వంతు నీకు దక్కుతుంది." అని ఎందుకు ఆశ చూపించాలి? (ఆరణ్యకాండ, ఆరవ సర్గ). చిత్రకూట పర్వతంవద్ద సీతారామ లక్ష్మణులు ప్రశాంతంగా కాలం గడుపుతూ వుండాగా "మీ రిక్కడ వుంటే, మాకు రాక్షసులపీడ పొచ్చగల" దని చెప్పి, వారిని మరింత దక్షిణదిశకు (మరింతగా రాక్షసుల మధ్యకు) ఎందుకు పంపించాలి? దీనిలో పెద్ద కుట్ర లేదా? ఈ కుట్రను ఖరదూషణుల వధానంతరం ఋషులు స్వయంగానే వెల్లడించలేదా? ఆ సందర్భంలో వారి పలుకులివి; "రామా! యిక్కార్యము నిమిత్తమే, పురందరుడు, పాకశాసనుడు, గొప్ప వెలుగు గలవాడునైన" దేవే

ద్రుడు పున్నెముల నొసగు శరభం గాశ్రమమునకు వచ్చియుండెను. ఓ రాఘవా! పాపంపు బను లొనర్చు నీ క్రూరరాక్షసు వధ నిమిత్తమే మహర్షులందఱు నిన్ను పాయముచే నిచ్చటికి జేరునట్లొనర్చిరి. ఓ దశరథనందనా! మేము తలపెట్టిన యిక్కార్య మీడేరిన దయ్యెను.ఇక మహర్షు లీ దండకయందలి యాశ్రమములందు స్వవిహితకృత్యముల నింపుగా జేయగలరు." ఈ పలుకులను పురస్కరించుకొని, చిత్ర కూటంనుంచి పంచవటికి రాముని తరలించడంలో ఋషులు పెద్ద కుట్ర పన్నినారని అమృతలింగం చేసిన ఆరోపణ పూర్తిగా సహేతుకమైనది కాదా?[19]

భక్తులవలె కాక, మేధావులవలె రామాయణాన్ని చదవగలవారికి ఒక ముఖ్య విషయం ఆకళింపుకు రాకమానదు. మనపై రామాయణ ప్రభావం తగ్గనంతవ రకు మనమధ్య బాబాలు, భగవాన్‌లు, అమ్మలు, అమ్మమ్మలు తలయెత్తుతూనే వుంటారు; మూఢమార్గం వెంట మనను నడుపుతూ, నిలుపుదోపిడి చేస్తూనే వుంటారు.

*

ఋషులకుట్రలో రామునిపాత్ర

"ఋషులెవరు?" అనే ప్రకరణంలోనే యజ్ఞయాగాదుల నెపంతో వారు దండకారణ్యంలో ఆశ్రమాలను ఎందుకు నెలకొల్పారో వివరించాలని ఆదిలో నే ననుకొన్నాను. కాని, ఆ ఘట్టాన్ని చేరేసరికి దాన్ని గురించి చెప్పవలసింది చాలా వున్నట్టు తోచింది. అందువల్ల ఒక ప్రకరణాన్ని అందుకు ప్రత్యేకిస్తున్నాను.

గుఱ్ఱాలను వూన్చిన రథాలతో, కొత్తతరహా గొడ్డళ్ళతో ఇక్కడకు చేరిన ఆర్యులు ధ్వంసంచేసింది హరప్పన్ నాగరికతకు చెందిన పురాలను మాత్రమే కాదు, దాని వ్యావసాయికవ్యవస్థను కూడా. అందువల్లనే వారి దేవాధిదేవుడైన ఇంద్రుని "పురందరుడు" అనే దానితోపాటు "వృత్రహుడు" అనేది కూడా ఒక బిరుదనా మమైంది. "పురందరః" అనే పదానికి "శత్రుపురములను వ్రక్కలించిన వాడు" అని "గురుబాలప్రబోధిని" స్పష్టంగా అర్థం చెబుతున్నది. ఇంద్రుడు వ్రక్కలించినట్టివి హరప్ప, మొహెంజొదారో, చాన్‌హుదారో, కాళీబంగన్. లోథాల్

మొదలైన పురాలు. వీటిలో తక్కినవి హరప్ప. మొహెంజొదారోలవలె పెద్దవి కాకపోవచ్చుగాని, అవి సయితం పురాలే. ఇంద్రుడు నాశనంచేసినట్టి పురాలలో ఒకటిగా ఋగ్వేదం పేర్కొంటున్న "హరియూపియా" అనేది హరప్ప కావచ్చు; అగ్నిదేవుడు భస్మీపటలం చేసినట్టు ఋగ్వేదమే చెబుతున్న "నార్మిణి" మొహెంజొదారో కావచ్చు[1] అన్నట్టు "సూర్యరాయాంధ్ర నిఘంటువు" ప్రకారం, "పురందరు"డంటే ఇంద్రునితో పాటు అగ్నిదేవుడు కూడా. పురాల విధ్వంసనకార్య క్రమంలో వారిద్దరు గట్టిగా పోటీపడి వుండాలి!

నగర సంబంధమైనది నాగరికత. ఆటవికులకు నగరం నచ్చదు, నాగరికత అంతకంటె నచ్చదు. గోడలంటేనే వారికి కంపరం. అవి వారికి గోరీని గుర్తుకు తెస్తాయి. కప్పుకింద వారికి శ్వాస సరిగా ఆడదు. అందువల్ల నగరాలు తమ చేజిక్కితే, వారు చేసే మొట్టమొదటి పని వాటిని నేలమట్టం చేయడం! వేదకాలం నాటికి నాలుగైదు వేల సంవత్సరాలు వెనకకు వెళ్ళవలసిన పని లేదు. క్రీస్తుశకం అయిదవ శతాబ్దిలో నాటికి తెలిసిన ప్రపంచంలో అధికభాగాన్ని జయించిన హూణులు నగరాలను ధ్వంసంచేసి, ఆరుబయట డేరాలు వేసుకుని, వాటిలో బ్రతుకుతూ వుండేవారు.[2] నగరానికి, నగరవాసానికి వారు అలవాటు పడ్డానికి చాలాకాలం పట్టింది. ఋగ్వేదకాలంలో ఇక్కడికి వలస వచ్చిన ఆర్యులు ఆటవికులు కాకపోవచ్చుగాని, ఆటవికస్థితికి ఒకటి, లేదా రెండు మెట్లు పైగా వున్నట్టివారు. అందువల్ల హరప్పన్ నగరాలను వారు నుగ్గుచేయడం వింతకాదు; నగరాలు కేంద్రాలుగా వర్తకవ్యాపారాలను కొనసాగించే వణిక్కులను (ఋగ్వేదంలో వీరిని "పణు"లన్నారు) ఊచకోత కోయడం విడ్డూరం కాదు. కాని, వ్యావసాయిక వ్యవస్థను వారెందుకు నాశనం చేశారు? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరం "వృత్రహాడు"అనే పదంలో దాగివున్నది. "గురుబాలప్రబోధిని" ఆధారంగా "వృత్రు హాడు- వృత్రం హతవాన్-వృత్రాసురుని జంపినవాడు" అని సరిపెట్టుకోనడానికి వీలు లేదు. "వృత్రము" అనే పదానికి "శ్యామిక" (చీకటి), "హిమాలయం"(కొండ) అనే అర్థాలు మన నిఘంటువులలో వున్నాయి. కాగా, సంస్కృతభాషలో గొప్ప పండితులైన కొందరు "వృతము" అనే మాటకు "అవరోధం" , "అనకట్ట" అనే అర్థాలను కూడా చెప్పవచ్చు నన్నారు. వీరి వాదాన్ని బలపరచడానికి ఋగ్వేదంలోనే ఒకచోట కృతిమ రోధస్సులను (గట్లు, గోడలు, చెలియలికట్టలు మున్నగువాటిని) ఇంద్రుడు తెగగొట్టగా, వాటి రాళ్ళు రథచక్రాలవలె దొర్లుకు పోయినవని, నదీజలాలు తిరిగి నిరాటంకంగా ప్రవహించాయని స్పష్టంగా వున్నది.

అయినప్పుడు "వృతహూడు" అంటే సరైన అర్థం "ఆనకట్టలను తెగగొట్టినవాడు" అని తప్ప మరొకటి కావడానికి వీలు లేదు.[3] వృత్రాసురుడు కొండ చరియపై నల్లని త్రాచుపామువలె పరుండివుండగా ఇంద్రుడు అతడిని వధించడాని ఋగ్వేదం చెప్పడం తిరిగి ఈ తీర్మానాన్నే బలపరుస్తున్నది.

ఆనకట్టలపై ఆర్యులకు నిర్మిమిత్తంగా ఆగ్రహం కలగలేదు. ఇప్పుడు మనం చేస్తున్నది మెట్టసాగు, లేదా పల్లంసాగు. హరప్పన్ రైతులు చేసిన సాగుకు ఈ రెండు వేర్లలో ఏదీ వర్తించదు; దాన్ని ఒక కొత్త పేరుతో-"వరదసాగు" అనే పేరుతో-పిలవాలి. అప్పటిలో ఇనపకళ్ళు నాగళ్ళు లేవు; ఇనుమే లేనప్పుడు ఇనపకళ్ళు నాగళ్లు ఎలా వుంటాయి? అప్పటి నాగళ్ళకు చెకుముకి రాళ్ళ కళ్ళులుండేవని[4] కొందరు చెప్పగా, అప్పటిలో నాగళ్ళు లేవని, గసికలనే ఉపయోగించే వారని[5] మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏమైనా, అప్పటిలో నేలను బాగా తడిపి, ఏదో ఒక తీరులో దాన్ని దమ్ము చేయవలసి వచ్చేది. ఇందుకోసం నదులకు, వాగులకు ఎక్కడికక్కడ ఆనకట్టలు కట్టి, వాటి ప్రవాహాలను పొలాలపైకి మళ్ళించి, కొన్ని రోజులపాటు నేలను వరదనీటిలో నాన నిచ్చేవారు. అందుకే నాటి వ్యవసాయాన్ని "వరదసాగు" అనడం! ఈనాటికి కూడా బలూచ్ ప్రాంతంలో సగటున 300 అడుగుల పొడవుతో, ఎనిమిది అడుగుల వెడల్పుతో ఎన్నో ఆనకట్టల అవశేషాలు కనబడుతున్నాయి. హరప్పన్ కాలంనాటి ఆనకట్టలు ఇలాగే వుండేవని అనుకోవచ్చు. ప్రస్తుతం వీటి పేరు "గబర్ బండ్‌లు".[6]

పరగణాలకు పరగణాలే వరదనీటిలో మునిగివుంటే, ఆలమందలు ఎక్కడ మేస్తాయి? అందువల్ల పశుపాలన ప్రధాన జీవికగాగల ఆర్యులు ఆనకట్టలను తెగగొట్టేవారు. వందల, వేలసంఖ్యలో గల ఈ ఆనకట్టలను (హరప్పన్ రైతులు అడ్డుపడుతుండగా) తెగగొట్టడం ఆర్యులకు ఒక గడ్డు సమస్యగా పరిణమించి వుండాలి. ఇందువల్లనే కావచ్చు, ఋగ్వేదం మొత్తం 70 సార్లు "వృత్రహూడు" గా ఇంద్రుని స్తోత్రం చేస్తున్నది. ఈ విధ్వంసన కృషిలో ఇంద్రునికి సహాయపడినందుకు, కొన్నికొన్ని సందర్భాలలో స్వయంగానే కార్యభారాన్ని వహించినందుకు అగ్ని, సూర్య, సోమ దేవులను, విష్ణువును, అశ్వినులను, మరుత్తులను ఋగ్వేదం ప్రశంసిస్తున్నది.[7] ఈ దేవతలలో కొందరు వృత్రాసురుని ఢాకకు తాళలేక పలాయనం చిత్తగించినట్టు ఋగ్వేదం స్వయంగానే చెప్పడాన్నిబట్టి తమ ఆనకట్టలను కాపాడుకొనడానికి ఎంత పట్టుదలతో హరప్పన్ రైతులు పోరాడినారో మనం ఊహించుకోవచ్చు.

పైగా, వృత్రాసురుడు కేవల మొక రాక్షసుడైతే, అతడిని వధించడానికి ఆర్య దేవగణంలోని ముఖ్యులందరు ఎందుకు రంగంలోకి దిగాలి? అతడిని తిరిగి తిరిగి వధించవలసివచ్చినదన్న అభిప్రాయాన్ని ఎందుకు కలిగించాలి? ఒక్కొక్క ఆనకట్ట ఆర్యుల కళ్ళకు ఒక నల్లని త్రాచుపాములె కనబడివుండాలి; ఒక్కొక్కటి ఒక వృత్రాసురునివలె వారిని కలవర పెట్టివుండాలి.

ఋగ్వేదకాలం ప్రారంభంలో "వృత్రహ" డైన ఇంద్రుడు అటు పిమ్మట "శునాశీరు" డైనాడు. "ఎవనివల్ల నాగళ్లు కదులుచున్నవో అతడు 'నాశీరు' డని "గురుబాల ప్రబోధిని" వివరిస్తున్నది. పశుపోషణనుంచి వ్యవసాయ నికి ఆర్యులు క్రమంగా మారడాన్ని ఇది సూచిస్తున్నది. ఋగ్వేదకాలం ఉత్తరార్ధంలోనే ఈ మార్పు జరిగివుండవచ్చు. ఇందుకు బలమైన సాక్ష్యాధారాలు కొన్ని ఋగ్వేదంలోనే వున్నాయి. మరికొంత దూరం వెళ్ళినతర్వాత వాటిని పేర్కొంటాను.

పశుపోషణకోసం ఒక ఘట్టంలో ఆనకట్టలను తెగగొట్టిన ఆర్యులు మరొక ఘట్టంలో వ్యవసాయ విస్తరణకోసం అడవులను తగలబెట్టడం మొదలు పెట్టారు. సప్తసింధు ప్రాంతంలో స్థిరపడిన తర్వాత వారి జనసంఖ్య పెరిగివుండాలి. ఇంతే కాక, వారి జాతికి చెందిన మరికొన్ని తెగలు ఇక్కడికి వలస వచ్చి వుండాలి. అంతట సప్తసింధుప్రాంతంనుంచి అన్యప్రాంతాలకు విస్తరించడం వారికి అనివార్యమై వుండాలి. వారు విస్తరించగలిగింది ప్రధానంగా ప్రాగ్దిశకే. అది గంగాయమునల ప్రాంతం; వర్షపాతం (సప్తసింధుప్రాంతంలోకంటె) ఎంతో అధికంగావున్న ప్రాంతం; కీకారణ్యాలతో నిండివున్న ప్రాంతం. అక్కడ వ్యవసాయం మొదలు పెట్టాలన్నా, అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొనవలెనన్నా, అందుకు మున్ముందుగా-తప్పనిసరిగా-చేయవలసిన పని అక్కడి అడవులను తగలబెట్టడమే. మరొక విధంగా ఆ పని చేయడానికి-బుల్ డోజర్ల మాట విడిచిపుచ్చండి-కనీసం ఇనపగొడ్డళ్లు అయినా నాడు లేవు. అందువల్ల అగ్ని దేవుని సహాయాన్ని అర్థించక తప్పేదికాదు.

కొన్ని వేల సంవత్సరాలు వెనుకకు వెళ్ళడం దేనికి? నలభై యేళ్ళనాడు భద్రాచలం సమీపంలోని అరణ్యాలలో కొంత భూమిని సేకరించిన ఒక మిత్రుని "ప్రస్తుతం ఏమి పండిస్తున్నారు?" అని నేను ప్రశ్నించగా "ఇంకా పైర్లు పెట్టడం వరకు రాలేదు; అడవిని తగల బెడుతున్నాను" అని జవాబు చెప్పాడు. "తగల బెట్టడానికి బదులు చెట్లను కొట్టిస్తే, కలపను అమ్ముకొనవచ్చుగదా! కనీసం కట్టె లైనా అమ్ముకోవచ్చుగదా!" అని నే ననగా, "అది కూలిదండుగ పని కాగల" దన్నాడు.

1969లో అండమాన్, నికోబార్ దీవులలో పర్యటననిమిత్తం పార్లమెంట్ సభ్యులబృందంలో ఒక సభ్యుని హోదాలో నేను వెళ్ళినప్పుడు అక్కడి ఉద్యోగులు మాకు చెప్పిన ఒక మాట ఈ సందర్భంలో జ్ఞాపకానికి వస్తున్నది. తూర్పు బెంగాల్ నుంచి (ఇప్పటి బంగ్లాదేశ్ నుంచి) తరలివచ్చిన కాందిశీకులను కొందరిని లిటిల్ అండమాన్ దీవికి చేర్చి, అక్కడ వారి నివాసంకోసం అడవిలో కొన్ని వేల ఎకరాలమేరను బుల్‌డోజర్లతో చదును చేశారు. బుల్‌డోజర్లు పెకలించిన చెట్ల మొదళ్ళను బాదులకింది కోసి గుట్టలుగుట్టలుగా వేర్చారు. ఇక్కడ మన కైతే ఆ కలప మేలిమిబంగారంతో సమానం. కాని, అక్కడివారికి దానితో పని లేదు. అక్కడినుంచి దాన్ని తరలించడానికి వీలున్నా, అందుకు విపరీతంగా ఖర్చు చేయవలసివస్తుంది. ఏ మద్రాసు రేవుకో, కలకత్తా రేవుకో చేర్చడం మాట విడిచి పెట్టండి; పోర్ట్ బ్లెయిర్‌కు చేర్చినా, అది దండుగ బేరమే అవుతుంది. ఎక్కడికీ కదల్చకుండా ఆ కలప గుట్టలను అక్కడనే మిగల్చగా, వాటిలో ఎలుకలు, పంది కొక్కులు ఎక్కువగా చేరి, పైర్లకు చెరుపు చేస్తున్నాయి. ఈ పరిస్థితిలో అగ్నిదేవుని సహాయాన్ని తాము అర్థించక తప్పదేమో అని తాము భావిస్తున్నట్టు ప్రభుత్వాధికారులు మాకు చెప్పారు. నిర్ధారణగా నాకు తెలియదుగాని, చివరికి ఆ దేవుడే దిక్కు అయినాడేమో!

అండమాన్, నికోబార్ దీవులలో నేను చూచిన అడవులను పోలినవే ఒక నాడు గంగాయమునల పీఠభూములలో వుండేవి. వాటిలోని చెట్లు నూరు, నూటయాభై అడుగుల యెత్తువరకు పెరుగుతాయి. కొన్నింటిని మొదళ్ళ కైవారం పది, పదిహేను అడుగులను మించి పోతుంది. చిక్కురొక్కురుగా పెరిగిన ఆ చెట్ల కొమ్మలగుండా, ఆ కొమ్మలపైకి దిట్టంగా ఎగబాకిన తీగలగుండా వెలుతురు కిందికి దిగలేదు. ఇట్టి కీకారణ్యాలలో కాలు పెట్టడం తమకు సాధ్యం కాక పోయినందునే సప్తసింధుప్రాంతంలోని ఆర్యులు గంగాయమునల పీఠభూములలోకి సరాసరిగా విస్తరించ లేదు. ఆ పీఠభూములకు ఉత్తరదిశలో (హిమాలయ పర్వతపంక్తి కి కొంచెం దిగువలో) అరణ్యాల సాంద్రత తక్కువ కాబట్టి, ఆ ప్రాంతంగుండా నేపాల్ వరకు ముందుకు చొచ్చుకు పోయారు. అక్కడినుంచి దక్షిణ దిశకు మరలి, క్రమానుగతంగా గంగాయమునల తీరాలకు చేరారు.[8] అరణ్యప్రాంతంనుంచి అరణ్యప్రాంతానికి ఈ పురోగమనంలో వారికి బాసటగా నిలిచినవాడు అగ్నిదేవుడే!

ఇంతకు పూర్వమే నేను సూచించినట్టు, సప్తసింధు ప్రాంతంనుంచి ఆర్యుల విస్తరణకు అగ్ని దేవుడు విశేషంగా సహాయపడినట్టు చెప్పడానికి ఋగ్వేదంలోనే

అనేక సాక్ష్యాధారా లున్నాయి. వాటిలో ఒకదాన్ని మాత్రమే ఇక్కడ వేర్కొం టాను. బహుశా నేపాల్ దిశలో విస్తరిస్తున్న కాలంలోనే ఆల మంద నడుమ గల ఆబోతుతో అరణ్యం మధ్యగల అగ్నిదేవుని ఋగ్వేదఋషులు పోల్చారు. వాయు వుని ప్రోత్సాహంతో మరింతగా అతడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నా డన్నారు. తడి నాల్కలు కొడవళ్ళవలె ఎండుచెట్లను ధ్వంసం చేస్తున్న వన్నారు. అతడు నడచిన దారి కారునల్లగా మారిపోతున్న దన్నారు[9] ఇది అరణ్యాలను దగ్ధం అవడాన్నిగురించి కవిత్వమే కదా?

మరికొంత కాలం తర్వాత అరణ్యాలను మరింతగా దగ్ధం చేస్తూ తూర్పుది క్కుకు ఆర్యులు ఏ విధంగా విస్తరించారో శతపథబ్రాహ్మణంలోని ఒక ఘట్టం విశదీకరించింది.[10] సరస్వతీనదీతీరంనుంచి తూర్పుగా ముందుకు సాగిపోతూ తన లో గల ప్రాంతా లన్నింటిని అగ్నిదేవుడు పవిత్రం చేశాడట. కాని, సదానీర అనే నదిని దాటి ముందుకు వెళ్ళలేకపోయాడట. (కోసల, విదేహ రాజ్యాల సరిహద్దు లోనిది ఈ నది). అంతట విదేఘ మాధవు డనే రాజు వచ్చి, నదిని దాటడంలో దేవునికి ఆసరాగా నిలిచాడట. అగ్నిదేవుని స్పర్శ తగలనందున అప విత్రమైన మిగిలిపోయినదన్న కారణాన అంతకుముందు సదానీరకు తూర్పుదిశలో బాహ్మణులు నివసించేవారు కారట. అగ్నిసంస్కారంతో పవిత్రమైన ప్రాంతంగా మారినంతనేఅక్కడ వారు నిశ్చింతగా స్థిరపడినారట. కొత్తవలస ప్రాంతాలను నెలకొల్పడానికి ముందు అక్కడి కాననాలను క్షత్రియుల సహాయంతో బ్రాహ్మ ణోత్తములు, ఋషిసత్తములు దగ్ధం చేసేవా రనడానికి దీన్ని ఒక తిరుగులేని తార్కాణంగా పేర్కొన్నది ఒక్క ఎ.ఎల్. బషం మాత్రమే కాదు,[11] భారతీయ చరిత్రకారులు పెక్కుమంది కూడా వున్నారు.

కోసలనుంచి తూర్పుదిక్కుకు ఆర్యులు విస్తరణఘట్టంలో విదేఘ మాధవుని పాత్రకు తుల్యమైనదే కోసలనుంచి నైఋతిదిశలో వారి పురోగమన ఘట్టంలో అయోధ్యారాముని ప్రాత్ర. దీని విశదీకరణకు పూర్వం చెప్పవలసిన విశేషాలు కొన్ని వున్నాయి. మౌర్యులకాలానికి కొంచెం ముందువరకు అరణ్యాలను దగ్ధం చేయడంద్వారా వ్యవసాయ క్షేత్రాల విస్తరణ కొనసాగింది. వ్యవసాయాభివృద్ధి కోసం, యజ్ఞ యాగాదులకోసం, అరణ్యాలలోగల ఫలపుష్పభరిత వృక్షాలనైనా రాజు దగ్ధం చేయించడం ఎంతమాత్రం దోషం కాదని వసిష్ఠ ధర్మసూత్రాలు ఉద్ఘోషిస్తున్నాయి.[12] కాగా, మహాభారతకాలంలో ఖాండవదహనం జరిగింది అగ్ని దేవుని అజీర్ణవ్యాధి నివారణకోసం కాదు. అర్ధరాజ్యం పేరుతో ధృతరాష్ట్రుడు

పాండవుల కిచ్చినట్టిది ఇప్పటి ఢిల్లీ పరిసరాలలోని ఖాండవవనాన్ని. దాన్ని ఖాండవప్రస్థం అని కూడా అనేవారు. అప్పటిలో నాగజాతివారికి అది నివాసస్థానం. ఇంద్రప్రస్థం రాజధానీ నగరంగా అక్కడ తమ రాజ్యసంస్థాపనకోసం పాండవులు చేసిన మొట్ట మొదటి పని ఖాండవవనాన్ని తగలబెట్టడం. ఒక విధంగా అది ఘోర హత్యాకాండ. ఒక షక్షం రోజులపాటు అది కొనసాగింది. చిట్టచివరికి దాని నుంచి ప్రాణాలతో బయటపడింది తక్షకుడు, మయుడు, నాలుగు పిచ్చుకలు మాత్రమే. మయుడు అసురుడు కాగా, తక్షకుడు నాగజాతివాడట. ఖాండవవన దహనసందర్భంలో తన జాతివారిని సర్వనాశనం చేసినందుకే బ్రాహ్మణవేషంలో పరీక్షిత్తు రాజప్రాసాదంలో ప్రవేశించి అతడిని తక్షకుడు చంపివుండాలి. ఇందుపై జనమేజయుడు నాగజాతివారిపై దండెత్తి వారిని చిత్రవధ చేశాడు. (ఈ నాటి మన నాగసమస్య ఈనాటిది కాదని, మహాభారత కాలంనాడే ఇది తలయెత్తిందని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.)

ఎంతటి క్రౌర్యానికైనా, అమానుషత్వానికైనా సంసిద్ధపడి, అరణ్యాలను స్వప్రయోజనానికై ఆర్యులు దగ్ధం చేయడం నిలిచిపోయింది బహుశా అశోకుని కాలంలోనే కావచ్చు. యజ్ఞయాగాదులతోపాటు అరణ్యాలను భస్మీపటలం చేయడాన్ని ఆయన నిషేధించాడు. అడవులను మరి కాల్చివేస్తే, దేశానికి అనర్థాలు తప్పని పరిస్థితి అప్పటికి ఏర్పడివుండాలి. అందువల్లనే ఖాండవవన దహనాన్ని ఒక దేవతాకార్యంగా ఒకచోట అభివర్ణించిన మహాభారతమే అడవులకు చిచ్చు పెట్టడం మహాపాపమని మరొకచోట పెచ్చరించింది. ఈ పెచ్చరిక భీష్మపర్వంలో వున్నది. ఈ పర్వాన్ని మహాభారతంలో దూర్చింది గుప్తరాజులకాలంలో కావచ్చు. వర్ణాశ్రమ వ్యవస్థను బలపరచడానికే దీని ఫోర్జరీ జరిగింది. బ్రాహ్మణాధిక్యతనుగురించి చెప్పి దలచుకొన్న కూహనా ధర్మసూత్రాలను ఒక క్షత్రయుని నోట చెప్పించడం ఈ ఫోర్జరీకోరుల గడసరితనాన్ని తెలుపుతున్నది.

ఇప్పుడు తిరిగి వెనుకకు వెళ్ళి పేర్కొనదగు విషయ మిది; ఈ నాటికీ మత సంబంధమైన ఏదో ఒక ఆచారాన్ని, లేదా సంప్రదాయాన్ని పాటించకుండా సేద్యాన్ని ప్రారంభించరు. పూర్వకాలంలో పౌరుల నిత్యజీవితంతో మతానికి మరింతగా ప్రమేయం వుండేది. ఋషులన్నవారు మద్యాన్ని (సోమరసాన్ని) సిద్ధపరచి, దాన్ని సేవించడాన్నే ఒక మతాచారంగా మార్చలేదా? సోమయజ్ఞమని దానికి పెద్ద పేరు పెట్టలేదా? ఏడు విధాలుగా దాన్ని జరిపేవారు కాదా? మంత్రాలతో, తంత్రాలతో ఎంత అట్టహాసంగా దాన్ని జరిపితే, అంత ఘనత

తమకు దక్కగలదని భావించే వారు కాదా? అయినప్పుడు కొత్త వలసప్రాంతాలను నెలకొల్పడానికి ముందు కొత్త వ్యవసాయక్షేత్రాలను సంస్థాపించడానికి ముందు, ఏదో ఒక పెద్ద తంతును వారు జరపడం సహజమే కాదా? యజ్ఞయాగాదులను నిషేధించిన అశోకుడు సరిగా అదే సమయంలో అరణ్యప్రాంతాలను దగ్ధం చేయడంపై కూడా ఆంక్ష విధించడం ప్రత్యేకించి గమనార్హమైన విషయం. భగవద్గీతను ఫోర్జరీచేసి మహాభారతంలో దూర్చినవారే భీష్మపర్వాన్ని కూడా దానిలో ప్రక్షిప్తం చేసివుండవచ్చు. యజ్ఞయాగాదులను భగవద్గీత నిరసించగా, అరణ్యాలను భస్మీపటలం చేయడం పాపకృత్యమని భీష్మపర్వం పొచ్చరిస్తున్నది. ఇది కూడా ప్రత్యేకించి గమనార్హమైన విషయమే!

ఇక్కడ నేను నొక్కిచెప్పగోరుతున్నది రామాయణంలో మనకు తగిలే విశ్వామిత్రుడు, భరద్వాజుడు, అత్రి, శరభంగుడు, సుతీక్ష్ణుడు, సుదర్శనుడు, అగస్త్యుడు మున్నగు ఋషులు ఆశ్రమాలపేరుతో దండకారణ్యంలో వ్యవసాయక్షేత్రాలను నెలకొల్పినారని, వాటిని నెలకొల్పడానికి ముందు యజ్ఞయాగాదుల పేరుతో దండకారణ్యంలో విశాలప్రాంతాలను దగ్ధం చేశారని. ఇది కేవలం నా ఊహకాదని శతపథబ్రాహ్మణాన్ని విమర్శాత్మక దృష్టితో పరిశీలిస్తే మీకే తెలుస్తుంది. ఏ యజ్ఞమైన, ఏ యాగమైనా, దానిలో ఏవో కొన్ని బూతుమాటలు తప్పవు, బూతుపనులైనా తప్పవు. వీటికి అధునిక భారతీయుడు సిగ్గుతో తలవంచుకోవాలని ఎన్.ఎమ్. కుంభేను పోలిన మహాపండితుడు వ్రాశాడు. కాని, ఇందుకు సంబంధించిన చర్చలోకి ఇక్కడ మనం దిగనక్కరలేదు. ఇక్కడ గమనించదగు విషయం వాజపేయం ఆదిలో పూర్తిగా అన్నపానీయాలకు సంబంధించిన యజ్ఞమని. ఇది మానవులకే కాక, దేవతలకు అన్నంపట్టగల యజ్ఞమని ప్రజాపతి చెప్పాడట. ఈ యజ్ఞసందర్భంలో మరుత్తుల స్తోత్రం జరుగుతుంది. మరుత్తులు కర్షకులని, కర్షకులే అన్నదాతలని సతపథబ్రాహ్మణం స్పష్టం చేస్తున్నది.[13]

ఇంతవరకు నేను వ్రాసిన విషయాలలో ఏకీభవించగలవారు రామరావణ యుద్ధానికి చారిత్రకాధారం ఎంతో కొంత వుంటే, దాన్ని ఆహారసేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థల సంఘర్షణగా నావలె తాము సయితం గుర్తించగలుగుతారు. అయితే, ఇది నా "డిస్కవరీ" కాదు; ఇదివరలోనే కొందరు సరిగా ఇదే తీర్మానానికి వచ్చారు. అట్టి వారిలో రొమిలా థాపర్‌ను ప్రత్యేకించి పేర్కొనాలి. గంగానది లోయకు చెందిన ఆహారోత్పత్తి వర్గాలకు, వింధ్య పర్వతప్రాంతాలలోని ఆహార సేకరణవర్గాలకు మధ్య జరిగిన సంఘర్షణే రామరావణ యుద్ధం కావచ్చునని ఆమె వ్రాసింది.

ఈ యుద్ధాన్ని వింధ్యప్రాంతంనుంచి మరింత దక్షిణంగా సింహళానికి జరపడం రామాయణాన్ని తిప్పివ్రాసినవారి వని కావచ్చునని ఆమె అభిప్రాయపడింది.[14]

నాగరికుడు కావడానికిముందు మానవుడు రెండు వ్యవస్థలగుండా పయనించాలి. వాటిలో మొదటిది ప్రాకృతావస్థ (శావేజరీ); రెండవది బర్బరావస్థ (బార్బరిజం.) ఇంకా మొదటి వ్యవస్థను దాటనివారు ప్రపంచంలో అక్కడక్కడ కొద్ది మంది వున్నారు; రెండవ వ్యవస్థలో మిగిలినవారు ఎన్నదగు సంఖ్యలోనే వున్నారు. దండకారణ్యవాసులను (రాక్షసులన్న పేరుతో) ప్రాకృతవ్యవస్థను దాటనివారుగా కొన్నిచోట్ల రామాయణం సూచిస్తున్నది; వారు అయోధ్యావాసులను మించిపోగల నాగరికులైనట్టు మరి కొన్నిచోట్ల వేర్కొంటున్నది. కాని, నిజానికి అక్కడి వారుబర్బరావస్థకు చెందినవారు, ప్రాకృతావస్థకు చెందినవారైతే, వారు నరమాంసభక్షకులు కావాలి. కాని, నరమాంసభక్షకులుగా రామాయణం విస్పష్టంగా పేర్కొన్నట్టివారు విరధుడు, ఇల్వలుడు, వాతాపి, కబంధుడు మాత్రమే. అయితే, ఈ నల్గురికి సంబంధించిన కథలు కేవలం పుక్కిటిపురాణాలని వాటి ముఖానే వ్రాసిపెట్టి వున్నది. తన యజ్ఞరక్షణకు రామలక్ష్మణులను పంపించవలసిందిగా కోరడానికి దశరథునివద్దకు వచ్చిన విశ్వామిత్రుడు రాక్షసులనుగురించి చేసిన నిందలలో నరమాంసభక్షణ ఒకటి కాదు (అయోధ్యాకాండ, 19వ సర్గ). చిత్రకూటంవద్ద నివసిస్తున్న ఋషులు రాక్షసులపై రామునికి చేసిన ఫిర్యాదులలో నరమాంసభక్షణ ఒకటికాదు (అయోధ్యాకాండ, 116 వ సర్గ). శరభంగాశ్రమానికి రాముని వద్దకు రాయబారం వచ్చిన ఋషులైనా రాక్షసులు తమను కబళిస్తున్నట్టు చెప్పలేదు. (అరణ్యకాండ, ఆరవసర్గ). రావణునినగరులో హనుమంతుడు చూచిన వంట పాత్రలలో "తేనెతో వండిన, మద్యంతో తడిపిన" వంటకాలే వున్నాయి కాని,నరమాంసం లేదు. (సుందరాకాండ, ఆరవసర్గ) నిద్రనుంచి మేల్కొనగానే కుంభకర్ణుడు తినడానికై రాసులుగా పోసిన భోజనపర్వాలలో వున్నది పంది మాంసమే, దున్నమాంసమే, నరమాంసం కాదు (యుద్ధకాండ, 60వ సర్గ).ఇందువల్ల రాక్షసులు నరమాంసభక్షకు లనడం, వారు ప్రాకృతావస్థకు చెందిన వారనడం నిరాధారమైన నిందలు మాత్రమే.

రామాయణాన్ని తిరిగి జాగ్రత్తగా పరిశీలిస్తే, దండకారణ్యంలోనివారు ఆహారసేకరణవ్యవస్థకు చెందినవారని తెలుస్తుంది. పినతల్లి కైకేయి కోర్కె ప్రకారం తాను వనవాసానికిపోనున్నట్టు తల్లి కౌసల్యకు చెబుతూ, రాము డన్న మాట దండకారణ్యంలో తాను "తేనె, గడ్డలు, దుంపలు, పండ్లు" తింటూ కాల క్షేపం

చేయబోతున్నానని (అయోధ్యాకాండ, 20వ సర్గ). సరిగా ఇదే మాటను రాముడు గుహునికి సయితం చెబుతాడు (అయోధ్యాకాండ, 50వ సర్గ). గంగానదిని దాటేసరికి ఆకలిగొన్న రామలక్ష్మణులు వేటాడి తిన్నది పందిని, ఎనుబోతును, దుప్పిని, నల్లచారల దుప్పిని (అయోధ్యాకాండ, 52వ సర్గ). అరణ్యవాసాన్ని గడపడానికి చిత్రకూట పర్వతప్రాంతం ఉత్తమమైనదని, "మీకు కావలసిన తేనె, దుంపలు, పండ్లు" అక్కడ సమృద్ధిగా లభిస్తాయని రామునికి భరద్వాజుడు చెబుతాడు (అయోధ్యాకాండ, 54వ సర్గ). రాముడు దండకారణ్యంలో ప్రవేశించగానే అక్కడి ఋషులు ఆయనకు అతిథిసత్కారంగా అందించినట్టివి "వన్యములైన కందమూల ఫలములు, మఱియు వనమున దొరకు నానా విధాహారములు" మాత్రమే (ఆరణ్యకాండ, ఒకటవ సర్గ). పంపాసరోవరాన్ని ప్రశంసిస్తూ, కబంధుడు రామునికి చెప్పిన మాట లివి : "రాఘవా! యీ సరస్సునందు రాయంచలు, నీరుకోళ్లు, క్రౌంచములు, లకుముకిపట్టలు నీటియందు దేలుచు నింపుగా గూయు చుండును. ఆ పక్షులు తిన్నని స్వభావముగలవియై, వధమన నెట్టిదో యెఱుగవు గాన మానవులను జూచి యవి భయపడవు. నేతి ముద్దలం బోలెడి యీ బలిసిన పక్షులను దినగలరు. లక్ష్మణుడు నీయెడ భక్తి గలవాడు గనుక, మంచివియు, చర్మము ఱెక్కలు లేనివియు, బలిసినవియు, ముండ్లు లేనివియునైన గండు చేపలను, చొఱచేపలను, రొయ్య చేపలను బాణములచే గొట్టి, వాని నినుపశలాకకు గ్రుచ్చి, కాల్చి నీకు దెచ్చియీగలడు. నీ వా చేపలను పంపాతీరమున గూర్చుండి భక్షించుచుండగా..." (ఆరణ్యకాండ,73వ సర్గ). కాగా , వానరుల ఆహారం సయితం కందమూల ఫలాలని కిష్కింధాకాండ (37వ సర్గ) పేర్కొంటున్నది. ప్రత్యేకించి ఈ విషయమై రామాయణాన్ని పరిశీలించిన దేవరాజ చన్న తీర్మానం ప్రకారం లంకలో అన్నాన్ని గురించి చెదురువాటుగా కనబడే ప్రస్తావనలు ప్రక్షిప్తాలే. లంకలో వ్యవసాయం లేదు, పశుపోషణ లేదు. ఇంతే కాదు, అక్కడ చాతుర్వర్ణ్యం లేదు, వర్తకులు లేరు, విపణులు లేవు, వేశ్యాంగనలు లేరు. రావణుని రాజధానిని ఒక పురంగా రామాయణం వర్ణిస్తున్నా, అది ఏదో ఒక ఆటవికుల తెగకు చెందిన ఆవాసమని చెప్పడానికి అన్యాధారాలు దానిలో పెక్కులున్నాయి.[15]

1969లో నేను చూచిన కార్ నికోబార్ దీవికి కాస్త కుడి యెడంగా రావణుని లంక బహుశా వుండేది. ఈ దీవిలో ఆవులు లేవు, బఱ్ఱెలు లేవు, మేకలు, గొఱ్ఱెలైనా లేవు. అక్కడివారు పాలు, పెరుగు, వెన్న, నేయి ఉపయోగించరు. ఇండియా నడిగడ్డపై పడమటినుంచి తూర్పుగా వెళ్లినకొద్దీ, ఉత్తరం

నుంచి దక్షిణానికి వెళ్లినకొద్దీ పాలు, పెరుగు, వెన్న, నేయి ఉపయోగం తగ్గుతుంది; వంటనూనెల ఉపయోగం పెరుగుతుంది. మానవ వికాసశాస్త్రవేత్త నిర్మల కుమార్ బోస్ చెప్పినట్టు, ఆర్యులకు నేయి లేకపోతే జరగదు, అనార్యులకు నూనె వుంటే చాలు.[16] కార్ నికోబార్‌లోని వారు నిషాదు లట. ఇండియా నడిగడ్డపై ఇప్పుడున్న నిషాదజాతి తెగలలో ఒకదాని పేరు "కోల్". వీరికి ఈ పేరు రావడానికి కోలాన్ని (పందిని) వీరు అభిమానించడమే కావచ్చు.[17] ఏమైనా, కార్ నికోబార్ దీవిలో వున్నవి పందులు మాత్రమే వాటి మాంసాన్నే అక్కడి వారు తింటారు. అన్నానికి బదులు "బ్రెడ్ ఫ్రూట్" అనే దాన్ని తింటారు. పోతే, మొత్తం దీవిని ఒక కొబ్బరి తోటగా చెప్పవచ్చు. కొబ్బరే వారికి ఫలహారం, కొబ్బరినీళ్లే వారికి పాలు, కొబ్బరినూనే వారికి నేయి, నాగలి వారికి తెలియదు; సేద్యంతో వారికి నిమిత్తం లేదు. రామాయణ కాలంలో దండకారణ్యంలోని అనార్యులు (వారు నిషాదులనుకొనడానికి ఎక్కువ ఆధారాలున్నాయి) ఈనాడు కార్ నికోబార్ దీవిలోనివారివలె ఆహారసేకరణ వ్యవస్థకు చెందినవారే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆహారోత్పత్తి వ్యవస్థలో మనిషికి ఎకరమైనా చాలు, ఆహారసేకరణ వ్యవస్థలో దాదాపు ఒక చదరపు మైలు కావాలి, కొన్ని కొన్ని ప్రాంతాలలో అంతకంటె పెచ్చుగా కూడా కావాలి, కార్ నికోబార్ లో చదరపు మైలుకు సగటు జనాభా యాభై. ఇందుకు కారణం—ఇంతకు ముందు నేను పేర్కొన్నట్టు, ఆ దీవి దాదాపు ఒక కొబ్బరితోట కావడమే. నికోబార్ ద్వీపసమూహానికి చెందిన మరి కొన్నింటిలో వాటి విస్తీర్ణానికీ, జనసంఖ్యకూ నిష్పత్తి ఇంతకు చాలా తక్కువ. ఉదాహరణకు, లిటిల్ నికోబార్ వైశాల్యం 57 చదరపు మైళ్ళు కాగా, దాని జనాభా (1960నాటి లెక్కల ప్రకారం) 182 మాత్రం; గ్రేట్ నికోబార్ వైశాల్యం 333 చదరపు మైళ్ళు కాగా, దాని జనాభా 203 మాత్రమే.[18] ఆహార సేకరణ వ్యవస్థలో మనిషికి కనీసం చదరపు మైలు చొప్పున కావాలన్న గుర్తింపుతోనే సౌత్ అండమాన్ దీవిలో (పోర్ట్ బ్లెయిర్ పరిసరాలలో) జరవ తెగవారికి 350 చదరపు మైళ్ళ అడవిని ప్రత్యేకించారు.[19] ఎవ్వరితోను వీరు కలవరు, తక్కిన ప్రపంచంతో ఎట్టి సంబంధం పెట్టుకోరు. వీరు నర మాంసభక్షకులు కారు గాని, ఒంటరిగా ఎవరైనా తారసిల్లితే బాణాలతో కొట్టి చంపుతారు. వీరిని అంకెకు తీసుకురావడం ఇదివరలో బ్రిటిష్ వారికి చేతకాలేదు; ఇప్పుడు మన ప్రభుత్వానికైనా చేతకావడం లేదు. అందువల్ల జరవల కోసం

350 చదరపు మైళ్ళు అడవిని ప్రత్యేకించి, దానికి నలుగడలలో ఇదివరలో వలె ఇప్పుడు కూడా పోలీసు- చెక్‌పోస్టులు పెట్టి, వారినుంచి ముప్పు రాకుండా కాపాడుకొనడం జరుగుతున్నది. ప్రస్తుతం జరవల సంఖ్య ఎంతో ఎవ్వరికీ గట్టిగా తెలియదు గాని, బహుశా మూడువందలకు మించదని ఊహిస్తున్నారు; నిజానికి అంతకంటె తక్కువ కావచ్చు.

ఆహార సేకరణవ్యవస్థలో జీవించడానికి కావలసినట్టి సువిశాల ప్రాంతాలు విధిగా విపినప్రదేశాలే అయివుండాలి. లేకపోతే, తవ్వుకొని తినడానికి దుంపలు దొరకవు, కోసుకు తినడానికి పళ్ళు దొరకవు, పట్టుకు తినడానికి చేపలు దొరకవు. వేటాడి తినడానికి పిట్టలు, కుందేళ్ళు, పందులు, లేళ్ళు, జింకలు, దుప్పులు వగైరాలు దొరకవు. పిండుకొని తాగడానికి తేనెపట్టులు దొరకవు. ఒక్కమాటలో బ్రతుకే గడవదు. ఆహారోత్పత్తి వ్యవస్థకు చెందినవారికి "ఇది కూడా ఒక బ్రతుకేనా!" అనిపించవచ్చు. కాని, ఎవరి జీవితవిధానం వారికి ఉత్తమమైనదిగానే తోస్తుంది. ప్రెసిడెంట్‌గా రాజేంద్రప్రసాద్ కార్ నికోబార్ దీవికి వెళ్ళినప్పుడు "నేను మీకు చేయగల సహాయం ఏదైనా వున్నదా?" అని ఆయన ప్రశ్నించగా అక్కడి ప్రజల ప్రక్షాన "మా పద్ధతుల ప్రకారం మమ్ము బ్రతకనివ్వండి; అదే మీరు మాకు చేయగల గొప్ప సహాయ"మని బిషప్ రిచర్డ్‌సన్ సమాధానం చెప్పాడు. ఆయనను లోకసభ సభ్యునిగా నామినేట్ చేయగా, తనకు ఢిల్లీ వాతావరణ మేమి, అంతకంటె ముఖ్యంగా అక్కడి జీవిత విధానమేమి, ఎంత మాత్రం మనస్కరించడం లేదని తన సభ్యత్వాన్ని అతి త్వరలోనే ఆయన విడిచిపెట్టాడు. నేను చూసినప్పుడు బిషప్ రిచర్డ్‌సన్ వయస్సు ఎనభై సంవత్సరాలకు పైగా. మా పార్లమెంటరీ బృందంలోని సభ్యులందరిలో ఎందువల్లనో నేను ఆయనకు ఎక్కువగా నచ్చాను. తక్కినవా రందరికీ అతిథి సత్కారంగా ఆయన రెండేసి, మూడేసి పెద్ద గవ్వ లివ్వగా, నాకేమో ఒక గుడ్డ సంచిలో పెట్టి ఒక డజనుకుపైగా వాటి నిచ్చాడు. తన జీవితచరిత్ర ప్రతిని సయితం బహూకరించాడు. నాతో జరిపిన సంభాషణలో "నాగరికత అనే జాడ్యం ఇక్కడికి విస్తరించడానికి ముందు ఇక్కడ అబద్ధాలాడేవారుకాదు, దొంగతనాలుండేవి కావు, కొట్లాటలు సాగేవి కావు. మీకు ఆశ్చర్యంగా తోచవచ్చుగాని, మా భాషలో యుద్ధాన్ని సూచించడానికి పదమైనా లే"దని ఆయన చెప్పాడు. రామాయణ కాలంలో దండకారణ్య ప్రాంతంలోని నిషాదులు బహుశా ఇట్టివారే కావచ్చునని నాకు అనిపిస్తూ వుంటుంది.

—ఈ ఘట్టంలో దాదాపు ఒకటిన్నర సంవత్సరాల క్రితం ఈ పీఠిక తిరిగి హఠాత్తుగా నిలిచిపోయింది. ఇందుకు పెక్కు కారణాలున్నాయి. తలచుకొనడానికైనా బాధాకరమైనవి కాబట్టి, ఇక్కడ వాటిని వివరించడానికి ప్రయత్నించను. కాగా, నేను విధిగా చెప్పవలసిన రెండు మాటలున్నాయి. నూటయాభై పేజీలకు పైగా అచ్చు వేసినమీదట ఈ నాటక ప్రచురణకై నా కారణాన ఇంతకాలంపాటు నవోదయ పబ్లిషర్స్ వేచి వుండవలసివచ్చింది. నా పట్ల ప్రేమ గౌరవాలతో ఈ దీర్ఘవిలంబనను సహించినందుకు ఆ సంస్థ నిర్వాహకులకు నా నమస్కారాలు. ఈ పీఠికలో ఇంతకుముందు నేను పేర్కొన్నవారిలో ఇద్దరు ప్రముఖులు మరి లేరు. ఇంచుమించు ఏడాది క్రితం నేషనల్ ప్రొఫెసర్ సునీతికుమార్ ఛటర్జీ కాలధర్మం చెందగా, అయిదారు నెలలనాడు బిషప్ రిచర్డ్‌సన్ కన్నుమూశాడు. (నేను దీన్ని వ్రాస్తున్నది 1978 డిసంబరు రెండవ వారంలో). వా రిద్దరి స్మృతికి నా ప్రేమాంజలి.

పద్దెనిమిది నెలలనాడు ఈ పీఠిక హఠాత్తుగా నిలిచిపోయింది బిషప్ రిచర్డ్‌సన్ విషయమై నేను ప్రస్తావిస్తూవుండగా. దాదాపు మూడువేల సంపత్సరాల క్రితం దండకారణ్యంలోని నిషాదులు సయితం—నిషాదులు కాకపోతే, మరొక జాతికి చెందిన ఆటవికులు—తమ పద్ధతి ప్రకారం తాము బ్రతకాలని మాత్రమే కోరుకొని వుండాలి. కాని, వారి కోర్కెను ఆర్య ఋషులు సాగనివ్వలేదు. గంగాయమునల ప్రాంతంనుంచి దక్షిణాదికి క్రమక్రమంగా వారు విస్తరించారు; దండకారణ్యంలో ఆశ్రమాలను—"ఆశ్రయాలు" బహుశా వాటికి మరింత సార్థకనామం— స్థాపించారు; యజ్ఞయాగాదుల వేరుతో విస్తృతప్రాంతాలను దగ్ధం చేశారు; దగ్ధం చేసిన ప్రాంతాలను వ్యవసాయ క్షేత్రాలక్రింద మార్చారు; వ్యవసాయానికి కావలసిన పశు సంపదను రాజులనుంచి గోదానంరూపంలో సంపాదించారు; వ్యవసాయానికి కావలసిన కార్మికులను ఛాత్రుల రూపంలో సమీకరించారు. ఋష్యాశ్రమాలలో ఛాత్రుల ప్రథమ కర్తవ్యం పశుపాలనమే, వారి ప్రధానవ్యాసంగం అన్ని విధాల ఆశ్రమాధిపతుల కోసం కాయకష్టం చేయడమే. ఏమైనా, ఇక్కడ గుర్తించదగు ముఖ్య విషయమిది; దండకారణ్యానికి వలసవచ్చినవారి ఆర్థిక వ్యవస్థ స్థానికుల వ్యవస్థకు పూర్తిగా విభిన్నమైనట్టిది, విరుద్ధమైనట్టిది. వలసవచ్చినవారు అరణ్యాలను దగ్ధం చేయాలి; లేకపోతే, తాము కోరినట్టు ఆహారోత్పత్తిని వారు కొనసాగించలేరు. స్థానికులు అరణ్యాల దగ్ధకాండను నిరోధించాలి; లేకపోతే, ఆహార సేకరణ వారికి అసాధ్యం కాగలదు. ఈ విభిన్న జీవిత విధానాలు మధ్యగల ఈ వైషమ్యం, వారి విరుద్ధ

ఆర్థిక వ్యవస్థల మధ్యగల ఈ విరోధం వారి మధ్య సంఘర్షణను అనివార్యం చేస్తుంది. ఈ సంఘర్షణలో రాముని సహాయం పొందడానికై ఋషులు ఆడని అబద్ధం లేదు, పన్నని కుట్ర లేదు, చేయని పాడుపని లేదు.

దండకారణ్యం ఋషులను నేను అకారణంగా నిరసించడంలేదు, అనవసరంగా నిందించడంలేదు. రామాయణాన్ని (దాని అనువాదాలను కాదు, అనుసరణలను కాదు, వాల్మీకి కృతిగా ప్రచారంలో గల సంస్కృత రామాయణాన్ని) భక్తులవలె కాక, విజ్ఞులవలె చదివితే, ఋషులను నాకంటె తీక్ష్ణంగా మీరే నిరసించవచ్చు, నా కంటె తీవ్రంగా మీరే నిందించవచ్చు.. నామాటకేమి, మీ మాటకేమి? సాక్షాత్తు ఆ సీతాదేవి ఏమన్నదో ఒకసారి గమనించండి. ఈ ఆటవికులు మనకు ఏమి అపకారం చేస్తున్నారని ఆమె భర్తను నిగ్గదీసింది. ఈ స్థానికులను చంపడమే పనిగా పెట్టుకొనడం మీకు తగునా అని సూటిగా ప్రశ్నించింది. "తప్పులేని జనులను హింసించుట" ఘోరమని తెగవేసి చెప్పింది. మనతో "వైరము లేక దండకారణ్యమున నున్నవారిని," తమ బ్రతుకు తాము నెమ్మదిగా బ్రతుకు తున్న వారిని చంపడం అతి ఘోరమని హెచ్చరించింది. బొంకులాడడం మహా పాతకం కాగా, పరదారాభిగమనం, వైరం లేకుండా సంహారం మరింత నికృష్ట మైన పాపాలని, ఈ చివరి పాపాన్నే మీరు చేస్తున్నారని భర్తముఖం పైనే అని వేసింది. ఇంతకంటె విపులంగా, ఇంతకంటె నిష్కర్షగా ఆమె మాట్లాడింది. ఆమె మాటలను మీరు పూర్తిగా తెలుసుకొనడానికి వీలుగా ఆరణ్యకాండలోని రెండు సర్గలకు (తొమ్మిదవ, పదవ సర్గలకు) సరస్వతుల సుబ్బరామశాస్త్రిగారి తెలుగు సేతను ఈ పీఠికకు రెండవ అనుబంధంగా ముద్రిస్తున్నాను. దాన్ని శ్రద్ధగా చదివితే, నా "సీత జోస్యం" నాటకంలోని ముఖ్యభాగాలు, ప్రత్యేకించి దానిలోని సీత పలుకులు, సంస్కృత రామాయణానికి ఎంత చేరువుగా వున్నాయో మీకు తెలిసివస్తుంది.

సీత పలుకులకు రాముడు చెప్పిన---చెప్పగలిగిన---ప్రత్యుత్తరం "నేను ప్రాణా లనైనా విడుస్తాను. నిన్ను విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను. అంతే తప్ప ఋషుల కిచ్చిన మాటలను విడవను" అని మాత్రమే! ఋషులకు తానిచ్చిన మాట ప్రకారం"వైరము లేక" దండకారణ్యంలో వున్నవారిని రాముడు చంపుతూపోయింది ఒక ఏడాది కాదు, రెండేళ్లు కాదు, వరసగా పదేళ్లపాటు. ఋష్యాశ్రమంనుంచి ఋష్యా శ్రమానికి నివాసాన్ని మార్చుతూ స్థానికులైన ఆటవికులను పదేళ్లపాటు ఆయన చంపిన మీదటనే (ఆరణ్యకాండ, 11వ సర్గ), అగస్త్యుని సూచన ప్రకారం

మరింత దక్షిణంగా దండకారణ్యంలోనికి ఆయన చొచ్చుకు వెళ్ళిన మీదటనే ఆయన తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొనడం తటస్థించింది.

ఆటవికులైనవారు, ఆహార సేకరణ ప్రాతిపదికకాగల ఆర్థికవ్యవస్థకు చెందిన వారు ఎప్పుడైనా—ఎక్కడైనా—శాంతినే అభిలషిస్తారు, సామరస్యపూర్వకంగానే జీవిస్తారు. ఇది చారిత్రక సత్యం.[20] వారి జీవితావసరాలు బహు స్వల్పం. సొంత ఆస్తిపాస్తులను కూడబెట్టుకొనాలన్న తాపత్రయం వారిలో వుండదు. అందువల్ల వారిమధ్య వారికి చెదురుగా తప్ప వివాదాలు రావు. ఇక పరాయివారితో వారు పోరుకు దిగడం అసలే జరగదు. వారి బ్రతుకు వారు బ్రతుకకుండా పరులు అడ్డుపడినప్పుడు మాత్రమే వారు పోరుకు స్థిరపడతారు. ఉత్తర అమెరికా ఖండం లోని ఆదివాసులు చాలా వరకు ఆహారసేకరణవ్యవస్థకు చెందినవారే. వారికి వ్యవ సాయం అసలే తెలియకపోదుగాని, దాన్ని కేవలం తిండి గింజలకోసం కొద్దిపాటిగా సాగించేవారు; అడవులలోనే వారు బ్రతుకుతూ వుండేవారు; అడవి బట్టలపైనే వారి ఆర్థిక వ్యవస్థ పెచ్చుగా ఆధారపడివుండేది. ఇంగ్లీషువారు పదిహేడవ శతాబ్ది ప్రారంభంలో తమ ఖండం తూర్పు తీరానికి వలసకు రావడాన్ని ప్రారం భించినప్పుడు ఉత్తర అమెరకా ఆదివాసులు (రెడ్ ఇండియన్‌లు) వారికి ఆతిథ్య మిచ్చారు, అన్య విధాల ఆదరించారు. వలసలో తమకు ఆదివాసులు చేదోడు, వాదోడుగా నిలిచి వుండకపోతే, ఇంగ్లీషువారు ఏ ఆకలికి మలమల మాడి చచ్చిపోయి వుండేవారే! అయితే, దీని ప్రతిఫలం క్రమక్రమంగా పెచ్చుమంది వలసకురావడం, అంతకంతకు పెచ్చుగా ఆదివాసులను అడవులలోకి తరిమికొట్టడం, వారి అడవులను నరికి వేయడం, వారి అడవిబట్టలను వేల సంఖ్యలో వేటాడి చంపడం, ఇతర దురాగతాలకు, దౌర్జన్యాలకు దిగడం—ఇంతే! ఈ ఘోరకృత్యాలు ప్రారంభమైన తర్వాతనే గత్యంతరం లేక రెడ్ ఇండియన్‌లు పోరుకు సన్నద్ధ పడవలసివచ్చింది. ఆయుధబలం లేనందున వారికి పరాజయం తప్పలేదు, దాదాపు సర్వనాశనమే తప్ప లేదు. ఉత్తర అమెరకా ఖండాన్ని—ముఖ్యంగా పశ్చిమ భాగాన్ని—ఆక్రమిం చుకొనడంలో పాశ్చాత్యులు జరిపిన చిత్రవధకు దండకారణ్య ప్రాంతంలోని ఆర్య ఋషులేమి, వారిని సమర్థించిన క్షత్రియులేమి కొనసాగించిన చిత్రవధకు విస్తృ తిలో గాని, క్రౌర్యంలో గాని ఏమంత భేదం కానరాదు. నా మట్టుకు నాకు డి.బ్రౌన్ రచించిన "బరీ మై హార్ట్ ఎట్ వూండెడ్ నీ" అనే గ్రంథానికి[21], వాల్మీకి రామాయణంలో ఆరణ్య, కిష్కింద, యుద్ధకాండలకు కొన్ని దగ్గరి పోలి కలు కన్పించాయి.

చెప్పిన మాటనే మరల చెప్పడమైనా, రామాయణాన్ని చదవవలసింది భక్తి భావంతో కాదు, విచక్షణా దృష్టితో. ఆ పని చేసినప్పుడు రామాయణంలో నాకువలె మీకు కూడా ఆహారసేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థల మధ్య సంఘర్షణ స్పష్టంగానే గోచరిస్తుంది. అప్పుడు నావలె మీరు కూడా దండకారణ్యంలోని ఋషులకుట్రలో రాముని పాత్రను సరిగా అర్థం చేసుకోగలుగుతారు.

*

ఆయుధాల ప్రశ్న

"రా"మాయణ కాలంలో ఎవరి ఆయుధాలెట్టివి?" అనే ప్రశ్నలో ఒక భాగానికి ప్రత్యుత్తరాన్ని వెంటనే చెప్పవచ్చు. రామునికి సంబంధించి నంతవరకు ఆయన ప్రధానాయుధం--కోదండం. అందువల్లనే "కోదండరాముడు" ఆయన బిరుదనామం. కోదండంతోపాటు ఆయన ఖడ్గాన్ని కూడా వినియోగిస్తూ వుండే వాడు. అయితే, దాని వినియోగం బహు సక్కత్తుగానే.

కోదండం, కార్ముకం, అస్త్రము, ఇష్వాసము, చాపము, ధనువు, ధన్వము, ధనుస్సు, సింగిణి, సింగాణి, విల్లు మొదలైనవి కేవలం పర్యాయపదాలు కాకపో వచ్చు. ఉదాహరణకు, "కార్ముకం" అనే పదానికున్న నానార్థాలలో "వెదురు" కూడా వున్నది. దీన్ని బట్టి వెదురుబద్దతో చేసిన విల్లు "కార్ముకం" అని తీర్మానించుకొనవచ్చునేమో! "ధనువు"కున్న నానార్థాలలో ఒకటి "నాలుగు మూరల కొలది" దీన్ని బట్టి నాలుగు మూరల నిడివి విల్లు "ధనువు" అనుకోవచ్చునేమో! పోతే, "సింగిణి" అంటే "[illegible]తో చేసిన విల్లు" అని "శబ్దార్థచంద్రిక" స్పష్టంగానే చెబుతున్నది. వాటి తీరు తెన్నులను బట్టి కూడా ధనుస్సులకు వేర్వేరు పేర్లు వచ్చి వుండవచ్చు. దేవిడి జమిందార్ "ఆంధ్రవి

జ్ఞానము" ప్రకారం "ధనుస్సు త్రివిధము – టంకారధనువు, ఝంకారధనువు, మహాధనువు అని. టంకారధనుస్సు వంకరలు తిరిగి యుండునది. ఝంకారధనుస్సు వంకరలు లేక, తిన్నగనుండి, శరసంధాన మొనర్చుతఱి నించుక వంగియు తిరిగి తిన్నగా నగుచుండును. మహాధనుస్సు విల్లువలె వంగియే యుండును." ఏమైనా, ఈ విషయమై సాధికారంగా వ్రాయగలవారు వసిష్ఠుని ధనుర్వేద సంహితను క్షుణ్ణంగా చదివినట్టివారే. అన్నట్టు, ఆయుధాలకు, ఆయుధ ప్రయోగానికి సంబంధించిన శాస్త్రానికి "ధనుర్వేదసంహిత" అని పేరు రావడం వెనుకటి కాలంలో ధనువుకు యుద్ధంలో గల ప్రాధాన్యాన్ని సూచిస్తున్నది.

టంకార, ఝంకార, మహాధనువులలో ఏదో ఒకదాన్ని రాముడు వినియోగించేవాడో, లేక అవసరాన్ని బట్టి మూడింటినీ వినియోగించేవాడో రామాయణం మనకు స్పష్టపరచడం లేదు. ఏమైనా, ఒకటి మాత్రం నిశ్చయం. విశ్వామిత్రుడు రామునికి ఏవో దివ్యాస్త్రాలను మంత్రోపదేశంద్వారా అందజేసినాడనడం(బాలకాండ, 27వ సర్గ) నమ్మదగు విషయం కాదు. ఇదే విధంగా అగస్త్యుడు విష్ణుదేవుని విల్లును, బ్రహ్మదేవుని అమ్ములను, దేవేంద్రుని అమ్ములపొదిని రామునికి బహూకరించినాడనడం సయితం (అరణ్యకాండ, 12 వ సర్గ) విశ్వసనీయం కాదు. మనకు నిజంగా దివ్యాస్త్రాలుంటే, మన దేశంపై జరిపిన దండయాత్రలలో--ఒకటి, రెండింటిలో తప్ప– వరసగా మనం ఎందుకు దెబ్బ తిన్నాము? క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దిలో పర్ష్యన్ చక్రవర్తి సైరస్ ది గ్రేట్ ఇండియా పశ్చిమోత్తర ప్రాంతాన్ని జయించినట్టు కొందరు ప్రాచీన చరిత్రకారులు వ్రాయగా ఆ ప్రయత్నంలో ఆయన మరణించినట్టు మరి కొందరు వ్రాశారు[1]. అయితే, ఆయన అల్లుడు డారియస్ ది గ్రేట్ నిశ్చయంగా ఆ ప్రాంతాన్ని తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు.[2] తర్వాత మెసెడోనియో చక్రవర్తి అలెగ్జాండర్ ది గ్రేట్ క్రీస్తుకు పూర్వం నాల్గవ శతాబ్దిలో అదే ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొన్నాడు.[3] మన బ్రహ్మాస్త్రాలు, పాశుపతాస్త్రాలు, అన్య దివ్యాస్త్రాలు డారియస్, అలెగ్జాండర్ల జైత్రయాత్రలను ఎందువల్ల నిరోధించలేకపోయాయి? ఈ విధమైన ప్రశ్న తప్పక వస్తుందని మన పౌరాణికులకు తెలుసు. అందువల్లనే, కురుక్షేత్ర సంగ్రామానంతరం కలియుగం ప్రవేశించిందని, ఈ పాడు కలికాలంలో మంత్రాలుఅమోఘంగా పని చేయవని ఒక సాకును ముందుగానే వెతికిపెట్టారు.

అయితే, దివ్యాస్త్రాలలో నాగాస్త్రం వుండేదేమో! కొనకు విషం పూసిన బాణం ప్రసక్తి ఋగ్వేదంలో వున్నది.[4] దానినే అటు తర్వాత నాగాస్త్రమనే

వారేమో! కాగా, బాణం కొసకు విస్తరింగాన్ని కట్టినట్టిది ఆగ్నేయాస్త్రం కావచ్చునేమో! దీని ప్రసక్తి అధర్వవేదంలో కనబడుతున్నది.[5] విషపు బాణాల, అగ్నిబాణాల ప్రయోగాన్ని "మనుధర్మశాస్త్రం" నిషేధిస్తున్నది. "నీతి ప్రకాశిక" సయితం వీటిపై ఆంక్ష విధిస్తున్నది. అయితే "శుక్రనీతిసారం" యుద్ధంలో విజయసాధనకు అధర్మయుద్ధ పద్ధతులను మించినవి లేవని ఉద్ఘోషిస్తున్నది. అంతే కాదు. రాముడు, కృష్ణుడు, ఇంద్రుడు అధర్మయుద్ధాన్ని చేసినట్టివారని వారి పేరెత్తి చెబుతున్నది; వారు ముగ్గురు వరసగా వాలిని, కాలయవనుని, నముచిని అధర్మయుద్ధం ద్వారానే వధించినట్టు వివరిస్తున్నది.[6]

ధర్మాధర్మ యుద్ధాల చర్చలోకి వెళ్ళకుండా, తిరిగి ధనుస్సుసంగతి యెత్తుకొన్నంతనే చెప్పవలసిన మొదటి మాట – ధనుర్విద్యలో భారతీయులకు ఒకప్పుడు విశేష విఖ్యాతి వుండేదని. వారి విఖ్యాతిని పురస్కరించుకొనే డారియస్ కుమారుడు జర్క్‌సెజ్ గ్రీసుపై దండయాత్ర జరిపినసందర్భంలో ఇండియానుంచి ధనుర్ధారుల దళాన్ని ఒకదాన్ని రప్పించుకొన్నాడు.[7] విలువిద్యలో భారతీయుల ఈ ఘనతకు ఒక కారణం, విల్లును తయారు చేయడంలో వారి నేర్పు కావచ్చు; రెండవ కారణం, దాన్ని ప్రయోగించడంలో వారి చాకచక్యం కావచ్చు; మూడవ కారణం, బాణాల ముక్కులకు వారు ఉక్కును వాడకం చేయడం కావచ్చు. విల్లును తయారు చేయడానికి వెదురుతోపాటు వేత్రాన్ని (పేము) వాడేవారు, కొమ్ముతోపాటు గంధం, సాలం, చంద్ర, మద్ది చెక్కలను వాడేవారు. ఇంతటితో ఆగక, బంగారం, వెండి, రాగి, ఇనుం మొదలైన లోహాలను సయితం వినియోగించేవారు. శ్రేష్ఠమైన విల్లునిడివి నాలుగు మూరలు. కాగా, మధ్యరకం విల్లు నిడివి మూడున్నర మూరలు. బాణాన్ని ప్రయోగించడానికి వింటి త్రాటిని యవనులవలె ఛాతీవైపుకు కాక, చెవివైపుకు మనవారు లాగేవారు.[8] బాణం ముక్కును మేలైన ఉక్కుతో చేసేవారు. ఒకనాడు మన ఉక్కును చాలింది ప్రపంచం మొత్తంమీదనే దొరికేది కాదు. పౌరవుని జయించిన అలెగ్జాండర్ ఆయనవద్దనుంచి అన్నింటి కంటె విలువైన నజరానాగా పుచ్చుకొన్నట్టిది 30 పౌనుల ఉక్కునే.[9] ఇండియా ఉక్కుకు దాదాపు మధ్యయుగం వరకు ఈ ప్రసిద్ధి మిగిలింది. ఆరబ్ దేశాలలో కత్తిని "జవాబ్-ఇ-హింద్" అనేవారు. ఇండియా ఉక్కుతో చేసిన కత్తితో చెప్పే జవాబుకు తిరుగులేదని వారి తాత్పర్యం.

అయితే, ఉక్కును తయారు చేయడంలో ఇండియా మొదటి స్థానానికి ఎప్పుడు చేరుకున్నదో కచ్చితంగా చెప్పలేము. ఇనుమును, ఉక్కును ఉత్పత్తిచేసే పద్ధతు

లను ఆదిలో కనిపెట్టినవారు ఆర్మీనియన్ ప్రాంతంలోని ఆదివాసులట. వారిని కిజ్‌వదనులనేవారట. వారినుంచి ఆ పద్ధతులను మిటన్నీలు మొదట తెలుసుకొనగా, మిటన్నీలనుంచి హిట్టయిట్‌లు తెలుసుకొన్నారు. వా రుభయులు ఆర్యజాతికి చెందిన తెగలవారే! వా రుభయులు పశ్చిమాసియాలో ఒకరి తర్వాత మరొకరు మహారాజ్యాలను సంస్థాపించినవారే. తమను, తమ రాజ్యాలను, తమ ప్రాబల్యాన్ని కాపాడుకొనడానికి, ఇనుము-ఉక్కు ఉత్పత్తి పద్ధతులను వా రుభయులు చాలా కాలంపాటు గుప్తవిద్యలుగా వుంచారు. తమకు ఇనుము కావాలన్నా, ఉక్కు కావాలన్నా, తక్కిన రాజులు వారిని ప్రాధేయపడవలసివచ్చేది. క్రీస్తుకు పూర్వం పధ్నాల్గవ శతాబ్దంలో ఈజిప్టుకు చెందిన ఒక ఫారో రాజు కొంత ఉక్కును ఉపాయనంగా కోరగా "ఇదుగో! అదుగో!" అంటూ కాలయాపన చేసి, హిట్టయిట్‌లు చివరికి మొండిచెయ్యి చూపించారు.[11] అప్పటిలో ఆయుధాలనే కాక, ఆభరణాలను సయితం ఇనుముతో, ఉక్కుతో చేసేవారు; అప్పటిలో వాటి ధర బంగారం ధర కంటె బహుశా పెచ్చు.

ఏ విద్యలైనా, వాటికి బహుళ ప్రయోజనం వున్నప్పుడు, నిత్యజీవితంతో, అంతకంటె ముఖ్యంగా యుద్ధంతో వాటికి ప్రత్యక్షసంబంధం వున్నప్పుడు, వాటిని గుప్తవిద్యలుగా మిగల్చడం ఎంతో కాలం పాటు సాధ్యం కాదు. అణుశాస్త్రాన్ని గుప్తవిద్యగా అమెరికా ఎంత కాలంపాటు మిగల్చగలిగింది? ఇనుము, ఉక్కు ఉత్పత్తిపద్ధతులలో సయితం ఇంతే జరిగింది. హిట్టయిట్‌ల సైనిక దళాలలో అనాగరిక జాతులవారు కొందరు కేవలం భుక్తికోసం చేరుతూ వుండేవారు. ఈ ఆయుధోపజీవులద్వారా ఇనుము, ఉక్కు ఉత్పత్తిపద్ధతులను ఒకటి, రెండు శతాబ్దాలు జరిగేసరికి ఇతర రాజ్యాలవారు తెలుసుకోగలిగారు. అయితే, క్రీస్తుకు పూర్వం పన్నెండవ శతాబ్దివరకు ఇనుము, ఉక్కు ఉత్పత్తులు బహుపరిమితంగా కొనసాగుతూవుండేవి; పదవ శతాబ్దినాటికి వాటి ఉత్పత్తులు ఎన్నదగు మేరకు పెరిగినా, ఎనిమిదవ శతాబ్ది లోనే ఆయుధాల నిర్మాణానికి వాటిని విరివిగా వినియోగించడం సాధ్యపడింది.[12]

మిటన్నీలకు, హిట్టయిట్‌లకు జ్ఞాతులైన ఆర్యులు సప్తసింధు ప్రాంతంలో ఎప్పుడు పాదం పెట్టినారో నిర్ధారణగా చెప్పలేముగాని, ఇక్కడికి చేరేనాటికే ఇనుమును, ఉక్కును ఉత్పత్తిచేసే పద్ధతులు వారికి తెలుసునని అనుకోవచ్చు. "అయస్సు" ప్రసక్తి, దాని ప్రశంస ఋగ్వేదంలో పెక్కుచోట్ల కనబడుతుంది. గట్టితనంతో, కరుకుతనంతో "అయస్సు"కు ఋగ్వేదం తరచు లంకె పెడుతుంది. కాబట్టి

అది ఇనుము అయివుండాలి, లేదా ఉక్కు అయివుండాలి.[13] అయితే, సప్తసింధు ప్రాంతంలో ముడియినుం దొరకదు. వేదకాలంనాటి ఆర్యులు మగధప్రాంతానికి విస్తరించడంలో పట్టుదల చూపడం కేవలం విపినప్రాంతాలను వ్యవసాయక్షేత్రాల కింద మార్చడం కోసమే కాదు; అక్కడి ముడియినుం కోసం కూడా కావచ్చు.[14]

రాముడు "బంగారు ములుకులుగల యేడమ్ముల నా కర్ణాంత మీడ్చి యే సెను" అని ఆరణ్యకాండ మూడవ సర్గలో వున్నది. "నే నేయు బంగారు తొడ వులు దూర్చిన బాణములు నిన్ను భేదించుకొని యావలికి బోవును" అని రాముడు ఖరునితో పల్కినట్టు అదే కాండ 29వ సర్గలో వున్నది. తిరిగి 31వ సర్గలో "పసిడిములుకుల" బాణాల ప్రసక్తి వచ్చింది. యుద్ధకాండకు వెళ్ళితే, ఈ "పసిడి ములుకుల" ప్రయోగం మరింత పెచ్చుగా కానవస్తుంది. రాముడు నిజంగానే పసిడిములుకుల అమ్ములను వాడి వుంటే, అవి శత్రువులను "భేదించుకొని, యావలికి బోవు"టు ఎంతవరకు జరిగేదో సందేహమే! ఒంట రిగా నిలిచి పోరాడినా, రాముడు ఎందరెందరినో చంపగలగడం ఉక్కుములుకుల అమ్ములను వాడినందువల్లనే, దిట్టమైన విల్లుతో చాకచక్యంగా వాటిని వాడినం దువల్లనే! అయితే, ఒంటరిగానే ఆయన వేలమందిని, లక్షలమందిని చంపినట్టు చెప్పడం అబద్ధం తలదన్నగల అత్యుక్తి మాత్రమే! వేలు, లక్షలు, కోట్లు, వేల కోట్లు, లక్షలకోట్లు - ఇట్టి సంఖ్యలను రామాయణంలో అతి వెర్రిగా వాడినా రనడం తూలుమూట కాదు. సుగ్రీవుడు కబురు పెట్టగా వచ్చిన వానరవీరులు దాదాపు కోటి కోట్ల మేరకు! (కిష్కింధాకాండ, 39వ సర్గ). 1976 నాటికి ప్రపంచం జనాభా 400 కోట్లకు కొంచెం తక్కువగానే జనాభా నిపుణుల అంచ నాల ప్రకారం క్రీస్తుశకం ప్రారంభంలో ప్రపంచం జనాభా25 కోట్లు మాత్రమే. పన్నెండున్నర కోట్లనుంచి 25 కోట్లకు ప్రపంచం జనాభా పెరగడానికి క్రీస్తుశకానికి పూర్వం దాదాపు 37,000 సంవత్సరాలు పట్టిందట. క్రీస్తు శకం ప్రారంభమైన తర్వాతకూడా 1650 వరకు ప్రపంచం జనాభా పెరుగుదల ఏమంత త్వరితంగా జరగలేదు. క్రీస్తుశకంలోని మొదటి 1650 సంవత్సరాలలో దాని పెరుగుదల 25 కోట్లనుంచి 50 కోట్లవరకు మాత్రమే. చకచక జనాభా పెరుగుదల పంధొమ్మి దవ శతాబ్ది ప్రారంభమైన పిమ్మటనే.[15] ఇండియా విషయంలో కూడా సరిగా ఇదే ధోరణి కానవస్తుంది. రిన్ డేవిడ్జ్ అంచనా ప్రకారం క్రీస్తుకు పూర్వం ఏడవశతాబ్దిలో మొత్తం ఉత్తర భారతం జనాభా బహుశ ఒకటిన్నర, రెండుకో ట్లను మించలేదు.[16] దక్షిణాపథాన్ని కలుపుకొంటే అది మూడు కోట్లను దాటేది

కాదేమో! డబ్లియు. హెచ్. మోర్‌ల్యాండ్ అంచనాప్రకారం అక్బర్ కాలంలో (క్రీస్తుశకం 1556-1605) ఇండియా మొత్తం జనాభా పదికోట్లు[17] మొట్ట మొదటి సారిగా 1872 లో ఇప్పటి పాకిస్తాన్, బంగ్లాదేశ్ బర్మాలను కూడ కలుపుకొని ఇండియా ఉపఖండం జనాభా లెక్కలను తీయగా, అప్పటి జనాభా ఇరవైకోట్లు మాత్రమే[18] - ఇండియా మొత్తం జనాభా ఒక కోటి కావచ్చు, కోటి న్నర కావచ్చు. అయినప్పుడు, లంకపై దండయాత్రకై సుగ్రీవుడు "కో"! అని కూకవేయగా వేలకోట్ల వానరులు వచ్చినారనడం "బొంకరా, బొంకరా, పోలిగా!" అంటే "టంగుటూరి మిరియాలు తాటికాయలంత" అన్నట్టుగా వున్నది. పోతే, లంకలోని రాక్షసుల సంఖ్య "లక్షకోటుల మూడు లక్షల యఱువది వేవురి కంటె పెచ్చు" అని చెప్పడాన్ని (కిష్కింధాకాండ, 35వ సర్గ) ఏమనవలెనో నాకు తోచడంలేదు! ! ఆ వానరులు, ఈ రాక్షసులు నిలబడ్డానికైనా ఈ భూమండలం చాలదు! ఇట్టి కాకమ్మ కథలను అల్లినవారు రాముడు జనస్థానంలో ఒంటరిగా నిలిచి సాగించిన పోరులో ఖరదూషణుల సమేతంగా పధ్నాలుగు వేల మందిని చంపినట్టు చెప్పడం (ఆరణ్యకాండ, 30వ సర్గ) అబ్బురమా? బహుశా ఆయన చంపినవారు పధ్నాలుగురు కావచ్చు.

ఏమైనా ఇట్టి వెర్రి మొర్రి కథలను ఒక పక్కకు నెట్టివేస్తే, వానరు లన్న వారు, ఋక్షము లన్నవారు, రాక్షసు లన్నవారు చిన్నిచిన్ని తెగలవారని, బహుశా ఒక్కొక్క తెగలో కొన్ని వందలమంది, లేదా, ఒకటి, రెండు వేలమంది వుండే వారని తీర్మానించుకొనవలసి వస్తుంది. కెప్టెన్ కుక్ పద్దెనిమిదవ శతాబ్ది ఉత్తరా ర్ధంలో ఆస్ట్రేలియాను స్థూలంగా సర్వే చేసినప్పుడు ఆ ఖండం మొత్తం జనాభా రెండున్నర లక్షలను మించకపోవచ్చునని అంచనా వేశారు. ఆ రెండున్నర లక్షల మంది 2500 తెగలకు చెందినట్టివారు.[19] దీని తాత్పర్యం ఒక్కొక్క తెగలో సగ టున వందమంది మించిలేరని. రామునికాలంలో దండకారణ్యంలో రెండున్నర వేల తెగలు కాకపోతే, కనీసం ఏ వంద, లేక రెండు వందల తెగలు వుండేవని ఖచ్చి తంగా అనుకోవచ్చు. ఈ నాటికైనా ఈశాన్యభారతంలోనే ఎన్ని కొండజాతులు లేవు? అక్కడి ఒక్క నాగజాతిలోనే తిరిగి ఎన్ని తెగలు లేవు?

లంకపై దండయాత్రలో రాముడు పోరింది కొన్ని కోట్లమందితో కాదు, లక్షలమందితో కాదు, వేలమందితోనైనా కాదు, కేవలం కొన్ని వందలమందితో కావచ్చు. వారిని ఆయన గెలవగలిగింది బహుశా వారికి విల్లంబులు లేకపోయి నందునే కావచ్చు. వానరులకు అవి లేవని రామాయణం పెక్కుచోట్ల స్పష్టంగా

చెబుతున్నది. వారు పోరు జరిపింది చెట్లను పెరికి, కొమ్మలను విరిచి, బండలను దొర్లించి, రాళ్ళను విసిరి; లేదా, గోళ్ళతో రక్కి, పళ్ళతో పీకి, కాళ్ళతో తన్ని, మోకాళ్ళతో కుమ్మి, పిడికిళ్ళతో మోది. ఇంతే తప్ప గద, ఖడ్గం, శూలం మొదలైన ఆయుధాలనైనా వారు వాడలేదు ! :

పోతే, రాక్షసులకైనా విల్లంబులున్నట్టు గట్టిగా చెప్పలేము. అవి వారికుంటే శూర్పణఖ తనకు జరిగిన ఘోరావమానాన్ని గురించి ఖరునితో మొరపెట్టుకొనడానికి వెళ్ళినప్పుడు "రాముని, వాని తమ్ముని ఒక్క బాణంతో చంపుతాను" అనికాక, "ఇదిగో! వారిని గొడ్డలితో నరుకుతా"నని అత డనివుండేవాడా? (అరణ్యకాండ, 22వ సర్గ). ఖరుని సేనానులలో మహాకపాలుడు శూలాన్ని, స్థూలాక్షుడు అడ్డకత్తిని, ప్రమాధి గొడ్డలిని పుచ్చుకొని పోరులో దూకేవారా? ఖరుడు, మరికొందరు విల్లంబులను వాడకపోలేదుగాని, అతడి సైనికులు కురిపించింది బాణాల వర్షాన్ని కాదు, చెట్లవాననే, రాలవాననే. (అరణ్యకాండ, 25వ సర్గ). విల్లు చేయడానికి వెదురుబద్ద చాలు, బాణం చేయడానికి వెదురుపుల్ల చాలు. అయినప్పుడు, విల్లమ్ములను ఖరదూషణులకు చెందిన ప్రతి సైనికుడు ఎందుకు సమకూర్చుకొనలేదు? లంకలో జరిగిన యుద్ధంలోనైనా తిరిగి ఇదే ప్రశ్న ఎదురౌతున్నది. రామలక్ష్మణులపై యుద్ధంలో ఇంద్రజిత్తు ప్రయోగించిన ప్రధమాయుధం నాగపాశం. అది వారిని పడగొట్టి, చేతులను కట్టివేసిందట. (యుద్ధకాండ, 45, 46వ సర్గలు). ఈ పాశాన్ని రామాయణంలోనే మరొకచోట యమపాశంతో పోల్చడం జరిగింది. అందువల్ల ఇది "లాసో" (LASSO) ! కావచ్చు. దీన్ని గిరిగిర విసరి పొగరుబోతు ఆబోతులనైనా, అశ్వాలనైనా పట్టుకోవచ్చు. ఇంద్రజిత్తు రామలక్ష్మణులపై ప్రయోగించింది. ఈ "లాసో"యే కావచ్చు. పోతే, కుంభకర్ణుడు యుద్ధానికి బయల్దేరింది విల్లమ్ములతో కాదు, మొనవాలుతో, అతని వెంట యుద్ధానికి వెళ్ళిన సైనికులు పుచ్చుకొని వెళ్ళినవి రోకళ్ళు, గుదియలు (యుద్ధకాండ, 65వ సర్గ). రోకళ్ళతో పాటు, గుదియలతో పాటు, వారు ఈటెలు, గదలు, గొడ్డళ్ళు, పట్టసములు, శక్తులు, త్రిశూలాలు, ఖడ్గాలు, చక్రాలు, మొదలైనవాటిని వాడినట్టు యుద్ధకాండ వివరిస్తున్నది. అక్కడక్కడ విల్లంబుల ప్రసక్తి వున్నా, అది కేవలం కొందరు నాయకుల విషయంలోనే. వానరులవలె రాక్షసులు సయితం ధనుర్బాణాలను వినియోగించే వారు కారేమో అని దీన్నిబట్టి అనుమానించవలసి వస్తున్నది. ఇదే అనుమానాన్ని సి.వి. వైద్య సయితం వెల్లడించారు.[20] ఒకవేళ వారికి ధనుస్సులుంటే, అవి

శక్తి మంతమైనవి కాకపోవచ్చు; వారి బాణాల ముక్కులు ఉక్కుతోకాక, రాతి ముక్కలతో చేసినట్టివి కావచ్చు. ఆయుధాల విషయంలో ఈ విధమైన ఆధిక్యం ఏదో లేకపోతే, రామలక్ష్మణులు దండకారణ్యంలోని ఆటవికులను, సంఖ్యాబలం వారి పక్షాన వున్నా, జయించగలిగేవారు కాదు! ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే కొద్దిమంది బహుళజనులను యుద్ధంలో జయించడం ఎప్పుడు-- ఎక్కడ--జరిగినా, అది నూతనాయుధాలవల్ల, లేదా నూతన యుద్ధపద్ధతులవల్ల, లేదా కొన్ని కొన్ని సందర్భాలలో ఈ రెండింటి సమ్మేళనంవల్ల జరిగినట్టు కానవస్తుంది.

మధ్యశిలాయుగం నాటికే-దాదాపు పదివేల సంవత్సరాల క్రితం నాటికే-విల్లును కనిపెట్టడం జరిగింది. ఆదిలో విల్లు ఒక ఆటవస్తువు; పిమ్మట ఒక సంగీత సాధనం.[21] తంబుర, వీణ మొదలైనవి విల్లునుంచి కాలక్రమాన రూపొందినట్టివే. ఈనాటికి కూడా ఆఫ్రికాకు చెందిన జూలూ తెగవారు విల్లును సంగీతసాధనంగానే వాడతారు.[22] విల్లుకు అమ్మును తోడుచేసేసరికి అదే వేటుకు ఉపకరణగా మారింది. తర్వాత అతి త్వరలోనే అది యుద్ధసాధనంగా వ్యాప్తిలోకి వచ్చింది. ఇంతటి పురాతనకాలంలోనే వ్యాప్తిలోకి వచ్చిన విల్లమ్ములకు దండకారణ్యప్రాంతానికి చెందిన తెగలవారు (వానరులుగా, ఋక్షములుగా, రాక్షసులుగా, రామాయణం పేర్కొంటున్నవారు) ఎందుకు అపరిచితులు కావాలి? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరానికై పసిఫిక్ సముద్రంలోని మెలినీజెన్, పోలినీజెన్ దీవులకు వెళ్ళక తప్పదేమో! ఆ దీవులలో అయిదింటిని మినహాయిస్తే తక్కినవాటికి చెందినవారు విల్లంబులతో పోరు జరపడాన్ని కావాలనే విరమించారు. వారి దృష్టిలో గదాయుద్ధమే వీరోచితమైంది. అందువల్ల ధనుర్బాణాల వినియోగాన్ని క్రీడా వినోదాలకు, మత్స్యాల, పక్షుల, మూషికాల వేటకు వారు పరిమితం చేశారు.[23] జూలూల దృష్టిలో కూడా ధనుర్బాణాలు భీరులకు తగు ఆయుధాలే! [24] దండకారణ్యానికి చెందిన తెగలవారికి కూడా విల్లంబుల విషయమై ఇట్టి న్యూనభావమే వుండేదేమో! కుంభకర్ణుని విషయంలో ఇది అక్షరాలా నిజం. తాను "వాడి యమ్ములతో" యుద్ధానికి అయిష్టుడనని రావణునితో అతడు స్పష్టంగా చెప్పనే చెప్పాడు (యుద్ధకాండ, 63 వ సర్గ)

ఏమైనా, ఆయుధబలం తక్కువైనందువల్లనే రాక్షసులుగా రామాయణం పేర్కొన్నవారు "గెరిల్లా" యుద్ధ పద్ధతులను అనుసరించవలసి వచ్చేది. ఎదుట నిలిచి పోరాడ్డానికి వీలులేనప్పుడు చాటునుంచి దెబ్బతీయక తప్పదు; పగలు దాడి జరపడానికి వీలులేనప్పుడు చీకటి మరుగున ముట్టడించక తప్పదు; అవసరమైన

ప్పుడు మారువేషాలకు వేసుకొని పగతురపై దూకకతప్పదు. రాక్షసు లన్నవారు ఈ విధమైన గెరిల్లా యుద్ధపద్ధతులను అనుసరించే వారు కనుకనే వారికి "నిశా చరు"లని, "కామరూపు"లని, "మాయావు"లని వారి విరోధులు ఏవేవో చెడ్డపేర్లు చాలా పెట్టారు !

మరొక్కమాట చెప్పి, ఈ ప్రకరణాన్ని ముగిస్తాను. మన పౌరాణికులను విడిచిపుచ్చండి; మన చరిత్రకారులైనా మానవవికాస శాస్త్రానికి (anthropology) తా మివ్వదగు ప్రాధాన్యమివ్వరు. ఆ శాస్త్రాన్ని నిర్లక్ష్యం చేసినప్పుడు ఏ ప్రాచీన సంఘాన్ని గురించి, ఏ పురాతన సంఘటననుగురించి సముచితాభిప్రాయాలను ఏర్పరుచు కొనడం సాధ్యపడదు. అన్ని సంఘాలవలె మనదికూడా మానవ వికాస చరిత్ర లోని దశ లన్నింటిద్వారా పయనించినట్టిదే! బ్రహ్మముఖం నుంచి మనం సరాసరిగా ఊడి పడలేదు. !!

*

శ్రీ సీతారాములు

ఏదేళ్ళనాడు మద్రాసులో నా "సీతజోస్యం" నాటకాన్ని నా మిత్రబృందా నికి చదివి వినిపించిన తర్వాత ఒక పండితమిత్రుడు చిరుకోపంతో చేసిన విమర్శ "ఈ సీత మా దృష్టిలోని సీత కా"దని. చిరునవ్వుతో ఆయనకు నేను చెప్పిన సమాధానం. "ఈమె మీ దృష్టిలోని సీత కాకపోవచ్చుగాని, వాల్మీకి దృష్టిలోని సీత" అని. ఇప్పటికైనా నా పండితమిత్రుడు నాతో ఏకీభవించకపోవచ్చు. అయ నవలె ఎందరెందరో ఏకీభవించక పోవచ్చు. అయినా, ఇదివరలోవలె ఇప్పటికీ - ఎప్పటికీ - నా నమ్మకం వాల్మీకి సీతనే యథాతథంగా నేను నా నాటకంలో ప్రవేశపెట్టానని.

వాల్మీకిని సరిగా చదవక, చదివినా సవ్యంగా అర్థంచేసుకొనలేక, చెక్కుమంది సంభావిస్తున్నట్టు, సీత నోట నాల్కలేని పతివ్రతాశిరోమణి కాదు. అవసరమైన ప్పుడు భర్తతో ఆమె నిష్కర్షగా మాట్లాడేది, గత్యంతరం లేనప్పుడు పరుషంగానైనా మాట్లాడేది. అనువాదాలతో సరిపుచ్చక,. వాల్మీకి రామాయణం ఆరణ్యకాండ లోని పదవసర్గను చదవండి. (అది ఈ పీఠిక చివర రెండవ అనుబంధంలో వున్నది). దాన్ని చదివితే, "ఆయుధ మెక్కడ, ఆరణ్యవాస మెక్కడ" అని విభుని ఆమె సూటిగా ప్రశ్నించినట్టు తెలుస్తుంది. "శస్త్రములు చేపట్టుటవల్ల పాపబుద్ధిపు

ట్టును" అని ధవుని ఆమె గట్టిగా హెచ్చరించినట్లు తెలుస్తుంది. "పగ లేకనే యొక్కరిని జంపుట" మహాపాతకమని పెనిమిటితో ఆమె నిష్కర్షగా పలికినట్టు తెలుస్తుంది. పోతే, ఆయోధ్యాకాండలో 30వ సర్గను చదవండి. అరణ్యావాసానికి తనవెంట రావలదని భర్త గట్టిగా చెప్పినప్పుడు పట్టలేని కోపంతో తన తండ్రి మాటగా "నా అల్లుడు స్త్రీయేగాని పురుషుడి కాడు. పురుషవేషము దాల్చిన స్త్రీయై నన్ను వంచించెను. !" అని పరుషంగా ఆమె పలుకుతుంది. కాగా, తన మాటగా మరింత పరుషమైన ధోరణిలో "నన్ను నటునివలె బరులపాలు చేయగోరుచున్నావు!!" అని పలుకుతుంది. ఇంత పరుషంగా ఆమె నిష్కారణంగా పలకలేదు. అందుకు తగు కారణం వున్నది. దాన్ని మరికొంత దూరం పోయిన తర్వాత వివరిస్తాను.

సరే, "సీత హాస్యాలు కూడా ఆడేదా?" అని మరొక సందేహం వెక్కుమం దికి కలగవచ్చు. ఔను ! ఆమెది హాస్యప్రవృత్తి. చతురతతో ఆమె హాస్యాలాడేది. అందరు వదినెలవలె మరదితో ఆమె ఎక్కువగా హాస్యా లాడేది. ఇది నా ఊహ కాదు; వాల్మీకి రామాయణమే ఈ సంగతిని స్పష్టంగా చెబుతున్నది. సీతాప హరణం తర్వాత ఆమెను తలచుకొని విలపిస్తూ "చెట్టుచాటున దాగి నన్ను వేళాకోళము పట్టించ గోరుచున్నావటే !" అని రాము డన్నట్టు ఆరణ్యకాండ 61వ సర్గ తెల్పుతున్నది. "ప్రియురాలా! నీవు పరియాచకము చేయు స్వభా వము గలదానివని నే నెఱుగుదును" అని ఆయనన్నట్టు 62వ సర్గ తెల్పుతున్నది. పంచవటివద్ద ఒక శిలాఫలకాన్ని చూపిస్తూ "లక్ష్మణా! సీత మునుపు నాతోడ నీ రాతి మీద గూర్చుండి, నీ తోడ బెక్కు పరియాచకపు మాటలాడెను గదా!" అని రాముడన్నట్టు 63వ సర్గ తెల్పుతున్నది. కిష్కింధాకాండ ప్రథమసర్గ ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నది. అక్కడ తమ్మునితో "లక్ష్మణా! సీత చిఱునవ్వు మోమువో నడుమనడుమ బరిహాస పూర్వకము లయినవియు, తియ్యనివియు, రస వంతము లయినవియు, మేలొన గూర్చినవియు నైన పలుకులు పలుకు నెప్పుడు వినగలను?" అని రాము డంటాడు. సీత హాస్యోక్తులాడేదనడానికి వీటినిమించి ఏమి సాక్ష్యాధారాలు కావాలి? ఈ సాక్ష్యాధారాల తర్వాత వాల్మీకి చిత్రణకు భిన్నంగా నేను సీతకు రూపకల్పన చేసినానంటే, అది సబబు కాగలదా?

లక్ష్మణునితో సీత పరియాచకా లాడుతూ వుండేదని రాముడు స్వయంగా పలికిన మీదట వదినె ముఖమైనా మరదికి తెలియదనడంకంటె "నాన్ సెన్స్"వుం టుందా? అయినా, కిష్కింధాకాండ 6వ సర్గలో ఇది వున్నది. రావణుడు తనను

ఎత్తుకు పోతున్న ఘట్టంలో తన ఆభరణాలను ఉత్తరీయంలో మూటకట్టి, ఋశ్య మూకపర్వత శిఖరంపై తన మంత్రులు నలుగురితో కూర్చున్న సుగ్రీవుని సమీపంలో సీత పడవేస్తుంది. వాటిని సుగ్రీవుడు రామలక్ష్మణులకు చూపించినప్పుడు, లక్ష్మణుడు అన్నగారితో "ఆమె దొడుగు బాహువులెట్టివో, కమ్మలెట్టివో, నాకు దెలియదు. నే నెల్లప్పు డామె పాదములకు మ్రొక్కటంజోసి, యామె కాలియంది యెలు మాత్రము నే నెఱుగుదును" అన్నాడట. (కిష్కింధాకాండ, 6వ వర్గ). పది సంవత్సరాలకు పైగా అరణ్య వాసంలోనేమి, అంతకుముందు అయోధ్యా నగరంలో నేమి పొరపాటుగానైనా లక్ష్మణుడు వదినె ముఖాన్ని చూడలే దనడం విడ్డూరపుమాట మాత్రమే కాదు, వికారపు మాట కూడా! వదినె ముఖాన్ని చూచినంత మాత్రాన తన మనస్సులో పాపచింతలు పుట్టవచ్చునన్న భయంతోనే లక్ష్మణుడు ఆ పని చేయలేదా? అతని మనస్సు అంతగా దుర్బలమైనదా, దుష్ట మైనదా? సమాజంలో స్త్రీ స్థానాన్ని గురించి అభిప్రాయాలు వక్రగతిని పట్టిన తర్వాత ఎవడో కిష్కింధకాండ 6వ సర్గలో లక్ష్మణునిచేత ఈ పలుకులను పలి కించాడని నిస్సందేహంగా అనుకోవచ్చు. వనవాసానికి వెడుతున్న సందర్భంలో గంగానదిని దాటవలసి వచ్చినప్పుడు లక్ష్మణుడు సీతను "వెనుకనుండి బట్టుకొని " పడవలోకి ఎక్కించాడు. (అయోధ్యాకాండ, 52వ సర్గ). వదినె ముఖం వంక చూడ్డమే దోషమైతే, ఆమెను పట్టుకొని పడవ నెక్కించడం మరెంతటి మహా దోషం!!

రాముడు సీతను ఎంతగా ప్రేమించినా, ఆ ప్రేమ ఆయన పితృభక్తిని మించింది కాదు, ఆయన బ్రాహ్మణాభిమానాన్ని మించింది కాదు, ఆయన భ్రాతృవాత్సల్యాన్ని మించింది కాదు, వంశగౌరవాన్ని గురించి ఆయన పట్టుదలకు మించింది కాదు. అందువల్లనే తండ్రి ఇతే, రాజ్యాన్నే కాదు, ధనాన్నే కాదు, ప్రాణాలనే కాదు, సీతనైనా భరతునికి అప్పగిస్తానని (!) కై కేయితో రాము డన్నాడు. (అయోధ్యాకాండ, 19వ సర్గ). తననైనాసరే భరతునికి అప్పగిస్తానన్న మాట విన్నందువల్లనే కావచ్చు, రామునితో సీత "నన్ను నటునివలె బరులపాలు చేయగోరుచున్నావు" అని కటువుగా పలికింది. ఇక, వైరము లేకుండానే చంపడం మహాపాపమని సీత పెచ్చరించినప్పుడు రాముడు ఋషులకు తా నిచ్చిన వాగ్దా నాన్ని తప్పబోనని చెప్పడానికి ముందు "ఓ సీతా! నేను ప్రాణములను, నిన్ను, లక్ష్మణుని విడనాడుదుగాని....."అని స్పష్టం చేస్తాడు. (ఆరణ్యకాండ, 11వ సర్గ). మరొక ఘట్టంలో - లంకా యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు,

అతడు మరణించినాడన్న భ్రమతో రోదించిన ఘట్టంలో - రాము డన్న మాటలు "నా కిక యుద్ధముతో గాని, ప్రాణములతో గాని, తుదకు సీతతో గాని పని యేమి యున్నది? దేశ దేశమునకు గావలసి నందఱు భార్యలు దొఱకుదురు: చుట్టాలును దొఱకుదురు; కాని, ఒక సోదరుడు దొరకుట యెక్కడను లేదు! " అని (యుద్ధకాండ, 102వ సర్గ). సీతను గురించి ఇంతకంటె చులకనగా, నికృష్టంగా ఆయన మాట్లాడింది రావణవధానంతరం. అశోకవినం నుంచి ఆమెను పిలిపించి, "స్వవంశమునకు నపకీర్తియు నిందయు రాకుండ గోరియు, నడవడి గాపాడుకొనగోరియు నేనింత కష్టపడితినిగాని, యదెల్ల నీ నిమిత్తముగాదు" అని చెబుతాడు. ఇంతటితోనైనా విరమించక, ఆయన పల్కిన పలుకు లివి;

"పరాయియింట జిరకాల ముండుటచే నడతల విషయమున సంశయాస్పదు రాలైన నీవు నా యెదుట నుండుటచే గంటినొప్పి వచ్చినవానికి దీపపు వెలుతురు మరింత పోట్లు పొడుచునట్లు నీ దర్శనము నా కెక్కువ యాయాసాస్పదముగ నున్నది. కావున నో జనకరాజపుత్రీ! నే నానతిచ్చెదను; ఈ పదిదెసలలో నీ మనసున కెక్కిన చోటునకు బొమ్ము. నాకు నీతో గావలసిన యక్కఱ యేదియు లేదు; సత్కులమున బుట్టిన, యందును పౌరుషముగల యెట్టి మానవు డయినను జిరకాలము పొరుగింటనుండి వచ్చిన యాడుదాని బ్రేమతో జేపట్టునా? ఇంతదనుక క్రూరుడైన రావణుని తొడమీదనుండి జాఱిపడినదానవు, ఆ దుష్టునిచే గామా తురమగు చూపుతో జూడబడినదానవునైన నిన్ను గొప్ప కులమున బుట్టినవాడనని పేరొందియుండు నే నెట్లు చేపట్టువాడను? నాకు వచ్చిన యవమానముం బోగొట్టుకొనుటకై నిన్ను జయించితిని కాని, నీ యందలి యాశచే గాదు. పోయిన కీర్తిని మఱల సంపాదించితిని. ఇంక నీవు నీ యిష్టమైన చోటికి బొమ్ము. ఓ శుభాంగీ! నే నెంతయో యాలోచించి యిట్లు పలికితినిగాని, యన్యముకాదు. నీవు లక్ష్మణుని కడనో, భరతునికడనో, వానర రాజగు సుగ్రీవునికడనో, రాక్షసేం ద్రుడగు విభీషణునికడనో, లేక నీ కెచ్చటనుండుట కిష్టమో యచ్చట సుఖముగా నుండి జీవింపుము. దివ్యరూపము గలదానవు; మనోరమవునైన నీవు బహుకాలము తన గృహమున నుండగా, గామాతురుడగు రావణుడు నిన్ను జూచి తన కామము నణచుకొని యుండి యుండునా?" (యుద్ధకాండ, 118వ సర్గ).

అయినా, ఆదర్శపురుషుడుగా, ఆదర్శప్రాయుడైన భర్తగా రాముని ఎందుకు సంస్తవిస్తారో నామట్టుకు నాకు అర్థంకాని విషయం! ! రామాయణం మొత్తం మీద నిజంగా సంస్తవించదగు వ్యక్తి రాముడు కాదు, సీత. అటు తర్వాత

సంస్తవించదగు వారు భరతుడు, లక్ష్మణుడు. ఆత్మాభిమానంలోగాని, హృదయవై శాల్యంలో గాని, బుద్ధి సూక్ష్మతలో గాని, వాక్చాతురిలో గాని, ధర్మాభినిరతిలో గాని, సీతకు ఏడువెనుకలుగా నిలవవలసినవాడే రాముడు. ఇక, త్యాగగుణంలో భరతునికి ఒకయోజనం దూరంలోనికైనా రాముడు రాడు, రాలేడు. విలపిస్తూ చేసినట్టిది త్యాగం కానేరదు. "జాబాలి" పీఠికలో నేను వివరించినట్టు, తనకు యౌవరాజ్య పట్టాభిషేకం తప్పిపోయినందుకు, తనకు సింహాసనం దక్కనందుకు లోలోపల కుమిలి పోవడమేకాదు, పైకికూడా రాముడు తన బాధను వెళ్లగ్రక్కుతూ పోయాడు, పోతే, రామాయణం మొత్తంలో లక్ష్మణుడు గట్టిగా విలపించిన ఘట్టాలు బహుశా రెండు మాత్రమే. వాటిలో మొదటిది - "నీచుడు నీచురాలి ననినట్టు" (ఇవి నామాటలు కావు; సీత మాటలు) తన శీలాన్ని శంకిస్తూ భర్త తనను అడ్డమైన మాటలన్న మీదట లంకలో సీత అగ్నిప్రవేశం చేసినప్పుడు; రెండవది, అన్న అనతిప్రకారం వాల్మీకి ఆశ్రమం చెంత అరణ్యంలో నిండు గర్భవతి సీతను విడిచిపెట్టినప్పుడు ఇందుకు భిన్నంగా రాముడు విలపించనట్టి ముఖ్యఘట్టం ఏదీ లేదు. పైగా, "ఇది దైవ ప్రేరణ" అని, "దైవయోగ"మని, "దైవమాయ" అని, (అయోధ్యాకాండ, 22వ సర్గ), "మనుజులకు స్వాతంత్ర్య మనునది లే"దని, "పుట్టుట గిట్టుటకే" అని (అయోధ్యాకాండ, 104వ సర్గ), "తొంటిబామున నేను కావలెనని పలుమాఱు పాపకార్యములు చేసి యుంటిని.....వాని కన్నిటి కిప్పుడనుభవించ వలసిన కాలము వచ్చిన" దని (ఆరణ్యకాండ, 63వ సర్గ). కాస్త సందు దొరికితే చాలు, రాముడు మెట్ట వేదాంతంలో పడిపోతాడు!

అయినా సీతను మించి, భరతుని మించి, లక్ష్మణుని మించి రాముడు ప్రశంస లందుకొనడం ఎందువల్ల? దీని కొక ముఖ్యకారణం లేకపోలేదు. అది "పబ్లిక్ రిలేషన్స్"కు, "ఇమేజ్ బిల్డింగ్"కు సంబంధించినట్టిది. ఉచితానుచితా లను,సమయా సమయాలను, సందర్భాసందర్భాలను ఎంతమాత్రం పాటించక, ఒక వ్యక్తిని ఆదే పనిగా స్తోత్రం చేస్తూ పోతే, అతడికి విధిగా ఘనత లభిస్తుంది. రాముని విషయంలో సరిగా ఇంతే జరిగింది. రామాయణంలో ఆయనను స్తోత్రం చేయనివారు దాదాపుగా లేరు. చివరికి శూర్పణఖ, మారీచుడు, కుంభకర్ణుడు కూడా ఆయనను స్తోత్రం చేస్తారు. వాల్మీకి రచనను పెంచి వ్రాసినవారే, రాముని అవతారపురుషునిగా చిత్రించినవారే ఈ పొగడ్తలను చేర్చివుండవచ్చు. "మనపట్ల వైరంలేనివారిని చంపడంద్వారా మీరు మహాపాపం చేస్తున్నా "రని సీత భర్తను స్త్రీవంగా విమర్శించిన వెనువెంటనే ఆమె చేత "నే నాఁడుదానన్నై నందున జప

లబుద్ధిచే నింత చెప్పితిని గాని, నీ కెవ్వడు నేర్పగలడు? " అనిపించడం వాల్మీకి రచనలో వేలుపెట్టినవాని పనే అయివుండాలి!

దశరథుడు "కామపరతంత్రు"డని, "కైకేయికి లోబడినవా"డని (అయోధ్యా కాండ, 53వ సర్గ) దూషించింది మరెవరో కాదు, రాముడే! అయినా, ఆదర్శప్రాయుడైన తనయునిగా రాముని భూషించడం భావ్యమా? తనకోసం తల్లి రాజ్యాన్ని సంపాదించగా భరతుడు దాన్ని నిరాకరించాడు. ఇంతటి గొప్పత్యాగం చేసిన భరతుడు రాజ్యలోభానికి అతీతుడు కాకపోవచ్చునని అనుమానించింది మరెవరో కాదు, రాముడే! (యుద్ధకాండ, 128వ సర్గ)అయినా, ఆదర్శప్రాయుడైన సోదరునిగా రాముని కీర్తించడం భావ్యమా? తన జీవితంలోని ప్రతి ముఖ్యఘట్టంలో రాముడు సీతను అవమానించాడు. అవస్థల పాల్జేశాడు, అయినా, ఆదర్శప్రాయుడైన భర్తగా రాముని సంస్తవించడం భావ్యమా? ఏ కఠిన పరీక్షకు నిలవవలసి వచ్చినా, రాముడు వలవల విలపించినాడు. అయినా, ఆదర్శప్రాయుడైన వీరునిగా రాముని ప్రస్తుతించడం భావ్యమా? అయితే, బహుళ జనుల దృష్టిలో ఎంతమాత్రం భావ్యం కాని పని - రాముని గురించి ఇట్టి ప్రశ్నలు నేను వేయడమే కావచ్చు నేమో? అంతమేరకు రాముని విషయంలో "బ్రెయిన్ వాషింగ్" జరిగింది!

స్వతంత్రంగా ఆలోచించడం, స్వతంత్రంగా వ్యవహరించడం, మానసిక దౌర్బల్యాన్ని చూపినప్పుడు తండ్రినైనా ధిక్కరించడం, ధర్మవిరుద్ధంగా వర్తించమంటే గురువు మాటనైనా త్రోసిపుచ్చడం - ఈ విధమైన ధీరగుణాలు రామునిలో కలికానికైనా కానరావు. అందువల్లనే ఆయన తండ్రిని ఏడ్పించాడు, తల్లిని ఏడ్పించాడు, భార్యను ఏడ్పించాడు, తమ్ములను ఏడ్పించాడు, తమ బ్రతుకు తాము బ్రతుకుతున్న ఆటవికులను ఏడ్పించాడు, అందరినీ మించి తానే ఏడ్చాడు! చివరకి సరయూనదిలోకి దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు!

పోనీ, ఇతర విషయాలలో నాతో ఏకీభవించకపోయినా, నా పీఠికలోని మొదటి కొన్ని పుటలను చదివినంతనే ఈ పుస్తకాన్ని ముక్కముక్కలుగా చించి పారవేయక, ఇంతవరకు నాతో వచ్చినవారు ఒక్క విషయంలో నాతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నాను. సీతారాము లిద్దరిలో చేయెత్తి నమస్కరించదగు వ్యక్తి రాముడు కాదు.

సీత, సీత, ముమ్మాటికీ సీత !!

*

ఉపసంహరణ

ఎన్నెన్నో అవాంతరాల తర్వాత, ఎన్నెన్నో ఆలస్యాల తర్వాత, ఎట్టకేలకు ఈ పీఠికను ముగించ గలుగుతున్నాను. దీన్ని వ్రాయడానికి ఎన్నెన్నో గ్రంథాలను చదవవలసివచ్చింది, ఎంతెంతగానో పరిశోధన జరపవలసివచ్చింది. అయినా, రామాయణాన్ని గురించి చివరి మాటను చెప్పగలిగినానన్న భ్రమ నాకు లేదు. మహాభారతంతో పోల్చినప్పుడు రామాయణంలో జరిగిన ఫోర్జరీలు చాలా తక్కువ, పురాణాలతో పోల్చినప్పుడు మరింత తక్కువ. అయినా, రామాయణంలోనైనా మార్పులు, చేర్పులు బహుళంగానే జరిగాయి, బహుశా నాలుగైదు శతాబ్దాలపాటు అవి జరిగాయి. అందువల్ల ముందు తూర్పార బట్టి, అటు తర్వాత చెరిగినా, జల్లించినా, తప్పనుంచీ, తాలునుంచీ గట్టిగింజను వేరు చేయడం తేలిక కాదు; అది దాదాపు అసాధ్యమని చెప్పినా చెప్పవచ్చు, అయినప్పుడు, నా పీఠికలోని విషయాలను, ముఖ్యంగా రామాయణకాలంనాటి ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలకు సంబంధించిన విషయాలను, పరమ సత్యాలుగా స్వీకరించవలసిందిగా నేను కోరలేను. నేను కోరగలిగింది ఒకే ఒక విషయం. అది - ఆలోచించకుండా నా వైఖరిని నిరసించవలదని, పరిశీలించకుండా నా వాదాన్ని నిరాకరించవలదని.

అన్నట్టు, నా వైఖరి పూర్తిగా కొత్తదికాదు, నా వాదం పూర్తిగా మౌలికమైనది కాదు రామాయణంవిషయమై నాకంటె నిశితంగా వ్రాసినవారున్నారు;

దాన్ని కేవలం ఒక కట్టుకథగా, ఒక జానపద గాథగా త్రోసివేసినవా రున్నారు. అట్టివారిని నేను గట్టిగా కాదనను గాని, రామాయణంలో చారిత్రకసత్యం రవ్వం తగావుంటే, అది క్రీస్తుకుపూర్వం పదవశతాబ్ది ప్రాంత్రాల ఉత్తర భారతంలోగల కొద్దిపాటి రాజ్యాలు పెక్కింటిలో ఒకదానికి చెందిన రాజాస్థానంలోని కుట్రలకు పరిమితమని నా వైఖరి; రామరావణ యుద్ధమనేది నిజంగా జరిగివుంటే, దాన్ని ఆహారసేకరణ, ఆహారోత్పత్తి వ్యవస్థలమధ్య సంఘర్షణగా పరిగణించవచ్చునని నా వాదం. నా వైఖరి సమర్థనకై "జాబాలి" పీఠికలో నేను ప్రయత్నించగా, నా వాదాన్ని మీకు నివేదించడానికై "సీతజోస్యం" పీఠికలో ప్రయత్నించాను.

ఎవరి కెంత బాధ కలిగినా సరే, మరొక్క విషయాన్ని చెప్పి, అంతటితో సరిపెడతాను. రామాయణ భారతాలైనా, అష్టాదశ మహాపురాణాలైనా వాటి ప్రధానోద్దేశాలు కులవ్యవస్థను పరిరక్షించడమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయడమే. అందువల్ల ప్రస్తుత ధోరణిలో వాటి ప్రచారం సాగితే, ప్రకృత రీతిలో వాటిపట్ల భక్తి శ్రద్ధలు ప్రబలడం జరిగితే, నవసమాజ నిర్మాణం, నూతన ధర్మసంస్థాపన కేవలం శుష్క నినాదాలుగానే మిగిలిపోవడం తథ్యం. దాదాపు పదిహేనువందల సంవత్సరాలుపాటు మన మానసికవికాసానికి, మన సాంఘికపురోగతికి రామాయణ, భారతాల ప్రభావం, అష్టాదశ మహాపురాణాల ప్రభావం ఒక తీవ్ర ప్రతిబంధకంగా నిలిచింది. ఆ ప్రతిబంధకాన్ని ఇకనైనా తొలగించుకొనక పోతే, మనం ఆధునిక యుగంలో ప్రవేశించలేము, అభ్యుదయపథం వెంట పురోగమించలేము.

"లుంబిని"
బంజారా హిల్స్
హైదరాబాదు
డిశెంబర్

నార్ల వెంకటేశ్వరరావు

మొదటి అనుబంధం

దశరథ జాతకం.*

శాస్త్ర జేతవనమున విహరించుచూ తండ్రి చనిపోయిన గృహస్థును గూర్చి చెప్పినది :

వర్తమానకథ

అతడు తండ్రి మరణించిన పిదప దుఃఖాభిభూతుడై పను ల్నియు విడ

---

* పాలీభాష నుండి తాము తెనిగించిన ఈ జాతక కథ పునర్ముద్రణకు రెండే ళ్ళనాడు నేను కోరినంతనే అందుకు సంతోషంగా సమ్మతించడమేకాక, నా యోగక్షేమాలను విచారిస్తూ స్వామి శివశంకరశాస్త్రి ప్రేమాదరాలతో కూడిన లేఖ వ్రాశారు. అదే ఆయన నుంచి నాకు చివరి లేఖ అయినందుకు చింతిస్తూ, ఆయన స్మృతికి ప్రేమాంజలి ఘటిస్తున్నాను.

నాడి శోకముచే వెర్రివా డయ్యెను. శాస్త ప్రాతఃకాలముననే లోకమునుగూర్చి యోచించి నప్పుడు త్వరలోనే అతడు శ్రోతాపత్తి పొందగలడని తోచినది. మరు నాడు శాస్తశ్రావస్తిలో భిక్షాటనముచేసి భోజనానంతరము భిక్షువులను సాగనంపి, ఒక్క భిక్షువును వెంటనిడుకొని, అతని యింటి కరిగెను. గృహస్థు శాస్తకు ప్రణ మిల్లి కూర్చున్న పిదప శాస్త మృదుమధుర స్వరముతో "ఉపాసకా, దుఃఖించు చున్నావా?" అనెను. "భన్తే, చిత్తము, పితృశోకము నన్ను వేధించుచున్నది." "ఉపాసకా, పూర్వము పండితులు అష్టలోక ధర్మమములను (అష్టాంగ యోగములు) స్వరూపతః గ్రహించి తండ్రి మరణించినను లేశమాత్రము కూడా దుఃఖింపరైరి." అని శాస్త అతని ప్రార్థనపై పూర్వజన్మ కథ చెప్పెను.;

అతీతకథ

పూర్వకాలమున వారణాసిలో దశరథరాజు నాలుగ గతులకును గురికాక ధర్మప్రకారము రాజ్యము చేయుచుండెను. ఆయునకున్న 16,000 మంది భార్య లలో పట్టపురాణికి ఇరువురు కొమరులును, ఒక కుమారియును జన్మించిరి. జ్యేష్ఠపుత్రుని పేరు రామపండితుడు, రెండవవాని పేరు లక్ష్మణ కుమారుడు, పుత్రిక సీతాదేవి. కొంతకాలమునకు పట్టపుదేవి కాలధర్మము చెందెను. ఆమె పోయిన తర్వాత చాలా నేవటి వరకును రాజు శోకాభిభూతుడై యుండెను. అమాత్యులు బోధించినమీదట రాజు తెలివి తెచ్చుకొని అపరకర్మలు చేయించి వేరొకతెను పట్ట పురాణిని చేసుకొనెను. ఆమె రాజున కిష్టురాలును, మనోరంజకురాలును ఆయెను. ఆవల ఆమె గర్భవతియై దోహదములు పొంది, తుదకు పుత్రుని గనెను. బిడ్డనికి భరతకుమారుడని పేరు పెట్టిరి. పుత్ర స్నేహమున రాజు ఆమెతో "భద్రే, నీకు వర మిత్తును కోరుకొనుము" అనెను. ఆమె వరము గైకొని, కుమారుని కేడు సంవత్సరములు వచ్చునప్పటికి రాజసన్నధి కరిగి "దేవా, నా కుమారునికై వరము దయచేసితిరి. ఇప్పుడు దానిని ప్రసాదింపుడు" అని విన్నవించెను.

"భద్రే, కైకొనుము."

"దేవా, నా పుత్రునకు రాజ్యము దయ చేయుము."

రాజు వేలితో బెదిరించుచు "దుర్మార్గురాలా, నీవు నశింతువు! నా కుమారులిరువురు అగ్ని స్కంధములవలె ప్రకాశించుచున్నారు. వారిని వలదని నీ కుమారునికి రాజ్యము యాచించు చున్నావా?" అనెను. ఆమె చెదిరి, శయనాగారమునకు చేరి పండుకొనెను. ఆవల ఆమె మాటి మాటికిని కుమారునకు రాజ్యము కావలె నని యాచించుచుండెను. ఆమెకు వర మీయక రాజు తనలో "స్త్రీలకు కృతజ్ఞత లేదు. వారు ద్రోహము తలపెట్టుదురు. మోసమున రాజముద్రిక వేసి నా కుమారులను సంహరింప కుందును గాక" అని తలచి, కొడుకులను రావించి, విషయము వివరించి "మీ రిచట నున్న యెడల అపాయము సంభవింప వచ్చును. మీరు ఏదో సామంత రాజ్యమున గాని, అరణ్యమునగాని నివసింపుడు. నా యనంతరము మీరు మరలి వచ్చి, వంశపరంపరాగతమగు రాజ్యము కైకొనుడు" అనెను.

ఆవల రాజు జ్యోతిష్కులను రావించి, తన ఆయుఃపరిమాణము గూర్చి అడిగెను. "పండ్రెండు సంవత్సరము"లని వారు చెప్పిరి. అపుడు రాజు కుమారులతో "నాయనలారా, మీరు నేటినుండి పండ్రెండు సంవత్సరముల తర్వాత మరలి వచ్చి ఛత్రధారణము చేయుడు" అని చెప్పగా, వారు "మంచి"దని తండ్రికి ప్రణమిల్లి, రాజభవనములోని వారు కన్నీరు కార్చుచుండగా నగరి వెలువడిరి. "నేను కూడా సోదరుల వెంట పోవుదు"నని సీతాదేవి తండ్రికి ప్రణమిల్లి కన్నీటితో బయలు వెడలెను. తమ వెంటవచ్చు జనమును వారు వెనుకకు మరల్చి హిమాలయము నకు జనిరి. జలము, ఫలములు మొదలగునవి సులువుగా లభించుచోట వారు ఆశ్రమమును నిర్మించుకొని, కందమూల ఫలాదులతో జీవనము చేయుచుండిరి. లక్ష్మణ పండితుడు, సీతాదేవియును రామపండితునితో "నీవు మాకు పితృస్థానీయుడవు, కావున ఆశ్రమ మందుండుము. మేము కందమూల ఫలాదులు తెచ్చి నిన్ను పోషింతుము" అనగా రామపండితు డాశ్రమమునందే యుండసాగెను. వార లిరువురు కందమూల ఫలాదులు తెచ్చి ఇచ్చుచు ఆయనకు సేవ చేయుచుండిరి.

అక్కడ దశరథమహారాజు పుత్రశోకముతో తొమ్మిదవ యేటనే మరణించెను. అపరకర్మలు జరిగిన పిమ్మట భరతకుమారుని అభిషేకమునకు అమాత్యులు అడ్డంకులు పెట్టిరి. రాజ్యచ్ఛత్రాధిపతి అరణ్యమున నివసించుచున్నాడు. అని వారనగా, భరత కుమారుడు "రామపండితుని వనమునుండి కొనివచ్చి ఛత్రధారణము చేయింతుము" అని యోచించి, పంచ రాజలాంఛనములతో, చతురంగబలముతో బయలు వెడలి, రామపండితుని నివాసము చేరుకొని, కొలదిదూరములో శిబిరము

నేర్పాటు చేసెను. లక్ష్మణపండితుడు, ,సీతయు కాననమునలోనికి పోయిన సమ యమున భరతకుమారుడు రామపండితుని ఆశ్రమముచేరి, సుప్రతిష్ఠమైన సువర్ణ విగ్రహమువలె నిశ్చింతముగా ఉపవిష్టుడై ఉన్న రామపండితుని చూచెను. ఆవల సన్నిధికి బోయి, ప్రణామముచేసి ఒకప్రక్క నిలిచి, రాజు మరణవృత్తాంతము తెలిపి, అమాత్యులతో కూడా రాముని పాదములవాలి, రోదనము చేయసాగెను. పండితుడు చింతింపలేదు. రోదింపలేదు. ఆయన ఆకృతిలో వికారము తోపలేదు. సాయంకాలమునకు సీతాలక్ష్మణులు కందమూలఫలాదులు కొనితెచ్చిరి. రాముడు తనలో "ఇతడు చిన్నవాడు, నాకు ఉన్నంత ద్రఢిమ కలవాడు కాడు. తండ్రి మరణవార్త సూటిగా తెలిపినచో, శోకావేగము కలిగి, గుండెలాగినను ఆగవచ్చును. మీ రిరువురును జలాశయములోనికి పంపి ఈ వృత్తాంతము తెలిపెదను"అని తల పోసి, ఎదుటనున్న నీటిపట్టు చూపి "మీకు చాల ఆలస్యముగా వచ్చితిరి. నీటిలో స్నానము చేయుడు" అని ఈ గాథ పలికెను.

లక్ష్మణా, సీతా, జలంబులందిగుడు !

వారు జలములోనికి జని నిలిచిరి. ఆవల రామపండితుడు వృత్తాంతము వివరించుచు శేషగాథ పలికెను:

మన తండ్రి దశరథక్ష్మా మహారాజు

మరణవార్తను దెల్పు భరతుండు నేడు.

తండ్రి మరణవార్త విని వారు తెలివి కోలుపోయిరి. రెండవ పర్యాయము వార్తవిని, మరల తెలివి కోలుపోయిరి. మూడవసారి కూడా వారు స్పృహ తప్పుటచే అమాత్యులు వారిని నీటిలో నుండి యీవలకు గొనివచ్చి, కూరుచుండబెట్టిరి. భరతకుమారుడు 'జనకుని మరణవార్త విని, సోదరుడు లక్ష్మణుడును, చెల్లెలు సీతయును దుఃఖము సహింపలేకుండిరి. రామపండితుడు మాత్రము విచారపడ లేదు. దుఃఖింపలేదు. ఈయన శోకరహితుడై యుండుటకు కారణ మేమో అడిగెదను' అనుకొని ఈ గాథ పలికెను.

శోకింప దగినను నీకు దుఃఖంబు

రా దేప్రభావాన రామ, తెల్పుదువ

తండ్రి గతించు వృత్తాంతంబు వినియు

రా కున్న దేటికి నీకు దుఃఖంబు ?

తాను శోకరహితుడై యుండుటకు కారణము తెలుపుచు, అనిత్యతాస్వరూప మును వివరించుచు ఆయన యీ గాథలు పలికెను.

ఎంత విలపించినగూడ నెవని జీవి
తమ్ము నిలువదొ వానికై తనకు తాను
బుద్ధిమంతుడు పీడలు పొందనేల ?
పడుచువారలు, వృద్ధులు, పండితులును
నిండు మూర్ఖులు, ధనికులు, నిర్ధనులుమ
అందరును మృత్యువొందుదు రనుట నిజము.
అవనిజమునుండి పడిపోదు ననుభయంబు
ఫలమునకు నుండు నిత్యము ప్రభవమొందు
మనుజునకు నిత్యముండును మరణ భయము.
ఉదయమున చాల గనబడుచుండ్రు జనులు
సందెవేళకు నుండరు కొంద రందు;
సందెవేళను గనబడు జనమునందు
ఒక్కడుంగూడ గనబడ డుదయవేళ.
మూఢులగువార లేడ్చుచు మొత్తుకొనుచు
కష్టపడ లాభలేశము కలుగునేని
ఉత్తములుగూడ నేడ్చుచు మొత్తుకొండ్రు.
తనకు దాహింసించుకొనుచు నెంతయును
దుఃఖించు నాతండు దుర్వార్ను డగును
పాగులుచు నున్నచో పోషణం బగునె
మృతునకు? ఏడుపు వితథమ్ము సుమ్ము.

ముట్టుకొన్నంతనే గృహమునకు నిప్ప
నలిలముల నార్పివేసెడి చందనమునను
దూదిపింజను వాయువు తోలునట్లు
తోడనే జ్ఞాని దుఃఖమున్ దోలవలయు.
ప్రాణి యేకాకిగా ప్రభవించుచుండు;
ఒక్క కుటుంబాన నుదయించుచుండు;
సంయోగపరములు సర్వభోగములు.
ఇహపరలోకాల నెవడు ధ్యానించు
అష్టజగద్ధర్మ మవగత మెవని
కాబహోశుతు, ధీరు, నధికశోకంబు
సైతము బాధింపజాలదు సుమ్ము!
యోగ్య లౌవారల కొసగుచునుందు
భోగవైభవములన్ పోషించుచుందు
బంధువులన్, పెరవారి పాలింతు
కరణీయ మిదె బోధ కల్గువారలకు

అక్కడ సమావిష్టులైన జనులు అనిత్యతా ప్రకాశనమును, ధర్మోపదేశమును గ్రహించి శోకరహితులైరి. అప్పుడు భరతకుమారుడు రామపండితునకు ప్రణామము చేసి "వారణాసి రాజ్యపరిపాలనము నిర్వహింపుడు" అని వేడెను.

"లక్ష్మణకుమారుని సీతాదేవిని కొనిపోయి రాజ్యపాలనము చేయుము" అని రాముడనగా

'దేవా, మరి తామో " అని భరతుడగిగెను.

"నాయనా, పండ్రెండు సంవత్సరముల తర్వాత నీవు రాజ్యము చేయవల యునని నాయనగారన్నారు. నేనిప్పుడే అచటికి పోయినపక్షమున ఆజ్ఞాపాలనము కానేరదు. మిగిలిన మూడు సంవత్సరములు గడిచిన పిదప వత్తును."

"అంతవరకెవరు రాజ్యము నెరపుదురు"!

"నీవు చేయుము"

"నేను నడపలేను."

"నేను రానంతవరకును ఈ పాదుకలు రాజ్యము నడుపును" అని రామపండితుడు తృణపాదుకలను తీసి యిచ్చెను. వారు మువ్వురును పాదుకలను గైకొని రామపండితునకు ప్రణామముచేసి, పరివారముతో వారణాస్తి చేరిరి. మూడు సంవత్సరముల కాలము పాదుకలను ప్రతినిధిగా నుంచి రాజ్యపాలనము చేసిరి. అమాత్యులు తృణపాదుకలను సింహాసనముపై నిలిపి అచట అభియోగములకు తీర్పునిచ్చెడివారు. తీర్పు సరిగా ఉండనిచో పాదుకలు పరస్పరము కొట్లాడుకొనునవి. ఆవల నిర్ణయములు సరిగా జరిగినచో పాదుకలు శాంతముగా నుండెడివి. రామపండితుడు మూడు సంవత్సరముల తరువాత అడవి వెలువడి వారణాసి చేరి ఉద్యానమున ప్రవేశించెను. అయన యాగమన సూచన తెలిసికొన్న అమాత్యులతో కుమారుడు సీతను పట్టపురాణిని చేసి ఇరువురకును రాజ్యమప్పగించెను. ఇట్లు పట్టాభిషిక్తుడైన బోధిసత్త్వుడు అలంకృతమైన రథమెక్కి అనుయాయులనేకులతో నగర ప్రదక్షిణము కావించి సుచంద్రప్రసాదమున పై అంతస్తు చేరి 16000 వత్సరములు ధర్మానుసారముగా రాజ్యముచేసి తుదకు స్వర్గగామి అయ్యెను.

(అభిసంబుద్ధగాథ ఈ విషయము స్పష్టపరుచు చున్నది.

పరిపాలనము మహాబాహువు కంబు

కంఠుడు రాముండు కావించినాడు

పదునారువేల సంవత్సరమితిని.)

శాస్త ఈ ధర్మోపదేశము చేసి జాతకములు రెంటిని సరిపోల్చెను. సత్యప్రకాశనాంతరము గృహస్థ శ్రోతాపత్తిఫలము నందెను.

"ఆ కాలమున దశరథ మహారాజు శుద్ధోధనుడు; మాత మహామాయ; సీత రాహులమాత, భరతుడానందుడు; లక్ష్మణుడు సారిపుత్రుడు; పరిషత్తు బుద్ధపరిషత్తు! రామపండితుడు నేనే."

*

రెండవ అనుబంధం

పైరములేకనే వధ*

సీత సుతీక్ష్ణ ముసీంద్రుని యనుజ్ఞవడసి ప్రయాణ మయిన వెనిమిటిం జూచి, మిక్కిలి తిన్నని పలుకులతో నిట్లనియె: "ఈ మునిధర్మము గొప్పది. దీనిని గడు సూక్ష్మమార్గమున సంపాదింపవలయు. ఇహలోకమున నింద్రియ విషయములందు దగులు విడిచినవానికే యీ ధర్మము సాధ్యముగా గలదు. పుడమియందు బొంకు లాడుట మహాపాతకము. పరదారాభిమనమును, పగలేకయే యొక్కరిం జంపుటయు నా మహా పాతకమునకంటె మించిన మహాపాతకములు. ఈ మూడును కామ జన్యములగు వ్యసనములు. రాఘవా! బొంకులాడుట నీ కింతకు ముందును లేదు. ఇకమీదను గలుగదు. ధర్మహాని దెచ్చు పరదారాభిలాష నీ కెక్కడిది? నరేంద్రా! నీకు బరదారాపేక్ష యిప్పుడును లేదు, ఇంతకు మునుపును లేదు, ఇకమీద నెప్పటికిని గలుగదు. శ్రీరామా! మనసునగూడ నీ కిట్టి యాశలేదు. అది దృఢము. నృపాత్మజా! ఎప్పటికిని నీవు స్వభార్యయందు రతిగలిగి యుండు వాడవు. ధర్మమును దప్పనివాడవు, చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడవు, తండ్రిమాట మీఱనివాడవు. సత్యసంధా? మహాత్మా! శ్రీమంతుడా! లక్ష్మణాగ్రజా! నీ యందు ధర్మము, సత్యము,

వేయి యేల, సుగుణము లన్నియు స్థాపితములై యున్నవి. మహాబాహువా! శుభకరమైన దర్శనము గల యో నాధా ! జితేంద్రియులచే నన్ని సుగుణ

---

* వావిళ్ళవారికి కృతజ్ఞతతో వారు ప్రచురించిన "శ్రీ మదాంధ్ర వచన రామాయణము" నుంచి అరణ్యకాండలోని తొమ్మిదవ, పదవ సర్గలను ఇక్కడ ముద్రిస్తున్నాను. ఇది వాల్మికి రామాయణానికి శ్రీ సరస్వతుల సుబ్బరామ శాస్త్రిగారి తెలుగు సేత.

ములు పొందగూడునుగాన, నీయెడ జితేంద్రియత్వముగూడ సిద్ధముగా నున్నది. అయినను, మూడవదగు క్రూరమయిన పరప్రాణహింస నీకు సంప్రాప్త మయినది. పామరులజ్ఞానమువలన పగలేకయే ప్రాణిహింస చేయుదురు. పామరులు చేసెడి ప్రాణిహింసారూపమగు పాపమునకు నీ వొడి గట్టితివి. శూరా! నీవు మునిజన సంరక్షణము నిమిత్తము పోరుచేసి, దండకారణ్యముననున్న రాక్షసుల నందఱను బరి మార్చెదనని ప్రతిజ్ఞ సేసితివి. దీనినిమిత్తమే వింటిని బాణములను దాల్చి లక్ష్మణ సమేతుడవై యీ దండకారణ్యమునకు వచ్చితివి. ఇప్పుడు నీ వట్లు బయలువెడలుట చూచి, నీ పితృవాక్య పరిపాలనాది ధర్మమును, నీ మేలును దలించిన నా మనము వంతుల పాలగుచున్నది. ఓ వీరుడా! మనము దండ కారణ్యములకు బోవుట యుక్తముగా దోపలేదు. దానికి గారణము నెవ్వెద నాలకింపుము. నీవు విల్లు చేతబూని, తమ్ముని దోడుసేసికొని, యడవులకు బోవుచున్నాడవు. అచ్చటనున్న యెల్ల వనచరులను జూచి బాణప్రయోగము చేయుదువు! క్షత్రియులకు విల్లును, అగ్నిహోత్రుని గట్టెలును సమీపముననున్నచో మఱింత చిరాకు పొచ్చును.

మున్నొకప్పుడు బహు మృగపక్షిసంఘముల కునికిపట్టయిన యొక్కపావనమగు నాశ్రమమున సత్యము పలుకువాడును, సదాచారుడునునైన మునీంద్రుడొక్కరుడు తపస్సు చేయుచుండెను. దేవేంద్రు డా మునియొక్క తపస్సునకు విఘ్నము నొనరింపగోరి, కావలివాని రూపుదాల్చి, కత్తియొకటి దీసికొని యా యాశ్రమ మునకు వచ్చెను. అట్లు దేవేంద్రుడు భటరూపముతో వచ్చి యయ్యాశ్రమమున దీవ్ర తపము సేయుచున్న యా మునీంద్రుని యెదట నిల్చి,"యోద్విజేంద్రా! యీ కత్తిని దీసికొని, యది మొదలు తనయెడ దాపరికము చేసిన వస్తువును గాపాడుటయం దెక్కువ శ్రద్ధగలవాడై, తన వశమున నప్పగించిన ఖడ్గమును జేతబట్టుకొనియే తిరుగుచుండెను. తనయొద్ద నిల్లడవెట్టినదానిని గాపాడుట యందా సక్తి గలవాడగుటచే దుంపలు పండ్లు తేబోవునపుడు గూడ నా కత్తిలేకుండ బోయి యెఱుగడు. తపసే కలిమిగా గల యా మునీంద్రుడెల్లప్పుడు కత్తిని జేతబూని పోవుచు, తపసునందు దలంపుమాని, శస్త్రసంగమువలన గ్రూరబుద్ధి బూని, దేనినిబట్టినను నఱకుచు జీవహింస చేసి, యన్యాయములకు బాల్పడి, నరకమున కేగెను, అనియిట్లు శస్త్రసంబంధమున నింతటి చేటుగలిగెనని పెద్దలు చెప్పగా నీ యితిహాసము వినియుందును.

ఆయుధముల దాల్చియుండుట యగ్ని దాల్చియుండుటంబోలి మనోవికారము

నకు గారణముగునని పెద్దలు చెప్పుదురు. కావున నాథా! నీ యెడ నాకు గల స్నేహముచేతను, నీవు నా యెడ జూపు బహుమానము చేతను, దెలిసినవిషయ మునే జ్ఞప్తికి దెచ్చుచున్నాను. నీకు దెలియని సంగతి నుపదేశించుదాననుగాను. నీవు వింటిని యెంతయు జేయదగని పనియని నాకు దోచుచున్నయది. తప్ప లేక జనులను హింసించుట నా కిష్టముగా దోపలేదు. శూరులగు క్షత్రియులు ధనుర్ధరులై నొచ్చినట్టి మునుల రక్షింపవలసినది కాని, యిట్లు రక్కసులను వైర ములేక హింసించుట తగదు. ఆయుధ మెక్కడ? అరణ్యవాస మెక్కడ ? క్షత్రియధర్మ మెక్కడ? తప స్సెక్కడ? ఇవి పరస్పర విరుద్ధములైనవి. కావున మన మిప్పుడు వ నమున నున్నాము. కనుక, వనవాసయోగ్యమయిన తపస్సు చేసెదము. ఆర్యా! శస్త్రములు చేపట్టుటవలన పాపబుద్ధి పుట్టును. ఇప్పుడిట్టి పాపబుద్ధి పుట్టును. ఇప్పుడిట్టి పాపబుద్ధి మనకు దగదు. వనవాసము ముగించి యయోధ్యకేగిన పదంపడి క్షాత్రము బూనుదువుగాని యిప్పటికి మానుము. నీవురా జ్యము వదిలి యెల్లప్పుడు వనవాసమునం దాసక్తి గలిగి తాపసుడవై యుందువేని, నా యత్తగాగగు కైకకును, మామగారికిని దఱుగని ప్రేమము గలుగును. ధర్మ ముపలన నర్థముగలగుచున్నది, ధర్మముపలన గామము గలుగుచున్నది. నరుడు ధర్మముపలన నంతయు బొందుచున్నాడు. ఈ జగత్తునకు సారభూతమైనది ధర్మ మేకాని వేరొక్కటికాదు. జ్ఞానులగువార లయ్యయి కృచ్ఛ్రచాంద్రా యణాదులగు, నియమములు పూని, యుపవాసములు సలిపి, శరీరమును బూనికతో వరుగుజేసి, ధర్మమును బొందుదురు. అంతియకాక, సుఖమువలన నెన్నటికిని సుఖముగలుగ నేరదు, శాంతస్వభావముగల యో నాథా! నీవెల్లప్పుడు మంచి మనసుగలవాడవై తపోవనములందున్నంతకాలము తపోరూప ధర్మము నాచరింపుము. మూడులోక ములకు సంబంధించిన యెల్ల విషయముల యథార్థమును నీ వెఱుగుదువు. నే నాడుదాననైనందున జపలబుద్ధిచే నింత చెప్పితిని గాని, నీ కెవ్వడు నేర్పగలడు? నీవు స్వబుద్ధితోను, తమ్మునితోను ఆలోచించి యేది యుక్తమని తోచునో దానిని వెంటనే చేయుము" అని సీత రామునికి హితముపదేశించెను.

-(ఆరణ్యకాండ, తొమ్మిదవసర్గ)

సీతాదేవి ప్రియునియందలి భక్తితో జెప్పిన పలుకులు విని, ధర్మమార్గము ననే యున్నట్టి రాముడు సీత కిట్లనియె: ధర్మజ్ఞురాలవైన యో జానకీ! నీ వంశ గౌరవమునకును, నా యందలి యనురాగమునకును దగినట్లు నా హిత ముగోరి యీమాట చెప్పితివి. దేవీ! నొచ్చినవారనుమాట వినరాగూడదనియే

క్షత్రియులు ధనుర్ధరులయి యుండవలయునని నీవే చెప్పితివి గదా! అది నీకే తెలిసియున్నప్పుడు నీకేమి బదులు చెప్పుదును? ఈ దండకారణ్యమున మిక్కిలి తీవ్ర నియమములతో దపం బొనరించుచున్న వారును, శరణు జొచ్చినవారిం గాపాడ జాలి నవారునునగు మును లందఱు రాక్షసులబారి కోర్వజాలక, తాముగా వచ్చి, నన్ను శరణు జొచ్చిరి. అరణ్యవాసులగు మునులు ధర్మము నడుపుటయం దాసక్తిగల వారలై దుంపలు, పండ్లు దినుచు, క్రూరకృత్యము లొనర్చురక్కసులకు వెఱచి, సుఖము దక్కి యున్నారు. ఒక్కొక్క వేళను బొలసుదిండ్లయిన క్రూరరాక్షసులు వనములందనేక నియమములతో దపస్సు చేయుచున్న మునులను నిష్కారణముగా దినిపోవుచున్నారు. దండకారణ్యవాసులగు బ్రాహ్మణోత్తము లందఱు రాక్షసులచే భక్షింపబడుచు మనకడకు వచ్చి, మమ్ము గాపాడుడని చెప్పిరి.

నేను వారి నోటినుండి వచ్చిన యా మాటను విని, వారి పాదసేవచేసి, యీ ప్రకారముగా జెప్పితిని: " ఓ మునీంద్రులారా! నాయపచారము మన్నింపుడు. నేను స్వయముగా వచ్చి యుపచారము చేయతగిన యింత మహిమగల మీరు వచ్చి నన్ను బ్రార్థించుట యనునది నాకు మిక్కిలి సిగ్గుగా నున్నది " అని చెప్పి, "నేను మీకిప్పుడేమి చేయువలయు " నని యాద్యంతములనడిగితిని. వారం దఱు గూడి యేక వాక్యముగా "రామా! దండకారణ్యమున వలయు రూపముల ధాల్చెడి" యనేకులు రాక్షసులు మమ్ము మిక్కిలి బాధించుచున్నారు. వారిని సంహరించి నీవు మమ్ము గాపాడుదువుగాక! ఓ పాపరహితుడా! యెవరికి సాధింప నలవికాని నంజుడు దిండులైన రాక్షసులు హోమసమయములండు, దర్శపూర్ణమా సాది యాగకాలము లందును సమీపించి, మా యాగములం బాడుసేసి, మమ్ము బెదరించుచున్నాడు. ఇట్లు రాక్షసులు పెట్టువట్టి యిడుమల బడుచు దపస్సులు నిర్విచారముగా జేసికొన జాలక దుఃఖపడుచు, గాపాడువారిం గానకయుండు మమ్ము గాపాడ నీవే సమర్థుడవు. నీకంటె వేఱుగతి మాకు లేదు. ఈ రౌద్రిమ్మరులను మా తపోమహిమచే సంహరింప జాలుదుము. అయినను, మేము చిరకాలము శ్రమ పడి సంపాదించిన తపస్సునితైఱుగున బోగొట్టుకొన నిష్టపడకున్నారము. రాఘవా! తపస్సున కనేక విఘ్నములు సర్వదా సంభవించుచుండును. కావున దప మాచరించుట కడు నసాధ్యము.అట్లీ రాక్షసులు మమ్ము నానావిధముల హింసించుచున్నను, శాప మొసగి, నానావిఘ్నముల కోర్చి సంపాదించిన తపస్సును వ్యయపఱుప మనస్సురాక యున్నవారము. కావున రాక్షసులబారి కోర్వజాలకున్న దండకారణ్య వాసులమైన మమ్ము నీవును, నీ తమ్ముడును రక్షింపుడు. వనవాసులమైన మాకు

నీవే రక్షకుండవు" అని చెప్పిరి.

ఓ జానకీ! నే నిదియంతయు విని, దండకారణ్యవాసులైన ఋషులను సకల విధముల కాపాడునట్లు ప్రతిజ్ఞ సేసితిని. నేను మునుల యెదుట బ్రతిజ్ఞ సేసి, నా బొందిని ప్రాణములుండునంతవఱకు జేసిన ప్రతిజ్ఞను నెఱవేర్పకుండజాలను. నా కన్నింటికంటె సత్యవాక్యపరిపాలనమే యెల్లప్పుడధిమతము. ఓ సీతా! నేను ప్రాణములను, నిన్ను, లక్ష్మణుని విడనాడుదుగాని, యాడినమాట దప్పను. అందును బ్రాహ్మణులయెడ బ్రతిజ్ఞచేసి, దానిని దప్పిపోవుట సరియగునే? ఋషులు నన్నడుగకపోయినను, వారిని నేను గాపాడివలసియుండ, వా రడిగి, నే నట్లు చేసెదనని యొప్పుకొని, యిప్పుడు తప్పిపోవుట యేటి మాట? ఏ పతివ్రతా! నీవు నా యందలి చెలిమివలను, మంచిమనసుగలదాన వౌటవలనను, ఈ యింపు మాటుల బలికితివి. ఆ మాటలకు నేను సంతసించితిని. అప్రియుని కెవ్వరును హితము బోధింపరుగదా! నీకు నా యందుగల యిష్టముచేతనే యిట్టి మాట పలికితివి. ఈ పలుకు నీకును, నీ కులమునకును దగియున్నది. నీవు నా ధర్మములందు సాబాలు పుచ్చుకొనుచుండుదానవు. నాకునాప్రాణములకంటె మిన్నయైనదానవు" అనియిత్తెఱగున మహాత్ముడయిన రాముడు తన నెచ్చెలియగు మైథిలితో నుడివి, విలుకాడై లక్ష్మణునితో గూడ మనోహరములగు తపోవనము లెల్ల దిరుగుచుండెను.

(అరణ్యకాండ, వదవ సర్గ)

*

రామాయణంలో నిజమెంత?

REFERENCES

1. Amrithalingam, T: Ramayana Vimarsa (English), Madras, undated, P.367
2. Kamaswar Iyer, B.V.(quoted by Guruge, Ananda: The Society of Ramayana, Maharagama, Ceylon, 1960, p 8)
3. Macdonell, A.A. and Keith, A.B: Vedic Index of Names and Subjects. Varanasi,1958 Reprint, Vol. II, p.230.
4. Winternitz, M: A History of Indian Literature, Calcutta, 1963, Vol, part II, p.443.
5. Mishra, D.P: Studies in the Proto - History of India, Delhi, 197 1, PP. 153-155.
6. Dutt, R.C: Civilization in India, London, 1893, Vol.1. p.138.
7. Apte, V.M: Social and Religious Life in the Grihya Sutras, Bombay, 1954, pp.106-107.

8. Jain, Jagadish Chandra: Life in Ancient India as Depicted in the Jain Cannon, Bombay, 1947, p.89.
9. Jacobi, Herman: The Ramayana, Baroda, 1960, p.104.
10. Macdonell, A.A: Sanskrit Literature, London, 1909, pp.312-313.
11. Barth, A: Religions of India, New Delhi, 1969, p.177.
12. Weber, Albrecht: The History of Indian Literature, London 19 14, p.192.
13. Keith, A.B. (Quoted by Guruge, p.16)
14. Durant, Will: The Story of Civilization, Newyork, 1941. The Oriental Heritage, Vol. 1 p.9.
15. Smith, G. Elliot: The Diffusion of Culture, London, 1930. pp. 208-209
16. APTE, p. 105
17. Frazer, James: The Golden Bough, Abridged Edition, London, 1950, pp. 380, 382, 387, and 396.
18. Allen, Grant: The Evolution of the Idea of God, London, 1901,p. 286.
19. Frazer, pp.433-434.
20. Allen, pp. 301-302.
21. Levi, Przyluski and Bloch: Pre-Aryan and pre-Dravidian in India, Calcutta, 1929, p. 14.
22. Winternitz, p.452
23. Muller, F.Max: A History of Ancient Sanskrit Literature, varanasi, 1968, pp.32-40.
24. Sen, Dineshchandra: The Bengali Ramayana, Calcurra, 1920, pp. 4-26
25. Vaidya, C.V: The Riddle of the Ramayana, Delhi, 1972, pp.55-61.
26. Sen, p.42-54.
27. Lyall, Alfred C: Asiatic Studies, First Series, p.17
28. Barth p.265.
29. Lyall p.18

30. Jacobi, pp.99-100
31. Crooke, William: The Popular Religion and Folklore of Northern India, Vol.1,p.87.
32. Majumdar, R.C., General Editor,The History and Culture of the Indian People, The Vedic Age, London, 1957, pp.165-167.
33. Weber, A. (Quoted by Telang, K.T; Selected Writings and Speeches, Vol.1, Bombay, 1916, pp.5-6).
34. Telang,pp.1-93.
35. Jacobi, p.71-72.
36. Winternitz, p.452.
37. Vaidya, p.52.
38. Bulcke, k; Ramkatha(Hindi), Prayag, 1971, pp. 102-103.
39. Fauche; Hippolyte (Quoted by Guruge,p.15.)
40. Blitz, Bombay, February, 14, 1976.
41. Shamasastry, R.(Quoted by Guruge,p.15.)
42. Pargiter, F.E: Ancient Indian Historical Tradition, Delhi, 1962, pp. 93 and 277-278.
43. Wilson, H>H:The vishnu Purana,English Translation Calcutta, 1961, Note on pp. 307-308.
44. Vaidya, pp.125-135.
45. Rangacharya, V: History of Pre-Musalman India,Vol. 11, Part1, Aryan Expansion Over India, Madras, 1937, p.551.
46. Majumdar, R,C: Ancient India, Delhi, 1960, p.197.
47. Sidhanta, N,k: The Heroic Age in India, London, 1929, pp. 6 and 13.
48. Mookerji, Radha kumud: Anciendt India, Allahabad, 1956, p.88.
49. Srinivasa Iyengar, P.T: Advanced History of India, Waltair 1942, pp. 108-109.
50. Wheeler, Talboys J. (Quoted by Guruge, p.14).
51. Lassen, AC.(Quodted in History of Classical Sanskrit Literature by M. Krishna Swami Delhi, 1970,pp.15-16)

52. Ratnam, Malladi Venkata : Rama, the Greatest Pharaoh of Egypt, Rajahmundry, 1934, 2 vols.

53. Pusalker, A.D: The Cultural Heritage of India, Vol. 11,Calcuta, 1969, p. 20.

54. Roychaudhuri, Hemchandra: Studies in Indian Antiquities, Calcutta, 1958,pp.294-297.

55. Dikshitar, V.R.Ramachandhra: Indian Culture, Vol.1, No. 4 1938, pp.579-585.

56. Pathak, Visududdanand: History of Kosala, Delhi, 1962 pp. 182-183.

*

ఏది జనస్థానం ఎక్కడిది లంక?

REFERENCES

1. Pargiter, F. E. (Quoted by T. Paramasiva Iyer in Ramayana and Lanka, Bangalore, 1940. Refereances to Pargiter's views are scattered throughout Iyer's Preface to the volume).
2. Jacobi Herman: The Ramayana, Baroda, 1960, pp.68-71.
3. Mehta, C. N : The Flight of Hanuman, Nadiad, 1941.
4. Adikari, N. S. (Quoted in A Bibliography of the Ramayana by N. A. Gore, Poona, 1943 p.34).
5. Gore, p.56.
6. John, Daniel: Annals of the Bhandarkar Oriental Research Institute, Vol.XXI (1939-40), pp.270-279.
7. Ramalinga Reddi Sastyabdapurti Commemoration Volume part II, pp.20-24.

8. Indian Express, Madras, January, 18, 1977.
9. Bandarkar, D. R: Jha Commemoration Volume, Poona, 1937, pp.47-57.
10. Imperial Gazetteer of India, New Edition, Vol. IX, 1908, p.68.
11. Paramasiva Iyer: Ramayana and Lanka, maps between pages 104 and 106.
12. Kunte, N. M: Vicissitudes of Aryan Civilization in India, Bombay, 1880, foot-note on p.190.
13. Rhys-Davids, T. H: Buddhist India, Calcutta, 1955, p 12 and p.25.
14. Das, Santosh Kumar: Economic History of Ancient India, calcutta, 1944, pp.202-209.
15. Bhandarker p.48.
16. Bhandarkar, R. G: Collected Works, Vol. III, Poona, 1927, p.8.
17. Kide, Sardar M. G: Location of Lanka, Poona, 1947.
18. Gore, p.39.
19. Hiralal: Jha Commemoration Volume, pp.151-161.
20. Gore, p.51.
21. Mankad, D. R. Editor, The ValmikiRamayana, Kiskinda Kanda, Baroda, 1965.
22. Times of India, Bombay, February 23, 1976.
23. Mishra, D. P: Mahakosal Historical Society Papers, Vol. I, Jabalpur.
24. Chakravarthy, R. S: Hindustan Times, New Delihi, October 31, 1971.
25. Sinha, V. N. P: Chota Nagpur Plateau, New Delhi, 1976, pp, 11-27-41-53.
26. Amirthalingam, T: Ramayana Vimarsa, Madras, undated.
27. Amirthalingam, p.466.
28. Brown, C. P: A Dictionary of Telugu and English Madras, 1852
29. Zamindar of Devidi: Telugu Encyclopaedia, Rajahmundry, 1941

30. Watt Sir George: The Commercial Products of India London, 1908 p.1072.
31. Watt, p.990.
32. Ramachandra Dikshitar: Indian Culture, Calcutta, 1935, Vol, I, No. 4,p.580.
33. Bhandarkar, D.R., p.56.
34. Roychaudhuri, H: Studies in Indian Antiquities, Calcutta, 1958, pp.296-297.
35. Amirthalingam, pp.462-466.
36. Imperial Gazetteer of India, New Edition, 1908, Vol. I, p.112
37. Kaumidi Mahotsvam, translated into Telugu by Dr D. V.. Avadhani, Third Edition, Hyderabad, 1968.
38. Cunningham, Sir Alexander (Referred to by D. R. Bhandarkar p.50).
39. Bhandarkar, D. R, p.50.
40. Sankalia, H, D: Ramayana, Myth or Reality, New Delhi, 1973, p. 17.

*

రాక్షసు లెవరు?

REFERENCES

1. Das, Abinas Chandra: Rigvedic Culture, Calcutta, 1925, pp.410-412.
2. Dutt, Romesh Chunder: A History of Civilization in Ancient India, London, 1893, Vol. I, p. 182.
3. Keith, A. B: In Cambridge History of India, Vol. I, Ancient India, Cambridge, 1935, p. 76.
4. Banerji-Sastri, Anantaprasad: Asura India, Patna, 1926.
5. Macdonell, A. A. and Keith, A. B: Vedic Index Varanasi, 1958, Vol. II p. 510
6. Guha, B.s: Racial Elements in the Population, London, 1944, pp. 9-10.
7. Chanda, Ramaprasad: The Indo-Aryan Races, Calcutta, 1969, pp, 4-5
8. Majumdar, D. N: Races and Cultures of India, Bombay, 1961, p. 64.

9. Hopkins, E. W: Epic Mythology, Varanasi, 1968, pp. 38-39.
10. Venkata Ratnam T. K: "The Rakshasas" an essay in K. V. Rangaswami Aiyyangar Commemoration Volume, Madras, 1940, pp. 187-188.
11. Mishra, D. P: Studies in the Proto-History of India, NewDelhi. 1971.
12. Padmanabhan, B.S, in the Hindu, August 28, 1977.
13. Roy, Sarat Chandra: The Mundas and Their Country, Bombay, 1971, pp. 28-29.
14. Childe, V. Gordon: New Light on the Most Ancient East, London, 1954, P. 185
15. Hoyle, Fred: A Decade of Decision, London, 1953, P. 154.
16. Childe, V. Gordon: Progress and Archaeology, London 1945, P. 49.
17. Hoyle, P. 154.
18. Childe, 1945, p. 49
19. Hoyle, p. 154
20. Ghosh, A: The City in Early Indian History, Simla, 1973, p. 52
21. Sankalia, H. D: Ramayana: Myth or Reality? p. 46
22. Roy, p. 38
23. Childe, 1945,p. 55
24. Chatterji, Suniti Kumar: Kirata-Jana-Kriti, Calcutta, 1951, p. 11
25. Vaidya, C. V: Epic India, Bombay, 1907, pp. 306-307
26. Sharma, Ramashraya: A Socio-Political Study of the Valmiki Ramayana, Delhi, 1971.
27. Dharma, Miss P. C: The Ramayana Polity, Madras, 1941
28. Vyas, S. N: India in the Ramayana Age, New Delhi, 1967
29. Mackenzie, Donald A: Myths of Bobylonia and Assyria, London, Undated, pp. 64-65

30. Moscati, Sabatino: The Face of the Ancient Orient, London, 1960, p. 29
31. Ghosh, Oroon Kumar: The Changing Indian Civilzation. Vol. 2, Calcutta, 1976, p. 341
32. Chatterji, p. 6
33. Levi, Przyluski and Block: Pre-Aryan and Pre-Dravadian in India, Calcutta, 1929, p. xii
34. Ghosh, Vol. 2, p. 293
35. Ghurye, G. S: Caste and Class in India, New York, 1952, p. 64
36. Chatterji, p. 5
37. Iyengar, P. T: Srinivasa: History of the Tamils, Madras, 1929, pp. 58-62.
38. Sankalia, pp. 48-49.

*

ఋషులెవరు?

REFERENCES

1. Gupta, M. Shakti: Loves of Hindu Gods and Sages, New Delhi, 1973
2. Mitra, Rajendralala: Indo-Aryans, London, 1881, Vol. II, p. 69
3. Keith, Arthur Berredale: The Religion and philosophy of the Upanishads, London, 1925, pp. 166-167
4. Muller, F. Max: Biography of Words, London, 1898, pp. 222-242
5. Macdonell, A. A. and Keith, A.B: Vedic Index, varanasi, 1958, Vol. II, p. 475.
6. MacDonell and Keith, Vol. II, pp. 123-124
7. MacDonell and Keith, Vol I, p. 517
8. MacDonell and Keith, Vol. I, p. 498
9. Raja, C. Kunhan: The Quintessence of the Rig Veda, Bombay, 1964, p 120
10. Raja, p. 13
11. Ghurye, G. S: Indian Sadhus, Bombay, 1964, pp 15-16.
12. Raja, pp. 8-13
13. Chattopadhyaya, Debiprasad: What is Living and What is Dead in Indian philosophy, New Delhi, 1976, pp. 130-131.
14. Macdonell and Keith, Vol. II, pp. 71, 183, 447.
15. Kosambi, D. D: The Culture and Civilization of Ancient India, London, 1965, pp. 66-68
16. Kosambi, D.D: An Introduction to the Study of Indian History, Bombay, 1975, pp. 102-103
17. Kosambi, D. D: "On the Origin of the Brahmin Gotras" in the

Journal of the Bombay Branch of the Royal Asiatic Society, 1950, vol. 26, pp. 21-80

18. Amirthalingam, T. Ramayana Vimarsa, Madurai, undated, p. 230.
19. Amirthalingam,p. 221

*

బుుషులకుట్రలో రామునిపాత్ర

REFERENCES

1. Kosambi, D. D: An Introduction to the Study of Indian History, Bombay, 1975, pp. 72-73
2. Meanchen-Helen, Otto J: The World of the Huns, Los Angels, 1973, pp. 178-179.
3. Kosambi, 1975, pp. 74-75.
4. Mackay, Ernest: Early Indus Civilizations, London, 1948,pp. 122, 132.
5. Sharma, R.S: Studies in the Cultural History of India, Agra, 1 965, p. 30.
6. Wheeler, Sir Mortimer: The Indus Civilization, Cambridge History of India, Supplementary Volume, Cambridge 1943, pp. 6-7.

ఆయుధాల ప్రశ్న

REFERENCES

1. Rapson, E.J. (Editor): The Cambridge History of India, Ancient India, Cambridge, 1935, Vol, 1, p. 330.
2. Rapson, p. 334.
3. Rapson, p. 345 ff.
4. Dutt, R.C: A History of Civilization in Ancient India, London, 1893, Vol. 1, p. 57.
5. Dikshitar, V.R.R: War in Ancient India, Madras, 1944, p. 103.
6. Oppert, Gustav: On the Weapons, Army Organisation and Political Maxims of the Ancient Hindus, Ahmedabad, 1967, pp. 72-73.
7. Majumdar, R.C. (Editor): The History and Culture of the Indian People, The Age of Imperial Unity, Bombay, 1951, p.42.
8. Mitra, Rajendralala: Indo-Aryans, London, 1881, Vol. 1, pp. 298-99.
9. Mitra, pp. 303-304.

10. Mitra, p. 302.
11. Child, V. Gordon: What Happened in History, Pelican Books,. London, 1948, pp. 182-183.
12. Krober, A.L: Antropology, Indian Edition, New Delhi, 1976, p.72 5.
13. Banerjee, N.R; The Iron Age in India, New Delhi, 1965, p. 158.
14. Kosambi, D.D: The Culture and Civilization of Ancient India, London, 1965, p. 90.
15. Chand, Gyan: population in Perspective, New Delhi, 1972, p. 102.
16. Rhys-Davids: Buddhist India, Indian Reprint, Calcutta, 1955, p. 21.
17. Moreland, W.H: Ind at the Death of Akbar, London, 1920, p.22.
18. Chand, p.44.
19. Keith, Sir Arthur: ;says on Human Evolution, London, Undated, p. 155.
20. Vaidya, C.V: The Riddle of the Ramayana, New Delhi, Revised Edition, 1972, p. 112.
21. Krober, p.356.
22. Taylor, Sir E.B: Anthropology, Thinker's Library Edition, London, 1946, Vol. 11, p. 50.
23. Krober, p. 375.
24. Taylor, p. 50.

*

సీత జోస్యం

రాముడు
కోసల దేశాధిపతి దశరథుని
• జ్యేష్ఠపుత్రుడు

సీత
రాముని భార్య

లక్ష్మణుడు
రాముని తమ్ముడు

జనస్థానానికి చెందిన
ఇద్దరు ఋషులు

రంగం
జనస్థానంలో
సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం

కాలం
రాముడు వనవాసాన్ని
ప్రారంభించిన కొత్తలో

ప్రథమాంకం

అది దండకారణ్యంలోని, జనస్థానంలోగల సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంలో అతిథులకై ఉద్దేశించబడిన పర్ణశాల. ప్రేక్షకులకు ఎదురుగా కనిపించే మట్టి గోడలో దానికి ఒకేఒకద్వారం. లోనికి వచ్చేవారు వంగిరాకపోతే, ద్వారం తలకు తగులుతుంది. దానికి రెండువైపుల వెదురు కడ్డీలతో రెండు కిటికీలు. పర్ణశాలలోకి వస్తూపోతూ వుండేవారు లోనికి రాకముందే ఆ కిటికీల గుండా కనబడుతూ వుంటారు. ఆశ్రమంలోని చెట్టచేమలు కూడా అల్లంత దూరాన వున్నట్టు ద్వారబంధంగుండా, గవాక్షాలగుండా కనిపిస్తూవుంటాయి.

పర్ణశాలలో పక్కగోడచెంత, ఒక నులక మంచం ఎత్తి పెట్టి వుంటుంది. దాని ప్రక్క ఒక బల్లపై రాసిగా వేర్చిన కందమూల ఫలాలు. మరొక బల్లపై మంచినీళ్ళకుండ; దాని సరసనే రెండు రాగి పంచపాత్రలు. పర్ణశాల మధ్యభాగంలో కృష్ణాజినాలతో కప్పబడిన అయిదారు ఉన్నతాసనాలు.

తెర లేచినప్పుడు ఒక అజినాసనంపై కూర్చుని, ఎదురుగా వున్న మరొక దానిపై విప్పి పెట్టివున్న తన నగల మూటలోనుంచి వాటిని పైకితీసి, ఏవేవో జ్ఞాపకాలు వెల్లువికి వస్తున్నట్టు, సీత వాటివంక చూస్తూ పోతూ వుంటుంది. వన్నె తగ్గిన నగలకు వాటి గుడ్డమూట చెంగుతో మెరుగు వెదుతూ వుంటుంది.

సీత వయస్సు పదహారు, పదిహేడు సంవత్సరాలు. ఒక సాదా పట్టుచీర కట్టుకొన్నా, చెవులకు కమ్మలు, మెడలో ఒక హారం, వేలిని ఒక వుంగరం తప్ప వేరే నగలు లేకపో-

యినా, ఇతర అలంకరణలు సయితం లేకపోయినా, చూడగానే చూపులను ఆకట్టుకొనగల అందచందాలు. క్షణాని కొక భావవిలసనాన్ని ప్రతిఫలించగల విశాల నేత్రాలు; చక్కగా శ్రుతిచేసిన వీణవలె పలకగల కంఠస్వరం.

తెర లేచిన కాసేపటికి లక్ష్మణుడు ప్రవేశిస్తాడు. అతని వయసుకూడా పదహారు, పదిహేడు సంవత్సరాల ప్రాంతాల. మంచి పొడగరి, వెడల్పు నుదురు, పెద్దకళ్లు తీర్చి దిద్దినట్టుగా వున్న ముక్కు, బలమైన క్రింది దవడ, కండలు తిరిగిన రెక్కలు, నారవంచె, నారతోనే నేసిన ఉత్తరీయం. ధనుస్సును, తూణీరాన్ని భుజాల నుంచి తొలగిస్తూ గడప దాటుతాడు. ఈ రంగంలో ప్రవేశించే ఋషుల ద్వరిలో మొదటి ఋషి వయస్సు అరవై పైగా; రెండవ ఋషి ఆయనకంటె పదేళ్లు చిన్న. మొదటి ఋషి పొట్టి; రెండవ ఋషి పొడగరి. ఒకరిది బవిరి గడ్డం. మరొకరిది మేక గడ్డం. ఇద్దరినీ నారబట్టలే. మొదటి ఋషి చేతులతో దండ కమండలాలు; రెండవఋషి చేతులలో ఒక పళ్ళ బుట్ట.

కాలి అలికిడి విని తలయెత్తిన సీతకు కిటికీని దాటుతూ లక్ష్మణుడు కనబడతాడు.

సీత: [మరది లోపలికి రాగానే అల్లరితో కూడిన చిరునవ్వుతో] తా మొక్కరే దయచేస్తున్నారు; తమ ఇనవంశోద్భవ ప్రభువు లెక్కడ?

లక్ష్మణుడు : ఏ! తమది కూడా ఇనవంశమే కాదా?

సీత : అయితే మాత్రమే? మా వంశీకులు అఖిల జగత్తును పదే పదే జయిస్తూ పోయారా? అశ్వమేధాలను పదే పదే చేస్తూ పోయారా? వారు సాగరాన్ని తవ్వారా? పాతాళాన్ని చేరారా? స్వర్గం నుంచి గంగను భూతలానికి దించుకు వచ్చారా? మీ వారితో మా వారికి పోలికెక్కడలే!

లక్ష్మణుడు : ముల్లోకాలలో జైత్రయాత్రలకు సంబంధించినంతవరకు ఆ మాట నిజమైనా...

సీత : [వెక్కిరింపుగా] “ఆ మాట నిజమైనా!”

లక్ష్మణుడు : కాదా, వదినా?

సీత : వందిమాగధులు మీకే కాదు; మాకూ వున్నారు!

లక్ష్మణుడు : ఔను మీకు వున్నారు - వుంటే?

సీత : ఆ! ఏమీ లేదు! వారి స్తోత్రపాఠాలను స్తోత్రపాఠాలు గానే మేము పరిగణిస్తాము గాని, అవి పరమసత్యాలన్న పిచ్చిభ్రమలకు పోము!

లక్ష్మణుడు : పిచ్చిభ్రమ లేమిటి, వదినా? దేవేంద్రుడు రాక్షసరూపంలో వచ్చి, మా సగరచక్రవర్తి యాగాశ్వాన్ని దొంగిలించి, పాతాళంలో దాన్ని కట్టివేయగా.....

సీత : ఆయన దాన్ని తిరిగి తెప్పించాడు! అరవైవేల మంది కొడుకులను కన్న తండ్రికి ఏదైనా సాధ్యమే!

లక్ష్మణుడు : భృగుమహర్షి వరప్రభావం వల్లనే ఆయన మొదటి భార్యకు వంశకరుడైన ఒక పుత్రుడు, రెండవ భార్యకు వంశకరులు కాని వారు అరవై వేలమంది కలిగారని మీరు వినలేదా?

సీత : వినకేమి? ఆ వరప్రభావం వల్లనే మీ సగరుని రెండవ భార్య అన్నట్టు అమె పేరేమిటి? - మరిచిపోయాను!

లక్ష్మణుడు : సుమతి!

సీత : ఆ! ఆ సుమతి నవమాసాలు మోసి, ఒక సొరకాయను కనింది. దాన్ని పగలగొట్టగానే దానిలోనుంచి బెలబెల మంటూ అరవై వేల మంది కొడుకులు బయటికి వచ్చారు. ఒక్కొక్కడికి ఒక్కొక్కటి చొప్పున అరవైవేల నేతి ముంతలు తెప్పించి, వాటిలో ఊర వేస్తూ వారిని అల్లారుముద్దుగా పెంచారు!

లక్ష్మణుడు : మీ ధోరణిచూస్తే సగరపుత్రులు సముద్రాన్ని తవ్విన సంగతిని కూడా మీరు శంకిస్తున్నట్టే కనబడుతున్నది.

సీత : ఎంతమాట! వీర, శూర, ధీరాగ్రేసరులైన సగరపుత్రుల శక్తి, సామర్థ్యాలను నేను శంకిస్తానా? తండ్రి మాటప్రకారం సముద్రాన్ని వారు తవ్వుతూపోగా భూమిని మోస్తుండే అష్టదిగ్గజాలు వారికి కనిపించాయి. భక్తిపూర్వకంగా వాటిని ప్రదక్షిణించి, వాటి కాళ్ళకిందగా మరింత తవ్వుకుంటూ పోయారు. ఇలా పోగా పోగా, వెయ్యి యోజనాల లోతున వారికి పాతాళలోకం తగిలింది. ఆ మాయలోకంలో.....

లక్ష్మణుడు : పాతాళలోక మనేది లేదనే మీ తాత్పర్యమా?

సీత : అది లేకపోతే, అక్కడ కపిలమహర్షికి అల్లంత దూరాన మేతమే స్తున్న తమ తండ్రి యాగాశ్వం వారికి కనబడేదా? "ఓరి దొంగా!" అంటూ ఆ మహర్షిపై వారు దూకేవారా? వారి దుందుడుకుతనానికి కినిసి, ఆయన శాపం పెట్టగా బూదిపోగుల్లై వారు.....

లక్ష్మణుడు : మీరింత పేళనగా మాట్లాడ్డానికి ఇదేమీ కట్టుకథ కాదే!

సీత : అబ్బే! కట్టుకథ కాదు, పిట్టకథ!

లక్ష్మణుడు : అయితే, సగరపుత్రులకు సద్గతల సాధనకై గంగాదేవిని ప్రార్థించి, మా భగీరథుడు ఆమెను స్వర్గంనుంచి భూతలానికి వెంటబెట్టు కురావడం కూడా ఒక పిట్టకథేనా?

సీత : కాదు, అది గట్టికథ! చిలవలపలవలతో మీ వంది మాగధులు దాన్ని చిక్కగానే అల్లారు!

లక్ష్మణుడు : అదేమిటి, వదినా? ప్రతిదాన్నీ ఒక కల్పితకథకింద కొట్టి వేస్తు న్నారు! తాను నూరవయాగం చేస్తుండగా దేవేంద్రుడే తిరిగి తన యాగాశ్వాన్ని అపహరించగా, మా రఘుచక్రవర్తి ఆ స్వర్గాధిపతిపై దండెత్తి వెళ్ళలేదా?

సీత : వెళ్ళకే! వెడుతూ వెడుతూ [మరిది దిక్కులో చూపుడు వేలెత్తి] మా ఈ ముద్దులమరదిని చంకనెత్తుకు వెళ్ళారు!

లక్ష్మణుడు : మీ మాటలు చాలా విచిత్రంగా వుంటాయి, వదినా!

సీత : మీ భ్రమలకంటేనా ? ఆ భ్రమలతో లేనిపోని గొప్పలకు పోయి, మీ అన్నగారు ఏమి ముప్పులు తెస్తారో అని నే నెంతగా తల్లడి ల్లుతూ వుంటానో నీ కేమి తెలుసు? ఇంతకూ ఆయన ఎక్కడికి వేంచేశారు?

లక్ష్మణుడు : తమ పుణ్యాశ్రమానికి విచ్చేసి, దాన్నిపావనం చేయవలసిందని

మహర్షి లెవరో వచ్చి కోరగా.....

సీత : ఈ కొత్త మహర్షి లెవరు? మన ప్రాణానికి వీ రెక్కడనుంచి దాపురించారు?

లక్ష్మణుడు : ఇక్కడి కొక యోజనం దూరంలోనే వారుంటున్నారట. తప్పక ఒకసారి దయచెయ్యాలని వారు మోమోటపెట్టగా, కాదనలేక వెళ్లారు!

సీత : కాదనలేక వెళ్లలేదు. కావాలనే వెళ్లారు! మీ అన్నగారి సంగతి నాకు తెలియదా? "రఘుకుల తిలకా! రణరంగ ధీరా! రాక్ష ససంహారకా!" అంటూ ఉబ్బవేస్తే చాలు, తమంతవారు ఈ లోకంలోనే లేరని తబ్బిబ్బులైపోతారు! ఈ ఋషుల స్తోత్రాలు మరి చాలు; వీరి సత్కారాలూ చాలు! త్వరగా 'వేరెక్కడి కైనా వెళ్లి, మన పర్ణశాల మనం వేసుకొని, మన బ్రతుకు మనం బ్రతకడం అన్ని విధాల మనకు శ్రేయస్కరం.

లక్ష్మణుడు : ఒక రాజర్షి కుమార్తెవై వుండి కూడా ఎందుకు - వదినా!, ఋషులంటే మీ కింత కంటగింపు?

సీత : రాజర్షి కుమార్తె నైనందునే! మా నాన్నగారు జటాజూటాలు ధరించిన ప్రతి కపటిని ఒక మహర్షిగా నెత్తిని పెట్టుకోరు! జ్ఞాను లైనవారినే చేరదీస్తారు, వారినే సన్మానిస్తారు.

లక్ష్మణుడు : అయితే, ఇక్కడ ఈ జనస్థానంలోని ఈ ఋషులందరు కపట వేషధారులనే మీరు తేల్చుతున్నారా?

సీత : అలా వారిని తేల్చకపోతే, వారు మన పుట్టి నిలువునా ముంచరూ! [ఈ లోపల నగలను తిరిగి మూట కట్టివేస్తూ] దీన్ని అక్కడెక్క డైనా కాస్త భద్రం చేస్తావా?

లక్ష్మణుడు : ఈ పూట వీటిని బయటికి తీశారెందుకు?

సీత : పనిలేనివారు ఏదో పని కల్పించుకోవద్దూ? ఏమీ చేయకుండా ఒంటరిగా కూర్చుంటే మనస్సు పరిపరి విధాల పోతుంది. ఈ ఋషులు మన వనవాసాన్ని శాంతంగా గడపనిచ్చేటట్టు లేరు.

[గట్టిగా నిట్టూర్చుతూ] ఊ! ఏమి కానున్నదో! [ఈ మాటలమధ్య నగల మూటను మరిది చేతికి అందించబోతుంది. ఒక నగ బయటనే మిగిలిపోయినట్టు అంతలో గమనిస్తుంది. అందించబోతున్న మూటను వెనక్కు తీసుకుని, దాన్ని తిరిగి విప్పుతుంది. బయట మిగిలిన నగను తక్కిన వాటితో జత చేర్చి, మళ్లీ మూట కట్టబోతూ, మధ్యలో ఆగి] ఈ జడ గంటలు చూచావా? ఇవి ఏడు తరాలనాటివట. ఇంటి పెద్దకోడలికే వీటిని పెట్టడం మా వంశంలో పరిపాటి. దాన్ని తప్పించి మా అమ్మ నా పెళ్ళినాడు నా కిచ్చింది. "ఎందుకమ్మా!" అని నేనెంత చెప్పినా వినిపించుకోకుండా, తన చేతులతో తాను వీటితో నాకు జడ అల్లింది. ఇంత చిన్నతనంలోనే నా కిన్ని కష్టాలు చుట్టుకున్నాయని ఇప్పుడు-పాపం! - ఆమె ఎంతగా కుమిలిపోతున్నదో! [కొన్ని క్షణాల మౌనం తర్వాత నగలపైకి తిరిగి దృష్టి పోనిచ్చి, ఒక నాగరాన్ని పైకి తీసి, మరదికి చూపుతూ] ఇది నా కెవ రిచ్చారో తెలుసా?

లక్ష్మణుడు : ఆ!

సీత : ఎవరు

లక్ష్మణుడు : మా అమ్మ.

సీత : మా కారణంగా తన ముద్దుల కొడుకు అడవులపాలైనాడని ఆ తల్లి ఎంతగా వ్యసనపడుతున్నదో!

లక్ష్మణుడు : మీ వెంట వెళ్ళవలసిందిగా ఆమె నన్ను ఆశీర్వదించి మరీ పంపించింది. నేను వెనక దిగబడితేనే ఆమె నిజంగా వ్యసనపడేది.

సీత : మా చిన్నత్తగారికి న్నేనన్నా, మీ అన్నగారన్నా ఎంతో ప్రాణం. ఆమె ఎంత మంచివారు! [నాగరాన్ని మూటలో పెట్టి, ఒక వజ్రహారాన్ని పైకి తీస్తూ] ఈ వజ్రహారాన్ని ఇంతకుముందు చూచావా?

లక్ష్మణుడు : లేదు.

సీత : ఇది మీ అన్నగారి బహూకృతి. ఏ సందర్భంలో బహూకరించారో

ఊహించగలవా?

లక్ష్మణుడు: ఉహూ!

సీత : యౌవరాజ్య పట్టాభిషేకం తమకు జరగబోతున్న దనుకొన్న సంద
ర్భంలో! "సింహాసనంపై రేపు నా సరసను కూర్చున్నప్పుడు నీవు
దిన్ని పెట్టుకుంటే చూడాలని ముచ్చటగా వుంది," అంటూ
తెచ్చియిచ్చారు. [బరువుగా] కాని అజినాసనాలే మాకు సింహా
సనా లయ్యాయి. పోనీ, ఈ ప్రవాసకాలాన్ని ఏలాగో ముగిం
చుకొని, ఇంటికి తిరిగి వెడదామను కొంటే, మరిన్ని కష్టాల
పాల్జేయకుండా ఈ మునిప్రుచ్చులు ఈ కారడవులనుంచి మనను
బయటపడనిచ్చేటట్టు లేరు!

లక్ష్మణుడు: ఎందువల్లనో తెలియదు - ఈ మహర్షు లందరు ధూర్తులని మీరు
అకారణ భయాలకు పోతున్నారు!

సీత : నావి సకారణ భయాలే, మీవి మాత్రం అకారణ భ్రమలు!! కార్యా
ర్థులై వచ్చినవారు తమరు ఇంద్రులని, చంద్రులని వందిమాగధు
లకంటె హీనంగా ముఖస్తుతులకు దిగితే, వారిని ధూర్తులనుకొనక,
మహర్షులనుకొంటానా?

లక్ష్మణుడు: అదేమిటి, వదినా? వారిలో కొందరి ముఖాలు బ్రహ్మవర్చస్సుతో
ఎంతగా వెలిగిపోతూవుంటాయి!

సీత : ఔనౌను! వారి పొగడ్తలు వింటూవుంటే మీ అన్నదమ్ములిద్దరి
ముఖాలు మరింతగా వెలిగిపోతూవుంటాయి! అన్నగారు అఖిలేశ్వరు
లని వారు కీర్తిస్తూవుంటే తమ్ముడుగారి ముఖంలో కోటి సూర్యులు
ఒక్కసారిగా ఉదయిస్తారు. సరిగాని సంధ్యా వందనానికై వెళ్ళి
నవారు దాన్ని ముగించుకొని చక్కారాక..... [వెలుపలినుంచి
"రఘుకుల తిలకా! రణరంగధీరా! రాక్షస సంహారకా"! అంటూ
– రెండు గొంతులతో స్తోత్రపాఠాలు] అరుగో! వస్తున్నారు మళ్ళీ
మీ వందిమాగధు లెవరో!

[పర్ణశాల ద్వారంపైపుకు లక్ష్మణుడు రెండడుగులు వేసీ వేయక
ముందే ఒక ఋషి లోనికి ప్రవేశిస్తాడు.]

లక్ష్మణుడు: [చేతులు జోడిస్తూ] నమస్కారం!

ఋషి : శతమానం భవతు!

సీత : [దాచుకోలేని చికాకుతో లేచి నిలబడుతూ] నమస్కారం!

ఋషి : దీర్ఘసుమంగళీభవ!
[చేతిలో ఒక పళ్ళబుట్టతో మరొక ఋషి మొదటి ఋషి వెనకనే లోపలికి ప్రవేశించి, ఒక పక్క కొదిగి నిలబడి వుంటాడు]

మొదటి ఋషి:(లక్ష్మణునితో) తమ పాదపద్మరజంతో మా పర్ణకుటీరాన్ని....

సీత : పావనం చేయగలిగింది వీరు కాదు; వీరి అన్నగారు!

మొదటి ఋషి:ఓహో! తమరు రామచంద్రప్రభువుల సోదరులా? లక్ష్మణస్వాములా?

సీత : ఆయన స్వాములు కావడానికి ఇంకా గడ్డమైనా మొలవలేదే!

మొదటి ఋషి:అయినా, వారు స్వాములే! మా రఘుకుల స్వాములతో వారా కరు కారా, తల్లీ?

రెండవ ఋషి: [సీతను సమీపించి, పళ్ళబుట్టను ఆమెకు అందించబోతూ] మాగురుదేవుల షక్షాన ఈ చిన్ని కాన్కను స్వీకరించండి!

సీత : [ఆ బుట్టను అందుకోకుండా] మాకెందుకివి? (ఒక మూలనున్న కందమూల ఫలాల రాసిని వేలెత్తి చూపుతూ) అటు చూడండి! సుతీక్ష్ణ మహర్షులు ఎన్నింటిని పంపించి, ఎంత పెద్ద రాసి పోయిచారో!

మొదటి ఋషి:ఇక్కడ మీకివి తక్కువని కాదు; మా రామచంద్ర ప్రభువుల పట్ల మా భక్తి గౌరవ ప్రపత్తులకు సూచకంగా తెచ్చాము - అంతే! రాజదర్శనానికి రిక్తహస్తాలతో వెళ్ళరాదని వృద్ధాను శాసనం!

సీత : ఇక్కడ రాజు లెవరు?

మొదటి ఋషి:ఎవరేమిటి తల్లీ? అయోధ్యాప్రభువులు, శ్రీరామచంద్రులు.

సీత : అయోధ్యకు ప్రభవులు భరతులు కారా?

మొదటి ఋషి:ప్రస్తుతానికి ఆయన నామమాత్రంగా ప్రభవు లైనా, రాజ్యం వీరిదే,

రాజ్యాధికారమూ వీరిదే!

సీత : అయితే, అక్కడనే నిక్షేపంగా వుండక ఈ అడవులలో అఘోరించడం దేనికి?

లక్ష్మణుడు: వదినా! [ఆమె తనవైపుకు చూడగా, "దయచేసి మీరు వూరుకోండి" అన్నట్టు మౌనంగా అర్థించి, రెండవ ఋషితో] అయ్యా! దాన్ని ఇలా తెండి!

[పళ్ళబుట్టను అందుకొని, దాన్ని పర్ణశాలలో ఒక మూలగా పెట్టి వచ్చి, ఋషి లిద్దరికి అజినాసనాలను చూపుతూ] నిలబడే వున్నారు - దయచేసి కూర్చోండి!

[ఋషులిద్దరు కూర్చుంటారు] అర్ఘ్యపాద్యాలు సమర్పించనందుకు మమ్ము తమరు మన్నించాలి. తమకు తెలియని దేమున్నది? - మేమే సుతీక్ష్ణ మహర్షులకు ప్రస్తుతం అతిథులమై వున్నాము.

మొదటి ఋషి:ఆ విషయం - స్వామీ! - మీరు మాకు వివరించాలా?

లక్ష్మణుడు: తమ శుభనామధేయాన్ని మేము వినవచ్చునా?

రెండవ ఋషి: వారు వాలఖిల్య మహర్షులు. తాము వినే వుంటారు, వాలఖిల్యులు బ్రహ్మరోమాలనుంచి జన్మించారని.

సీత : ఔను! వైఖానసులు బ్రహ్మదేవుని గోళ్ళనుంచి పుట్టుకు వచ్చారని కూడా విన్నాము! మరి తామెవరు? ఆయన చెమట చుక్కల నుంచి ఊడిపడినవారు కారుగదా?

లక్ష్మణుడు: [వినతిపూర్వకంగా] మా వదినగారు ఈ పూట కాస్త చికాకుగా వున్నారు. ఆమె మాటలను తమరు పట్టించుకోవద్దని నా మనవి

మొదటి ఋషి:ఆమె మాకు కన్నతల్లి వంటిది [సీత ముఖం చిట్లిస్తుంది] తల్లి నాలుగ తిట్టినా, అవి బిడ్డలకు దీవనలే! కూర్చోండి, లక్ష్మణ స్వామీ! కూర్చోండి. ఎంతసేపు అలా నిలబడతారు? మీకు లేనిపోని శ్రమ దేనికి?

లక్ష్మణుడు: ఆ! ఏమి శ్రమ లెండి!

రెండవ ఋషి: అమ్మా! దయచేసి తామైనా.....

సీత : [వెంటనే కూర్చుంటూ] మరి కానేపు పోతే మీరు నన్ను అమ్మ మ్మనే చేస్తారేమో!

లక్ష్మణుడు: [సంభాషణ ధోరణి మార్చాలన్న తాపత్రయంతో, రెండవ ఋషి నుద్దేశించి] అయితే, తమ రెవరో, తమ పరిచయ భాగ్యం మాకు కలిగించారు కాదు.

మొదటి ఋషి: ఈయన మా ప్రియ శిష్యులు. మాతోపాటు వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి, మా సన్నిధిలో వుంటున్నారు; భక్తి శ్రద్ధలతో మాకు శుశ్రూష చేస్తున్నారు.

సీత : ఈయనకు ఊరూపేరూ లేదా?

మొదటి ఋషి: లేకేమి, తల్లీ, లేకేమి? ఈయన తోడ్పాటు లేకుండా ఈ జనస్థానంలో ఏ యాగమూ జరగదు. అందువల్ల "యాగానంద స్వామి"అనేది ఈయన ప్రసిద్ధ నామమైపోయింది! పేరుకు మా శిష్యులన్న మాటేకాని. అశేష యాగధన సంపన్నులు!

రెండవ ఋషి: నా పట్ల ప్రేమ గౌరవాల కొద్దీ మా గురుదేవులు పలుకుతున్న పలుకుల కేమిలెండి! వారి పాదధూళిని శిరస్సున ధరించడానికైనా తగను! వారు సామాన్యులా? అత్రి అగస్త్యులను మరపించగల మహర్షులు; భృగు భరద్వాజులతో పోల్చదగు బ్రహ్మర్షులు; వసిష్ఠ విశ్వామిత్రులకు దీటురాగల దివ్యర్షులు!

సీత : అయితే, ఈ జనస్థానానికి తా ముభయులు సూర్యచంద్రులన్న మాట! [మరదివైపు తిరిగి] కూర్చోవయ్యా, నువ్వూ కూర్చో! మహర్షి సత్తముల సెలవైందిగా! తమ సమక్షంలో చేతులు జోడించి నిలబడలేదని శాప మేదో తగిలించరులే!

మొదటి ఋషి:అమ్మమ్మా! ఎంత మాట!

సీత : నే నన్నంత పనీ జరిగింది! నన్ను అమ్మమ్మను చేసివేశారు!!

లక్ష్మణుడు : [సంభాషణ ధోరణిని మార్చాలని తిరిగి ప్రయత్నిస్తూ] మా అన్నగారు ఇక్కడే, ఈ సమీపంలోనే వుంటున్న ఋషులెవరో ఆహ్వానించగా వారి అతిథ్యాన్ని స్వీకరించడానికి వెళ్ళారు. వారు తిరిగి వచ్చేసరికి చాలా పొద్దెక్కి పోవచ్చు.

సీత : ఎండముఖాన పడరా దంటే తాము వెంటనే తిరుగుప్రయాణం కట్టడం మంచి దేమో!

మొదటి ఋషి:మా ప్రభువులు ఇక్కడికి విచ్చేశారని విన్నంతనే వారి దర్శనార్థం నాలుగు యోజనాల దూరంనుంచి హుటాహుటిగా వచ్చాము. శ్రీవారి దర్శనభాగ్యం పొంది, వారికి మా నివేదన చేసుకోకుండా తిరిగి వెళ్ళము.

సీత : అయితే, శ్రీవారి దర్శనభాగ్యం కోసమే తాము విచ్చేయలేదన్న మాట! ఏదో నివేదనతో సయితం వచ్చారు!

లక్ష్మణుడు: [ఆందోళనతో] వదినా!

సీత : [వినిపించుకోకుండా] ఏ నివేదనతో తమరు వచ్చారో, అది నాకు తెలుసు- చెప్పమంటారా? "రాక్షసుల పీడ మాకు విశేషంగా వుంటున్నది. మా యజ్ఞయాగాదులకు వారు విఘాతాలు కల్పిస్తున్నారు. వారిని సంహరించి, వారి దురాగతాల నుంచి ప్రభువులు మాకు విముక్తి కలిగించాలి"- ఇదే కాదా మీ నిదేదన?

రెండవ ఋషి: ఆశ్చర్యం! పరమాశ్చర్యం! మా నివేదన మా మనస్సులో వుండగానే దాన్ని తా మెంత సరిగా గ్రహించారు!

సీత : తమబోటి దివ్యర్షులమధ్యకు వచ్చిన తర్వాత నాకు కూడా కాస్త కాస్త దివ్యదృష్టి అబ్బుతున్నది లెండి!

రెండవ ఋషి: [సీత పలుకులలోని వ్యంగ్యాన్ని గ్రహించలేక] దివ్యదృష్టికి ఈ

జనస్థానంలో మా గురుదేవుల తర్వాతనే మరెవరైనా! వారు త్రికాలజ్ఞులు!

సీత : వారి శుశ్రూషతో తాము కనీసం ద్వికాలజ్ఞులైనా అయివుండాలి! అయినా, చూచి చూచి ప్రభువులవారి దర్శనార్థం వారు లేనప్పుడు వేంచేశారేమో! ఇలాంటి క్షుద్రవిషయాలకు తాము తమ దివ్యశక్తులను వృథాచెయ్యరు కాబోలు! వాటిని తమరు.....

లక్ష్మణుడు : [అపవారిస్తూ] వదినా! దయచేసి నన్ను మాట్లాడనిస్తారా?

సీత : ఏ! వీరు నన్ను శపిస్తారని భయమా?

రెండవ ఋషి: అమ్మమ్మా! ఎంత మాట!

సీత : సంతోషం! మరొక మెట్టు పైకెక్కించక, నన్నింకా అమ్మమ్మగానే మిగిల్చారు!

మొదటి ఋషి:నాకు తెలుసు, తల్లీ!- నాకుతెలుసు మీది క్షణిక కోపమని. మమ్మ కాదన్నట్టు మేము మిన్నకున్న క్షణంలో మా తల్లి మా పట్ల ప్రసన్నులౌతారని కూడా మాకు తెలుసు!

సీత : అయితే, మీకు రోష మన్నది కూడా లేదన్నమాట! [మొదటి ఋషి చిరునవ్వు నవ్వుతాడు] ఎవరే మన్నా పడతారన్నమాట![మొదటి ఋషి పెదవులపై తిరిగి చిరునవ్వు] కాలు పట్టుకు లాగుతున్నా చూరు పట్టుకు వేలాడతారన్నమాట. [తనను కాదన్నట్టు మొదటిఋషి మరల మందహాసం చేయగా నిస్పృహతో]
అయితే, నేను నా పరాజయాన్ని గుర్తించక తప్పదు! రోషమైనా లేనివారిని ఏమని ఏమి లాభం?
[కొన్ని క్షణాలపాటుపూర్తి నిశ్శబ్దం]

మొదటి ఋషి:మేము బయల్దేరిన వేళావిశేషంవల్లనే మా మహారాజ్ఞికి మాపై ఆగ్రహం వచ్చింది. ముందు ఆగ్రహపడినా, తర్వాత మమ్మ అనుగ్రహించి, రామచంద్రప్రభువులకు మా నివేదనను ఆమె బలపరుస్తారని మాకు తెలుసు!

సీత : ఔను! సమస్తం మీకు తెలుసు! మీరు సర్వజ్ఞులయ్యే! సరిగాని,

నాకున్న ఒక చిన్న సందేహం తీర్చండి. ఇది కోసల దేశమా?

మొదటి ఋషి:కాదు, జనస్థానం.

సీత : ఇక్కడికి వలసరావడానికి ముందు మీరు కోసలదేశ పౌరులా?

మొదటి ఋషి:కాదు, మాది కాశీదేశం.

సీత : అయితే, మావారు మీకు ప్రభువు లెలా అయినారో!

మొదటి ఋషి:రఘునందనులు ఈ భూమండలానికే ప్రభువులు!

సీత : ఎప్పటినుంచి?

మొదటి ఋషి:ఈ భూమి పుట్టినప్పటినుంచీ!

సీత : నాకు తెలియక అడుగుతున్నాగాని, ఈ భూమితోనే రఘు చక్రవర్తి పుట్టుకువచ్చాడా?

మొదటి ఋషి:లే దనుకోండి!

సీత : రఘుచక్రవర్తి జయించిన రాజ్యా లన్నీ ఇప్పుడు కోసలదేశ సార్వభౌమత్వాన్ని గుర్తిస్తున్నాయా?

మొదటి ఋషి:అవి గుర్తించక పోయినా.....

సీత : మీరు గుర్తిస్తున్నా రన్నమాట! సంతోషం!! కాని, ఈ మహిమండలంపైన కోసలరాజులకు లేని సార్వభౌమత్వాన్ని మీరు గుర్తించడానికిముందు ఈ జనస్థానంపై దీని ప్రభువు కున్న సర్వసత్తాక ప్రతిపత్తిని గుర్తించడం మీకు, మాకూ, అందరికీ క్షేమ మేమో!

మొదటి ఋషి:వారు రాక్షసులు, తల్లీ! క్రూరరాక్షసులు!

సీత : వారి కంటికి మీరే క్రూరరాక్షసులుగా కనబడవచ్చుగదా! వారు మా కోసలరాజ్యంలోకి రాలేదు, మీ కాశీరాజ్యంలో కైనా రాలేదు. అన్యాయంగా వారి సీమలోకి చొచ్చుకు వచ్చింది మీరే! వారి నివాసస్థానాలకు చిచ్చుపెడుతున్నది మీరే! వారి బ్రతుకులను

బుగ్గిచేస్తున్నది మీరే! వారి ఉసురు పోసుకొంటున్నది.....

లక్ష్మణుడు: [అపవారిస్తూ] వదినా! వదినా!

సీత : నా మాటకు ఒక క్షణం అడ్డురాబోకు! [తిరిగి మొదటి ఋషి తో] వారిని సర్వనాశం చేస్తున్నది మీరే!

మొదటి ఋషి: అదేమిటి, తల్లీ! అదేమిటి? మా హోమగుండాలలో నీళ్ళు పోసి, వాటిని చల్లార్చి వేస్తూ, వారు మమ్ము వేధించుకు తింటూ వుంటే, మేమే వారికి ఏదో కీడు తలపెట్టినట్టు మమ్ము నింది స్తున్నారు!

సీత : హోమగుండాలను మీరెందుకు వెలిగిస్తున్నారు? ఈ అడవు లను కాల్చడానికి కాదా? వీటిని చదును చేసి, దున్నుకోడానికి కాదా? అందువల్ల మీకు పంటలు పండవచ్చు, మీ గరిసెలు నిండ వచ్చు, మీ సంసారాలు పచ్చగా వుండవచ్చు. కాని, ఇక్కడి వారి మాటేమిటి? వీరు కాయలేరుకుని, కంద మూలాలు తవ్వుకుని బ్రతకవలసిన వారు కారా? పిట్టలను పట్టుకొని, జంతువులను కొట్టుకొని పొట్టపోసుకోవలసినవారు కారా? ఈ అడవులను మీరు ధ్వంసం చేస్తే, వారి బ్రతుకులే ధ్వంసం కావా?

మొదటి ఋషి: వారు కూడా హోమగుండాలను వెలిగించుకుంటే మేము కాదం టామా?

సీత : సేద్యంపట్ల వారికి ఆసక్తి లేదు. వారు హోమగుండాలను ఎందుకు వెలిగించుకోవాలి? తమ జీవితవిధానాన్ని ఎందుకు మార్చుకోవాలి?

మొదటి ఋషి: మన జీవితవిధానమే నాగరికవిధానమైనందున!

సీత : జంతువులను వేటాడినట్టు తోటి మానవులను వేటాడి, వారి నివాసస్థానాలలో తిష్ఠవేయుడమే మీ నాగరికత కాబోలు!

మొదటి ఋషి: ఇది దైవానుశాసనం, తల్లీ! ఇది దైవానుశాసనం! యజ్ఞవాటిక లను, హోమగుండాలను మన ఇంద్ర వరుణ మిత్రాది దేవతలే మనకు నిర్దేశించారు! వారి ప్రీత్యర్థం యజ్ఞయాగాదులను మనం

విధిగా జరపాలి. లేకపోతే సృష్టిక్రమానికే భంగం వాటిల్లుతుంది, సమస్తలోకాలు ఒక్కసారిగా లయిస్తాయి!

సీత : మీ దేవతలు మీ కుంటే, వారి దేవతలు వారికి లేరా?

మొదటి ఋషి:వారి దేవతలా? వారు క్షుద్రదేవతలు!

సీత : భక్తుల స్వభావాన్ని బట్టి దేవతల స్వభావాన్ని నిర్ణయిస్తే మీ దేవతలే క్షుద్రదేవత లేమో!

మొదటి ఋషి:[తన శాంతాన్ని మరి కాపాడుకోలేక] దశరథ మహారాజు కోడలు, రామచంద్రప్రభువు ధర్మపత్ని.....

సీత : [ఆవేశంతో] వారి పే రెత్తడానికైనా మీకు అర్హత లేదు! మరి కట్టిపెట్టండి! అనవసర ప్రేలాపనకు పోతే.....

లక్ష్మణుడు: [ఆందోళనతో] వదినా! వదినా!

రెండవ ఋషి: అమ్మమ్మా! ఎంత ఆగ్రహం! ఏమి ఆవేశం!

సీత : అమ్మమ్మా, గిమ్మమ్మా అంటే మరి సహించేది లేదు సుమీ!

లక్ష్మణుడు: వదినా! మీ కొక నమస్కారం! తొందరపడకండి. [మొదటి ఋషితో] తమరు, తమ శిష్యులు ఇప్పుడు వెళ్ళి, రేపు రాగూడదా?

మొదటి ఋషి:[లేస్తూ] రామచంద్రప్రభువుల దర్శనం లభించేవరకు మేము ఈ పుణ్యాశ్రమంలోనే వేచి వుంటామూ లెండి!
[గురువువెంట శిష్యుడు కూడా లేస్తాడు]

లక్ష్మణుడు: సరే! సుతీక్ష్ణ మహర్షులతో మాట్లాడి,తమ విడిదికి ఏర్పాట్లు చేయిస్తాను. దయచేసి నావెంట రండి!

మొదటి ఋషి:ఆయన మాకు సుపరిచితులే! ఆయన దర్శనం చేసుకునే ఇక్కడి వచ్చాము! మేము వెడతాము లెండి! మీకు శ్రమ దేనికి?

లక్ష్మణుడు: సరే మంచిది! నమస్కారం!

మొదటి ఋషి:దీర్ఘాయుష్మాన్ భవ!

[మొదటి ఋషి బయటికి వెడతాడు. సీతవంక బెదురు బెదురుగా చూస్తూ గురువును అనుసరించబోయిన రెండవ ఋషి తల "ఠఫీ" అంటూ ద్వారానికి కొట్టుకొంటుంది. "అమ్మమ్మ" అంటూ రెండు చేతులతో నెత్తి పట్టుకొని ఆయన నిలబడి పోతాడు]

లక్ష్మణుడు: [చప్పన చెంతకు వెళ్ళి] పాపం! ఎంత దెబ్బ తగిలింది! తల చిట్లలేదుగదా!

మొదటి ఋషి:[గుమ్మం అవతలనే ఆగి, వెనుకకు తిరిగి చూస్తూ]కాస్త చూచి నడవొద్దూ?

రెండవ ఋషి: [తల తడివి చూచుకుంటూ] ఇంకా నయం! చిట్లలేదు, బొప్పి కట్టింది - అంతే! [సీతవంక తిరిగి ఒక బెదురు చూపు చూచి, గురువుతో] పదండి, గురుదేవా, పదండి!

[ఋష లిద్దరి నిష్క్రమణ]

లక్ష్మణుడు: [సీత వైపుకు నడుస్తూ అమ్మమ్మా! ఎంత కోపం! మీ కెంత కోపం!!

సీత : నన్ను నవ్వులలోకి దించాలని చూస్తున్నావు గాని, ఇది నవ్వులాట విషయం కాదు! ఈ మునిముచ్చుల కారణంగా మన కేదో కీడు మూడక తప్పదు!

లక్ష్మణుడు: మన్నించండి, వదినా! ఎందుకో తెలియదుగాని, ఈ జనస్థానానికి వచ్చినప్పటి నుంచీ మీ నీడ చూచి మీరే భయపడుతున్నారు!

సీత : నా నీడ చూచి కాదు, ఈ ఋషుల పీడ చూచి! భూతాలవలె పిశాచాలవలె వీళ్ళు మనను పట్టుకున్నారు!

లక్ష్మణుడు: మనం కాకపోతే మరి వారికి దిక్కెవరు వదినా?

సీత : అన్నకు తగిన తమ్ముడివే! దిక్కులేని వాళ్ళు ఈ ఆటవికులా? వీళ్ళను మారణహోమం చేస్తున్న మీరూ, మీ ఋషులా? ఇన్నాళ్లుగా చూచీచూడనట్టు ఊరుకొన్నాను; మరి ఊరుకొనేది లేదు! మీ అన్నగారిని రానీ! ఈ పూట ఆయనతో ఏదో ఒకటి తేల్చివేసుకొంటాను!

లక్ష్మణుడు: నేను మీకు చెప్పగలపాటి వాడిని కాదుగాని.....

సీత : అయితే చెప్పబోకు!!

లక్ష్మణుడు: [ఒక క్షణం మౌనం తర్వాత తల పంకిస్తూ] మీ ముఖంలో మబ్బులు కమ్ముకొంటున్నాయి, మీ కళ్లలో మెరుపులు మెరుస్తున్నాయి, మీ మాటలలో పిడుగుల రాలుతున్నాయి - ఈ పూట మా అన్నగారికి పెనుతుఫాను తప్పదు!

[తెర]

*

ద్వితీయాంకం

వర్షాటి ఉదయం పది, పదకొండు గంటల ప్రాంతాల. సుతీక్ష్ణమహర్షి ఆశ్రమంలో తిరిగి అదే అతిథిగృహం. తిరిగి అదే పక్కీలో.

ఈ రంగంలో కొత్తగా ప్రవేశించే రాముడు లక్ష్మణుని కంటె వయస్సుకు ఏ మంత పెద్దవాడు కాదుగాని, స్థిరబ్రూపి: చాయలో మాత్రం ఒకటి, రెండు వన్నెలు తక్కువ. తమ్ముడు కట్టుకొన్నవాటివలె తనవి కూడా నారబట్టలే. ఏ రాజాలంకరణలు లేకపోయినా, మోము తీరులో, మాట తీరులో, నడక తీరులో రాజఠీవి పుట్టిపడుతూ వుంటుంది. వంశగౌరవాన్ని కాపాడవలసిన భారం, దాన్ని పెంపొందించవలసిన బాధ్యత; ఇవి తనకు విధివిహితా లన్న ప్రగాఢవిశ్వాసం ప్రస్ఫుట మౌతుండే వ్యక్తిత్వం.

రంగస్థలంపై తెర లేచినప్పుడు అన్న రాకకై ఆతురతతో ఎదురు చూస్తూ లక్ష్మణుడు గుమ్మంలో నిలబడి వుంటాడు. అశాంతిని, ఆగ్రహాన్ని సూచిస్తున్న వదనంతో సీత పర్ణశాలలో నడయాడుతూ వుంటుంది. మధ్యలో ఒకటి, రెండు సార్లు అశాంతితో చెంతనున్న అజినాసనంపై ఆమె కూర్చుంటుంది; ముళ్ళపై కూర్చున్నట్టు అంతలోనే తిరిగి దిగ్గున లేస్తుంది.

సీత : [లక్ష్మణునితో] తలవాకిలిలో నిలబడి నీ వెంత గిలగిలలాడినా, ఆయన వచ్చేవేళకే వస్తారు గాని, ఒక్క క్షణమైనా ముందు రారు! చిరచిర లాడుతున్న ఆ యెండలో పడిగాపులు దేనికి? నీడలోకి రారాదూ?

లక్ష్మణుడు: ఆ! ఏమంత యెండగా వున్నది లెండి!

సీత : నిన్న పొద్దుననగా వెళ్ళిన అన్నగారు ఇంతవరకు తిరిగి రాలేదన్న మనస్తాపంవల్ల ఎండ వేడిమి కూడా తమకు తెలియడం లేదు కాబోలు!

లక్ష్మణుడు : [లోపలికి వస్తూ] నిజమే, వదినా! ఆలస్యమైన కొద్దీ నాకు ఆందోళన పెచ్చుతున్నది. ఋషుల ఆతిథ్య స్వీకరణకై వెళ్ళిన వారు.....

సీత : ఋషుల ఆతిథ్య స్వీకరణ! ఔను! అటవిక సంహారరూపంలో!!

లక్ష్మణుడు : మీ మాటల కేమి గాని, నిన్న సాయంత్రానికి అన్నయ్య రాకపోతే రాత్రికైనా వస్తా రనుకొన్నాను. రాత్రికి తిరిగి రాలేదు. సరిగాదా, తెల్లవారిన తర్వాతనైనా ఆయన జాడ లేదు. ఇంత జాగుచేశా రెందుకో! కనీసం మనకు వర్తమానమైనా పంపించారు కారు!

సీత : ఆటవికసంహార కార్యక్రమంలో పూర్తిగా మగ్నులైనవారికి సతిజ్ఞాపకం వుంటుందా, సోదరుడు జ్ఞాపకం వుంటాడా? తమశౌర్య ప్రతాపాలను పూర్తిగా చూపించి, రఘు వంశ ప్రతిష్ఠను పూర్తిగా కాపాడి, ఋషుల స్తోత్రపాఠాలను పూర్తిగా విని, ఆ తర్వాత నెమ్మదిగా వస్తారులే! రాక, ఎక్కడికి పోతారు?

లక్ష్మణుడు : కోపంకొద్దీ నిర్లక్ష్యాన్ని మీరు ప్రదర్శిస్తున్నా, మీ మనస్సు- వదినా! నిజం చెప్పండి! - ఆందోళనగా లేదూ?

సీత : [మాట తేల్చి వేస్తూ] లేదు.

లక్ష్మణుడు : గట్టిగా చెప్పండి-లేదూ?

సీత : [ముఖం ఒక వైపుకు తిప్పుకుని, కొంచెం గట్టిగా] లేదు!

లక్ష్మణుడు : నా వంక చూస్తూ చెప్పండి: మీకు నిజంగా ఆందోళన లేదూ?

సీత : [చెమ్మగిలిన చెక్కిళ్ళతో కూడిన ముఖాన్ని లక్ష్మణునివైపుకు తిప్పి] ఆందోళనపడి నేను చేయగలిగింది ఏమున్నది? ఆయనకు నేనంటే లక్ష్యమా, నా మాటంటే లక్ష్యమా?

లక్ష్మణుడు : ఆయనను వెతుక్కుంటూ నేను వెళ్ళడం మంచిదేమో! వెళ్ళ మంటారా, వదినా?

సీత : వెళ్ళు! వెడితే ఆయనకు తోడుగా మరి నలుగురు నిరపరాధులను నువ్వుకూడా చంపి రావచ్చు!

లక్ష్మణుడు : ఆ దేమిటి, వదినా? మరీ అంత నిష్ఠురంగా మాట్లాడుతున్నారు!

సీత : ఔను! నిజమాడితే నిష్ఠురమే! ఆయనకు తోచకపోతే, పోనీ నీవైనా చెబుతున్నావా? -ఆటవికులను వేటాడ్డంకోసమే మనం అరణ్య వాసానికి రాలేదని. ఇది తగదని చెప్పకపోగా, ఆయన మాటకు నువ్వు తాళం వేస్తున్నావయ్యే!

లక్ష్మణుడు : ఆయనకు నేను హితోపదేశం చేయగలపాటి వాడినా? అన్ని విషయాలలో ఆయన.....

[లక్ష్మణుడు మాటమధ్యలో వుండగా రెండవ ఋషి పర్ణశాలలో ప్రవేశించబోతాడు. హుటాహుటిగా వస్తున్నందున "ఠంగు" అంటూ తల ద్వారానికి కొట్టుకొంటుంది. "అమ్మమ్మా!" అంటూ ఆయన ముందుకు తూలి పడిపోబోతాడు. పడకుండా ఆయనను లక్ష్మణుడు పట్టుకొంటాడు]

లక్ష్మణుడు : తల మళ్ళీ చితకగొట్టుకున్నారా?

సీత : ఆయన తల అంత తేలికగా చితికేది కాదులే!

రెండవ ఋషి: [ఒక అజినాసనంపై చతికిలబడి తల తడివి చూచుకొంటూ] చితక లేదు గాని, దిమ్మెక్కింది.

లక్ష్మణుడు : మంచితీర్థం కావాలా?

రెండవ ఋషి: ఔను, స్వామీ!

సీత : [మంచి నీళ్ళు తీసుకురావడానికి కదలబోయిన మరదితో] నే నిస్తాలే! [పర్ణశాలలో ఒకమూలగా బల్లపై పెట్టివున్న పెద్ద కుండలో నుంచి పంచపాత్రతో మంచినీళ్ళు తెచ్చి యిస్తుంది.]

రెండవ ఋషి: [మంచినీళ్ళను గడగడ తాగివేసి] అమ్మమ్మా! ప్రాణమిప్పుడు కాస్త కుదటబడింది. [సీత ముఖం చిట్లించు కొనడాన్ని గమనించి] మన్నించండి! "ఈ అమ్మమ్మా ఊతపదం నీ కొక జాడ్యమై పోయింది సు మీ!" అని మా గురుదేవులు నిన్న గట్టిగా నన్ను మందలించారు. కాని, అది లేనిదే నా నోట మాట వెగిలి చావదయ్యే! [దెబ్బ తగిలనచోట తలనిమురుకొంటూ] రామచం ద్రప్రభువులు ఇంకా తిరిగి రానట్టేనా? ఆశ్రమద్వారంవద్ద వారి దారికాస్తూ పొద్దుటినుంచి కూర్చునే వున్నా! లోపలికి వచ్చిన ప్రతివారినీ పలకరిస్తూనే పోయా! ఇంతలో ఎక్కడినుంచి దాపు రించిందో ఆ పాపిష్టినిద్ర, ఒక రావిచెట్టు మొదలుకు జేరగిలబడి, ఒకటి, రెండు కునుకులు తీశా! ఇంతకు ముందే చప్పన మెలకువ వచ్చి, కళ్ళుతెరిచి చూద్దునుగదా పొద్దునడినెత్తి కెక్కబోతున్నది. "అమ్మమ్మా! ఎంత పనిజరిగింది!" అనుకొంటూ సరాసరి ఇక్కడికి ఒక్కపరుగున వచ్చా! రామచంద్రప్రభువులు ఇంకాతి రిగి రాకపోబట్టి సరిపోయిందిగాని, లేకపోతే తమకు ముందుగా వర్తమానం అందించనందుకు, మాగురుదేవులు నన్ను నిలువునా చీల్చేవారే! మీకు తెలియదు, ఆయనెంత చండశాసనుడో! పైకి శాంతమూర్తిగా కనబడిన, కోపం వస్తే- అమ్మమ్మా! -ఆయన ప్రళయకాల రుద్రుడే! కార్యార్థులై వచ్చినందున నిన్న మీ మాట లను ఆయన సహించారుగాని, లేకపోతే! ఏదోఒక ఘోరశాపం పెట్టివుండేవారే! ఆయన.....

సీత : [కోపంగా] మీరే మా కొకశాపం! వేరే శాపం దేనికి?

రెండవ ఋషి: అమ్మమ్మా! ఎంత మాట!

లక్ష్మణుడు : [సీతతో] వదినా! మీరుకాస్త శాంతించండి. [రెండవ ఋషితో] అయ్యా! అన్నగారు రాగానే తమకు వర్తమానం చేస్తాను లెండి! తాము వెళ్ళిరండి!

రెండవ ఋషి: తప్పక చేస్తారా? మరచిపోరు గదా!

లక్ష్మణుడు : మరవను లెండి!

రెండవ ఋషి: అయితే, మరి నేను వెళ్ళివస్తా!

లక్ష్మణుడు : [ఆయన లేవగానే, ద్వారాన్ని చూపుతూ] ఈ సారైనా.....

రెండవ ఋషి: అమ్మమ్మా! ఆ పొరపాటు మళ్ళీ చేస్తానా!
[ఈ మాట లని ద్వారం అల్లంత దూరాన వుండగానే తలపూర్తిగా వంచుకొని రెండవ ఋషి బయటికి వెళ్ళబోతాడు. సరిగా ఆ వేళకు మొదటి ఋషిసమేతంగా రాముడు వాకిటి లోకి వస్తాడు. "లోపలికి దయచేయండి!" అన్నట్టు రాముడు మూగసైగలతో ఆహ్వానించగా మండిగంపైగా లోపలికి పాదం పెట్టబోతున్న మొదటి ఋషి రొమ్మును రెండవ ఋషి తన తలతో ఢీకొంటాడు.]

రెండవ ఋషి: [తలయెత్తి మొదటి ఋషిని చూచి, తెల్లబోతూ] అమ్మమ్మా! ఎంత తప్పిదం! ఎంత తప్పిదం!! గురుదేవులు మన్నించాలి.
[వంగి కాళ్ళకు నమస్కారం చేస్తాడు]

రాముడు : [లోపలికి వస్తూ] ఎవ రది?

మొదటి ఋషి: ఈయన మా శిష్యుడు లెండి! [రెండవ ఋషితో] చూడక తప్పిదం చేశావు-దాని కేమిలే!

రాముడు: [అజినాసనాలను ఋషు లిద్దరికి చూపుతూ] దయచేసి కూర్చోండి!

మొదటి ఋషి:[ముందు తాను కూర్చుంటూ, రామునితో] తమరు కూడా దయచేయండి!

రాముడు : [రెండవ ఋషితో] అయ్యా! తమరు కూర్చోలే దేమి?
[చిత్తరపడివున్న ఆ ఋషిని రెక్కపుచ్చుకుని, ఒక అజినాసనంపై కూర్చోబెట్టి, తాను కూడా కూర్చుంటాడు. ఈ లోపుగా రాముని ధనుర్బాణాలను అందుకుని, వాటిని లక్ష్మణుడు పర్ణశాలలో ఒక మూలగా పెట్టివస్తాడు.]

మొదటి ఋషి:[సీతతో] తల్లీ! తాము.....

సీత : కూర్చుంటాను లెండి! నిన్న పొద్దుననగా వెళ్లినవారు, మీరు చూస్తూనే వున్నారుగా, ఇప్పుడే తిరిగి వచ్చారు. స్నానపానాదులు పూర్తి చేసుకొని, వారిని కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి. వారితో మీరు మాట్లాడదలచింది సాయంత్రం మాట్లాడవచ్చు. ఇంతలో ముంచుకుపోయేది ఏమీ లేదు.

రాముడు : [మొదటి ఋషి తో] నావిశ్రాంతిమాట కేమిలెండి. తాము పెద్దలు, పూజ్యులు, నిన్నటినుంచి నాకోసం తాము వేచి వుండవలసి వచ్చినందుకు నే నెంతో విచారిస్తున్నాను. తమ ఆదేశ మేమిటో సెల వివ్వండి

మొదటి ఋషి:ఆదేశం కాదు, అభ్యర్థన. ప్రభువులు మా పుణ్యాశ్రమానికి ఒక సారి విచ్చేసి.....

సీత : [వెటకారంగా] తమ పాదపద్మరజంతో దాన్ని ఒకసారి పావనం చెయ్యండి!

మొదటి ఋషి:మా విన్నపాన్ని మహారాజ్ఞి చక్కగా వివరించారు.

సీత : ఇంకావివరించమంటారా? " మా పుణ్యాశ్రమాన్ని పావనం చేసిన తర్వాత మా ప్రాంతంలోని రాక్షసులను చెండాడి, వారి పీడ మాకు విరగడ చెయ్యండి!"

రాముడు : [చిరుకోపంతో] మరి చాలు - మా ప్రసంగంలో నీ జోక్యం!

మొదటి ఋషి:మహారాజులకు మా దొక విన్నపం: మన సంభాషణలో పాల్గొన కుండా మహారాజ్ఞిని-దయచేసి-నిరోధించకండి. అయోధ్యా చక్రవర్తి లుగా, ఆర్యావర్తనాయకులుగా మీరు కొనసాగిస్తున్న దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు మీ పట్టపుదేవేరిగా ఆమె సమ్మతి, సన్నుతులు మీకు కావాలి. అవి లభించినప్పుడే మీ కృషి అవిచ్ఛిన్నంగా కొనసాగు తుంది, అప్పుడే మీ శాసనం అమోఘ మౌతుంది. మమ్ముగురించి, మా మహర్షిలోకాన్ని గురించి మహారాజ్ఞికి ప్రస్తుతం కొన్ని దుర భిప్రాయా లున్నట్టు మాకు తెలుసు. వాటిని నివారించగల మన్న విశ్వాసం మాకున్నది. [సీతవైపుకు తిరిగి] తల్లీ! ఇలా రండి! దయ చేసి కూర్చోండి! నిన్నటి మీ సందేహాలను ప్రభువుల సమక్షంలో వెల్లడించండి. వాటిని మేము నిశ్శేషంగా తొలగిస్తాము.

సీత : గత రాత్రి మీరు పూర్తిగా జాగరణం చేసివుండాలి.

మొదటి ఋషి:జాగరణమా? దేనికి తల్లీ?

సీత : ఇప్పుడు మీరిచ్చిన గంభీరోపన్యాసాన్ని సిద్ధపరచుకోడానికి!

రాముడు : [చిరాకుగా] సీతా!

మొదటి ఋషి:మా మహారాజ్ఞికి అన్నీ తండ్రిపోలికలే వచ్చాయి. జనక మహా రాజు కూడా సంభాషణాచతురులని, హాస్యప్రియులని విన్నాము. సరే తల్లీ! ఇలా వచ్చి కూర్చో! అన్ని విషయాలు చర్చించుకోవచ్చు. అన్ని సందేహాలు నివర్తిచేసుకోవచ్చు.
[నిలుచున్న చోటునుంచి సీత కదలదు]

రాముడు : పెద్దలమాట కాదనరాదు! రా! వచ్చి కూర్చో!
[కదిలివచ్చి, రామునికి దగ్గరగా సీత కూర్చుంటుంది.]

మొదటి ఋషి:లక్ష్మణస్వాములు - తమరు కూడా.....
[లక్ష్మణుడు కాస్త దూరంగా కూర్చుంటాడు]

మొదటి ఋషి:అయోధ్యాపౌరులు కానివారు అయోధ్యా ప్రభువుల రక్షణకోరడం భావ్యం కాదని మహారాజ్ఞి అభిప్రాయం. అంతేకాదా, తల్లీ?

సీత : ఔను!

మొదటి ఋషి:కాని, అయోధ్యా ప్రభువుల రాజ్యాధికారంకంటె వారి నైతికాధికారం ఎంతో విస్తృతమైంది. కాదా, ప్రభూ?

రాముడు : నిశ్చయంగా!

మొదటి ఋషి:[లక్ష్మణునితో] లక్ష్మణస్వాములు మాతో ఏకీభవిస్తారా?

లక్ష్మణుడు : పూర్తిగా

మొదటి ఋషి:ఈ నైతికాధికారమే అయోధ్యాప్రభువులకు వంశపారంపర్యంగా దేశనాయకత్వాన్ని కట్టబెడుతున్నది. స్వర్గనాయకత్వం ఇంద్రుని దైనట్టు ఆర్యావర్తనాయకత్వం ఇక్ష్వాకులదే! ఔనా ప్రభూ?

రాముడు : నిశ్చయంగా!

మొదటి ఋషి:లక్ష్మణస్వాములు తిరిగి మాతో ఏకీభవిస్తారా?

లక్ష్మణుడు : పూర్తిగా!

మొదటి ఋషి:ఆర్యావర్తంపై అయోధ్యాప్రభువుల కున్న ఈ వంశపారంపర్యనాయకత్వం దృష్ట్యా ఆర్యఋషులైనవారు తాము ఎక్కడున్నా ఆపత్కాలంలో ఆ ప్రభువులరక్షణ కోరవచ్చునని మా మతం. ఇంతకు రామచంద్రప్రభువులు ఏ మంటారు?

సీత : ఏమంటారా? [రాముని చూపుతూ] ఈ ప్రభువు లేమో "నిశ్చయంగా " అంటారు! [లక్ష్మణుని చూపుతూ] ఆ స్వాము లేమో "పూర్తిగా"అంటారు!! పొగడ్తలకు పొంగిపోవడం రాజుల కున్న జాడ్యమే కాని, ఈ అయోధ్యారాజుల కున్నంతగా మ రెవ్వరికీ లేదు!

మొదటి ఋషి:అమ్మమ్మా! ఎంతమాట!

మొదటి ఋషి:[తన చికాకునుకప్పిపుచ్చుకొంటూ, రెండవ ఋషితో] ప్రభువులతో మేము మాట్లాడి వచ్చేలోగా, మీరు మన విడిదికి వెళ్ళి, మన తిరుగు ప్రయాణానికి సన్నాహాలు జరపడం మంచిదేమో!

రెండవఋషి : [లేస్తూ] చిత్తం!

లక్ష్మణుడు : [రెండవ ఋషితో పాటు లేచి, ద్వారాన్ని చూపుతూ] జాగ్రత్తగా వెళ్ళండి!

రెండవ ఋషి: అమ్మమ్మా! తల మరొకసారి బొప్పి కట్టించుకొంటానా! [ప్రమాదం లేకుండానే ఈసారి రెండవ ఋషి బయటికి దాటి పోతాడు. ఆయన వెళ్లిపోగానే లక్ష్మణుడు తిరిగి తన స్థానం లోకి వచ్చి కూర్చుంటాడు.]

మొదటిఋషి :మాకు తెలుసు తల్లీ! - విదేహరాజులలో పెక్కుమంది రాజర్షులున్నట్టు మాకు తెలుసు. వారిలో మహాజ్ఞానులున్నట్టు కూడా మాకు తెలుసు. ఇప్పటి సీరధ్వజులు కూడా జ్ఞానసిద్ధి పొందిన వారే! అయినా, ఆర్యావర్తంపై నైతికాధికారానికి సంబంధించి నంతవరకు ఎవరైనా అయోధ్యాచక్రవర్తుల తర్వాతనే. పుట్టింటి వారిపై మమతవల్ల ఈ విషయాన్ని గుర్తించడం జనక రాజ నందనకు కొంత కష్టమే కావచ్చు. అయినా.....

సీత : మీ పారలౌకిక శక్తులసంగతి నాకు తెలియదు గాని, మీ లౌకిక ప్రజ్ఞ మాత్రం అసాధారణమైనదే!

రాముడు : [ముక్కుపై వేలు వేసుకొంటూ] సీతా!

మొదటిఋషి :మా తల్లి ఎంత ప్రయత్నించినా మాకు కోపం తెప్పించలేరు!

సీత : ఆ సంగతి నిన్ననే తెలిసిందిలెండి!!

రాముడు : ఆ ! నిన్నకూడా మహర్షులతో వాగ్వాదం చేశావా? ఇది మనకు తగదు. పెద్దలు ఏమన్నా మారాడకుండా మనం వినాలి.

మొదటిబుషి :వాదప్రియత్వం ఆమెకు రక్తంలోనే వున్నదిలెండి. అందువల్ల ఆమెను వారించకండి. ఆ! ఇంతకు ముందు నేను అంటున్నట్టు ఎవరు గుర్తించినా, ఎవరు గుర్తించకపోయినా, మా బుషిలోకం మాత్రం అనాదికాలంగా అయోధ్యాచక్రవర్తులకు ఈ ఆర్యావర్తంపైగల నైతికాధికారాన్ని గుర్తిస్తున్నది; వారినే తన నైతిక సార్వభౌములుగా గౌరవిస్తున్నది.

సీత : వారు మీకు నైతిక సార్వభౌములైతే వారినుంచి మీరు కోరవలసింది నైతిక సమర్థన మాత్రమే; ఆయుధాల ద్వారా సంరక్షణ కాదు. ఆయుధాలతో ఏ ప్రభువులైనా రక్షించవలసింది తమకు పన్నులు చెల్లించే మత పౌరులనే!

మొదటిబుషి :[క్షమాపూర్వకమైన చిరునవ్వుతో] మేము మా ప్రభువులకు పన్నులు చెల్లించడం లేదని మహారాజ్ఞి అభిప్రాయమా? అయితే, అది పొరపాటు! నియతిగా మేము వాటిని చెల్లిస్తూనే వున్నాము.

సీత : అలాగా! ఇది నాకు తెలియని కొత్త విషయమే ! రాజకోశాగారాలపై మీ బుషులు దాడిచేయడమే నాకు తెలుసుగాని, వాటిని నించడం తెలియదు!

మొదటిబుషి :మేము పన్నులుగా చెల్లించేది క్షరమైన ధనధాన్యాలు కావు; అక్షరమైన మా యజ్ఞఫలం!

సీత : అది అక్షరమైంది మాత్రమేకాదు, అగోచరమైంది కూడా!

మొదటిబుషి :ఔను తల్లీ! ఔను!

సీత : అదీ ఒక మేలే! దాన్ని భద్రంచేసుకోడానికి ప్రజల కష్టార్జితంతో మేము కోశాగారాలు కట్టుకోనక్కరలేదు!

రాముడు : [తీవ్రంగా] సీతా! నీవు మరీ మితిమీరి పోతున్నావు సుమీ!

మొదటిబుషి :[రామునితో] మా విన్నపాన్ని మన్నించి, తాము మహారాజ్ఞిని వారించకండి. ఆమె వైఖరిని మార్చడానికి, దయచేసి, మాకు మరికొంత సావకాశ మిప్పించండి! [సీతతో] మీ కోశాగారాలను నింపలేకపోయినా, మా యజ్ఞఫలం మీకు పాథేయమౌతుంది, తల్లీ!

సీత : పాథేయమా?

మొదటిబుషి :బ్రహ్మపదాన్ని చేరడానికి అది మీరు పాథేయమై, అక్కడ మీకు శాశ్వత సుఖాలను చేకూర్చుతుంది.

సీత : త్వరగా మమ్ము ఈ లోకంనుంచి సాగనంపడానికి అది తోడ్పడు తుందన్నమాట!

రాముడు : [కోపంగా]మరి చాల్లే! సంతోషించాం!!

మొదటిబుషి :[రామునితో] తమరు చిరాకు పడవద్దు! [సీతతో] అమ్మా! మీ రేమన్నా సరేగాని, మా యజ్ఞఫల ప్రభావాన్ని చిరకాలంగా అయో ధ్యాప్రభువులు గుర్తిస్తున్నారు. అందువల్లనే దానిలో చతుర్థాంశాన్ని వారు కోరుతున్నారు. వారు కోరినమేరకు దాన్ని మేము సంతో షంగా వారికి సమర్పించుకొంటున్నాము.!

సీత : [దీర్ఘం తీస్తూ] అలాగా!

మొదటిబుషి :రాజులకు ప్రజ లిచ్చేది తమ రాబడిలో ఆరవవంతు మాత్రమే! ఇక, మే మంటారా? మా అయోధ్యాప్రభువులకు మా యజ్ఞఫ లంలో నాల్గవవంతును పంచిపెడుతున్నాము!

సీత : [అవహేళనగా] మీరు చెప్పేవరకు నిజంగానే నాకు తెలియదు సుమండీ! - తమ కష్టార్జితంలో తమరు మా కింత పెద్దభాగం పెడుతున్నారని!

మొదటిబుషి :రాసిలోనే అది పెద్దది కాదు, గుణంలో కూడా. అది అమూల్య మైంది, అనశ్వరమైంది, అమోఘమైంది!

సీత : తమ అమోఘసంపదను తమవద్దనే వుంచుకొని, దానితో ఆత్మర క్షణ చేసుకోవచ్చుగదా? ఆయుదాలద్వారా [రాముని చూపుతూ] ఈయన రక్షణ కోరడం దేనికి?

మొదటిబుషి :యజ్ఞఫలం మాకు కూర్చే మహత్తరశక్తులతో మేము ముల్లోకా లనే మాడ్చి వేయగలం; సృష్టికి ప్రతిసృష్టిని చేయగలం! అట్టి మాకు ఈ రాక్షససంహారం ఒక లెక్కా? కాని, ప్రభువుల ఆయుధశక్తిని మించిపోయినప్పుడు తప్ప మేము మా దివ్య శక్తు లను రాక్షస సంహారాన్ని పోలిన లౌకిక ప్రయోజనాల సాధనకై వినియోగించరాదు. ఇది మాకు దైవానుశాసనం!

సీత : మీ దివ్యశక్తుల పటిమ నాకు తెలియదుగాని, మీ వాక్పటిమ మాత్రం అమోఘమైనదే!

రాముడు : [చాలా కోపంగా] సీతా!

సీత : మీరు గద్దించినా, మరి నేను మిన్నకుండేది లేదు! మిమ్ము ముఖస్తుతి చేసి, ఈ మునిప్రముఖులు మీతో అమాయకు లైన ఆటవికులను అన్యాయంగా చంపిస్తున్నారు. వీరి మోసాన్ని కానలేక మీరు.....

రాముడు : [దిగ్గున లేస్తూ] చాల్చాలు! మరి కట్టిపెట్టు!! [మొదటి బుషితో] తమ వెంట నేను తప్పక వస్తాను, తమ హోమగుండాలను చల్లా ర్చుతున్న రాక్షసులను వధిస్తాను. విడిదికి వెళ్ళి, తమ ప్రయాణ సన్నాహాలు పూర్తి చేయించండి! మరి కొద్ది సేపటిలోనే నేను నా కోదండంతో తమ సేవలో నిలుస్తాను. [తమ్మునివైపు తిరిగి] లక్ష్మణా! మహర్షులవెంట వెళ్ళి, వారిని విడిదిలో దిగవిడిచిరా!

మొదటిబుషి :[సీతతో] ఈనాడు కాకపోతే మరొకనాటికైనా నీకే తెలుస్తుందిలే - తల్లీ - మా బుషిలోకాన్ని రక్షించడం అయోధ్యా చక్రవర్తుల ప్రథమ కర్తవ్యమని. ఏనాడు దాన్ని వారు నిర్లక్ష్యంచేస్తే, ఆనాడే వారి ప్రాధాన్యం సమసిపోతుంది. మరి వెళ్ళిరామా?

[సీత మారు పలకదు. లక్ష్మణుడు ముందు నడవగా మొదటి బుషి వెళ్ళిపోతాడు. వా రిద్దరు కదిలివెళ్ళగానేసీతకోపం కన్నీళ్ళ కింద మారుతుంది. ముఖం ఒకవైపుకు తిప్పకొని, చీర చెంగుతో కళ్ళను తుడుచుకొంటూ ఆమె నిలబడివుంటుంది.]

రాముడు : [కొన్ని క్షణాల మౌనం తర్వాత] నా కర్తవ్యాన్ని నేను పరిపాలిస్తున్నాను. నాకు రాగల ప్రమాద మేమీ లేదు! నీకు లేనిపోని భయం దేనికి, బాధదేనికి? [దగ్గరికి వెళ్లి, భుజంపై చేయి వేసి] ఎందుకు అనవసరంగా కంటతడి పెట్టుకోవడం? ఇటు చూడు! [ఒక క్షణం ఆగి]నిన్నే! ఇటు చూడమంటూ వుంటే! [ఆప్యాయంగా ఆమె ముఖాన్ని తనవైపుకు తిప్పకొని, తడిసివున్న ఆమె చెక్కిళ్ళను తుడుస్తూ] నా మాట వినుమా! ఆకారణంగా కలవర పడబోకు!

సీత : [గాద్గదికంగా] నే నేమి కలవరపడితే మీకు దేనికిలెండి! నేను మీకు కావాలా?

రాముడు : అదేమిటి? - పిచ్చిమాట!

సీత : పిచ్చిమాట కాదు, నిజం మాటే! నేను మీకు కావలసినదా న్నైతే "ఇదుగో! సంధ్యవార్చివస్తా!" నంటూ నిన్న పొద్దుననగా వెళ్ళినవారు ఇప్పటికి తిరిగి వస్తారా? వచ్చిరాకముందే మరొక బుష్యాశ్రమానికి తిరిగి ప్రయాణం కడతారా?

రాముడు : నిన్న సాయంత్రానికో, రాత్రికో తిరిగి రావలిసింది. కాని, నా సహాయంకోరిన మహర్షులు ప్రారంభించిన మహాయజ్ఞం నేటి ప్రాతఃకాలానికి కాని పూర్తికాలేదు.

సీత : అది మహాయజ్ఞమా? అయితే కనీసం ఒక వందమందికైనా వైధవ్యం సంప్రాప్తించి వుంటుంది!

రాముడు : వైధవ్య మేమిటి?

సీత : మీకు తెలియనట్టు నన్నడగడం దేనికి? యజ్ఞయాగాదుల రక్షణ పేరుతో స్థానిక గృహస్థులలో ఏ వంద మందినో మీరు వధిస్తే, వారి భార్యలు వందమందికి వైధవ్యం సంప్రాప్తించదా? పాపం! వారూ నా వంటి స్త్రీలే అని తలచుకొన్నప్పుడు నా గుండెలు జలదరిస్తూవుంటాయి!

రాముడు : వారితో పోలిక పెట్టుకొంటున్నావా?

సీత : పోలిక పెట్టుకోవడంలో తప్పేమున్నది? వారు రాజపుత్రికలు కాక పోవచ్చు, రాజపత్నులు కాకపోవచ్చు. అయినా, వారూ నా వంటి స్త్రీలే కారా? సుఖంగా తమ సంసారాలు తాము చేసుకోవాలని నావలె వారూ కోరుకోరా?

రాముడు : అయితే, మహర్షుల హోమగుండాల జోలికి పోకుండా తమ భర్తలను వా రెందుకు నిరోధించరు?

సీత : నేను మిమ్ము నిరోధించగలుగుతున్ననా, తమ భర్తలను వారు నిరోధించగలగడానికి!

రాముడు : నేను వెడుతున్నది ఆర్షధర్మరక్షణ కోసం!

సీత : వారు వస్తున్నది ఆత్మరక్షణకోసం! అరణ్యాలే, అరణ్యకసంపదలే జీవనాధారాలైన వారు వాటిని మీరు దగ్ధం చేస్తుంటే, చూస్తూ వూరుకోగలరా?

రాముడు : నీకు తెలియక పోవచ్చుగాని, అగ్నిహోత్రుడు పావనం చేయని భూములు ఆర్యులైనవారికి నివాసయోగ్యాలు కావని మన ధర్మ శాస్త్రం చెబుతున్నది. ఆ శాస్త్రానుసారంగానే మన ఋషులు ఈ జనస్థానంలో తమ పుణ్యాశ్రమాల సంస్థాపనార్థం ఏవో కొన్ని ప్రాంతాలను అగ్నిహోత్రుని సహాయంతో పావనం చేయవలసివస్తున్నది. ఇంత విశాలమైన ఈ దండకారణ్యం వుండగా ఈ రాక్షసులు ఈ జనస్థానాన్నే ఎందుకు అంటిపెట్టుకోవాలి? కాస్త అవతలికి కదలిపోరాదా? అక్కడ బ్రతకరాదా? అడవులలో అఘోరించే వారికి ఏ అడవు లైతేనే!

సీత : మీ మహర్షులే ఆ పని ఎందుకు చేయరాదో! నిర్మానుష్యమైన ప్రాంతాలు ఈ దండకారణ్యంలో ఎన్నిలేవు ? వాటిలో తమ పుణ్యాశ్రమాలను స్థాపించు కొనక, ఈ జనస్థానానికే మీ వారెందుకు రావాలి?

రాముడు : ఇదివరలో నీవు మహర్షులంటే ఎంతో భక్తి చూపేదానివి. ఇక్కడికి వచ్చినతర్వాత, ఎందువల్లనో వారిని నీవు విపరీతంగా విద్వేషిస్తున్నావు!

సీత : ఇక్కడికి మనం వచ్చిన తర్వాతగాని వారి నిజరూపం నాకు తెలిసిరాలేదు!

రాముడు : వారి విషయంలో నీవు పూర్తిగా పొరపడుతున్నావు సుమీ! వారు పూతచరితులు, మనకు సర్వదా పూజనీయులు!

సీత : పోనీ, మీ మాట నేనెందుకు కాదనాలి; వారు పూతచరితులే, పూజనీయులే! కాని, మనం వనవాసానికి ఎందుకు వచ్చినట్టు? మన ప్రవాసకాలాన్ని ప్రశాంతంగా గడుపుకుపోవడానికా, మహర్షుల ప్రేరణపై ఈ వన్య ప్రాంతాలవారిని వధించి వెళ్ళడానికా?

రాముడు : "ఏకః క్రియా ద్వ్యర్థకరీ బభూవ " అన్నట్టు, పితృవాక్య పరిపాలనతో పాటు ఋషి లోకసేవకు ఈ వనవాసం నాకు మహదవకాశాన్ని కల్పిస్తున్నది!

సీత : అయితే, మీ తండ్రిముందు మీ రేమి ప్రతిజ్ఞ చేసి వచ్చారు? మీ తల్లి కేమి వాగ్దానం చేసివచ్చారు? ప్రవాసకాలంలో మునీంద్రునివలె జీవిస్తామని కాదా? దాన్ని మీ రిప్పుడు నిజంగా పరిపాలిస్తున్నారా?

రాముడు : ఎందుకు పరిపాలించడం లేదు?

సీత : మునీంద్రులు అస్త్రశస్త్రాలను ధరిస్తారా? సంధ్య వార్చడానికి వెళ్ళినా సాయుధులై వెడతారా? నిరాయుధులను చంపివస్తారా?

రాముడు : వారు నిరాయుధులు కారే!

సీత : రాళ్ళూ రప్పలూ, కర్రలూ బర్రలూ కూడా మీ దృష్టిలో ఆయుధాలేనా?

రాముడు : ఈటెలు, బరిసెలు, కత్తులు, గదలు; గొడ్డళ్ళు మొదలైనవి కూడా వారి కున్నాయి.

సీత : ఏమున్నా వారికి మీ విల్లంబులు లేవుగదా! అవే వారికుంటే అవలీలగా మీరు వారిని కూలవేయగలరా?

రాముడు : ఏమైనా నిరాయుధులు మాత్రం కారు. పైగా, వారు రాక్షసులు!

సీత : అది వారికి మీ మహర్షులు పెట్టిన పేరు! రాక్షసులుగా చిత్రించక పోతే, వారిని మీచేత మీ మహర్షులు చంపించలేరు!

రాముడు : నీ మాటల కేమిలే! వారు నిస్సందేహంగా రాక్షసులే!

సీత : పోసి, రాక్షసులని చెప్పి మృగాలవలె వారిని వేటాడ్డానికై మీ రిప్పుడు రాజులు కారుగదా?

రాముడు : నే నిప్పుడు రాజును కాకపోయినా క్షత్రియుణ్ణి కానా? నా శర ణుజొచ్చిన వారికి రక్షణ నివ్వడం నా క్షత్రియధర్మం కాదా?

సీత : అయితే, మీరు అయోధ్యలో చేసిన ప్రతిజ్ఞ మునివేషధారణకే పరి మితం కాబోలు! మునివలె జీవించనప్పుడు మునివేషం మాత్రం దేనికి? దాన్ని విప్పివేయండి!

రాముడు : ఈ ధర్మసూక్ష్మాలు నీకు తెలియవులే!

సీత : ఏ! నేనంత మూర్ఖురాలినా?

రాముడు : జనక మహారాజ పుత్రికారత్నాన్ని నేనంత మాట అంటానా? నేను ఈ దండకారణ్యంలో ప్రవేశించగానే.....

సీత : మీరు దీనిలో ప్రవేశించలేదు; మిమ్ము దీనిలో ప్రవేశపెట్టించారు.

రాముడు : [ఆశ్చర్యంగా] ప్రవేశపెట్టించారా? ఎవరిది?

సీత : ఈ ఋషులే!

రాముడు : ఈ పూట నీ మాటలన్నీ విడ్డూరంగా వున్నాయి!

సీత : మీరు పన్నిన పన్నాగాన్ని నావలె మీరు కానగలిగితే నా మాటలు మీకు విడ్డూరంగా తోచవు.

రాముడు : పన్నాగమా? ఏమి పన్నాగం?

సీత : చాలా పెద్ద పన్నాగం! చిత్రకూటంవద్ద మనం చక్కని పర్ణశాల వేసుకోలేదా? అక్కడనే మన ప్రవాసకాలాన్ని గడపాలని అనుకో లేదా?

రాముడు : ఔను!

సీత : ఆ పర్వతంపై విహరిస్తూ, ఆ నదిలో జలక్రీడలాడుతూ మనం ప్రవాసక్లేశాలను మరచిపోలేదా?

రాముడు : నిజమే! అక్కడ అయోధ్యా నగరాన్నే మరిచిపోయాం! అక్కడి ప్రకృతి సౌందర్యగరిమి అంతటిదే!

సీత : ఆ సౌందర్యగరిమ అక్కడ వుండగా మిమ్మొక మహాకవిని చేసింది. కదిలితే ఒక ఉపమానం, మెదిలితే ఒక ఉపమానం అక్కడ మీనోట వస్తూ వుండేది.

రాముడు : ఆ ! నా పిచ్చి ఉపమానాల కేమిలే!

సీత : అవి పిచ్చివేమీ కావులెండి! చిత్రకూటం సానువులలోని ఒక చెట్టు కొమ్మ మందాకినిపైకి వాలివుండడాన్ని చూచి మీ రేమన్నారు?

రాముడు : నీవే చెప్పు!

సీత : నేను చెప్పను!

రాముడు : అయితే, నేను చెబుతాను; ప్రేమకలాపాలాడ్డానికి ప్రేయసి వక్ష స్థలంపైకివాలబోతున్న ప్రియునివలె అది వున్నదన్నాను.

సీత : ఇంతకంటె కూడా మంచి ఉపమానం మీరు తెచ్చారు. గాలి పాటుకు కదిలిన ఆ చెట్టుకొమ్మ మందాకినిపై జలజల పూలను రాల్చగా, నృత్యప్రదర్శనానికి ముందు సభాసదులపై దోసిళ్ళతో పువ్వులను విరజిమ్మే నర్తకివలె అది వున్న దన్నారు.

రాముడు : ఉహూ!! అంతకంటె మంచిది మరొకటి వున్నది. తొలి సంజరేకలకు జేవురించిన చిత్రకూట శిఖరాన్ని ఒకనాడు నీకు చూపిస్తూ, అది మన ప్రథమ సమాగమంనాటి నీ వదనబింబాన్ని పోలివున్న దని నే ననలేదా?

సీత : అయినా, చిత్రకూట పర్వత ప్రాంతం మిమ్మొక మహాకవిని చేయలే దంటారు దేనికి?

సీత :

రాముడు : ఇవన్నీ నువ్వు జ్ఞాపకం చేస్తుంటే, నా మనస్సు మళ్ళీ ఆ నందనం వైపుకు పరుగు పెడుతున్నది!

సీత : అంత సుఖంగా, సంతోషంగా అక్కడ మనం కాలం గడిపినా, ఆ ప్రాంతాన్ని విడిచి ఇక్కడికి ఎందుకు రావలసివచ్చింది?

రాముడు : అక్కడవుంటే నా తల్లులు, నా తమ్ములు నన్ను చూడ్డానికి తరచు వచ్చి, మన ప్రవాసదీక్షకు అంతరాయాలు కలిగిస్తారని నేను భయపడిబట్టే.

సీత : అది మీకు కలిగిన భయం కాదు; ఈ ఋషులు మీలో ప్రవేశపెట్టిన భయం!

రాముడు : అంతటి కాపట్యాన్ని వీరికి అంటగట్టడం నీకు తగదు!

సీత : మన్నించండి - వీరి మాయలో పడి, వీరి కాపట్యాన్ని మీరు కానలేక పోతున్నారు. మనం చిత్రకూటంవద్ద నివసించడంవల్ల జనస్థానంలోని రాక్షసులు అక్కడివరకు వచ్చి తమను హింసపెట్టగలరన్న భయాన్ని వీరు వెల్లడించలేదా? మరింత సురక్షిత స్థానాలకు తాము తరలిపోతున్నట్టు నటన చేయలేదా? అయినా, ఉత్తరాభిముఖంగా వెళ్ళక, దక్షిణదిశకే వీరు ఎందుకు వస్తున్నారు? మనవెనకనే ఈ జనస్థానంలో ఎందుకు ప్రవేశిస్తున్నారు?

రాముడు : ఆ ! నీవన్నీ లేనిపోని సంశయాలు!

సీత : అయితే, ఈ మాటకు బదులు చెప్పండి! ఈ దండకారణ్యంలో మన వనవాసానికి తగు ప్రదేశం ఏ దన్న ప్రశ్నకు ప్రతి ఒక్క ఋషి మరింతగా దక్షిణానికే పొమ్మని మనకు ఎందుకు చెబుతున్నాడు?

రాముడు : ఎందుకో తెలియదుగాని, అందరినోట అదే మాట వస్తున్నది.

సీత : తెలియకపోవడానికి ఇందులో పెద్ద రహస్య మేమున్నది? మీ రెంత ముందుకు సాగితే తా మంత ముందుకు విస్తరించవచ్చు; చివరికి మొత్తం దండకారణ్యాన్నే తాము వశపరచుకోవచ్చు.

రాముడు : అంతే నంటావా?

సీత : ఇంకా మీకు సందేహమా?

రాముడు : అయినా, నే నిప్పుడు వెనుదిరగడానికి వీలులేదు.

సీత : ఎందువల్ల

రాముడు : వాగ్దానం చేసినందున.

సీత : ఏమి వాగ్దానం?

రాముడు : రాక్షసుల పీడనుంచి మీకు విముక్తి కలిగిస్తానని ఈ దండకారణ్యంలో ప్రవేశించగానే ఋషులకు నేను చేసిన వాగ్దానం.

సీత : అది తొందరపాటు వాగ్దానం కాదా? అనాలోచితమైనది కాదా?

రాముడు : ఏమైనా, ఒకసారి మాట యిచ్చిన మీదట దాన్ని తప్పడం మా వంశంలోనే లేదు.

సీత : అయితే, అయోధ్యలో మీ తల్లితండ్రుల కిచ్చి వచ్చిన మాట గాలికి ఎగిరిపోయినట్టేనా?

రాముడు : దానికి భిన్నంగా నేను వెళ్ళడం లేదు!

సీత : వెళ్ళకేమి? అక్కడి మీ మాటప్రకారం ఇక్కడ మీరు మునివలెనే జీవిస్తున్నారా? మునులు ఆయుధధారణ చేస్తారా? క్షత్రియ ధర్మమును పరిపాలిస్తారా? మీ మొదటి మాట నిలుపు కోవాలంటే, నా విన్నపాన్ని మన్నించి, ఘన వనవాసం ముగిసే వరకు ఆయుధవిసర్జన చేయండి!

రాముడు : అది జరగదు!

సీత : నన్ను మన్నించండి - నే నేదో ధర్మోపన్యాసం చేస్తున్నట్టుగా భావించకండి. నే నంతటిపాటిదాన్ని కాను. అయినా, దయచేసి నా మాట వినండి. ఆయుధానికి రక్తదాహం వుంటుంది; అది నరబలిని కోరుతుంది. ఆయుధధారణ చేయగానే కారుణ్యమూర్తులైనా క్రూరులౌతారు, శాంతిప్రియులైనా యుద్ధోన్మాదు లౌతారు.

ముఖ్యంగా క్షత్రియుని చేతిలో ఆయుధా లుండరాదు. అవి అగ్ని హోత్రునికి సమీపంలో సమిధ లుండడమే! మీ చేతిలో నిత్యం వుంటున్న మీ ఆయుధాలే మిమ్ము హింసాకృత్యాలకు ప్రేరేపిస్తు న్నాయి; అవే మీకు పాప చింతలను కలిగిస్తున్నాయి. నా ప్రార్థన మన్నించి, కనీసం ప్రస్తుతానికైనా ఆయుధ విసర్జన చేయండి.

ాముడు : నీ వేమైనా చెప్ప. నేను ఆయుధవిసర్జన చేయను. ఇది ముమ్మా టికీ నిశ్చయం.!

ీత : నేను మీ దృష్టిలో మూర్ఖురాలినే కావచ్చు. అయినా, పెద్దల మాటనైనా పాటించరాదా? అన్నతాలు పలకడం పాపమని పెద్ద లన్నారు. అన్యకాంతలను కామించడం అంత కంటె పెద్ద పాపమన్నారు. పగ లేకుండానే పరులను చంపడం ఈ రెండిం టిని మించిన మహాపాపమన్నారు. ఆ మహాపాపానికే మీ రిప్పుడు వొడిగడుతున్నారు!

రాముడు : [కోపంగా] నేను మహాపాపానికి వొడిగడుతున్నానా? నీవు చాలా క్రూరంగా పలుకుతున్నావు సుమీ!

సీత : నిరపరాధులను నిర్దాక్షిణ్యంగా వధించడంకంటె నా పలుకులు క్రూర మైనవా?

రాముడు : [తీవ్రంగా] నేను వధిస్తున్నవారు నిరపరాధులనే నీవు నిజంగా నమ్ముతున్నావా?

సీత : ఔను! ఈ ఆటవికులకు మనపట్ల వైరం లేదు. మనతో వీరు ఏ విధమైన జోక్యం పెట్టుకోవడం లేదు. మనకు కించిత్తు అప కారమైనా తలపెట్టడం లేదు.మృగాలవలె వీరిని వేటాడ్డం దేనికి? రాక్షసులుగా వీరిని ఋషులు చిత్రిస్తూవుంటే నిజమేమో అను కొన్నాను. కాని, తీరా ఇక్కడికి వచ్చి చూస్తే, వీరు అన్నెం పున్నెం తెలియని ఆటవికులు! తమ బ్రతుకు తాము బ్రతకాలనే వీరు కోరుతున్నారు. నా మాట వినండి. ఋషుల స్వార్థానికి వీరిని బలిపెట్టకండి. [చరాలున వంగి, భర్త రెండు పాదాలను

పట్టుకుని] నే నొక మహారాజు కుమార్తెను, మరొక మహార
కోడలిని. భిక్ష మడగడం నా ప్రవృత్తికి విరుద్ధం. అయినా,
పూట మిమ్ము భిక్ష మడుగుతున్నాను. ఈ అటవికు
ప్రాణభిక్ష పెట్టండి, వీరి సతులకు మాంగల్యభిక్ష పెట్టండి, ఁ
మ్మనశ్శాంతి భిక్ష పెట్టండి!!

రాముడు : [ఆమె పట్టు విడిపించుకుని తన ధనుర్బాణాల వద్దకు వెళ్ళి, వా
అందుకుని, బయటికి వెళ్ళబోతూ] అవసరమైతే నేను న
విడుస్తాను, లక్ష్మణుని విడుస్తాను, నా ప్రాణాలనైనా విడుస్తా
ఋషుల కిచ్చిన మాట మాత్రం తప్పను. ఆడిన మాట తప్
మా వంశ గౌరవం మంట గలుస్తుంది.

సీత : [అభిమానం, కోపం, దైన్యం ముప్పిరిగొనగా, లేచి నిలబడ, బ
టికి వెళ్ళిపోతున్న భర్తతో] ఔను! మీ వంశగౌరవమే మీ
కావలసింది, నేను కాదు! వెళ్ళండి! వెళ్ళి, నిరపరాధుల
చంపి, మీ వంశగౌరవం కాపాడుకోండి! కాని ఆగి ఒ
మాట వింటారా? [రాముడు ఆగిపోయి వెనుదిరిగి చూస్తా
ప్రతిమాటను నొక్కుతూ, తిరిగి సీత] అవసరమైతే నన్ను వి
స్తామన్నారు. మీ రంతటివారే! మీ వంశ గౌరవానికి బ
ఎప్పుడో ఒకప్పుడు ఏ నట్టడివిలోనో నన్ను దిక్కులేని దాన్ని
మీరు దిగవిడుస్తారు!!
[చురచురచూచి, రాముడు చరాలున బయటికి వెళ్ళిపోతూ వుండ

తె

*

AOUA102 B125

ప్రతులకు :

న్యూ స్టూడెంట్ బుక్ సెంటర్
ఏలూరురోడ్, విజయవాడ -520 002

రూ. 15/-

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B125
పుస్తకం పేరు	పీత తోస్యం
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	17
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C1, BC1 16, NO.
లేని పేజీలు	
తయారు చేసినది	M. Roji
పేజీలు విడదీసినది	M. Roji
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good